

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అతివలే నిర్ణేతలు!

- 154 స్థానాల్లో మహిళా ఓటర్లే అధికం
- రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4.14 కోట్లు
- మహిళలు 2,10,58,615 మంది
- 2,03,39,851 మంది పురుష ఓటర్లు
- ట్రాన్స్‌జెండర్లు 3,421, సర్వీసు ఓటర్లు 68,185
- తుది జాబితా కన్నా 5,94,631 మంది అధికం
- నమోదులో కర్నూలు టాప్, అత్యల్పం అల్లూరి

3

శుక్రవారం | 3-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 17 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 11.24 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శతభిషం రా. 12.06 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ. 8.30-9.59; దుర్ముహూర్తం: ఉ. 8.23-9.14, మ. 12.37-1.28; అమృతఘడియలు: సా. 5.24-6.54; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పండుటాకులపై మళ్లీ పగ

పింఛన్ల పంపిణీలో అవ్వాతాతలకు వరుసగా రెండో నెల కూడా నరకం

పింఛన్ లబ్ధిదారుల్ని రోడ్డుపైకి లాగిన జగన్


నందికొట్కూరులో బ్యాంకు వద్ద పింఛన్‌దార్ల పడిగాపులు

- బ్యాంకుల ముందు వృద్ధులు క్యూ
- మండుటెండలో నిలువుకాళ్లపై రోజంతా పడిగాపులు..
- డబ్బులు పడ్డాయో లేదో తెలియక కంగారు
- ఫోన్ వాడకం ఎలాగో తెలియనివారికి మరిన్ని ఇబ్బందులు
- యాక్టివ్‌గా లేని ఖాతాలతో అవస్థలు
- పింఛన్ కోసం వస్తూ మరో తాత మృతి

2


పింఛను పాట్లు..

రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నవారు అక్కడికి, ఇక్కడికి తిరిగి, చివరికి పెన్షన్ ఎక్కడా పడలేదని తెలుసుకుని బేజారయ్యారు.

ఏప్రిల్‌లో తాము పింఛను తీసుకున్న సచివాలయాల వద్దకే ఈసారీ చాలామంది వెళ్లారు. 'ఇక్కడ కాదు.. బ్యాంకులకు పోండి' అని సిబ్బంది చెప్పడంతో కాళ్లీడ్చుకుంటూ బ్యాంకుకు పోయారు.

పింఛను డబ్బులను తమకు కట్టాల్సిన అప్పులు, వడ్డీ, రుసుముల కింద కొన్ని బ్యాంకులు తీసేసుకున్నాయి.

ఆధార్, ఫొటోలు కావాలంటూ ఇంటికి, బ్యాంకుకు మధ్య ఒకటికి రెండుసార్లు అధికారులు తిప్పారు.



23 లక్షల కార్డులు కట్!



- ఏడాదిన్నర కిందటే మొదలైన ఏరివేత కసరత్తు
- బియ్యం కార్డులపై సీపీఆర్‌తో అధ్యయనం
- కుటుంబాలు-కార్డుల మధ్య మిస్ మ్యాచ్
- 77 శాతం మాత్రమే సరిపోలాయన్న సంస్థ
- మిగిలిన 23 లక్షల కార్డులు 'తేడా' అని నిర్ధారణ
- ఈ ఏడాది జనవరిలోనే సర్కారుకు నివేదిక
- ఎన్నికలున్నందునే గప్‌చుప్‌గా జగన్ ప్రభుత్వం
- మళ్లీ అధికారంలోకి వస్తే కోతలు ఖాయం
- బియ్యం కార్డుతో ముడిపడిన పథకాలూ దూరం
- కలకలం రేపుతున్న సీపీఆర్ నివేదిక

'మరొక్క చాన్స్' ఇస్తే జరిగేది ఇదే..!

ఒక్క చాన్స్ అంటూ వచ్చారు! జనాన్ని బటన్ నొక్కుడు మాయలో ముంచి... వాతలు పెట్టారు!

మరొక్క చాన్స్ ఇస్తే జగన్ ఏం చేస్తారు? ఈ ప్రశ్నకు సమాధానం దొరికింది! మళ్లీ అధికారం అప్పగిస్తే... వాతలతోపాటు పథకాల్లో భారీగా కోతలూ తథ్యం! సిద్ధం... సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి, తాను రెండోసారి అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు, వాటితో ముడిపడిన పథకాల లబ్ధిదారులకు కోత పెట్టేందుకు ఇప్పటికే రంగం 'సిద్ధం' చేసుకున్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మేధో, పరిశోధన సంస్థ సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ (సీపీఆర్) నివేదిక సాక్షిగా బయటపడిన విషయమిది!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కాగానే పథకాలపై 'సమీక్ష'కు శ్రీకారం చుట్టారు. సంతృప్త స్థాయిలో ఇచ్చిన పథకాల్లో కోతలు పెట్టేందుకు సిద్ధమయ్యారు! ఇప్పుడు.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా అచ్చం ఇలాగే ఆలోచిస్తున్నారు. రెండోసారి అధికారంలోకి రాకముందే, 'కోతల'కు రంగం సిద్ధం చేశారు. ఆయన అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఏకంగా 23 లక్షల రేషన్ కార్డులు రద్దయినట్లే! వాటితోపాటు... కార్డులతో

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది

- విజన్ లేని పాలకుల వల్ల భవిష్యత్తు నాశనమైంది
- అరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం: నితిన్ గడ్కరీ




పార్వతీపురం(ఆంధ్రజ్యోతి), విశాఖపట్నం (వేపగుంట), మే 2: 'రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. విజన్ లేని పాలకుల వల్ల భవిష్యత్తు నాశనం అయ్యింది' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖలోని వేపగుంట మీనాక్షి కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం సాయంత్రం 'ఎలైట్ మీట్' పేరుతో వివిధ వర్గాల నాయకులు, పారిశ్రామిక వర్గాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. "ఒక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తే సరిపోతుందనేలా వ్యవహరించడం తగదు. దేశాభివృద్ధిలో

మిగతా 11వ పేజీలో...

చంద్రబాబు కడప సభకు హాజరైన జనం



జగన్.. మాట తప్పావ్



ఓటడిగే హక్కు నీకెక్కడిది: చంద్రబాబు

- మద్య నిషేధం చేశాకే అడుగుతానన్నావ్.. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నావ్
- జాబ్ కేలెండర్, డీఎస్సీ ఏవీ?.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ పనుల్లో 50% ఎక్కడ?
- మేనిఫెస్టోలో 99% హామీలు నెరవేర్చలేదు.. వైసీపీ పాలనకు సున్నా మార్కులే
- మాది ప్రజా మేనిఫెస్టో.. మొదటి నెల నుంచే రూ.4 వేల పెన్షన్
- ఉచిత ఇసుక విధానం తెస్తాం.. మళ్లీ జగనొస్తే ఆంధ్రా నార్త్‌కొరియా అవుతుంది
- అవినాశ్‌రెడ్డి పిల్లోడైతే బడికి పంపాలి.. పార్లమెంటుకు కాదు

14

రాయచోటి, కడప సభల్లో టీడీపీ అధినేత ఫైర్


విశాఖలో సభలో పవన్ కల్యాణ్‌పై పూల వర్షం

మళ్లీ జగన్ వద్దు!

- వైసీపీకి ఓట్లు వేస్తే ఆస్తులు పోతాయ్.. ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేయాలి
- మన తల రాత మనమే మార్చుకోవాలి.. ప్రతి ఒక్కరూ ఓటు వేస్తేనే మార్పు సాధ్యం
- చిన్నరాయి తగిలితే బ్యాండేజీ వేసి ఏదో జరిగిపోయినట్లు సీఎం బిల్డప్
- 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యం.. ఆ తల్లిదండ్రుల ఆవేదన తెలియదా మరి!?
- రంగులకు తగలేసిన దానిలో పదో వంతు ఇచ్చినా తోటపల్లి, జంపరకోట పూర్తి
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం.. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి: పవన్

14



'భూమి' బద్దలైంది!

టైటిల్ చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

11

- నిలదీస్తున్న రైతాంగం.. సర్కారు వెన్నులో వణుకు
- మీడియా, విపక్షాలను నియంత్రించేలా ప్లాన్
- ప్రభుత్వ అనుకూల ప్రచారం చేయాలంటూ 'రెవెన్యూ'కు సీఎంవో క్లాస్.. అధికారులు 'నో'
- సీఐడీతో కేసులు పెట్టించేందుకు 'సిద్ధం'
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీ రామకృష్ణతో ఫిర్యాదు
- ఎవరిపై చర్యలు తీసుకోవాలంటూ సీఐడీ ప్రశ్న
- అధికారులకు పైనుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు






అబ్ కీ బార్?

బ్రిజ్ భూషణ్ టికెట్ ఆయన కొడుక్కే!

లఖ్‌నవూ, మే 2: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌కు మరోసారి టికెట్ ఇచ్చేందుకు బీజేపీ నిరాకరించింది. అయితే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానాన్ని తన చిన్న కుమారుడు, రాష్ట్ర రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు కరణ్ భూషణ్ సింగ్‌కు కేటాయించింది. జాతీయ స్థాయి షూటర్ అయిన కరణ్, ఆస్ట్రేలియాలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌ను పూర్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని మరో ప్రముఖ లోక్‌సభ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి దినేశ్ ప్రతాప్‌సింగ్ పేరును బీజేపీ ఖరారు చేసింది.



ఆకాశ దేశం నుంచి అవనికి లేజర్ సందేశం

22.6 కోట్ల కి.మీ. దూరాన ఉన్న సైకీ వ్యోమనౌక నుంచి 10 నిమిషాల డేటా అందుకున్న నాసా

న్యూయార్క్, మే 2: ప్రపంచంలోని అన్ని దేశాల వద్ద ఉన్న సంపదకన్నా విలువైన లోహాలతో కూడిన సైకీ అనే గ్రహశకలంపై పరిశోధనకు నాసా పంపిన సైకీ అనే వ్యోమనౌక.. 22.6 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి లేజర్ సందేశాలను భూమికి పంపింది! సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న దూరం కన్నా ఒకటిన్నర రెట్ల దూరం ఇది. "ఏప్రిల్ 8న సైకీ వ్యోమనౌక డేటా నుంచి 10 నిమిషాల డేటాను మేం డౌన్‌లోడ్ చేసుకున్నాం" అని ఈ ప్రాజెక్టుకు ఆపరేషన్స్ లీడ్‌గా వ్యవహరిస్తున్న మీరా శ్రీనివాసన్ తెలిపారు. దీన్ని గణనీయమైన మైలురాయిగా అభివర్ణించిన ఆమె.. భవిష్యత్తులో వ్యోమనౌకల ద్వారా సమాచార ప్రసారంలో ఆప్టికల్ కమ్యూనికేషన్స్ ఎంత ప్రముఖ పాత్ర వహిస్తాయో చెప్పడానికి ఇదో నిదర్శనమన్నారు.

ఏమిటా గ్రహశకలం ప్రత్యేకత?

ఎప్పుడో 172 ఏళ్ల క్రితం.. ఇటలీకి చెందిన అనిబేల్ డి గాస్పరిస్ అనే ఖగోళ శాస్త్రవేత్త 'సైకీ' గ్రహశకలాన్ని కనుగొన్నాడు. ఇది కుజుడికి, గురుడికి మధ్య ఉండే ఆస్టరాయిడ్ బెల్ట్‌లో ఉండే వేలాది గ్రహశకలాల్లో ఒకటి. దీని వ్యాసం దాదాపు 220 కిలోమీటర్లు. శాస్త్రజ్ఞులు దీన్ని 'ఎం టైప్ ఆస్టరాయిడ్'గా వర్గీకరించారు. ఎం అంటే మెటల్. ఖనిజాలు, లోహాలతో కూడి ఉండే గ్రహశకలాలను ఈ వర్గీకరణలో చేరుస్తారు. దీని ఉపరితల వైశాల్యం 1,65,800 చదరపు కిలోమీటర్లు. ఈ గ్రహశకలంపై 10 క్వింటిలియన్ డాలర్ల విలువ చేసే ఖనిజాలు, లోహాలు (ఇనుము, నికెల్, బంగారం వంటివి) ఉంటాయని అంచనా. ఒక క్వింటిలియన్ అంటే.. పదివేల కోట్ల కోట్లు. అలాంటిది 10 క్వింటిలియన్ డాలర్లంటే.. ఆ సంఖ్యను మాటల్లో చెప్పడం కూడా కష్టమే!! అందుకే దానిపై పరిశోధనల నిమిత్తం 2023 అక్టోబరులో సైకీ వ్యోమనౌకను పంపారు. అది 2029 నాటికి ఆ గ్రహశకలానికి సమీపానికి చేరుకుని.. దూరం నుంచే దానిపై రెండేళ్లపాటు (2031 దాకా) పరిశోధనలు చేయనుంది.

అసలేమిటీ టెక్నాలజీ?

గుర్తుందా.. 20 ఏళ్ల క్రితం మనం టెలిఫోన్ నుంచి మోడెమ్‌కి కనెక్షన్ ఇచ్చి 256 కేబీపీఎస్(కిలోబిట్స్ పర్ సెకన్) వేగంతో పనిచేసే ఇంటర్‌నెట్ వాడేవాళ్లం. అప్పట్లో కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఫైళ్లను డౌన్‌లోడ్ చేయాలంటే తలప్రాణం తోకకొచ్చేది! 2009-10 నాటికి బ్రాడ్ బ్యాండ్ సేవలు విస్తరించాయి. ఆప్టికల్ ఫైబర్ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చింది. డేటా సరఫరా గణనీయంగా పెరిగి మెగాబిట్స్‌కు చేరింది. ఇప్పుడు 5జీ వచ్చాక వేగం జీబీపీఎస్ (గిగాబిట్స్ పర్ సెకన్)కు చేరింది! ఇదే రీతిలో.. రోదసి నుంచి సమాచార ప్రసారానికి ప్రస్తుతం ఉపయోగిస్తున్న రేడియో తరంగాలకు బదులుగా బ్రాడ్‌బ్యాండ్ తరహాలో ఆప్టికల్ కమ్యూనికేషన్స్ సాయంతో 4కే, అల్ట్రా హైడెఫినిష్ రిజల్యూషన్‌తో డేటాను ట్రాన్స్‌మిట్ చేయొచ్చు. అందులో భాగంగానే నాసా ఈ డీఎస్‌వోసీ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చందమామపై అడుగు పెట్టినప్పుడు అక్కడి నుంచి ట్రాన్స్‌మిట్ అయిన దృశ్యాలన్నీ నలుపు, తెలుపుల్లో ఉన్నాయి కదా! అదే ఈ టెక్నాలజీతో అయితే మాంచి కలర్, హైడెఫినిషన్ వీడియోలను చంద్రుడి మీది నుంచి పంపవచ్చన్నమాట.

సూరి హత్య కేసులో భానుకిరణ్‌కు జీవిత ఖైదు

- శిక్ష ఖరారు చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసు ప్రధాన నిందితుడు, అనంతపురం జిల్లాకు చెందిన మద్దెలచెర్వు సూరి హత్య కేసులో నిందితుడు మలిశెట్టి భానుకిరణ్ అలియాస్ భానుకు జీవితఖైదును హైకోర్టు ఖరారు చేసింది. సూరి హత్య కేసులో విచారణ కోర్టు తనకు జీవితఖైదు విధించడాన్ని సవాల్ చేస్తూ భాను తెలంగాణ హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలుచేశాడు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

దుబాయ్‌లో మళ్లీ వర్షాలు

దుబాయ్, మే 2: ఎడారి దేశం యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ని వర్షాలు మళ్లీ హడలెత్తిస్తున్నాయి. దుబాయ్, అబుదాబీ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. గత నెలలో దుబాయ్‌ను ముంచెత్తిన భారీ వర్షాలతో పోలిస్తే తీవ్రత తక్కువే అయిన జాతీయ విపత్తు నిర్వహణ విభాగాలు ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేశాయి. భారీ వర్షాల ప్రభావంతో గురువారం పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. మరికొన్ని సర్వీసులను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. అంతేకాక, దుబాయ్‌లో పలు రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. అంతర్గత బస్సు సర్వీసులను రద్దు చేశారు. పాఠశాలలు, విద్యా సంస్థలకు గురు, శుక్రవారాలు సెలవుగా ప్రకటించారు. అయితే, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు దుబాయ్ మెట్రో రైలు సర్వీసులను పెంచారు. కాగా, ఏప్రిల్ 14-15 తేదీల్లో కురిసిన కుంభవృష్టి వల్ల దుబాయ్‌లో ఓ ఏడాదిన్నరలో కురిసే వర్షం గంటలోనే కురిసింది. ఫలితంగా దుబాయ్‌ను వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే.

ప్రజ్వల్‌పై లుక్ అవుట్ నోటీసు

- విచారణకు రాకుంటే అరెస్టు చేస్తాం
- కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర హెచ్చరిక

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అతనిపై లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు హాసన్ జిల్లా హొళె నరసీపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ప్రజ్వల్ దేశం విడిచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో 24 గంటల్లోగా తమ ముందు విచారణకు హాజరు కావాలని సిట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. అయితే, తాను జర్మనీలో ఉన్నానంటూ ప్రజ్వల్ న్యాయవాదుల ద్వారా ఏడు రోజుల గడువు కోరారు. ఆ విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్ గురువారం అతనిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు లుక్ అవుట్ నోటీసులు పంపారు. లుక్ అవుట్ నోటీసు తర్వాత కూడా ప్రజ్వల్ ఆచూకీ లభించకపోతే.. కోర్టు నుంచి నాన్ బెయిలబుల్ నోటీసు జారీ చేసే అవకాశం ఉంది. కాగా, ప్రజ్వల్ గడువులోగా విచారణకు హాజరు కాకుంటే అరెస్టు చేస్తామని కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర హెచ్చరించారు. కలబురగిలో పరమేశ్వర గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ వద్ద దౌత్య పాస్‌పోర్ట్ ఉన్నందునే రాత్రికి రాత్రి దేశం విడిచి వెళ్లగలిగారని చెప్పారు. కాగా, ప్రజ్వల్ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ హొళెనరసీపుర పోలీస్‌స్టేషన్‌లో గురువారం మరో మహిళ ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ప్రజ్వల్ రాసలీలల వీడియోలు లీక్ చేసిన ఆయన మాజీ డ్రైవర్ కార్తీక్.. సిట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో అదృశ్యమయ్యారు. ప్రస్తుతం మలేసియాలో ఉన్న కార్తీక్ మంగళవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే.

రాహుల్‌ను ప్రధానిగా చేయాలని పాక్ తహతహ!



భారత్‌లో బలహీన, అవినీతి ప్రభుత్వం ఉండాలన్నది శత్రుదేశం ఆలోచన: మోదీ

ఆనంద్, సురేందర్‌నగర్, మే 2: రాహుల్‌గాంధీని భారతదేశ ప్రధానమంత్రిగా చేయాలని పాకిస్థాన్ తహతహలాడుతోందని ప్రధాని మోదీ చెప్పారు. భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని శత్రుదేశం భావిస్తోందన్నారు. గురువారం గుజరాత్‌లోని ఆనంద్, సురేందర్‌నగర్, జునాగఢ్‌లలో జరిగిన బీజేపీ ఎన్నిక ల సభల్లో మోదీ ప్రసంగించారు. 'భారత్‌లో కాంగ్రెస్ పార్టీ మరణిస్తోందని పాకిస్థాన్ ఏడుస్తోంది. ఆ పార్టీ కోసం పాక్ నేతలు ప్రార్థనలు జరుపుతున్నారు. ఇది మనకేమీ ఆశ్చర్యం కలిగించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, కాంగ్రెస్ పాకిస్థాన్ మద్దతుదారు అని తెలిసిందే' అని తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీపై రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్న ఓ వీడియోను బుధవారం పాక్ మాజీ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈ నేపథ్యంలో.. కాంగ్రెస్‌పై, రాహుల్‌పై మోదీ ఆరోపణలు గుప్పించారు. ముంబై ఉగ్రవాద దాడుల సమయంలో ఉన్నట్లుగా భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని, 2014కు ముందులాగా అవినీతి ప్రభుత్వం ఉండాలని పాకిస్థాన్ కోరుకుంటోందన్నారు. తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాక్ ఉగ్రవాదం టైర్లు పంచర్ అయ్యాయన్నారు. గతంలో ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసిన పాకిస్థాన్ ఇప్పుడు గోధుమపిండి దిగుమతుల కోసం తంటాలు పడుతోందని, బాంబులను పట్టుకున్న చేతులు ఇప్పుడు భిక్షపాత్రను పట్టుకున్నాయని ఎద్దేవా చేశారు.

లిఖితపూర్వకంగా చెప్పాలి!

ఓబీసీల రిజర్వేషన్లను తగ్గించి ఆ కోటాను ముస్లింలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ ఆలోచన అని మోదీ పునరుద్ఘాటించారు. ఒకవేళ ఆ పార్టీకి ఆ ఆలోచన లేకపోతే, లిఖితపూర్వకంగా ఆ విషయం చెప్పాలని సవాల్ చేశారు. యూపీలో సమాజ్‌వాదీపార్టీ తరఫున పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ మేనకోడలు మరియా ఆలం ఇటీవల.. ఇండియా కూటమికి మద్దతుగా ఓట్ల జిహాద్ జరపాలని పిలుపు ఇచ్చారని మోదీ పేర్కొన్నారు. ఇంతవరకు లవ్‌జిహాద్, ల్యాండ్ జిహాద్ గురించే విన్నామని, ఇప్పుడు ఓట్ల జిహాద్ అని అంటున్నారని విమర్శించారు.

అబద్ధాలు వ్యాప్తి చేస్తున్న కాంగ్రెస్


- ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, మే 2: కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసి సమాజంలో ఘర్షణ వాతావరణం సృష్టిస్తోందంటూ బీజేపీ గురువారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాజ్యాంగాన్ని మార్చివేసేందుకే 400 ఎంపీ సీట్లు కావాలని కోరుకుంటోందంటూ తమపై అసత్యాలు వ్యాప్తి చేస్తోందని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తారంటూ అబద్ధాలు చెబుతోందని ఆరోపించింది. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది, పార్టీ నాయకుడు ఓం ప్రకాశ్ ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీలు డీప్ ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం సుధాంశు త్రివేది విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 15 సంఘటనలను ఈసీ దృష్టికి తెచ్చామని చెప్పారు. స్వేచ్ఛగా, నిజాయితీగా ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

మాస్ రేపిస్టుకు మోదీ మద్దతు: రాహుల్

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడి, వీడియోలు చిత్రీకరించాడని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గురువారం కర్ణాటకలోని శివమొగ్గలో ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ప్రజ్వల్ తరఫున ప్రచారం చేసినందుకు దేశంలోని మహిళలకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది సెక్స్ కుంభకోణం కాదు.. మాస్ రేప్ అన్నారు. ఒక మాస్ రేపిస్టుకు మద్దతుగా ప్రధాని ప్రచారం చేశారని విమర్శించారు. ప్రజ్వల్‌కు ఓటు వేస్తే తనకు మద్దతు ఇచ్చినట్టేనని రాష్ట్ర ప్రజల ముందు చెప్పిన మోదీ.. దేశంలోని ప్రతి మహిళను అవమానించారని మండిపడ్డారు. అందుకే దేశంలోని తల్లులు, అక్కచెల్లెళ్లను ప్రధాని, హోంమంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ నేతలందరూ క్షమాపణ అడగాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ప్రజ్వల్ మాస్ రేపిస్ట్ అని బీజేపీలో ప్రతి నాయకుడికీ తెలుసు. అయినా అతడికి మద్దతు పలకడమే కాకుండా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్నారు' అని ఆరోపించారు.

లోకం తీరు



ఠారెత్తించిన ఎండలు

47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

అమరావతి, విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకప్రాంతాలు, ఉత్తర కోస్తాలో పలుచోట్ల గురువారం ఎండ తీవ్రతతో ప్రజలు ఉడికిపోయారు. వడగాలితో ఆవిర్లు వచ్చి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్న సమయంలో కొన్ని ప్రాంతాలు నిప్పులకొలిమిలా మారిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. గురువారం 47 డిగ్రీలు దాటేసింది. 14 జిల్లాల్లో 43 డిగ్రీల కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వడగాడ్పులు ఉధృతమయ్యాయి. ప్రకాశం జిల్లా ఎండ్రపల్లిలో 47.1, మార్కాపురంలో 47, నంద్యాల జిల్లా బనగానపల్లెలో 46.7, నెల్లూరు జిల్లా అక్కమాంబాపురంలో 46.6, చిత్తూరు జిల్లా తవణంపల్లె, కడప జిల్లా జమ్మలమడుగులో 46.4 డిగ్రీలు, అనంతపురం జిల్లా తెరన్నపల్లి, కర్నూలు జిల్లా గూడూరు, పల్నాడు జిల్లా విజయపురిలో 45.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పండుటాకులపై మళ్లీ పగ

- పింఛన్ల పంపిణీలో అవ్వాతాతలకు
- వరుసగా రెండో నెల కూడా నరకం
- పింఛన్ లబ్ధిదారుల్ని రోడ్డుపైకి లాగిన జగన్

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

పండుటాకులపై మరోసారి జగన్ ప్రభుత్వం పగ తీర్చుకుంది. పింఛను పంపిణీలో అవ్వాతాతలను వరుసగా రెండో నెల కూడా అవస్థలపాలు చేసింది. గత నెల సచివాలయాల చుట్టూ వారిని తిప్పి, 33మంది ప్రాణాలు బలి తీసుకున్న సర్కారు, ఈసారి బ్యాంకుల ముందు పింఛను లబ్ధిదారులను నిలువకాళ్లపై నిలబెట్టింది. అటు 43 డిగ్రీల ఎండ, ఇటు బ్యాంకు ఖాతాల సమస్యలతో 'ఇదేం ఖర్మ' అనుకుంటూ అవ్వాతాతలు అల్లాడిపోయారు. సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది సహకారంతో ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వగలిగే అవకాశం ఉన్నా, ప్రతిపక్షాలు ఎంతగా డిమాండ్ చేసినా....జగన్ మొండితనం ప్రదర్శించారు. ఎన్నికల ముందు అవ్వాతాతలను అవస్థలు పెట్టి.. ప్రతిపక్షాలను అందుకు బాధ్యులుగా చూపించే రాజకీయ కుట్రను కొనసాగించారు. లక్షలాదిమంది వృద్ధులు ఏప్రిల్‌లో సచివాలయాల వద్ద



పింఛనుదారులతో రద్దీగా ఉన్న అనకాపల్లి జిల్లా మాడుగుల ఇండియన్ బ్యాంకు బ్రాంచీ



అనంతపురం నగరంలోని కల్యాణదుర్గం రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ బ్రాంచి ఇది. పింఛన్ తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులతో బ్యాంకు కిటకిటలాడింది. కొందరు వృద్ధులు క్యూలో నిలబడలేక కింద కూర్చుండిపోయారు.

పడిగాపులు కాసేలా చేశారు. ఈసారి బ్యాంకు ఖాతాలలో జమచేసి.. వారి కష్టాలను మరింత పెంచారు. గురువారం బ్యాంకుల వద్దకు వెళ్లడానికి నరకం అనుభవించారు. మీ సెల్‌ఫోన్లకు సమాచారం వస్తుందని సిబ్బంది చెబుతుంటే....ఈ వయసులో మాకు అవేమీ తెలియదని వృద్ధులు దిగాలుగా దిక్కులు చూడటం కనిపించింది. కొన్ని చోట్ల... 'మీ ఖాతా నిలిచిపోయిం'దని సిబ్బంది చెప్పడంతో బిత్తరపోయారు. ఆధార్ కార్డు, ఫొటోలు తేవాలని బ్యాంకు అధికారులు కోరడంతో మండుటెండలో అటూ ఇటూ తిరగలేక పింఛనుదార్ల పాట్లు వర్ణనాతీతం. మండుటెండలో వడగాల్పులు తట్టుకుంటూ కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం, బ్యాంకులవద్ద తమవంతు వచ్చేవరకూ పడిగాపులు పడుతూ.. రోజంతా అవస్థలు పడ్డారు. ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, జీరో బ్యాలెన్స్ ఉండడం, కొద్ది నెలలుగా వారి ఖాతాల నుంచి లావాదేవీలు జరగకపోవడంతో పింఛన్‌దారులు పింఛన్ నగదు తీసుకునేందుకు ఇక్కట్ల పాలయ్యారు. విత్‌డ్రా ఫాం నింపలేకపోవడం, సర్వీసుల పేరుతో డబ్బులకు కోత పడడంతో ఇంకొందరు ఆవేదనతో తిరుగుముఖం పట్టారు.

ఏ బ్యాంకు.. ఏ ఖాతా..?

కొందరికి రెండు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. అటువంటి వారు ఒక బ్యాంకుకు వెళితే పింఛను సొమ్ము పడలేదని చెప్పారు. మరో ఖాతా ఉన్న బ్యాంకుకు వెళితే అక్కడా జమ కాలేదని సమాధానం. కొన్ని ఖాతాలు ఇన్‌యాక్టివ్‌లో ఉండటం, మరికొన్ని ఖాతాలు మైనస్ బ్యాలెన్స్‌లో ఉండడంతో పేదలకు పింఛన్ సొమ్ము అందలేదు.

రాలిన మరో పండుటాకు

మండుటెండలో పెన్షన్ కోసం వెళుతూ వడదెబ్బ తగిలి ఒక వృద్ధుడు చనిపోయాడు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం పంచాయితీ పద్మ సరస్సు గిరిజన కాలనీలకి చెందిన పి.గోపాలయ్య మామిడి తోట కాపలాదారుగా జీవనం సాగిస్తున్నారు. పింఛన్ అందుకోవడానికి కాలినడకన కార్వేటినగరం వస్తుండగా వడదెబ్బ తగిలి సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందాడు.

గ్రామాల్లో గగ్గోలు...

ప్రభుత్వం పింఛన్ మొత్తం బ్యాంకు ఖాతాల్లో వేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా అనంతగిరి మండలం గిరిజనులు (పింఛన్‌దారులు) చాలా మంది ఆటోల్లో సమీపంలోని ఉన్న దేవరాపల్లిలోని బ్యాంకుకు వచ్చారు. అయితే చాలామంది ఖాతాలు మనుగడలో లేకపోవడంతో సమస్య వచ్చింది.

'ఇక్కడ కాదు.. బ్యాంకుకు పో'

ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్దకు పిలిపించి పింఛన్లు పంపిణీ చేశారు. అదే అలవాటు చొప్పున కొందరు గురువారం తమకు సమీపంలోని సచివాలయాలకు వెళ్లారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది 'నీకు పింఛన్ ఇక్కడ ఇవ్వడం లేదు. బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు..' అని చెప్పడంతో వారంతా ఉసూరుమంటూ అక్కడినుంచి వచ్చేశారు. బ్యాంకు ఎక్కడో... ఏ బ్యాంకుకు వెళ్లాలో తెలియక దిగాలు పడ్డారు.

కొంత పెంచి... ఎంతో కోసి...

పింఛను సొమ్ము స్వల్పంగా పెంచిన ప్రతిసారీ లబ్ధిదారుల సంఖ్యలో జగన్ కోత పెడుతున్నారు. తూర్పుగోదావరిలో ఈనెలలో కొన్ని పింఛన్లను రద్దు చేశారు. గత నెల 2,44,730 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా ఈనెల ఆ సంఖ్య 2,43,084కు తగ్గించారు. అంటే, ఈ ఒక్క జిల్లాలోనే 1,646 పింఛన్లు కోసేశారు.

ఐదు కిలోమీటర్లు నడిచొచ్చా...



"దేవరాపల్లికి 30 కిలోమీటర్లు దూరంలో ఉంటున్నాం. పింఛను కోసం మా ఊరినుంచి ఐదు కిలోమీటర్లు నడిచి, తారురోడ్డు పాయింట్ దగ్గర ఆటో ఎక్కి ఇంత దూరం వచ్చాను. అయినా, పనవ్వలేదు. గతంలో గ్రామంలోనే పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు బ్యాంకులో వేశారని చెప్పడంతో బి.సి. పాయింట్‌లో (బ్యాంకు కస్టమర్ పాయింట్) తీసుకునేందుకు దేవరాపల్లి వచ్చా. అయితే నా బ్యాంకు ఖాతా మనుగడలో లేదట. పదేళ్ల కిందట ఎస్.కోట (విజయనగరం జిల్లా) బ్యాంకులో నా ఖాతా ఉందట. అక్కడకు వెళ్లాలి. నాకు తెలియదు...ఎవరినో ఒకరిని తీసుకువెళ్లాలి. గ్రామంలోనే పెన్షన్ ఇచ్చే విధంగా చూడాలి"

\- సీదరి గంగులు, తట్టపూడి, పినకోట పంచాయతీ, అనంతగిరి మండలం, ఉమ్మడి విశాఖ జిల్లా

బ్యాంక్ అప్పు, వడ్డీ కింద పింఛన్ జమ



నాగమ్మ

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దర్గాహోన్నూరు గ్రామంలో పలువురు లబ్ధిదారుల పింఛను సొమ్మును బ్యాంకర్లు.. రుణానికి వడ్డీ కిం ద జమ చేసుకున్నారు. నాగమ్మ అనే దివ్యాంగురాలు బ్యాంకులో రూ.19 వే లు రుణం తీసుకుంది. ప్రభుత్వం ఈ నెల పింఛను డబ్బులను బ్యాంకు ఖా తాలో జమ చేయడంతో ఆమె విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లారు. అయితే, ఆమెకు పడిన రూ.3 వేల పింఛన్ సొమ్మును వడ్డీ కింద జమ చేసుకున్నామని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆమె కుంగిపోయారు. ఇదే గ్రామానికి చెందిన ఎర్రమ్మదీ ఇదే పరిస్థితి.

సంతకం ప్రాక్టీస్ చేసిన అవ్వ

తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరానికి చెం దిన కాలేపు కళావతి (60) చాలా ఏళ్ల క్రితం బ్యాంకు ఖాతా తెరిచారు. తర్వాత అవసరం లేకపోవడంతో పట్టించుకోలేదు. ఇప్పుడు పింఛను కోసం వెళ్లగా విత్‌డ్రా ఫాంపై సంతకం చేయాలన్నారు. అయితే, వయసు రీత్యా వచ్చిన ఆరోగ్య సమస్యల వల్ల ఆమె సంతకం మరిచిపోయారు. పెన్నుతో రాయడానికి ఆమె చేతులు సరిగా సహకరించడంలేదు. వేలిముద్రను బ్యాంకు వాళ్లు ఒప్పుకోలేదు. దీంతో ఆమె అతి కష్టంపై సంతకం ప్రాక్టీసు చేయాల్సి వచ్చింది.

జంధ్యం వేసుకునే మీకెందుకురా రాజకీయాలు!

- జనసేన కార్యకర్త కుటుంబంపై వైసీపీ దాడి.. దూషణలు

మచిలీపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నం నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీకి చెందిన జనసేన నాయకుడు కర్రి మహేష్ కుటుంబ సభ్యులపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. 'జంధ్యం వేసుకునే మీకెందుకురా రాజకీయాలు. వెనుకబడిన కులానికి చెందిన వాడివి దానికి తగ్గట్టే ఉండు. వెధవ రాజకీయాలు చేద్దామని చూస్తే అంతు చూస్తాం' అని బూతులు తిడుతూ రెచ్చిపోయారు. మచిలీపట్నం వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు సమక్షంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. దాడిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులపై పోలీస్‌స్టేషన్ వద్దే మరోసారి దాడి జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయాలంటూ మచిలీపట్నం ఎంపీ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

రెచ్చగొట్టి.. ఆపై దాడి

విశ్వబ్రాహ్మణ కాలనీకి చెందిన జనసేన కార్యకర్త కర్రి మహేష్ ఇటీవల పార్టీ తరఫున చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అతనిపై కక్షసాధింపు చర్యలకు దిగేందుకు వైసీపీ కార్యకర్తలు వ్యూహం పన్నారు. వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ కాలనీలో పర్యటించారు. ముందస్తు పథకం ప్రకారం వైసీపీ కార్యకర్తలు మహేష్ ఇంటి ఎదురుగా బాణాసంచా కాల్చి హడావిడి చేశారు. ఇంట్లోనివారు బయటకు వచ్చేవరకు అక్కడే ఉన్నారు. మహేష్ భార్య హేమలత, అతని సోదరుడి కుమారుడు నాగబాబును చూడగానే ఒక్కసారిగా దాడికి దిగారు. దొరికిన వారిని దొరికినట్లు చితకబాదారు.



బాధితులతో కలిసి ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

ఓటింగ్ ప్రక్రియ మొదలైంది!

- భద్రతా దళాలకు ఎలక్ట్రానిక్ బ్యాలెట్లు పంపాం
- వృద్ధుల నుంచి పోస్టల్ బ్యాలెట్లు సేకరిస్తున్నాం
- ఈ దశలో హైకోర్టు జోక్యం వద్దు
- 'గాజుగ్లాసు' వ్యవహారంలో ఈసీ నివేదన
- టీడీపీ వ్యాజ్యంపై విచారణ 6కి వాయిదా


హోం ఓటింగ్ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గంలో తన ఇంటిలోనే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. బ్యాలెట్ల ముద్రణ బుధవారం సాయంత్రమే మొదలైందని.. ఇప్పటికే భద్రతా దళాలకు ఎలక్ట్రానిక్ బ్యాలెట్లు పంపామని హైకోర్టుకు నివేదించింది. ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఐచ్ఛికం ఇచ్చిన 85 ఏళ్లు దాటిన వయోవృద్ధుల నుంచి పోస్టల్ బ్యాలెట్లు సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ దశలో కోర్టు జోక్యం చేసుకుంటే ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని.. రాజ్యాంగంలోని 329(బీ) అధికరణ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని పేర్కొంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున, గాజుగ్లాసు గుర్తును ఇతర స్వతంత్ర అభ్యర్థులెవరికీ కేటాయించకుండా జనసేనకు మాత్రమే రిజర్వ్ చేసేలా ఆదేశాలివ్వాలంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య దాఖలు చేసిన వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. ఈవీఎంలపై అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులు మాత్రమే ఉంటాయి. చదవలేని నిరక్షరాస్యులైన ఓటర్లు గుర్తు ఆధారంగా తమ ఓటుహక్కును వినియోగించుకుంటారు. గాజుగ్లాసు గుర్తు కేటాయింపు విషయంలో ఈసీ ఉత్తర్వులు పరిమిత నియోజకవర్గాలపై మాత్రమే ప్రభావం చూపుతున్నాయి. ఎన్నికల ప్రక్రియను నిలువరించాలని మేం కోరడం లేదు. మా వినతిని పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలిచ్చేలా ఈసీని ఆదేశించండి' అని కోరారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ.. టీడీపీ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. ఎన్నికల ముందు పొత్తును చట్టంలో ఎక్కడా గుర్తించలేదని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ జోక్యం చేసుకుని.. గుర్తుల కేటాయింపు ప్రక్రియ ఏ దశలో ఉందో వివరాలు తెలుసుకుని కోర్టు ముందుంచాలని దేశాయ్‌ను ఆదేశించారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు విచారణ జరిపారు. గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ల సేకరణకు సంబంధించిన పై తాజా వివరాలను ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది కోర్టు ముందుంచారు. దమ్మాలపాటి స్పందిస్తూ.. పిటిషనర్ నుంచి వివరాలు తెలుసుకుని కోర్టు ముందుంచేందుకు సమయమివ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను 6వ తేదీకి వాయిదా వేశారు.

రామచంద్రయాదవ్‌పై తొందరపాటు చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. ఆయన ఎన్నికల ప్రచారానికి అవరోధం కల్పించవద్దని పేర్కొంది. చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం పరిధిలోని సదుం పోలీస్ స్టేషన్‌లో రామచంద్ర యాదవ్‌పై నమోదు చేసిన హత్యాయత్నం కేసులో న్యాయస్థానంపై ఆదేశాలిచ్చింది. విచారణను ఈ నెల ఎనిమిదవ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ ఇదే పోలీస్ స్టేషన్‌లో రామచంద్ర యాదవ్‌పై నమోదు చేసిన మరో కేసులో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటించాలని జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలిచ్చారు. అంతముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది ఉమేష్‌చంద్ర వాదనలు వినిపించారు. రాజకీయ కక్షతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా పిటిషనర్‌ను ఇబ్బందులకు గురిచేందుకు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని వారు వాదించారు.

బాబు ష్యూరిటీకి మోదీ గ్యారంటీ తోడు

- కూటమి మేనిఫెస్టోకు కేంద్రం పూర్తి సహకారం
- టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతల సమావేశం

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి మేనిఫెస్టోకు కేంద్ర సహకారం పూర్తిగా ఉంటుందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు ప్రకటించారు. బాబు షూరిటీకి మోదీ గ్యారంటీ తోడుగా నిలుస్తుందని పేర్కొన్నారు. తమ మేనిఫెస్టో అట్టర్ ప్లాప్ కావడం భరించలేక కూటమి మేనిఫెస్టోపై వైసీపీ నేతలు విష ప్రచారం మొదలు పెట్టారని మండిపడ్డారు. టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ గురువారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'బీజేపీ జాతీయ మేనిఫెస్టో దేశ స్థాయిలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తే ఏపీలో కూటమి పార్టీలు విడుదల చేసిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల మనోభావాలకు అనుగుణంగా రూపొందింది. జాతీయ శక్తి బీజేపీ... ప్రాంతీయ శక్తులైన టీడీపీ జనసేన పార్టీలు కలిస్తే మహాశక్తి. దీన్ని భరించలేక వైసీపీ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారు. 'వికసిత్ భారత్- వికసిత్ ఆంధ్రప్రదేశ్' మా నినాదం. చిల్లర రాజకీయాలు చేయడంలో జగన్ గ్యాంగ్ సిద్ధహస్తులు శ్మశానాల్లో కూడా తన బొమ్మ కనిపించకపోతే భరించలేని స్థితికి జగన్ చేరుకొన్నారు. అందుకే కూటమి మేనిఫెస్టోలో బొమ్మల గురించి మాట్లాడే హీనస్థితికి ఆయన దిగజారారు. చాలా రాష్ట్రాల్లో కూటమిగా ఎన్డీయే వెళ్తోంది. ఎక్కడా ఇటువంటి చిల్లర రాజకీయాలు లేవు. దానికి నీలి మీడియా వంత పాడుతోంది. పచ్చి అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్ ఈ విషయంలో కూడా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మద్యనిషేధం ఎటు పోయింది? రూ.3వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏమైంది? జాబ్ కేలెండర్ ఎవరికైనా కనిపించిందా? పేదలకు కేంద్రం ఇచ్చిన బియ్యం కూడా బొక్కి జగన్ రూ.50వేల కోట్లు వెనకేశారు. 'బైబై జగన్... జైజై కూటమి' మా నినాదం' అని లంకా దినకర్ పేర్కొన్నారు. 'లోకేశ్ పాదయాత్ర, చంద్రబాబు పర్యటనలు, పవన్ జనవాణి కార్యక్రమం, ప్రజల నుంచి నేరుగా వాట్సాప్ ద్వారా వచ్చిన వినతులు అన్నీ కలిపి లక్షా 30వేల అంశాలను పరిశీలించి కూటమి మేనిఫెస్టోను తయారు చేసింది. జగన్ వైఫల్యాలకు సమాధానంగా ఇది రూపొందింది. జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం నామమాత్రంగా తయారైంది. ఆస్పత్రులకు రూ.2వేల కోట్లు బకాయి పడ్డారు. పేదలకు ఆస్పత్రుల్లో వైద్యం దొరకడం లేదు. అందుకే దానికి సమాధానంగా దేశంలో మొదటిసారిగా సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని మేనిఫెస్టోలో ప్రతిపాదించాం. డిజిటల్ హెల్త్ కార్డు జేబులో పెట్టుకొని వెళ్తే ఒక కుటుంబం రూ.25లక్షల వరకూ ఉచితంగా వైద్యం పొందవచ్చు. జగన్‌కు పాలన చేతగాక కూటమి మేనిఫెస్టో ఆచరణ సాధ్యంకాదని ప్రచారం చేస్తున్నారు. జగన్‌రెడ్డికి అవినీతి తెలుసు. చంద్రబాబుకు ప్రభుత్వ ఆదాయం పెంచడం తెలుసు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రూ.8లక్షల కోట్ల అవినీతి చేశారు. అందులో పదో వంతు కూడా ప్రభుత్వానికి ఆదాయం పెంచలేకపోయారు. ఏపీపీఎస్సీ ఉద్యోగాలను కూడా అమ్ముకొన్న ఘనత జగన్‌కు దక్కుతుంది. లాండ్ టైటిలింగ్ పేరుతో లాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తెచ్చారు. అధికారంలోకి రాగానే దానిని రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం కలగలపుగా రెండిటి సమతూకంగా కూటమి మేనిఫెస్టో తయారైంది' అని పట్టాభిరాం చెప్పారు. కూటమి మేనిఫెస్టో అద్భుతంగా ఉందని మేధావి వర్గాలు ప్రశంసిస్తుంటే వైసీపీకి కంటగింపుగా ఉందని, అందుకే దానిపై బురద చల్లుతున్నారని శివశంకర్ విమర్శించారు.

8న ప్రధాని రోడ్ షో ఏర్పాట్లపై చర్చ

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార పర్యటన ఏర్పాట్లపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు గురువారం సమావేశమై చర్చించారు. ఈ నెల 7న అనకాపల్లి, రాజమహేంద్రవరంలో మోదీ పర్యటన ఉంటుందని, 8న రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలోని పీలేరులో బహిరంగ సభతో పాటు విజయవాడలో రోడ్ షో ఉంటుందని బీజేపీ నేతలు వివరించారు. 8న సాయంత్రం విజయవాడ బందర్ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రధాని హెలికాప్టర్లో దిగుతారని, అక్కడి నుంచి బెంజి సెంటర్ వరకూ రోడ్ షో ఉంటుందని చెప్పారు. ఈ రోడ్ షోను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, భారీ జనసందోహంతో నిర్వహించాలని కూటమి నేతలు నిర్ణయించారు. ఇటీవల బెంగళూరులో ప్రధాని రోడ్ షోను విజయవంతంగా నిర్వహించిన కర్ణాటక బీజేపీ నేత సిద్ధి రాజు తన అనుభవాలను వివరించారు. జన సమీకరణ, నగర అలంకరణ, ఇతర అంశాలకు ప్రత్యేకంగా కమిటీలు వేసుకొని ఇప్పటి నుంచే పనిచేయాలని, ఆయా నియోజకవర్గాల నేతలు అందరినీ భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

అతివలే నిర్ణేతలు!

154 స్థానాల్లో మహిళా ఓటర్లే అధికం

- ఓటర్ల నమోదులోనూ వారిదే పైచేయి
- రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4.14 కోట్లు
- మహిళలు 2,10,58,615 మంది
- 2,03,39,851 మంది పురుష ఓటర్లు
- ట్రాన్స్‌జెండర్లు 3,421, సర్వీసు ఓటర్లు 68,185
- తుది జాబితా కన్నా 5,94,631 మంది అధికం
- నమోదులో కర్నూలు టాప్, అత్యల్పం అల్లూరి
- సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా వెల్లడి



అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా గురువారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంటుకు జరిగే ఎన్నికల్లో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 4,14,01,887 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు. జనవరి 22న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితాలో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,08,07256 మంది ఉండగా ఇప్పుడు ఆ ఓటర్ల సంఖ్య 4,14,01,887 కోట్లకు చేరుకుంది. అంటే తుది జాబితాతో పోలిస్తే తాజా జాబితాలో ఓటర్ల సంఖ్య 5,94631 పెరిగింది. తుది ఓటర్ల జాబితాలో ప్రకారం పురుష ఓటర్ల సంఖ్య 2,00,74,322 ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 2,03,39,851కి చేరింది. మహిళా ఓటర్లు 2,07,29,452 ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 2,10,58,615కి చేరింది. ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య గతంలో 3,482 ఉండగా ఇప్పుడు 3,421గా నమోదైంది. సర్వీసు ఓటర్లు 67,434 ఉండగా ఇప్పుడు 68185కి చేరింది. గతంలో కన్నా సర్వీసు ఓటర్ల సంఖ్య పెరిగింది.

ఓటర్ల నమోదులో కర్నూలు టాప్

ఓటర్ల తాజా జాబితా ప్రకారం.. రాష్ట్రంలో అత్యధికంగా ఓటర్లున్న జిల్లాల్లో కర్నూలు మొదటి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 20,56,203 మంది ఓటర్లు ఉన్నారు. రెండోస్థానంలో ఉన్న అనంతపురంలో 20,20,243 మంది ఉన్నారు. ఇక, విశాఖ జిల్లా మూడోస్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 20,16,069 మంది ఓటర్లు ఉన్నారు. అదే విధంగా అత్యల్ప స్థాయిలో ఓటర్లు ఉన్న జిల్లాగా చివరి స్థానంలో.. అల్లూరి సీతారామరాజు జిల్లా నిలిచింది. ఇక్కడ 7,71,478 మంది ఓటర్లు ఉన్నారు.

ఇక్కడ పురుష ఓటర్లే ఎక్కువ

రాష్ట్రంలోని 21 నియోజకవర్గాల్లో మహిళల కంటే పురుషులు అధికంగా ఉన్నారు. టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట, రాజాం, చీపురుపల్లి, గాజువాక, పిఠాపురం, పి.గన్నవరం, ఎర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, మడకశిర, దర్శి హిందూపురం, పెనుగొండ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు రాష్ట్రవ్యాప్తంగా 3,421 మంది ఉండగా.. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 318 మంది ఉన్నారు. కోనసీమ జిల్లాల్లో అత్యల్పంగా 21 మంది ఉన్నారు. ఇక, రాష్ట్రంలో సర్వీసు ఓటర్లు 68,185 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్ల నమోదులో శ్రీకాకుళం మొదటి స్థానంలో ఉంది.

మహిళా ఓటర్లే అధికం

రాష్ట్రంలో 26 జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జనవరిలో కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితాలో శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో పురుష ఓటర్లు మహిళా ఓటర్ల కన్నా ఎక్కువగా ఉండగా తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇక, 154 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

పెరిగిన ఓటర్లు

2019 సాధారణ ఎన్నికల నాటికి రాష్ట్రంలో 3,94,05,967 మంది ఓటర్లు ఉండగా, 2024 ముసాయిదా ఓటర్ల జాబితాలో ఈ సంఖ్య 4,02,21,450కి చేరింది. తుది ఓటర్ల జాబితా-2024లో ఆ సంఖ్య 4,08,07256 చేరింది.



ఇప్పుడు తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో ఆ సంఖ్య 41401887కి చేరింది. మొత్తంగా 5,94,631 మంది ఓటర్లు పెరిగారు.

- అత్యధికంగా ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో భీమిలి తొలిస్థానంలో ఉంది. ఇక్కడ 3,64,304 మంది ఓటర్లు ఉన్నారు. తర్వాత స్థానంలో గాజువాకలో 3,34,399 మంది ఓటర్లున్నారు.
- అత్యల్ప సంఖ్యలో ఓటర్లు ఉన్న నియోజకవర్గం పెడన. ఇక్కడ 1,67,622 మంది ఓటర్లు ఉన్నారు. తర్వాత స్థానంలో నరసాపురంలో 1,70,521 మంది ఓటర్లు ఉన్నారు.
- అత్యధిక జెండర్ రేషియో ఉన్న నియోజకవర్గాల్లో రంపచోడవరం మొదటి స్థానంలో నిలిచింది. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,101 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రెండో స్థానంలో ఏలూరులో 1091 మంది, గుడివాడలో 1089 మంది ఉన్నారు. అత్యల్ప జండర్ రేషియో గిద్దలూరులో నమోదైంది. ఇక్కడ ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 964 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

మద్యంపై కమాండ్ కంట్రోల్ సెంటర్

- ఎన్నికల నేపథ్యంలో 24 గంటలూ పర్యవేక్షణ

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరా పర్యవేక్షణకు విజయవాడలోని కమిషనరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. మద్యం ఉత్పత్తి, రవాణా, సరఫరాను ఈ సెంటర్ నుంచి 24 గంటలపాటు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. 37 డిస్టిలరీలు, 4 బ్రూవరీలు, 29 మద్యం డిపోల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీల ఫుటేజీని నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం మద్యం రవాణా చేసే వాహనాలు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించాలని, ఎక్కడైనా వాహనాలు దారితప్పితే వాటిని సరిచేస్తున్నామని వివరించారు. అలాగే మద్యం నిల్వలు, అక్రమంగా మద్యం తయారీ, అమ్మకాల్లో ఉల్లంఘనలపై ఫిర్యాదులు కూడా స్వీకరిస్తున్నామని తెలిపారు. 9154106528, 8121909444 నంబర్లకు ఫోన్‌చేసి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో జిల్లాకు ఒకటి చొప్పున సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

775 బాటిళ్ల నకిలీ మద్యం స్వాధీనం

- హోమియోపతిలో వాడే మందుతో తయారీ.. పెందుర్తిలో భార్యాభర్తలు అరెస్టు

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): హోమియోపతి వైద్యంలో వాడే మందును ఉపయోగించి నకిలీ మద్యం తయారుచేస్తున్న వ్యక్తితో పాటు దానిని విక్రయిస్తున్న అతని భార్యను సెబ్ అధికారులు అరెస్టు చేశారు. పెందుర్తిలోని ఒక అపార్టుమెంటులో ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్‌కు చెందిన లాడి శిరీష హోమియోపతి వైద్య చికిత్సలో వాడే 'బెల్లడోనా' డ్రగ్‌తోపాటు క్యారమెల్ కలర్ ఉపయోగించి తయారుచేసిన నకిలీ మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి సెబ్ పోలీసులు దాడి చేశారు. అనంతరం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో శిరీష భర్త లింగరాజుపాత్రోను అదుపులోకి తీసుకున్నారు. 775 నకిలీ మద్యం బాటిళ్లు, మద్యం తయారీకి ముడిసరకుగా వినియోగిస్తున్న 290 కార్బో వెజిటబుల్స్ అస్పిడోస్పెర్మా బాటిళ్లు సీజ్ చేశారు.

పెద్దిరెడ్డి ఇలాకా ప్రమాదకరం!

- పుంగనూరు, చంద్రగిరి, తంబళ్లపల్లి సహా 11 స్థానాలు అత్యంత సమస్యాత్మకం
- పెద్ద ఎత్తున ఘర్షణలు, అల్లర్లకు అవకాశం
- ఆ నియోజకవర్గాల్లో 100% వెబ్‌క్యాస్టింగ్
- రాష్ట్ర వ్యాప్తంగా 64 పోలింగ్ కేంద్రాల్లో

374 ఎమ్మెల్యే, 64 మంది ఎంపీ అభ్యర్థులకు భద్రత

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నేత, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు, ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పోటీ చేస్తున్న తంబళ్లపల్లి, వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి తనయుడు మోహిత్ రెడ్డి పోటీలో ఉన్న చంద్రగిరి స్థానాలు అత్యంత సమస్యాత్మకమైన నియోజకవర్గాల జాబితాలో ఉన్నాయి. వీటితోపాటు మరో 11 స్థానాలు కూడా సమస్యాత్మక నియోజకవర్గాలుగా రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు గుర్తించారు. ఆయా స్థానాల్లో పోలింగ్ ప్రక్రియను 100 శాతం వెబ్‌క్యాస్టింగ్ చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా గురువారం వెల్లడించారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలను భారీ సంఖ్యలో మోహరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 46,389 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. వీటిలో 12,438 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్టు తెలిపారు. కాగా, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.203 కోట్ల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. జనవరి నుంచి ఎన్నికల ప్రకటన వరకు రూ.179 కోట్ల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 374 మంది ఎమ్మెల్యే, 64 మంది ఎంపీ అభ్యర్థులు భద్రత కావాలని కోరినట్టు తెలిపారు. వారి అభ్యర్థనలను డీజీపీకి పంపామన్నారు. సీవిజిల్ కింద 16 వేల ఫిర్యాదులు వచ్చాయన్నారు. కోడ్ అమల్లో ఉన్న కాలంలో జరిగిన హింసాత్మక సంఘటనల్లో ఇద్దరు మరణించారని, 156 మంది గాయాలపాలయ్యారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది మాత్రమే ఇంటి నుంచి ఓటు వేసేందుకు అంగీకరించారని తెలిపారు. ఈ ఓటింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభమైందన్నారు.

'గాజు గ్లాసు' అక్కడ ఉండదు

జనసేనకు కేటాయించిన ఎన్నికల గుర్తును ఆ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడం లేదని మీనా తెలిపారు. జనసేన పోటీ చేస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లోను, అదేవిధంగా జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాల పరిధిలోని లోక్‌సభ అభ్యర్థులకు కూడా గ్లాసు గుర్తును ఇవ్వలేదని తెలిపారు.

మీనా చెప్పిన మరిన్ని విషయాలు

- సామాజిక పెన్షన్ల పంపిణీపై ఏప్రిల్ 30న కమిషన్ ఆర్డర్ ఇచ్చింది. అకౌంట్లలో జమచేయాలని పేర్కొంది. అకౌంట్స్ లేని వారికి నేరుగా ఇవ్వాలని చెప్పింది.
- అభ్యర్థులు పెరిగిన కారణంగా అదనంగా 15 వేల బ్యాలెట్ యూనిట్లను తెప్పించాం. విశాఖ పార్లమెంటులో 33 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నాం.
- నెల్లూరు, కోనసీమ, కాకినాడలో వెలుగు చూసిన గోవా లిక్కర్ డంపుల వెనుక ఉన్నవారిని హైదరాబాద్‌లో గుర్తించాం. ఒకచోట హరియాణ లిక్కర్ కూడా దొరికింది.

ఇవి.. యమ డేంజర్!

మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, ఒంగోలు, ఆళ్లగడ్డ, తిరుపతి, చంద్రగిరి, విజయవాడ సెంట్రల్, పుంగనూరు, పలమనేరు, పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లి.

'లాండ్ టైటిలింగ్' సెగలు!

- అధికార, ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ సమరం
- ప్రజల్లో వ్యతిరేకతతో ఆత్మరక్షణలో వైసీపీ నేతలు
- ఎన్నికల వేళ చర్చనీయాంశంగా మారడంతో తిప్పలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన లాండ్ టైటిలింగ్ చట్టం సెగలు రేపుతోంది. ఈ చట్టంపై ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ సమరం నడుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుండటంతో వైసీపీ నేతలు ఆత్మరక్షణలో పడ్డారు. వ్యతిరేకతను తగ్గించుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. లాండ్ టైటిలింగ్ చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం చాలాకాలం క్రితమే తెచ్చినా అందులోని కీలక అంశాలను మీడియా ప్రముఖంగా లేవనెత్తడం, ప్రతిపక్షాలు వాటిని విస్తృతంగా ప్రచారంలోకి తేవడంతో అది ప్రస్తుతం ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు తన ప్రచార సభల్లో దీనిని ప్రముఖంగా లేవనెత్తుతున్నారు. ఈ చట్టంలో ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను వివరిస్తూ, ఇటువంటి చట్టాన్ని, దీనిని తెచ్చిన వైసీపీని సమర్థిస్తారా? అని ప్రశ్నలు వేస్తూ సభికుల నుంచి సమాధానం రాబడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ఆయన బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ఈ చట్టంలోని కొన్ని అంశాలను ప్రతిపక్షాలు బలంగా లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తమ భూమికి సంబంధించిన ప్రతి ఆస్తిని టైటిలింగ్ అధికారి వద్ద నమోదు చేయించాలని, దానిపై మరెవరైనా హక్కు కోరితే ఆ ఆస్తిని వివాద రిజిస్టర్‌లో చేరుస్తారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఆస్తిని తనఖా పెట్టినా, దానిపై బ్యాంకు రుణం తీసుకొన్నా ప్రభుత్వానికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, ఏ చిన్న అంశం తెలపకపోయినా జైలుశిక్ష తప్పదని మరో క్లాజ్ పేర్కొంటోంది. ఈ అంశాలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ప్రజల ఆస్తులపై వివాదాలు రేకెత్తడానికి ఈ చట్టం దోహదం చేస్తుందని, ఏదో ఒక వివాదాన్ని అధికార పార్టీ నేతలు కావాలని రేకెత్తించి తర్వాత సొమ్ము చేసుకొనే ప్రయత్నం చేస్తారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రజల భూములు లాక్కోవడానికే ఇటువంటి చట్టం తెచ్చారని, ఇది లాండ్ గ్రాబింగ్ చట్టమని మండిపడుతున్నాయి. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపణలొస్తున్న నేపథ్యంలో ఇప్పుడు ఏకంగా చట్టమే తెచ్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండటం అధికార పార్టీకి ఇబ్బందికరంగా తయారైంది. తాను భూములు పంచేవాడినే తప్ప కొట్టేసేవాడిని కానని ప్రచార సభలో సీఎం జగన్ స్వయంగా వివరణ ఇచ్చారు. ఈ చట్టం నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖలో తీసుకువచ్చిన అనేక నిర్ణయాలు మరోసారి తెరపైకి వచ్చాయి. టైటిల్ చట్టం అమల్లో భాగంగా రైతులకు ఇస్తున్న పాస్‌పుస్తకాల నిండా జగన్ బొమ్మలు ప్రచురిస్తుండటం కూడా ఈ సమయంలో చర్చనీయాంశంగా మారింది. వారసత్వంగా వచ్చిన భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలపై రైతుల ఫొటోలు ఉండాలి తప్ప సీఎం ఫొటో ఎందుకని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో ఒక రైతు ఏకంగా సీఎం సతీమణిని దీనిపై నిలదీశారు. ఒక సభలో రైతు పాస్‌పుస్తకాన్ని చించివేస్తున్న దృశ్యం వైరల్‌గా మారింది. అలాగే భూముల రిజిస్ట్రేషన్ తర్వాత అసలు పత్రాలు ఇవ్వకుండా, కేవలం జిరాక్స్ డాక్యుమెంట్లే ఇస్తారన్న అంశం వెలుగులోకి వచ్చింది. దీనిపై రైతులు, సామాన్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. భూముల సర్వే సందర్భంగా గ్రామాల్లో కొత్తగా వేస్తున్న సర్వే రాళ్లపై సీఎం పేరు ఉండటంపైనా విమర్శలొస్తున్నాయి. ఈ అంశాలన్నీ ఒకేసారి తెరపైకి రావడంతో అధికారపార్టీ సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ అంశంలోని తీవ్రతను గుర్తించి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో ఒకసారి వివరణ ఇప్పించింది. రైతులు కంగారుపడాల్సిన అవసరం లేదని సంబంధిత అధికారులతో చెప్పించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వంపై నమ్మకం తగ్గడంతో ప్రతిపక్షాలు చెబుతున్న అంశాలను రైతులు పట్టించుకొంటున్నారని, దీనితో అధికార పార్టీకి వ్యతిరేక సెగలు తగులుతున్నాయని రెవెన్యూ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

చంద్రబాబు రావాలి.. జగన్ ఇంటికి పోవాలి!

- జాతి ఐక్యంగా ముందుకు రావాలి: మంద కృష్ణమాదిగ



దొనకొండ, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయటానికి, జగన్‌ను ఇంటికి పంపటానికి మాదిగ జాతి ఐక్యంగా ముందుకు రావాలని మీ బిడ్డగా పిలుపునిస్తున్నానని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం గురువారం ఆయన ప్రకాశం జిల్లా దొనకొండలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలన రావాలని ఎమ్మార్పీఎస్ ఆకాంక్షిస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ పై ముందుగా మాదిగలకు న్యాయం చేసింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబేనని చెప్పారు. 1999-2004 కాలంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణను అమలు చేశారని, దీంతో మాదిగలకు 22 వేల ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, వేలాది ఉన్నత విద్యావకాశాలు మాదిగ బిడ్డలకు వచ్చాయని తెలిపారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను రద్దుచేయటంతో మళ్లీ ఉద్యమం మొదలుపెట్టినట్టు చెప్పారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తానన‌టంతో, జాతికి మేలు చేయటం కోసం ఆయనకు మద్దతు ఇచ్చానన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఎన్డీయే కూటమికి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. మాదిగ బిడ్డలు కలిసికట్టుగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

డేటా లీకేజీపై అంతా గప్‌చుప్..!

- సైలెంటుగా సీడీఎంఏ సైటు డిసేబుల్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ప్రభుత్వం చర్యలు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచే ప్రజలందరి రహస్య సమాచారం చోరీకి గురవుతోందని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం సైలెంట్‌గా చర్యలు చేపట్టింది. ప్రభుత్వంలోని అన్ని వెబ్‌సైట్ల నుంచి ముఖ్యంగా సంక్షేమ పథకాల వెబ్‌సైట్ల నుంచి ఆధార్, పాన్, పాస్‌పోర్టులు, ఫోన్‌నంబర్లు, ఫొటోలు, ఆస్తిపత్రాలు, ఇతర వివరాలన్నీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనికి ఉదాహరణగా 'ఆంధ్రజ్యోతి' కథనంలో సీడీఎంఏ వెబ్‌సైటులో మ్యారేజ్ రిజిస్ట్రేషన్ విభాగం నుంచి ప్రజల రహస్య సమాచారం ఎలా డౌన్‌లోడ్ చేసుకోవచ్చో వివరించింది. ఈ డేటా లీకేజీపై నంద్యాలకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి అనే వైసీపీ కార్యకర్త 'ఏబీఎన్' చానల్ లైవ్‌లో ప్రజల రహస్య సమాచారాన్ని ఎలా డౌన్‌లోడ్ చేసుకోవచ్చో చూపించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. కానీ, లీకేజీ లేదని చెప్పుకొనే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో సీడీఎంఏ వెబ్‌సైటులో దరఖాస్తుల స్టేటస్‌ను చెక్ చేసుకునే లింక్‌ను అందుబాటులో లేకుండా చేశారు. లీకేజీని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ మున్సిపల్ పరిధిలో ప్రజలకు ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్సు, మ్యారేజి రిజిస్ట్రేషన్లు, ఇతర సేవలు అందుబాటులోకి రావు. వైసీపీ కార్యకర్త విష్ణువర్ధన్ రెడ్డి ఏడాదిన్నర నుంచి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఈ లీకేజీపై ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు వెలుగులోకి రావడంతో సీడీఎంఏ సైటును డిసేబుల్ చేశారు. కానీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అన్ని వెబ్‌సైట్ల నుంచి ఇంకా భారీగా లీకేజీ జరుగుతోంది. మరి దాన్నెలా అరికడతారనేది ప్రశ్నార్థకమే.

రేపటి నుంచి ఈహెచ్‌ఎస్ సేవలు బంద్!

- ప్రభుత్వానికి మరో మూడు రోజులు సమయమిస్తాం
- ఆ తర్వాత ఆరోగ్యశ్రీ సేవలు కూడా ఆపేస్తాం
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు నెట్‌వర్క్ ఆస్పత్రుల అల్టిమేటం

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు మరోసారి నోటీసులిచ్చాయి. ఈ నెల 4వ తేదీ నుంచి ఉద్యోగుల హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) సేవలు నిలిపివేస్తున్నట్టు స్పష్టం చేశాయి. ఆ తర్వాత మూడు రోజుల్లోగా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఈ నెల 8వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలు కూడా నిలిపివేస్తామని హెచ్చరించాయి. ఈ మేరకు గురువారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యం సమాచారం ఇచ్చింది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.1400 కోట్ల వరకూ బకాయి పడింది. వాటిని విడుదల చేయాలని కోరుతూ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరు నెలలుగా పోరాడుతూనే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తుంది తప్ప బిల్లులు విడుదల చేయడం లేదు. విసుగుచెందిన నెట్‌వర్క్ ఆస్పత్రులు శనివారం నుంచి ఈహెచ్‌ఎస్ సేవలు నిలిపివేయాలని నిర్ణయించాయి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆస్పత్రులకు బకాయిల సమస్య వెంటాడుతూనే ఉంది. ఆస్పత్రులు గట్టిగా ఒత్తిడి చేస్తే రూ.50 కోట్లు, రూ.100 కోట్లు.. ఇలా చిన్న మొత్తాలు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంటోంది. ఆ బిల్లులు ఆస్పత్రులకు ఏ మూలకూ సరిపోవడం లేదు. నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రులు 90% ఆరోగ్యశ్రీ రోగులపైనే ఆధారపడుతున్నాయి. 10% రోగులు మాత్రమే నగదు చెల్లించి చికిత్స చేయించుకుంటారు. ఈ 10% నిధులతో ఆస్పత్రుల నిర్వహణ కష్టం. కనీసం వైద్య, నర్సింగ్ సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. ఈ విషయాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు పదే పదే ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నాయి. భరించలేని ఆర్థిక నష్టాల్లోకి వెళ్లిపోతున్నామని ఆరు నెలల నుంచి మొత్తుకుంటున్నాయి. అయినా ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేదు. ఆస్పత్రులు సమ్మె నోటీసులివ్వగానే హడావుడిగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లేదంటే ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని రంగంలోకి దించి చర్చలు జరపాలని ఆదేశిస్తుంది. వీరిద్దరూ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాన్ని పిలిపించి చర్చలు నిర్వహిస్తారు. సీఎం బకాయిలు విడుదల చేయమన్నారు, వారం పది రోజుల్లో మొత్తం వచ్చేస్తాయని నమ్మపలికి పంపించి వేస్తారు. 15 రోజుల తర్వాత మళ్లీ సేమ్ సీన్ రిపీట్ అవుతుంది. ఆరు నెలలుగా నెట్‌వర్క్ ఆస్పత్రులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల ఫలితం ఇలాగే ఉంటోంది. బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సేవలు నిలిపి వేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బర్మాతో జాగ్రత్త!

అంతర్యుద్ధం జరుగుతున్న మయన్మార్‌లో సైనికప్రభుత్వం బాగా బలహీనపడిందని, పరిస్థితులు సైన్యానికి అనుకూలంగా లేవని థాయ్‌లాండ్ ప్రధాని ఇటీవల ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. మయన్మార్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పొరుగు దేశం అధినేత చేసిన ఈ వ్యాఖ్య యుద్ధ తీవ్రతకు అద్దంపడుతున్నది. గత ఏడాది చివరి మాసాల్లో ఆరంభమైన ఈ తిరుగుబాటు తీవ్రస్థాయికి చేరుకొని, అద్భుత విజయాలను సాధిస్తోందని మయన్మార్‌కు ఆవల, సైనిక జుంటాకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రవాస ప్రభుత్వ ప్రతినిధులు చాలాకాలంగా అంటున్నారు. అది నిజమేనని ఇప్పుడు దేశంలోపల ఉంటున్న పాత్రికేయులు, పౌరసమాజ ప్రతినిధులు కూడా ధైర్యంగా చెబుతున్నారు. సైనిక ప్రభుత్వం రోజులు లెక్కబెట్టుకుంటోందని, అది పతనమైన అనంతరం దేశంలో ఎటువంటి వ్యవస్థ ఏర్పడాలనే విషయంమీద ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి.

సైనిక ప్రభుత్వంమీద పోరాడుతున్న సకల శక్తులూ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాయన్న మాటలో అతిశయోక్తి ఉండవచ్చును గానీ, మయన్మార్‌లో దాదాపు అరవైశాతం భూభాగం సైన్యం ఏలుబడిలో లేదన్నది మాత్రం నిజం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సైనిక ప్రభుత్వం తన ఆధిపత్యం కోసం ఏర్పాటు చేసుకున్న అన్ని వ్యవస్థలనూ తిరుగుబాటుదారులు దెబ్బతీసి, తమ అధీనంలోకి తెచ్చుకున్నారని, కొన్ని ముఖ్యపట్టణాలు మాత్రమే సైన్యం నియంత్రణలో ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. చాలా మిలటరీ స్థావరాలు, ఔట్ పోస్టులు సైన్యం చేతుల్లోనుంచి జారిపోయాయి. మయన్మార్–థాయ్‌లాండ్ సరిహద్దుల్లోని కీలకనగరాలు తిరుగుబాటుదారుల వశమవుతున్నందువల్లనే థాయ్ ప్రధాని ఆ వ్యాఖ్య చేసివుండవచ్చు. పెద్దసంఖ్యలో సైనికులు మరణించడం, యుద్ధభూమినుంచి పారిపోవడం, శత్రువులకు లొంగిపోవడం లేదా వారితో చేరిపోవడం ఇత్యాదివి సైనిక ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నాయి. కొత్తవారితో సైన్యాన్ని భర్తీచేసుకొనేందుకు మయన్మార్ స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్ (ఎస్ఏసి) లేదా జుంటా చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలితాన్నివ్వడం లేదు. విధిగా సైన్యంలో చేరాల్సిందేనని ప్రత్యేక ఆదేశాలు యువతను మరింత ఆగ్రహానికి గురిచేశాయి.

ప్రజలు ఎన్నుకున్న అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని 2021 ఫిబ్రవరిలో కూల్చివేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న మిలటరీ ఈ అతిపెద్ద తిరుగుబాటును తట్టుకోలేకపోతున్నది. త్రీ బ్రదర్ హుడ్ అలయెన్స్ పేరిట మయన్మార్ జాతీయ ప్రజాస్వామ్య ఆర్మీ, అరాకన్ ఆర్మీ, తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ కలసికట్టుగా ఆరంభించిన ఈ పోరాటం అనంతరకాలంలో మరిన్ని జాతులు, గ్రూపుల చేరికతో ఇంకా బలపడింది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని నిరంకుశంగా అణచివేసినందుకు సైనికప్రభుత్వంపై ఆగ్రహించి ఆయుధాలు చేపట్టినవారు కూడా అనేకమంది. గతంలో మిలటరీతో సయోధ్యగా ఉన్న వివిధ జాతులు, తెగలు కూడా ఈ యుద్ధ కాలంలో ప్రత్యర్థులతో కలిసిపోవడంతో మిలటరీ పాలకులు పెద్ద ఎత్తున ఎదురుదెబ్బలు తింటున్నారు. అనాదిగా వేర్వేరు లక్ష్యాలతో పోరాటాలు చేస్తున్న గ్రూపులన్నీ తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి మిలటరీని దించాలన్న లక్ష్యంతో ఒక్కటైనాయి. వ్యాపార వాణిజ్యమార్గాలు కూడా తిరుగుబాటుదారుల అధీనంలోకి పోతున్నందున పొరుగుదేశాలతో సాగే వాణిజ్యం కూడా ప్రభావితమవుతున్నది.

మయన్మార్ సైనిక ప్రభుత్వంతో లోపాయికారీగా సయోధ్యతో వ్యవహరిస్తున్న భారత ప్రభుత్వం ఈ పరిణామాలపై బహిరంగంగా ఏమీ మాట్లాడటం లేదు. తిరుగుబాటుదారుల ధాటీని తట్టుకోలేక భారతదేశంలోకి పారిపోయివస్తున్న మయన్మార్ సైనికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. వారికి తాత్కాలికంగా ఆశ్రయం ఇచ్చి, తిరిగి సరిహద్దులు దాటిస్తున్నప్పటికీ, అంగ్‌సాన్ సూకీని అష్టకష్టాలూ పెడుతున్న మిలటరీ ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తప్పడం లేదు. భారత ప్రభుత్వం ఈ కష్టకాలంలో తమకు అండగా నిలవడం లేదని మిలటరీ పాలకులకు కూడా ఆగ్రహం కలుగుతున్నదట. మరోపక్క, ఈ సైనిక ప్రభుత్వం పని అయిపోయిందనీ, తమను అధికారికంగా గుర్తించాలని ప్రవాస యూనిటీ గవర్నమెంట్ ప్రతినిధులు భారత్ సహా చాలా దేశాలకు విజ్ఞప్తులు చేసుకుంటున్నారు. దేశరాజధానిలోని సైనికస్థావరాల మీదే డ్రోన్‌దాడులు చేయగలిగేస్థాయికి పోరాటం చేరుకున్న తరుణంలో, పొరుగుదేశం పరిణామాలు కచ్చితంగా భారత్‌కు ఇబ్బంది కలిగించేవే.

ఒప్పులకుప్ప, ఒడిలో మీడియా!

ప్రధాన స్రవంతి మీడియాలో స్వతంత్ర గళాలను మూసేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు యూట్యూబ్‌లో ఉన్న స్వతంత్ర ఛానల్స్ వెంట పడుతోంది. 'బోల్ తా హిందుస్తాన్' అనే హిందీ న్యూస్ ఛానల్‌ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూట్యూబ్ నుంచి తొలగించారు. ఏప్రిల్ 4న కేంద్రంలోని ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ ఛానల్‌ని రద్దు చేస్తున్నట్లు యూట్యూబ్ నుంచి ఈమెయిల్ ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే రాత్రికి రాత్రి తీసివేయడం కూడా జరిగిపోయింది. ఈ ఛానల్‌కి 3 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 40వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. కొన్ని వారాల క్రితం ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ రద్దు చేశారు. ఇప్పుడు మొత్తం ఛానల్‌నే తీసేసారు. ఈ ఛానల్ అల్ప సంఖ్యాకుల, దళిత బహుజనుల సమస్యల మీద వార్తలు చేస్తుంది.

'బోల్ తా హిందుస్తాన్' తతంగం ఇంకా నడుస్తూనే ఉండగా మరో రెండు ఛానల్స్‌కి అదే రకం నోటీసు వచ్చింది. అవి 'నేషనల్ దస్తక్', 'ఆర్టికల్ 19'. ఈ ఛానల్స్ కూడా దళిత బహుజన విషయాల గురించి బలంగా కంటెంట్ చేస్తాయి. ఈ ఛానల్స్ చేసే కార్యక్రమాలను చూసి ప్రభుత్వం ఎందుకు ఇంతగా బెదురుతోంది? పార్లమెంట్ ఎన్నికల్లో హిందుత్వ రాజకీయాల ముసుగు ఈ ఛానల్స్ తొలగిస్తున్నాయనా? 'నేషనల్ దస్తక్' అనే ఛానల్‌కి దాదాపు 94 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. ఇక ఛానల్‌ని చూసేవాళ్లు మరో 30 లక్షల మందికి షేర్ చేస్తూ ఉంటారు. ఈ ఛానల్ ప్రత్యేకించి దళిత్ బహుజన్ హక్కుల గురించి విస్తృతంగా కవరేజ్ ఇస్తుంది. దళిత బహుజన యువతని జర్నలిస్టులుగా తీసుకుంటుంది. ఇంటర్న్‌షిప్స్ ద్వారా కొన్ని వేలమందిని మీడియా ప్రొఫెషనల్స్‌గా తయారు చేస్తుంది. పెద్ద మీడియా సంస్థలు కవర్ చేయని వార్తలను ఈ ఛానల్ చేస్తుంది. యూపీ బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఈ ఛానల్‌కి కొన్ని లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. సరిగ్గా మోడల్ కోడ్ ఉన్న సమయంలో, ఎలక్షన్ మధ్యలో ఇంత బలమైన ఛానల్‌ని మూసివేయడం ఎలక్షన్ కమిషన్‌కి ఏ మాత్రం తప్పుగా అనిపించట్లేదు. మూసివేయటానికి ఎటువంటి ప్రత్యేక కారణం ఇవ్వకుండా, ఎటువంటి ప్రక్రియా పాటించకుండా, కేవలం ఉల్లంఘన జరిగిన కార్యక్రమాన్ని తొలగించమనకుండా, మొత్తం ఛానల్‌నే మూసివేయడం ఎంత దౌర్జన్యం?



మీడియా మీద అణచివేతను కేవలం 19(1)A కోణం నుంచి చూస్తే సరిపోదు. దీనికి ప్రబలంగా కుల మత కోణం కూడా ఉంది. అగ్రకుల పాత్రికేయులను వెంటాడటం వెనుక కూడా వారు దళిత బహుజనుల, అల్ప సంఖ్యాక వర్గాలకు మద్దతుగా నిలబడినప్పుడే జరుగుతున్నది. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య వాదులం ఎంతమందిమి గుర్తిస్తున్నాం?

ఇదే క్రమంలో 'ఆర్టికల్ 19' అనే ఛానల్‌కి కూడా ప్రభుత్వం నుంచి ఇటువంటి బెదిరింపే వచ్చింది. గతంలో కేరళలోని 'మీడియా వన్' అనే సాటిలైట్ ఛానల్‌ని కూడా ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ లైసెన్స్ రెన్యూ చేయకుండా మూసివేసే పరిస్థితి కల్పించింది. జాతీయ భద్రత నెపంతో, కారణం బహిరంగంగా చెప్పకుండా ప్రభుత్వం కోర్టులో సీల్ కవర్ అందించింది. సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, దాని తరవాత ఢిల్లీలో జరిగిన అల్లర్లను గురించి ఆ ఛానల్ చేసిన విస్తృత కవరేజ్‌లో– ఢిల్లీ పోలీస్ నిష్పాక్షికంగా తమ విధులు చేయలేదని, అల్లర్లలో ఆరెస్సెస్ పాత్ర ఉందని విమర్శలు చేయడం ప్రభుత్వానికి నచ్చక ఛానల్‌ని మూసేసింది. దీనిని దేశభద్రతతో ముడిపెట్టింది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఛానల్‌ని దాదాపు సంవత్సరం తరవాత మళ్ళీ తెరవగలిగారు.


మొదటగా, 2014లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణికి బలి అయ్యింది హిందుస్థాన్ టైమ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ బాబీ ఘోష్. ఈయన 2016–17 మధ్య తాను ఎడిటర్‌గా ఉన్న కాలంలో హేట్ ట్రాకర్‌ని రూపొందించి, అందులో దేశవ్యాప్తంగా అల్ప సంఖ్యాకుల మీద జరిగిన విద్వేష దాడులను ఎప్పటికప్పుడు నమోదు చేయించాడు. 28 సెప్టెంబర్ 2015లో దాద్రిలో అఖ్లాఖ్‌ని గొడ్డు మాంసం కోసం గోహత్య చేశాడన్న తప్పుడు ఆరోపణలతో పట్టపగలు మూకదాడి చేసి, హత్య చేశాక ఈ హేట్ ట్రాకర్‌ని మొదలుపెట్టారు. ఇది ప్రారంభం అయిన కొన్నాళ్లకే బాబీ ఘోష్‌ని తీసేయమని యాజమాన్యం మీద ప్రభుత్వం నుంచి ఒత్తిడి మొదలైయింది. బాబీ ఘోష్ త్వరలోనే రాజీనామా చేసి వెళ్ళిపోయాడు. పత్రిక వెంటనే తమ వెబ్‌సైట్ నుంచి హేట్ ట్రాకర్‌ని తీసివేసింది. ఇక తరువాతి కాలంలో రవీష్ కుమార్, పుణ్య ప్రసూన్ బాజ్‌పాయి, అభిసార్ శర్మ వంటి దిగ్గజ జర్నలిస్టులను యాజమాన్యాల మీద ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలు విడిచి వెళ్లే లాగా చేసింది కేంద్ర ప్రభుత్వం. ఎన్‌డిటీవీ లాంటి న్యూస్ సంస్థల్ని పెట్టుబడిదారీ మిత్రులు స్వాధీనం చేసుకునే పరిస్థితులని సృష్టించింది.

ఒక పక్క కుల వివక్షకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉన్న ఛానళ్లు, పత్రికల మీద, పాత్రికేయుల మీద విరుచుకుపడే ప్రభుత్వం సుదర్శన్ టీవీ, రిపబ్లిక్, టైమ్స్ నౌ, ఆజ్ తక్ వంటి ఛానళ్లు ప్రతిరోజూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే షోలు చేస్తుంటే చూసీ చూడనట్టు ఉంటోంది. గత కొన్ని నెలల్లో ఈ ఛానళ్లకి నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ విద్వేషపూరిత షోలు చేస్తున్నారని జుర్మానాలు విధించటం చూస్తున్నాం. కానీ ప్రభుత్వం మాత్రం వాటిపై చర్య తీసుకోకపోగా, నియంత్రించే ఊసే లేదు.

గతంలో హత్రాస్‌లో ఒక దళిత మహిళను అగ్ర కులాల వాళ్లు అత్యాచారం చేసి, దారుణంగా హింసించి చంపిన ఘటన తరవాత, దానిని గురించి రిపోర్ట్ చేయడానికి వెళుతున్న సిద్దిక్ కప్పన్‌ను ఇంకా ఒక్క అక్షరం కూడా రాయకముందే అరెస్ట్ చేసి రెండేళ్ల పాటు జైల్లో మగ్గించింది కేంద్ర ప్రభుత్వం. ఈ సంఘటనలన్నిటికీ కామన్ విషయం దళిత బహుజనుల, అల్ప సంఖ్యాకుల రక్షణ, భద్రత, హక్కులు అని గమనించాలి. ఈ ప్రభుత్వం పదే పదే మనకు పంపుతున్న సందేశం – ఈ దేశంలో అగ్ర కులాల, బహు సంఖ్యాకుల ఆధిపత్యమే ఉండాలి. ఇతరుల సమస్యలు తలెత్తినా, గొంతులు లేచినా అణచివేత అనివార్యం. మీడియా మీద అణచివేతను కేవలం 19(1)A కోణం నుంచి చూస్తే సరిపోదు. దీనికి ప్రబలంగా కుల మత కోణం కూడా ఉంది. అగ్రకుల పాత్రికేయులను వెంటాడటం వెనుక కూడా వారు ఈ సామాజిక వర్గాలకు మద్దతుగా నిలబడినప్పుడే జరుగుతున్నది. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య వాదులం ఎంత మందిమి గుర్తిస్తున్నాం? గుర్తిస్తే మన కర్తవ్యం ఏమిటి?

• ప్రొ. పద్మజ షా

ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?



అసంఖ్యాక భారతీయులు గత ఐదేళ్లుగా కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలకు వారు ప్రతిస్పందించడంలేదు. ఏ పార్టీ గెలిచినా నష్టపోతోంది తామేనన్న భావన కూడా వారిలో బాగా పెరిగిపోతోంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికల మొదటి రెండు విడతల పోలింగ్ ముగిసింది. ఇంకా ఐదు విడతల పోలింగ్ జరగవలసి వున్నది. ఇంతలో, ప్రచండ వేసవి గాడ్పులు, ఎన్నికల ప్రచార వేడి మిళితమై ఒక తీవ్ర ఉక్కపోతతో సతమతమవుతున్న దేశ ప్రజల ముందుకు అనుకోకుండా ఒక పెద్ద ప్రశ్న వచ్చింది: టీవీ స్టూడియోల లోను, విశాల సమాజంలోను రాజకీయ పార్టీల నాయకుల వాద ప్రతివాదాల హోరు ఎడతెగకుండా మిన్నంటుతున్నా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ ప్రజాస్వామిక 'పండుగ'లో పాల్గొంటున్న వారి సంఖ్య అంచనాల కంటే ఎందుకు తక్కువగా ఉన్నది?

మండుతున్న ఎండా కాలం, పంట కోతల సమయం, సుదీర్ఘ వారాంతపు సెలవులు అనేవి పోలింగ్ శాతం తక్కువగా ఉండడాన్ని పాక్షికంగా మాత్రమే వివరిస్తాయి. నిజమేమిటంటే దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజాస్వామిక లోటు (ప్రజాస్వామిక సంస్థలు, వ్యవస్థలు తమ కార్యాచరణల్లో ప్రజాస్వామ్య సూత్రాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండకపోవడం, పర్యవసానంగా ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల ప్రజల్లో అనాసక్తి, నిర్లిప్తత పెరిగిపోవడం వల్ల నెలకొనే పరిస్థితి) గణనీయంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మన ప్రజాస్వామ్యం అసమగ్రంగా ఉన్నది. సామాన్యుల ఆరాటాలను ఆర్తీలు, నేతలు పట్టించుకోవడం లేదు. కనుకనే సగటు ఓటరు తన ప్రతినిధిగా ఏ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోవాలనే విషయమై అంతకంతకూ ఉత్సుకతను కోల్పోతున్నాడు. పార్లమెంటు సభ్యుడుగా తన విధ్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో నిర్వర్తించగలడనే భరోసాను వివిధ పార్టీల అభ్యర్థులలో ఏ ఒక్కరూ ఇవ్వలేకపోవడమే అందుకు కారణంగా చెప్పవలసి ఉన్నది.

ఎన్నికల ముందు రోజుల్లో విజయోత్సాహంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదాన్ని ఇచ్చింది, 400 సీట్లతో తమ పార్టీ విజయం సాధించగలదని ఆ పార్టీ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో చెప్పాయి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని, అయితే 1984 సార్వత్రిక ఎన్నికలలో 414 నియోజకవర్గాలను గెలుచుకున్న రాజీవ్ గాంధీ రికార్డును ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిగమించగలరా అన్న విషయం మాత్రమే మిగిలి వుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

ఎన్నికల ప్రచారం ఊపందుకుని, రెండ విడతల పోలింగ్ సైతం ముగిసిన ప్రస్తుత తరుణంలో అధికార, ప్రతిపక్షాలు రెండింటికీ ఓటర్ల విషయమై ప్రాథమిక వాస్తవాలు తెలిసివచ్చాయి. ఏ రాష్ట్రంలోనూ అటు అధికార పక్షం/ కూటమికి గానీ, ఇటు ప్రతిపక్షం / కూటమికి గానీ అనుకూల పవనాలు వీయడం లేదన్నది స్పష్టంగా కన్పిస్తున్నది. ఓటర్లు ఏ పక్షం వైపు మొగ్గు చూపడం లేదనేది విశదమయింది. (మొదటి విడతలో పోలింగ్ శాతం అంచనాల కంటే 3 శాతం తక్కువగా నమోదయింది). వెన్వెంటనే ప్రధాని మోదీ, ఓటర్లలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం ప్రారంభించారు. 2047 సంవత్సరం నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మిస్తామన్న హామీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ మొదటి దశ ఎన్నికలు ముగియగానే మాట మార్చింది. ఆశాభావ రాజకీయాల నుంచి భయాన్ని సృష్టించే రాజకీయాలకు మారింది. ఆశాభావం, భయం అసాధారణమైన సహచరులు. భయపూరిత రాజకీయాలు హానికరమైనవి, విధ్వంసకరమైనవి కాగా ఆశాభావ రాజకీయాలు సానుకూలమైనవి, నిర్మాణాత్మకమైనవి, సృజనాత్మకమైనవి.

2024 సార్వత్రిక ఎన్నికలు ఒక ఆశాభావంతో ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఆశాభావం శీఘ్రగతిన అర్ధ సత్యాలు, అబద్ధాలను నిర్భయంగా వ్యాపింపజేసే ఒక భయపూరిత వాతావరణంలోకి జారిపోయింది.

రాజస్థాన్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ తన శ్రోతల్లో తీవ్ర సంకుచితత్వ భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ మానిఫెస్టో ముస్లిం లీగ్ మానిఫెస్టోలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ వారు అధికారంలోకి వస్తే మీ ఆస్తులను స్వాధీనం చేసుకుని చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తారని మోదీ హెచ్చరించారు. అంతే కాకుండా స్త్రీల మెడల్లో ఉన్న మంగళసూత్రాలను సైతం తెంచుకుపోతారని కూడా ఆయన ఆరోపించారు. ఏ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ప్రధానమంత్రి ఇటువంటి ఆరోపణలు చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పార్టీకి ప్రధాన మద్దతుదారులుగా ఉన్న హిందూత్వవాదులను రెచ్చగొట్టి, సుపరిచిత 'శత్రువు'కు వ్యతిరేక పోరాటంలో వారు పాల్గొనేలా చేయడమే ఆయన లక్ష్యం. ఎన్నికలలో బీజేపీ ఒక విజేతగా నిలవటంలో భారతీయ ముస్లింలు కీలక పాత్ర వహిస్తున్నారు. 1990ల్లో వారిని 'బాబర్‌కి ఔలద్' అని పరిహసించారు. ఇప్పుడు వారిని 'ఘస్ పేటియాస్' (చొరబాటు దారులు) అని నిందిస్తున్నారు.

బీజేపీ మళ్లీ మతతత్వ పక్రీకరణలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ సైతం ఊహాత్మక భయాల ఆధారంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచార సభలలో భారత రాజ్యాంగం ప్రతిని ఎత్తిచూపుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు రిజర్వేషన్లను శాశ్వతంగా రద్దు చేసేందుకు రాజ్యాంగానికి సవరణలు చేస్తుందని హెచ్చరిస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలతో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా మండల్ 'సామాజిక న్యాయ'వాదుల మద్దతును కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఆరాటపడుతోంది.

అయితే సగటు ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ ధోరణులు ఏవీ పట్టడం లేదు. ఆ పార్టీల ప్రచారాలకు వారు స్పందించడంలేదు. జీవనోపాధి సమస్యలతో సతమతమవుతున్న సగటు ఓటర్లు వాటి నుంచి బయటపడేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఆసేతు హిమాచలం పర్యటించండి– నాయకులు, సామాన్య పౌరుల మధ్య సంబంధరాహిత్యం ఎంతగా ఉన్నదో స్పష్టమవుతుంది. గత ఐదేళ్లుగా అసంఖ్యాక భారతీయులు, కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలు వారి నేమాత్రం ఆకట్టుకోలేకపోతున్నాయి. నగరాలలో సాయం సంధ్యల్లో వివిధ సభలు, సమావేశాలలో పాల్గొనే వారికి 'ప్రభవిస్తున్న నవభారతం' అనేది ఒక ఉత్తేజకర చర్చనీయాంశం కావచ్చు గానీ దుర్భర పరిస్థితులు ఉన్న గ్రామీణ భారతంలో వాటర్ ట్యాంకర్ ఎనిమిది రోజులకు ఒకసారి మాత్రమే రావడం అనేది ఒక కఠోర వాస్తవం. మరి 'నవభారత్' గురించిన ఉద్ఘాటనలు సగటు పౌరులను ఎలా ఉత్తేజపరుస్తాయి? రాజకీయ నాయకుల ప్రసంగాలకు, సంఖ్యానేక ప్రజల వాస్తవ జీవన పరిస్థితులకు మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. నేతల ఈ నిర్లక్ష్య వైఖరులే అత్యధిక ఓటర్లలో ఎన్నికల ప్రకియ పట్ల ఉదాసీనతను కాకపోయిప్పటికీ ఏ పార్టీ అభ్యర్థికి ఓటువేయాలనే విషయమై ఒక నిశ్చయానికి రాలేని మందకొడితనాన్ని కలిగిస్తున్నాయి.

మహారాష్ట్రనే చూడండి. పశ్చిమ భారతంలోని ఈ ప్రధాన రాష్ట్రంలో గత మూడేళ్లలో అనేక రాజకీయ ఉపద్రవాలు సంభవించాయి. ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. విధేయతలు మార్చుకోవడం, రహస్య పొత్తులు పెట్టుకోవడం మొదలైన పరిణామాలు రాష్ట్ర పాలనపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తల సైతం ఎన్నికల సంబంధిత వ్యవహారాలలో పాల్గొనేందుకు ఎంత మాత్రం ఆసక్తి చూపడం లేదు.

రాజకీయవేత్తలు తమ ఆస్తిపాస్తులను పెంచుకుంటూ పదవులను అధిష్ఠిస్తుండగా సగటు కంటే తక్కువ వర్షపాతంతో వ్యవసాయరంగంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై సంపన్నులు విలాస జీవితాలు గడుపుతుండగా ట్యాంకర్ మాఫియా గ్రామీణ మహారాష్ట్రలో ఒక పెద్ద బకెట్ నీటిని రూ. 200కి విక్రయిస్తోంది! రాజకీయ నాయకులు పెద్ద పెద్ద హామీలు ఇచ్చి వాటిని ఏ మాత్రం నెరవేర్చకపోతుండడంతో వారి పట్ల గ్రామీణ ప్రాంతాల ఓటర్లలో భ్రమలు తొలగిపోయాయి. ఇప్పుడు ఎన్నికల విషయంలో గ్రామీణ ఓటర్ల ఆలోచనలకు ఈ వాస్తవాలే ఆధారంగా ఉంటున్నాయి అంటే ఎన్నికల పట్ల వారి మనోవైఖరులు ఎలా ఉన్నాయనేది ఎవరికి వారే అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకులు, ముఖ్యంగా అధికారంలో ఉన్న వారి పట్ల వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 'మోదీ గ్యారంటీ'లకు సంబంధించిన పోస్టర్లు పల్లె పల్లెన ప్రతి వీధిలోనూ వెలసినా పాలకుల పట్ల వారి వ్యతిరేకతను తగ్గించలేకపోతున్నాయి. అవును, ప్రజల్లో ప్రబలిన ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే బీజేపీ వంద మందికి పైగా సిట్టింగ్ ఎంపీలను మార్చివేయడం జరిగింది.

ఈ వాస్తవాలు మరొక పెద్ద ప్రశ్నను మన ముందుంచుతున్నాయి : జీవన పోరాటంలో అలసిపోయిన ఓటర్ అసంతృప్త మనోవైఖరి నుంచి ఎన్నికలలో లబ్ధిపొందేదెవరు? నష్టపోయేదెవరు? బీజేపీ సహేతుకంగానే తన విజయంపై ఆత్మవిశ్వాసంతో ఉన్నది. పటిష్ఠ ఎన్నికల యంత్రాంగం, అందునా ప్రజల విశ్వాసాన్ని మరెవరికంటే ఎక్కువగా పొందుతున్న ఒక శక్తిమంతమైన నాయకుడి నిర్ణయాలు, నిర్దేశాలకు పని చేస్తుండడంతో తాము వరుసగా మూడోసారి కూడా విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు పూర్తి నమ్మకంతో ఉన్నాయి. కాంగ్రెస్ కూడా ఒక ఆశాభావంతోనే పోరాడుతున్నది. ఓటర్ల ఉదాసీనత, సరిసమాన స్థాయిలో పోటీ పడుతున్న నియోజకవర్గాలలో ప్రత్యర్థితో గట్టిగా పోరాడే అవకాశాన్ని కల్పిస్తుందనే ఆశ కాంగ్రెస్‌కు నిండుగా ఉన్నది. అయితే భారత ప్రజాస్వామ్య సంక్షోభం బీజేపీ వర్సెస్ ప్రతిపక్షం అనే ద్వంద్వత్వానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది చాలా విస్తృతమైనదీ, తీవ్రమైనదని చెప్పి తీరాలి. ఏమైనా ఎన్నికలలో ఏ పార్టీ గెలిచినా ఓటర్లే ఎక్కువగా నష్టపోతున్నారనే భావన ప్రజల్లో బాగా పెరిగిపోతోంది. పార్టీలు, నాయకుల పట్ల ప్రజల ఈ విశ్వాస రాహిత్యమే భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి ఒక తిరుగులేని తార్కాణం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఓటెవరికి వేయాలి?

మనది ప్రజాస్వామ్యం. ఓటెయ్యాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది. ఆ ఒక్క రోజూ సకల అంగాల్నీ కూడదీసుకుని ఎడమచేతి చూపుడువేలి మీద చుక్కేయించుకోవాలి. ఎండ భరించైనా కదలాలి. ఇంతకీ ఓటెవరికేయాలి? ఒక లక్ష్యంతో పనిచేసేవారిని గుర్తించాలి. ప్రజలకు మేలు జరుగుతుందని భావించేవారిని తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవారిని దూరంగా ఉంచాలి. గత ఐదేళ్ళుగా మనకు కొన్ని అనుభవాలున్నాయి.

రాజ్యాంగ పరిధి దాటి పనిచేయడం పాలకుడు తన గొప్పతనంగా భావిస్తున్నాడు. రక్షణ వ్యవస్థను గుప్పెట పెట్టుకుంటే చాలనుకుంటున్నాడు. ఆశ్రిత అధికార గణమే తనకు రక్ష అనుకుంటున్నాడు. ప్రత్యర్థి ఆర్థిక మూలాల్ని ధ్వంసం చేయడమే తన బలం అనుకుంటున్నాడు. అందినకాడికి దోచుకోవడం, దాచుకోవడం పరమావధి అనుకుంటున్నాడు. పైగా దురన్యాయమేమిటంటే తన అనుంగు మిత్రులకు అన్నిందాల స్వేచ్ఛా వాయువులు ప్రసాదించడం, వారి తప్పులు ఎన్నయినా ఉపేక్షించడం తన విధి అనుకుంటున్నాడు. ప్రజాభీష్టాన్ని గౌరవించక్కర్లేదనుకుంటున్నాడు. అంతేనా?

ప్రజాస్వామ్య ఉగ్రవాదిగా మారడానికి శాసనసభ సీట్లన్నీ తనకే కావాలంటున్నాడు. అసలు ఈ కోరికే విడ్డూరం కదా. అరె.. ప్రజాస్వామ్యంలో ఉన్నాం. పాలక పక్షం, ప్రతిపక్షం రెండూ ఉండాలి కదా. ఒంటెద్దు పోకడల్ని నియంత్రించాలి కదా. నిర్మాణాత్మకమైన సూచనలు అందుకుని ఆచరించే సహృదయత ఉండాలి కదా. లోటుపాట్లు సరిదిద్దుకునే వ్యవస్థ ఉండాలి కదా. ఫ్యూడల్ మనస్తత్వం నరనరాన జీర్ణించుకున్నవాడు మాత్రమే నియంతలా పాలించాలనుకుంటాడు. చరిత్ర పాఠాలు చెప్పినా చెవికెక్కించుకోడు. ఒత్తిడి చేసి, ప్రలోభపెట్టి, తాత్కాలిక ప్రయోజనాలు కల్పించి నెగ్గాలనుకుంటే చెల్లదు గాక చెల్లదు.

ప్రజలు చాలా తెలివైనవారు. కళ్ళ ముందున్న నిజాల్ని కాదని అబద్ధాల్ని నమ్మరు. రాజధాని ఏదంటే మూడు దిక్కులు చూపిస్తుంటే చిరాకు పడతారు. గతుకుల రవాణా వ్యవస్థ ప్రగతికి పట్టుకొమ్మలని భావించి అసలు పట్టించుకోకపోవడాన్ని ఈసడిస్తారు. చదువుకున్న యువత వలసెళ్లి పోతుంటే మౌనంగా ఉండలేరు. కొలతలేసి చూసుకుని సామాజిక న్యాయం కొరవడిందంటే తిరగబడతారు. అస్తవ్యస్త విధానాలతో దార్శనికత లోపించిన చదువులు చట్టుబండలు కావడాన్ని భావితరాలు క్షమించవు. ఇప్పుడు చెప్పండి ఎవరికి ఓటెయ్యాలి? అంతిమంగా ప్రజలే గెలుస్తారు.

– దాట్ల దేవదానం రాజు
విశ్రాంత ఉపాధ్యాయుడు

సర్కార్ అండతో చెలరేగిపోతున్న ఇసుకమాఫియా

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుకమాఫియా పేట్రేగిపోతోంది. దాని కనుసన్నల్లో అక్రమ ఇసుకతవ్వకాలు అడ్డూఅదుపూ లేకుండా సాగిపోతున్నాయి. వెంటనే ఆ తవ్వకాలను నిలిపివేయాలని, వాటికి పాల్పడ్డవారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడం రాష్ట్రంలోని పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోంది. మరోవైపు కేంద్రసంస్థలు, జాయింట్ కమిటీలు ఇప్పటివరకు జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించిన నివేదికలను పరిశీలిస్తే గనులశాఖ ధృతరాష్ట్ర పాత్ర వహిస్తూ జగన్ ప్రభుత్వ వందిమాగధులైన ఇసుకమాఫియా ప్రయోజనాలను కాపాడుతున్నట్లు తేటతెల్లమవుతోంది. 'రాష్ట్రంలో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఎన్నో నిబంధనల్ని ఉల్లంఘించడంతో పాటు ఏకంగా నదీప్రవాహాలనే దారిమళ్లించి మరీ అక్రమమైనింగ్‌కు పాల్పడ్డారు. దీనిని అడ్డుకుని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన గనులశాఖ విధి నిర్వహణలో ఘోరంగా విఫలమైంది' అంటూ కేంద్రసంస్థలు, జాయింట్ కమిటీలు ముక్తకంఠంతో అభిప్రాయపడ్డాయి.


'గనులశాఖ కోరిక మేరకు ఇసుకరీచ్‌లలో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు(ఈసీ) ఇచ్చే బాధ్యత మాది. పర్యావరణ పరిరక్షణ, చట్టాల అమలులో డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ(డీఎంజీ) నోడల్ విభాగంగా పని చేస్తుంది. 2021 ఆగస్టులో ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు, ఆ తర్వాత అనేక సందర్భాల్లో సూచించిన మార్గదర్శకాలు, 2023 మార్చి 23న ఇచ్చిన ఈసీలను రద్దు చేస్తూ జారీచేసిన ఉత్తర్వులు, బీ1 కేటగిరీలోని 110 రీచ్‌ల్లో తవ్వకాల నిలిపివేత వరకు ప్రతి ఆదేశాన్ని కచ్చితంగా అమలు చేయాలంటూ గనులశాఖ డైరెక్టర్‌కు అనేక దఫాలుగా లేఖలు రాశాం. ఈ మెయిల్స్ పంపించాం. అయినా అక్రమ మైనింగ్ ఆగలేదు. నాటి జేపీ వెంచర్స్ నుంచి నేటి ప్రతిమ, జీసీకేసీ కంపెనీల వరకు అన్నీ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ ఇసుకతవ్వకాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. వీటిని అడ్డుకోవడంలో గనులశాఖ పూర్తిగా విఫలమైంది' కేంద్ర పర్యావరణ, అటవీశాఖ జాయింట్ కమిటీ, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ(సియా) 2022 ఆగస్టులో ఎన్జీటీకి సమర్పించిన నివేదికలో పేర్కొన్న అంశాలివి.

నిబంధనలకు విరుద్ధంగా రెండుటన్నులు, అంతకుమించిన బరువున్న ఇసుకను ఒకేసారి తవ్వితీయగల జేసీబీలను ఆ సంస్థలు ఉపయోగించాయి. 2023 మార్చిలో 110 రీచ్‌ల ఈసీలను రద్దు చేశాక కూడా అవి తవ్వకాలు జరిపాయి. జెపి వెంచర్స్ సంస్థ లీజు 2023 మే 12న రద్దయినా నవంబరు నెలాఖరు వరకు తన అక్రమదందాను కొనసాగించింది. జేపీ వెంచర్స్ తర్వాత కాంట్రాక్టు దక్కించుకున్న కొత్తసంస్థలు ప్రతిమ పద్దెనిమిది జిల్లాల్లో, జీసీకేసీ ఎనిమిది జిల్లాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నాయి. ఈ రెండూ 'సియా' నుంచి ఈసీలు తీసుకోకుండానే అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నాయి. కేంద్రం అమలులోకి తెచ్చిన 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సస్టెయినబుల్ శాండ్ మైనింగ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్–2016', 'ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ మానిటరింగ్ గైడ్‌లైన్స్ ఫర్ శాండ్ మైనింగ్–2020' మార్గదర్శకాలను అవి తుంగలో తొక్కేశాయి. నోడల్ ఏజెన్సీ నుంచి సరైన పర్యవేక్షణ లోపించడంతో ఇసుకరీచ్‌లలో అడ్డగోలుగా ర్యాంపులు, రహదారులు ఏర్పాటుచేశారు. కృష్ణానదిలో ఈ సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రీచ్‌లను కిలోమీటర్ పైగా గుర్తించాల్సి ఉండగా కొన్ని రీచ్‌లను 500మీటర్ల పరిధిలోనే ఏర్పాటుచేశారు. ఇలా చేయాలంటే ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి. ప్రతిమ, జీసీకేసీ సంస్థలు అవేం పట్టించుకోకపోయినా గనులశాఖ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది.

చంద్రబాబు హయాంలోని ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసిన జగన్ సర్కారు జేపీ వెంచర్స్‌కు 2021 మే 12 నుంచి రెండేళ్లపాటు 1535 కోట్ల రూపాయలకు ఇసుక కాంట్రాక్టును అప్పగించింది. ఆ సంస్థ కొన్నాళ్లకే అక్రమంగా ఇసుక తవ్వకం సాగిస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోందని 2021 ఆగస్టులో గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (సియా), కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని జాయింట్ కమిటీలతో ఎన్జీటీ విచారణ జరిపించింది. ఒక మోస్తరు యంత్రాలను మాత్రమే ఉపయోగించాల్సిన రీచ్‌ల్లో భారీయంత్రాలతో ఇసుక తవ్వుతున్నారని, పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించారని అవి నివేదికలిచ్చాయి. దీంతో కృష్ణా, గుంటూరు, చిత్తూరు సహా రాష్ట్రంలోని అన్ని రీచ్‌ల (110–బీ2 కేటగిరీ)కు ఇచ్చిన పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసింది. జేపీ వెంచర్స్ తీవ్రస్థాయిలో పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున మొత్తం 110 రీచ్‌లకు కలిపి 1908 కోట్ల రూపాయల పెనాల్టీ విధించింది. ఆ సొమ్ము చెల్లించిన తర్వాతే కొత్తగా ఈసీలు తీసుకోవాలని ఆదేశించింది. దీనిపై జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించి తాత్కాలిక స్టే తెచ్చుకుంది.

గత డిసెంబరు నుంచి ఇసుక అమ్మకాలు సాగిస్తున్న ప్రతిమ, జీసీకేసీ కూడా అక్రమంగా తవ్వకాలు సాగించడంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. కొత్తగా పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే తవ్వకాలు చేపట్టాలంటూ హైకోర్టు వాటిని ఆదేశించింది. అయినా అవి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఈసీలు లేకుండానే తవ్వకాలు సాగించినట్టు కేంద్రసంస్థలు వెల్లడించాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కూడా ఇసుక అక్రమతవ్వకాలపై ఎన్జీటీ జరిమానాలు విధించింది. అయినా అవి ఆగకపోగా మరింతగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇసుక కాంట్రాక్టర్లతో గూడుపుఠాణి కావడంతో వాళ్లు సాగించే అక్రమదందాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. టన్ను ఇసుక ధరను రవాణా చార్జీలు కాకుండా 475 రూపాయలుగా నిర్ణయించి ఎంతో సరసమైన ధరకు సరఫరా చేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం దినపత్రికల్లో ప్రకటనలు గుప్పిస్తూ పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటోంది.

పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే ఇసుక వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ వనరుల కోసం అన్వేషించడం నేటి పరిస్థితుల్లో అత్యవసరం. కొన్ని ప్రాంతాల్లో పెద్దపెద్ద భవనాలు తదితర నిర్మాణాలలో ఇసుకకు మారుగా వాడుతున్న రోబోశాండ్‌ను ఎక్కువగా వినియోగించేలా ప్రోత్సహించడం అవసరం. ఇలాంటివే మరికొన్నిటిని కనిపెట్టేలా పరిశోధనలు జరపాలి. అలానే పర్యావరణ పరిరక్షణ కోసం, ఇసుక తవ్వకాలపై ఉన్న నిబంధనలను పాటించే విధంగా ప్రజల్లో చైతన్యం పెంపొందించడానికి పౌరసంఘాలు కృషిచేయాలి. అప్పుడే ఇసుక మాఫియాకు కళ్లెం వేయగలుగుతాం. మానవాళి మనుగడకు ముఖ్యమైన జలవనరులు విధ్వంసం కాకుండా కాపాడుకోగలుగుతాం.



కానీ నదీ తీరప్రాంతాలతో పాటు హైదరాబాదు, బెంగుళూరు లాంటి నగరాలలో కాంట్రాక్టర్లు ఇసుక అమ్ముకుంటున్న తీరు చూస్తే కళ్ళు బైర్లు గమ్ముతాయి. ఆ నగరాలకు టన్ను ఇసుకను రెండువేలకు పైగా సరఫరా చేస్తూ వాళ్లు కోట్లు ఆర్జిస్తున్నారు.

ఇసుక బంగారాన్ని మించిపోయి పెద్ద ఆదాయవనరుగా మారిపోవటంతో కాంట్రాక్టర్లు పాలకులకు వాటాలు పంచి, ప్రభుత్వ విభాగాలను గుప్పెట్లో పెట్టుకుని వ్యవహరిస్తున్నారు. నియమ నిబంధనలన్నిటినీ తుంగలోతొక్కి, తమకు అడ్డొచ్చిన తహసిల్దార్ స్థాయి అధికారులు మొదలుకుని క్రిందిస్థాయి ఉద్యోగుల వరకు బెదిరింపులకు పాల్పడుతూ, దారికిరాని వారిని హతమారుస్తూ పేట్రేగిపోతున్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో అయినా వీరి ఆగడాలకు కళ్లెం పడుతుందేమో చూడాలి.

పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే ఇసుక వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ వనరుల కోసం అన్వేషించడం నేటి పరిస్థితుల్లో అత్యవసరం. కొన్ని ప్రాంతాల్లో పెద్దపెద్ద భవనాలు తదితర నిర్మాణాలలో ఇసుకకు మారుగా వాడుతున్న రోబోశాండ్‌ను ఎక్కువగా వినియోగించేలా ప్రోత్సహించడం అవసరం. ఇలాంటివే మరికొన్నిటిని కనిపెట్టేలా పరిశోధనలు జరపాలి. అలానే పర్యావరణ పరిరక్షణ కోసం, ఇసుక తవ్వకాలపై ఉన్న నిబంధనలను పాటించే విధంగా ప్రజల్లో చైతన్యం పెంపొందించడానికి పౌరసంఘాలు కృషిచేయాలి. అప్పుడే ఇసుకమాఫియాకు కళ్లెం వేయగలుగుతాం. మానవాళి మనుగడకు ముఖ్యమైన జలవనరులు విధ్వంసం కాకుండా కాపాడుకోగలుగుతాం.

■ ముప్పాళ్ళ భార్గవశ్రీ
సిపిఐ ఎంఎల్ నాయకులు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విలక్షణం... ఈ భగీరథ వృత్తాంతం



'కృత్తివాస రామాయణం' బెంగాలీలో కృత్తివాస ఓఝూ రచించిన కావ్యం. ఆయన క్రీస్తుశకం పదిహేనో శతాబ్దానికి చెందిన కవి, పండితుడు. ఈ కావ్యాన్ని 'శ్రీరామా పాచాలీ' (పాకాలీ) అని కూడా పిలుస్తారు. దీన్ని 'గంగానదీ లోయ ప్రాంత బైబిల్'గా బెంగాలీ రచయిత, పరిశోధకుడు దినేశ్ చంద్రసేన్ అభివర్ణించారు. ఆధునిక బెంగాలీ సాహిత్యానికి పూర్వ యుగంలో... అత్యంత ప్రచారం పొందిన కావ్యంగా కృత్తివాస రామాయణాన్ని విమర్శకులు పరిగణిస్తారు. ఇందులో వర్ణితమైన భగీరథుడి కథ విలక్షణమైనది, వేరెక్కడా కనిపించనిది.

కృత్తివాస రామాయణం ప్రకారం... నాలుగు అంశలుగా ఉద్భవించాలని నారాయణుడు కోరుకున్నాడు. ఆ ప్రకారం ఆయన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులుగా మారిపోయాడు. లక్ష్మీదేవి నారాయణుడికి ఎడమవైపు సీతగా ప్రత్యక్షమయింది. అదే సమయంలో... నారాయణ మంత్రం జపిస్తూ వైకుంఠానికి వచ్చిన నారదుడు... ఆ అద్భుత దృశ్యాన్ని చూసి పరమానందభరితుడయ్యాడు. నారాయణుడి ప్రతి లీల వెనుకా ఒక రహస్యం ఉంటుందనే సంగతి నారదుడికి బాగా తెలుసు. 'ఈ నాలుగు రూపాల వెనుక ఉన్న రహస్యం ఏమై ఉంటుంది?' అని ఆలోచించాడు. కానీ ఆ కారణమేమిటో నారదుడికి అంతుపట్టలేదు. 'నాకు తెలియకపోతేనేం? ఆ ముక్కంటికి తెలిసే ఉంటుంది' అనుకుంటూ నేరుగా కైలాసానికి చేరుకున్నాడు. తనతోపాటు తన తండ్రి బ్రహ్మను కూడా తీసుకువెళ్ళాడు. వారిద్దరినీ చూసి ప్రసన్నుడైన శివుడు... "మీ రాకకు కారణమేమిటి?" అని అడిగాడు. వైకుంఠంలో తను చూసిన దృశ్యాన్ని నారదుడు వివరించాడు. ఒక అంశ నాలుగు అంశలుగా ఎలా మారిందో తెలియజేయమన్నాడు. శంకరుడు చిరునవ్వు చిందిస్తూ "అరవై వేల ఏళ్ళ తరువాత... త్రేతాయుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం నారాయణుడు రఘు వంశంలో దశరథుడి పెద్ద కుమారునిగా జన్మిస్తాడు. రావణాది రాక్షసులను సంహరించడానికి అవతరిస్తాడు. ఆ దృశ్యాన్నే నువ్వు ముందుగా చూశావు" అని చెప్పాడు. సగరుడి మునిమనుమడైన దిలీపుడు సంతానహీనుడిగా స్వర్గస్థుడవడం, భగీరథుడి జననం... శంకరుని ఈ భవిష్యవాణితో ముడిపడి ఉంది.

రఘువంశానికి చెందిన, అయోధ్యకు రాజైన సగరుడు అశ్వమేధ యాగాన్ని చేపట్టాడు. యజ్ఞాశ్వాన్ని ఇంద్రుడు తరలించుకుపోయి... పాతాళంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమంలో కట్టిపడేశాడు. సగరుడి ఆదేశంతో అతని అరవైవేల మంది కుమారులు యజ్ఞాశ్వాన్ని వెతుకుతూ... భూమిని తవ్వి పాతాళానికి చేరుకుంటారు. కపిల మహర్షి ఆశ్రమంలో కట్టేసి ఉన్న యజ్ఞాశ్వాన్ని చూసి, దాన్ని కపిలుడే దొంగిలించాడనుకొని, ఆయనను నిందిస్తారు. ఆ మహర్షి కోపాగ్నికి భస్మమైపోతారు. వారితో పాటు యజ్ఞాశ్వాన్ని వెతికి తెమ్మని తన పెద్దకొడుకైన అసమంజసుణ్ణి సగరుడు ఆదేశిస్తాడు. అన్ని చోట్లా గాలిస్తున్న అసమంజసుడు పాతాళంలోని కపిల మహర్షి ఆశ్రమానికి చేరుకొని, యజ్ఞాశ్వాన్ని చూసి, జరిగిందంతా తెలుసుకుంటాడు. తన సోదరులకు పుణ్యగతులు ఎలా ప్రాప్తిస్తాయో చెప్పాల్సిందిగా కపిలుణ్ణి వేడుకుంటాడు. అసమంజసుడిపై దయతలచిన కపిలుడు..... దివిలో ప్రవహించే గంగానది ఆ అరవై వేలమంది సగర పుత్రుల మీద ప్రవహిస్తే... వారికి పుణ్యగతులు ప్రాప్తిస్తాయని చెబుతాడు.

గంగను కిందకు తీసుకువచ్చే ప్రయత్నంలో అసమంజసుడు, అతని కుమారుడు అంశుమంతుడు మరణిస్తారు. అనంతరం అంశుమంతుడి కుమారుడు దిలీపుడు సంతానం లేకుండానే మరణిస్తాడు. దీనితో రఘు వంశానికి వారసుడు కరువవుతాడు. తాను రఘువంశంలో దశరథుడి కుమారుడిగా జన్మించి, భూభారాన్ని తగ్గిస్తానని కొన్ని వేల ఏళ్ళ క్రితమే దేవతలకు నారాయణుడు మాట ఇచ్చాడు. వారసుడు లేకపోతే... నారాయణుడి మాట అసత్యం అవుతుంది. అలా జరిగితే భూమి నాస్తికమయం అవుతుంది. ధర్మం పట్ల ప్రజల మనసులో విశ్వాసం తగ్గుతుంది. దీనికి తరుణోపాయం తెలపాలని బ్రహ్మాది దేవతలు పరమశివుణ్ణి వేడుకుంటారు. శంకరుడు ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాడు. తన ప్రణాళిక ప్రకారం అయోధ్యకు చేరుకుంటాడు. దిలీపుడి భార్యలు చంద్ర, మాల... శివుడికి స్వాగతం చెబుతారు. భక్తి శ్రద్ధలతో పరిచర్యలు చేస్తారు. సంతృప్తుడైన శివుడు... "మీలో ఒకరు త్వరలో గర్భం దాల్చి, పండంటి కుమారుడికి జన్మనిస్తారు" అని ఆశీర్వదిస్తాడు. ఆ ఆశీస్సు విని వాళ్ళు దిగ్భ్రాంతి చెందుతారు. "స్వామీ! ఇది ఎలా సంభవం?" అని అడుగుతారు. "ఇది దైవ సంకల్పం. మీ ఇద్దరి మధ్య జరిగే కలయిక కారణంగా పుత్రుడు జన్మిస్తాడు" అని చెప్పి, శివుడు కైలాసానికి చేరుకుంటాడు.

అప్పటికే ఋతుస్రావం ఆగిపోయిన మాలకు ... శివుడి ఆశీస్సుల కారణంగా నెలసరి అవుతుంది. చంద్ర, మాలల కలయిక జరిగి, మాల గర్భం దాలుస్తుంది. పది నెలల తరువాత... ఎముకలు లేని పిండానికి జన్మనిస్తుంది. ఎముకలు లేకపోవడం వల్ల ఆ పిండం నడవలేకపోతుంది. ఆ మాంసం ముద్దను చూసి చంద్ర, మాల విలపిస్తారు. 'శివుడు వరమిచ్చాడా, శాపమిచ్చాడా' అనేది తేల్చుకోలేకపోతారు. పిండం పెరిగి పెద్దదైతే అభాసుపాలవుతామని భయపడతారు. ఆ పిండాన్ని కొంగుచాటున దాచుకొని సరయూ నదీ తీరానికి చేరుతారు. దాన్ని నదిలో పారేయాలనుకుంటున్న వారిద్దరినీ వశిష్టుడు చూస్తాడు. దివ్యదృష్టితో అంతా తెలుసుకుంటాడు. ఆ పిండం రఘువంశ వారసుడని గ్రహిస్తాడు. రఘువంశ పురోహితుడిగా... ఆ వంశ వారసుణ్ణి కాపాడడం తన విద్యుక్త ధర్మంగా భావించి... "మీరు ఆ పిండాన్ని ఒడ్డునే వదిలిపెట్టండి. దారిన పోయేవారెవరైనా దాన్ని కాపాడగలరు" అని చెప్పి వెళ్ళిపోతాడు. చంద్ర, మాల ఆ విధంగా చేస్తారు.

అప్పుడు సరయూ నదిలో స్నానం చేయడానికి అష్టావక్ర మహర్షి వస్తాడు. అష్టావక్రుడి శరీరంలోని ఎనిమిది వంకరల కారణంగా... ఆయన వంకరటింకరగా నడుస్తూ ఉంటాడు. ఎముకలు లేని పిండం కూడా అలాగే నడుస్తూ ఉంటుంది. ఆ పిండం తన నడకను అనుకరిస్తోందని అష్టావక్రుడు అనుమానిస్తాడు. 'అది నన్ను వెక్కిరిస్తూ ఉంటే భస్మం అవుతుంది. అలా కాకుండా... జన్మతః అలాగే ఉంటే... నా తపోబలం వల్ల సుందర రూపం దాల్చుతుంది' అనుకుంటాడు. పుట్టుకతోనే ఎముకలు లేని ఆ పిండం... అష్టావక్రుడి తపోబలం వల్ల సుందరమైన బాలుడిగా మారుతుంది. ఆ బాలుడు తన తల్లులను కలిసి, జరిగిన విషయం తెలియజేస్తాడు.

అయిదేళ్ళ వయసులో... ఆ బాలుణ్ణి విద్యాభ్యాసం కోసం వశిష్టుడి ఆశ్రమంలో చేరుస్తారు. ఆశ్రమంలోని కొందరు బాలురు అతని పుట్టుకను ఎగతాళి చేస్తారు. కోపంతో ఇంటికి చేరిన కుమారుడి ద్వారా... జరిగింది తెలుసుకున్న ఆ తల్లులు... అతని జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తారు. రెండు భగాల మధ్య కలయిక కారణంగా జన్మించిన వాడు కాబట్టి అతను భగీరథుడయ్యాడనేది... కృత్తివాస రామాయణంలోని భగీరథ వృత్తాంతం.

● డాక్టర్ ఎ.బి సాయిప్రసాద్
9980567541

మూలాలు బెంగాలీ పద్మ పురాణంలో...

'భగీరథుడు ద్వియోనిజుడు' అనే అంశాన్ని బెంగాలీ లిపిలో ఉన్న 'పద్మ పురాణం' నుంచి కృత్తివాసుడు తీసుకున్నాడు. రెండు భగాల మధ్య సంభోగం సంభవం అనే విషయాన్ని గురించి రుత్ వనిత, సలీం కిద్వాయ్ అనే ఇద్దరు విద్యావేత్తలు ప్రధానంగా పరిశోధన చేశారు. పద్నాలుగో శతాబ్దానికి చెందిన బెంగాలీ ధార్మిక గ్రంథాలలో... ఇద్దరు మహిళల మధ్య కలయిక సంభవమని సూచించే గ్రంథాలు ఉన్నాయని అమెరికా మోన్‌టానా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అయిన రుత్ వనిత 'సేమ్ సెక్స్ మ్యారేజ్ అండ్ హిందూ ట్రెడిషన్స్' అనే గ్రంథంలో వివరించారు. కృత్తివాసుడు దీన్ని 'పద్మ పురాణం' నుంచి గ్రహించాడనీ, 'సుశ్రుత సంహిత'లో ఇద్దరు స్త్రీల మధ్య జరిగే కలయిక కారణంగా ఒకరిలో ఫలదీకరణ జరుగుతుందనీ రాసి ఉందనీ ఆమె పేర్కొన్నారు. కవిరాజ్ కుంజాలాల్ భిషగ్రత్న ఆంగ్లంలోకి అనువదించిన 'సుశ్రుత సంహిత' (చౌకంబా సంస్కృత సిరీస్-39, 135వ పేజీ) నుంచి కొన్ని పంక్తులను ఉదాహరణగా కూడా చూపించారు. ద్వియోని సంభవుడైన భగీరథ వృత్తాంతాన్ని చర్చిస్తున్న సందర్భంలోనే... మరో విషయం గురించి కుడా రుత్ వనిత ప్రస్తావిస్తూ "మేము వితంతువులం. మాకు సంతానం ఎలా కలుగుతుందని శివుణ్ణి చంద్ర, మాల ప్రశ్నించినట్టే... మేరీ మాత కూడా "నేను పురుషుణ్ణి ఎరుగను, ఇదెలా జరుగుతుంది?" అని దేవదూతను ప్రశ్నిస్తుంది. అప్పుడు దేవదూత "పరిశుద్ధాత్మ నీపైకి వస్తుంది. సర్వోన్నతుడి శక్తి నిన్ను కమ్ముకుంటుంది" అని (బైబిల్, లూకా- 1:34, 35) చెబుతాడు" అని పేర్కొన్నారు.

భగీరథుడు ద్వియోని సంభవుడనే వృత్తాంతం నాకు తెలిసినంతవరకూ ఏ భారతీయ రామాయణంలోనూ లేదు. అవధి భాషలో రామాయణాన్ని 'రామచరితమానస్' అనే పేరుతో రచించిన తులసీదాసు... బెంగాలీ కృత్తివాస రామాయణం నుంచి కొంతవరకూ ప్రభావితుడయ్యాడనేది విమర్శకుల అభిప్రాయం. (ఆధారం: కృత్తిపాస రామాయణం, ఆదికాండం, హిందీ అనువాదం. అనువాదకులు: యోగేశ్వర త్రిపాఠి యోగి, ప్రబంధ్‌కుమార్ మజుందార్, నవారుణ వర్మ)

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mKCc7cHలో చదవండి.

గీతాసారం

మనతో స్నేహం చేద్దాం...



"మానవుడు కోరికలు లేని మనసు ద్వారా తనను తాను ఉద్ధరించుకోవాలి. స్వీయ వినాశనానికి పాల్పడకూడదు. మనిషికి తనకు వశమైన మనసే బంధువు, తనకు వశంకాని మనసే శత్రువు" అని భగవద్గీతలోని 'ఉద్ధరే దాత్మనాత్మానాం' అనే గీతా శ్లోకంలో శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.ఈ శ్లోకంలో అనేక కోణాలు కనిపిస్తాయి. వాటిలో మొదటిది... తనను తాను ఉద్ధరించుకోవలసిన బాధ్యత ప్రతి వ్యక్తి మీదా ఉంటుంది. మనం చేసిన కర్మల వల్ల చెడు జరిగినప్పుడు లేదా ఆశించిన ఫలితాలు రానప్పుడు కుటుంబాన్నో, స్నేహితులనో, సహోద్యోగులనో, పరిస్థితులనో, పని వాతావరణాన్నో, దేశాన్నో తప్పు పట్టడం లేదా మనల్ని మనమే నిందించుకోవడం సర్వసాధారణంగా జరిగే విషయం. ఇది చాలా తీవ్రమైన కక్షలు పెరిగిపోవడానికి, ఇతరుల పట్ల ద్వేషానికి కారణమవుతుంది. కొందరిలో ఈ వైఖరులు జీవితాంతం కొనసాగుతాయి. మరోవైపు, మన జ్ఞాపకాలు మనల్ని పశ్చాత్తాపాన్ని గుర్తుచేసినప్పుడల్లా... మనల్ని మనం పదేపదే శిక్షించుకుంటాం. పరిస్థితులు ఏవైనప్పటికీ... మనల్ని మనం ఉద్ధరించుకోవాలని ఈ శ్లోకం మనకు చెబుతుంది. శరణాగతి, ప్రశ్నించడం, సేవ అనే మూడు లక్షణాలను మనలో అభివృద్ధి చేసుకున్నప్పుడు... మనకు సాయం చెయ్యడానికి గురువు మనల్ని చేరుతాడని అంతకుముందు కృష్ణుడు తెలిపాడు.

రెండోది... మనలోని పరిపూర్ణతలను, లోపాలను సమానంగా స్వీకరించడం ద్వారా... మన అసమర్థతలుగా భావించుకొనేవాటిని అధిగమించడం. అది మన భౌతికమైన రూపం కావచ్చు, సక్రమంగా లేని గతం కావచ్చు, విద్యాపరమైన, ఆర్థికపరమైన స్థాయి కావచ్చు, మనం ఎదుర్కొన్న ఆహ్లాదమైన, అసహ్యమైన పరిస్థితులు కావచ్చు. మూడోది... మనకు మనమే స్నేహితులుగా ఉన్నప్పుడు... నిరాశ, కోపం, మత్తుపదార్థాలకు లేదా వినోదపు తెరలకు బానిస కావడం లాంటి వాటికి ప్రధాన కారణమైన ఒంటరితనానికి అవకాశం ఉండదు. ముఖ్యంగా వృద్ధాప్యానికి దగ్గరవుతున్నప్పుడు... ఎవరి మీదా ఆధారపడకుండా సంతోషంగా ఉండడానికి ఇది దోహదం చేస్తుంది. చివరిగా... ఇది శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా మన గురించి మనం శ్రద్ధవహిస్తూ... సమతుల్యమైన జీవనం గడపడానికి సంబంధించిన విషయం. అలా గడిపినప్పుడు జీవితంలోని ప్రతి అంశం చక్కగా ఉంటుంది. మనం మనతో స్నేహం చేసుకుంటే జరిగే సహజ పరిణామం ఏవిటంటే... పక్షపాతంగా వ్యవహరించడం, ఇతరుల ప్రవర్తన మీద తీర్పులు చెప్పడం లాంటివి వదిలేస్తాం. అప్పుడు మొత్తం ప్రపంచం మనకు స్నేహితుడిగా మారుతుంది. సకల లోకానికీ మనం స్నేహితులం అవుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ధ్యాన మూలం గురోర్మూర్తిః

ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితిని చేరడానికి మూడు సోపానాలను పూర్వులు పేర్కొన్నారు. వాటిలో మొదటి మెట్టు ధ్యానం, రెండో మెట్టు ధారణ, మూడో మెట్టు సమాధి (నిర్విచార స్థితి). మీకు సత్యాన్వేషణపై అభిలాష ఉన్నప్పుడు... మీరు ఆరాధించే దైవం మీద మీ చిత్తాన్ని నిలకడగా నిలపడాన్నే 'ధ్యానం' అంటారు. 'ధారణ' అంటే... ధ్యానం కోసం ఏకాగ్రతతో చేసే సంపూర్ణ ప్రయత్నం. కాబట్టి మీరు కొలిచే దైవాన్ని ఏకాగ్రతతో స్మరించుకోండి. మీ చిత్తాన్ని ఆ దైవం మీద లగ్నం చేయండి. మొదట్లో చిత్తం చంచలంగా ఉంటుంది. క్షణక్షణం దారి తప్పుతూ ఉంటుంది. అప్పుడు మీరు ధ్యానంలో ఉంటారు కాని... ధారణ ఉండదు. ధారణ అనే స్థితి చాలా ముఖ్యమైనది. ఈ స్థితిలో మీ చిత్తం భగవంతునితో అనుసంధానం అవుతుంది. ఎప్పుడైతే ధ్యాన, ధారణ స్థితులు మీలో సంపూర్ణ వికాసం పొందుతాయో... అప్పుడు మీరు సమాధి స్థితిని చేరుకుంటారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారికి ఈ స్థితిని చేరుకోవడం చాలా సులభం.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదం

మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోః కృపాః అన్నారు పూర్వులు. మీరు మీ గురువు దగ్గర, మీరు ఆరాధించే దైవం దగ్గర మోకరిల్లి, మీరు ధ్యానం చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని, పరిస్థితులను, మానసిక స్థితిని ప్రసాదించాలని వేడుకోవాలి. అహంకారానికి అతీతంగా... భగవంతుడితో మమేకమై, మిమ్మల్ని మీరు తెలుసుకున్నప్పుడే ధ్యానంలో ప్రవేశిస్తారు. ధ్యానం ఉదయం, సాయంత్రం... రెండు పూటలా చేయడం మంచిది. ఉదయం చేసే ధ్యానంలో... మనల్ని మనం అంతర్ముఖంగా పరిశీలించుకోవాలి. 'నేను ఆధ్యాత్మికంగా ఎంత లోతుకు వెళ్ళగలిగాను? నా ఆధ్యాత్మికమైన ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తున్నవేమిటి?' అని ప్రశ్నించుకోవాలి. సాయంత్రం ధ్యానంలో... 'నేను ఇతరులకు ఎంత మేరకు సహాయపడగలిగాను? భగవత్కార్యాల్లో ఎంత మేరకు పాలుపంచుకోగలిగాను?' అని మదింపు చేసుకోవాలి. ధ్యానంలో... ఎలాంటి ఆలోచనలూ లేని నిర్విచార స్థితికి చేరుకొనే మార్గంలో... ఆ ఆత్మపరిశీలన అవసరం.

సహజయోగ



ధ్యానంలో మనం చేరుకొనే ఆ ఆలోచనారహిత స్థితి... కొద్ది సేపే అయినా... భగవంతుడితో మనల్ని అనుసంధానిస్తుంది. తద్వారా మన ప్రార్థనలు భగవంతుణ్ణి చేరుతాయి. ప్రార్థనలో మనలో కదిలే ప్రశ్నలకు, సందేహాలకు భగవంతుడు ఇచ్చే సమాధానం, పరిష్కారం ధ్యానం ద్వారానే మనకు చేరుతాయి. అది మనసుకు ఆహ్లాదాన్ని, ఓర్పును ఇస్తుంది. మన సమస్యలను తీరుస్తుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు అతీతంగా మారుతాం. మనల్ని మనం అదుపు చేసుకోగలుగుతాం. ధ్యానం వల్ల కుడి, ఎడమ పార్శ్వాల్లోని సమస్యలను వదిలేసి... మధ్యస్థంగా ఉంటారు. అంటే, గతానికి, భవిష్యత్తుకు సంబంధించిన అనవసరమైన ఆలోచనలను వదిలేస్తారు. వర్తమానంలో ఉంటారు. మీ వివేకాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారు. అదే విలంబ స్థితి.

పూర్వకాలంలో మునులు, ఋషులు ఐహిక బంధాలను వదులుకొని, అడవులకో, హిమాలయాలకో వెళ్ళి తపస్సు చేసుకొనేవారు. సంసారాలను వదలనక్కరలేకుండా, ఎక్కడికీ వెళ్ళక్కర్లేకుండా... ఎప్పుడైనా, ఎక్కడైనా చేసుకోగలిగే ప్రక్రియను శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ స్థాపన ద్వారా మానవాళికి అందించారు. కుండలినీ జాగృతిద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, తమ దైనందిన జీవితంలో చేసుకొనే ధ్యానంతో... నిర్విచార స్థితిని, ఆ తరువాత నిర్వికల్ప స్థితిని... అంటే భగవంతుడిపట్ల ఎలాంటి సందేహాలూ లేని స్థితిని పొందగలరని నిరూపించారు. సహజయోగ సాధనలో ధ్యానం... మన దైనందిన జీవితంతో సమ్మిళితమై ఉంటుంది. ఈ ధ్యానంలో మనల్ని, మన ఆరోగ్యాన్నీ సమతుల్యం చేసుకోవడం, మెరుగుపరుచుకోవడం ఒక సాధారణ విషయం. అంతేతప్ప సహజయోగ ధ్యానం ఆరోగ్యం కోసమో, రోగనివారణ కోసమో మాత్రమే కాదు. అందుకు అతీతమైనది.

డాక్టర్ పి. రాకేష్ , 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



నవ్య | చిత్రజ్యోతి

పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా

- ఎస్.ఎస్.రాజమౌళి



నటుడు సత్య దేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు, మే 10 ఈ చిత్రం విడుదల అవుతోంది. బుధవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ "డైరెక్టర్ టీజర్, ట్రైలర్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచేశారు. ఇది పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా అన్న అనుభూతిని కలిగించారు. ఈ సినిమాతో సత్యదేవ్ స్టార్ అవుతారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. చిత్ర సమర్పకుడు కొరటాల శివ మాట్లాడుతూ "డైరెక్టర్ చెప్పిన కథ వినగానే ఈ సినిమాలో నేనూ ఓ భాగం అవుదామని ఇలా సమర్పకుడిగా వ్యవహరించాను. నేను చూసిన మంచి నటుల్లో సత్యదేవ్ ఒకరు. కాల భైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు" అని అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ "కొరటాల శివ సినిమాను ఓకే చేయగానే సినిమా సగం సక్సెస్ అనుకున్నాం. డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినప్పుడే ఇది వంద కోట్ల కంటెంట్ ఉన్న సినిమా అనిపించింది. కృష్ణా నది ఎన్ని మలుపులు తిరిగి గమ్య స్థానం చేరుకుంటుందో..ఈ సినిమాలోనూ అన్నే మలుపులు ఉన్నాయి" అని అన్నారు. "మూవీకి ఈ టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూశాక తెలుస్తుంది" అని డైరెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, చిత్ర బృందం పాల్గొన్నారు.



ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకక్కుతోన్న చిత్రం 'కుబేర'. నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం చిత్రబృందం నాగార్జున ఫస్ట్‌లుక్ టీజర్‌ను ఆవిష్కరించింది. కథా నేపథ్యాన్ని ప్రతిబింబించేలా నోట్ల కట్టలతో నిండిన కంటైనర్ల మధ్య వర్షంలో గొడుగుపట్టుకొని కళ్లద్దాలతో ఉన్న నాగార్జున లుక్ ఆకట్టుకుంది.

పేదల కోసం వీరమల్లు పోరాటం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం తొలి భాగం టీజర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. చార్మినార్, ఎర్రకోట లాంటి భారీసెట్‌లు, పవన్ కల్యాణ్ వీరోచిత పోరాట ఘట్టాలు, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు వెరసి సినిమా భారీ స్థాయిలో తెరకెక్కిందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. మరో అప్డేట్‌ను ఈ సందర్భంగా చిత్రబృందం పంచుకుంది. ఇకపై 'హరిహర వీరమల్లు' మిగిలిన చిత్రీకరణ,నిర్మాణానంతర కార్యక్రమాలను క్రిష్ పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతి కృష్ణ పూర్తి చేస్తారని యూనిట్ తెలిపింది. ఈ ఏడాది చివర్లో 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవనుంది. నిధి అగర్వాల్, బాబీడియోల్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్, మనోజ్ పరమహంస.



మాట నిలబెట్టుకున్నారు

ప్రముఖ నిర్మాత కె.ఎల్.నారాయణ సుదీర్ఘ విరామం తర్వాత రాజమౌళి, మహేశ్‌బాబు కలయికలో వస్తున్న సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌ను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ప్రస్తుతం వారి క్రేజ్ ఆకాశాన్ని తాకేలా ఉంది. రాజమౌళికి హాలీవుడ్ నుంచి కూడా ఆఫర్స్ వస్తున్నాయి. అయినా వాటిని కాదనుకుని ఇచ్చిన మాటకు కట్టుబడిన రాజమౌళి, 'దుర్గా ఆర్ట్స్' బ్యానర్‌లోనే ఈ మూవీ తీస్తున్నామని ప్రకటించి మాట నిలబెట్టుకున్నారు. రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ సాగుతోంది. ఆగస్టు లేదా సెప్టెంబరులో చిత్రీకరణ ప్రారంభం అవుతుంది" అని చెప్పారు.

నాన్న టైటిల్ ఇచ్చి ఆశీర్వదిస్తున్నారు




'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నరేశ్ మాట్లాడుతూ 'నేను ఇన్ని సంవత్సరాలు పరిశ్రమలో ఉన్నానంటే కారణం మా నాన్నగారు. ఆయన ఉన్నన్ని రోజులూ నాతో సినిమాలు తీసి హిట్లు ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఆయన లేనప్పుడు కూడా తన సినిమా టైటిల్ ఇచ్చి బ్లెస్ చేస్తున్నారు' అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అడవి శేష్ మాట్లాడుతూ 'నరేశ్ అంటే మా ఇంట్లో మనిషి. ఆయన ఎప్పుడూ ఇతరుల ఆనందాన్ని కోరుకుంటారు. మే 3న ఈ సినిమాను అందరం థియేటర్లలో చూద్దాం. ఎంజాయ్ చేద్దాం' అన్నారు. ఈ సినిమాతో నరేశ్ రూపంలో మంచి ఫ్రెండ్ దొరికాడని ఫరియా అబ్దుల్లా చెప్పారు.

దక్షిణాదికి వచ్చిన దెయ్యం కథ



తమన్నా, రాశీ ఖన్నా, సుందర్ నటించిన 'బాక్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు, చిత్ర దర్శకుడు సి. సుందర్ మీడియాతో మాట్లాడుతూ "అరణ్మనై' సిరీస్‌లో నాలుగో చిత్రమిది. మొదటి మూడు సినిమాలు తెలుగు, తమిళ భాషల్లో హిట్ అయ్యాయి. ఈ చిత్ర కథ కోసం రీసెర్చ్ చేసే క్రమంలో చరిత్రతో ముడిపడిన ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. అస్సామీ జానపదంలో 'బాక్' అనే ఘోస్ట్ ఉండేదని అక్కడివారి నమ్మకం. తమ ప్రాంతాన్నాంతా చేతబడి చేశారని వారి విశ్వాసం. ఆ విషయం విని ఆశ్చర్యపోయా. అదే 'బాక్' కథకు బీజం వేసింది. అస్సామీ, బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఉండే బాక్ అనే దెయ్యం సౌత్‌కి వస్తే ఎలాంటి పరిణామాలు సంభవించాయన్నది ఈ చిత్రకథ' అన్నారు.

సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా...



సినిమా సినిమాకు వైవిధ్యమైన రోల్స్ చేస్తూ సూపర్ హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంటున్నారు సుహాస్. ఆయన హీరోగా నటించిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ గురించి సుహాస్ మీడియాతో ముచ్చటించారు. "ఇందులో ఆర్జే పాత్ర పోషించాను. ఫేస్ బ్లైండ్‌నెస్ కారణంగా ఎలాంటి సమస్యల్లో ఇరుక్కుంటాను, వాటి నుంచి ఎలా భయటపడతాననేదే ఈ సినిమా కథాంశం. అందరినీ అలరించే సినిమా ఇది. చాలా మంది నా కథల ఎంపిక బావుంటుందని మెచ్చుకుంటుంటారు. ఈ సినిమాను థియేటర్లలో చూస్తున్నప్పుడు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా ఈ సినిమా సాగుతుంది. దర్శకుడు అర్జున్ వైకెకు ఇది తొలి చిత్రం అయినా చాలా అనుభవం ఉన్నట్లు సినిమాను తెరకెక్కించారు" అని చెప్పారు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక : ముంబై

ముంబై X కోల్‌కతా



నలుగురు స్పిన్నర్లు ఉండాల్సిందే

రోహిత్ శర్మ

ముంబై: భారత టీ20 వరల్డ్‌కప్ టీమ్‌లో నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడాన్ని కెప్టెన్ రోహిత్ శర్మ పూర్తిగా సమర్థించుకున్నాడు. సెలెక్షన్ విషయంలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఎంతో స్పష్టతతో ఉన్నట్టు చెప్పాడు. జట్టు ఎంపికపై ఎదురవుతున్న విమర్శలకు సమాధానం చెప్పేందుకు గురువారమిక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్‌తోపాటు సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కూడా పాల్గొన్నాడు. 'విండీస్‌లో ఆడేందుకు నలుగురు స్పిన్నర్లు కావాల్సిందే. దానికి తగిన కారణాలు ఉన్నాయి. మాకు వెస్టిండీస్ పిచ్‌లపై ఆడిన అనుభవం ఉంది. అక్కడ ఉదయం 10 గంటలకు మ్యాచ్ ఆరంభమవుతుంది. గయానా, ఆంటిగ్వా వికెట్లు స్లో బౌలర్లకు సహకరిస్తాయ'ని రోహిత్ చెప్పాడు.

అది కఠిన నిర్ణయమే : అగార్కర్

ఫామ్‌లోలేకున్నా పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు కల్పించడం సరైన నిర్ణయమేనని అగార్కర్ చెప్పుకొచ్చాడు. 'ఫిట్‌నెస్ ఉంటే హార్దిక్‌కు ప్రత్యామ్నాయమే లేదు. ఓ మిడిలార్డర్ బ్యాటర్‌ను తీసుకోవడం కోసం టాప్‌లో ఆడుతున్న కేఎల్ రాహుల్‌ను పక్కనబెట్టాల్సిన పరిస్థితి. అలాగే రింకూను పక్కనబెట్టడం కఠిన నిర్ణయమే' అని అగార్కర్ అన్నాడు.

సలీమాకు పగ్గాలు

మహిళల హాకీ జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : వెటరన్ గోల్‌కీపర్ సవితా పూనియాపై వేటు పడింది. భారత మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ఆమెను తొలగించి..మిడ్‌ఫీల్డర్ సలీమా టేటేకు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు..బెల్జియం, ఇంగ్లండ్ అంచె ప్రో.హాకీ లీగ్‌లో తలపడే 24 మంది సభ్యుల భారత జట్టును గురువారం ప్రకటించారు. సవిత సారథ్యంలో జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. అలాగే స్వదేశంలో జరిగిన ప్రొ.లీగ్ హాకీ మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటలేకపోయింది. తెలుగమ్మాయి ఈదుల జ్యోతి (ఫార్వర్డ్) జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

ఆఖరి బంతి థ్రిల్లర్

భువీ మాయతో గట్టెక్కిన హైదరాబాద్

జైస్వాల్, పరాగ్ పోరాటం వృథా

నితీశ్ కుమార్ హాఫ్ సెంచరీ

రైజర్సే విన్నర్



భువనేశ్వర్ (3/41)

హైదరాబాద్: థ్రిల్లర్ సినిమాను తలపించేలా సాగిన సన్‌రైజర్స్ హైదరాబాద్-రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. భారీ ఛేదనలో రియాన్ పరాగ్ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 77), జైస్వాల్ (40 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 67) దూకుడుతో మ్యాచ్ రాజస్థాన్‌దే అని అంతా భావించారు. అయితే చివరి బంతికి రెండు పరుగులు కావాల్సిన వేళ పోవెల్ (27) వికెట్‌తో పేసర్ భువనేశ్వర్ ప్రత్యర్థికి గట్టి ఝలక్ ఇచ్చాడు. దీంతో ఒక్క పరుగు తేడాతో నెగ్గి సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఊపిరిపీల్చుకుంది. రాజస్థాన్‌కిది రెండో ఓటమి. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 201 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 నాటౌట్), హెడ్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 58), క్లాసెన్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 నాటౌట్) రాణించారు. అవేశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 200 పరుగులు చేసి ఓడింది. భువనేశ్వర్‌కు మూడు.. కమిన్స్, నటరాజన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా భువనేశ్వర్ నిలిచాడు.

ఆఖర్లో తడబాటు: స్లో పిచ్‌పై భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన రాజస్థాన్‌కు తొలి ఓవర్‌లోనే పేసర్ భువనేశ్వర్ గట్టి షాక్ ఇచ్చాడు. నాలుగు బంతుల తేడాలోనే ఓపెనర్ బట్లర్, కెప్టెన్ శాంసన్‌లను డకౌట్లుగా పెవిలియన్‌కు చేర్చాడు. ఈ స్థితిలోనూ ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఓపెనర్ జైస్వాల్, రియాన్ పరాగ్ మూడో వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యంతో ఆర్‌ఆర్‌కు అండగా నిలిచారు. అయితే చివర్లో జట్టు తడబడడంతో మూల్యం చెల్లించుకుంది. మూడో ఓవర్‌లోనే పరాగ్ 4,6,4తో 15 రన్స్ అందించాడు. నాలుగో ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించిన జైస్వాల్.. తర్వాతి ఓవర్‌లోనూ 4,4,6తో చెలరేగాడు. దీంతో పవర్‌ప్లేలో స్కోరు 60/2కి చేరగా.. ఇదే జోరుకు పదో ఓవర్‌లోనే వంద రన్స్‌తో నిలిచింది. అలాగే ఇద్దరూ 11వ ఓవర్‌లోనే అర్ధసెంచరీలను సైతం పూర్తి చేసుకున్నారు. అయితే 78 బంతులపాటు సాగిన వీరి జోరుకు పేసర్ నటరాజన్ బ్రేక్ వేశాడు. స్కూప్ షాట్‌కు యత్నించిన జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. అలాగే 16వ ఓవర్‌లో కమిన్స్ మూడు పరుగులే ఇచ్చి పరాగ్‌ను అవుట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీనికి తోడు ఓ భారీ సిక్సర్‌తో ఆకట్టుకున్న హెట్‌మయెర్ (13)ను నటరాజన్ వెనక్కి పంపాడు. 19వ ఓవర్‌లో కమిన్స్.. జురెల్ (1) అవుట్ చేయగా, పోవెల్ సిక్సర్‌తో సమీకరణం ఆరు బంతుల్లో 13 రన్స్‌కు మారి ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే పోవెల్ పోరాటంతో ఐదు బంతుల్లో 11 రన్స్ వచ్చాయి. ఇక చివరి బంతికి రెండు రన్స్ కావాల్సిన వేళ పోవెల్‌ను భువీ ఎల్బీ చేయడంతో రైజర్స్ సంబరాల్లో మునిగింది.

నెమ్మదిగా ఆరంభమైనా..: టాస్ గెలిచిన రైజర్స్ బ్యాటింగ్ ఎంచుకోవడంతో ఇక తొలి బంతి నుంచే విధ్వంసం ఆరంభమైనట్టే అని అంతా భావించారు. కానీ అంచనాలకు భిన్నంగా ఆరంభంలో వీరి ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. మధ్య ఓవర్ల నుంచి ఆఖరి వరకు నితీశ్ కుమార్ స్ట్రోక్‌ప్లే ధాటికి రైజర్స్ భారీ స్కోరే అందుకుంది. హెడ్, క్లాసెన్ సహకరించారు. అయితే మొదట రాజస్థాన్ బౌలర్ల కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులకు ఓపెనర్లు హెడ్, అభిషేక్ తమ దూకుడును తగ్గించాల్సి వచ్చింది. దీంతో రైజర్స్ ఈ సీజన్‌లోనే పవర్‌ప్లేలో అత్యల్ప స్కోరు (37)ను నమోదు చేయడంతో పాటు అభిషేక్ (12), అన్మోల్‌ప్రీత్ (5) వికెట్లను సైతం కోల్పోయింది. పరిస్థితిని గమనించిన హెడ్, నితీశ్ వికెట్‌ను కాపాడుకునే క్రమంలో జాగ్రత్తగా ఆడారు. కానీ ఆర్‌ఆర్ ఆధిపత్యం తొలి ఎనిమిది ఓవర్ల పాటే సాగింది. అప్పటికి రైజర్స్ స్కోరు 48/2 మాత్రమే. ఈ దశలో నిరాశగా మ్యాచ్‌ను తిలకిస్తున్న ఉప్పల్ ఫ్యాన్స్‌కు తొమ్మిదో ఓవర్‌లో హెడ్ 6,6,4తో ఊపు తెచ్చాడు. చాహల్ వేసిన ఈ ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి. అక్కడి నుంచి రైజర్స్ లయ అందుకుంది. ఆ తర్వాత నితీశ్ కూడా గేరు మార్చి అశ్విన్, అవేశ్ ఓవర్లలో ఒక్కో సిక్సర్ బాదడంతో స్కోరులో వేగం పెరిగింది. అటు హెడ్ 37 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఈసారి చాహల్ మరో ఓవర్‌ను లక్ష్యంగా చేసుకున్న నితీశ్ 6,4,6,4తో ఏకంగా 21 రన్స్ రాబట్టడంతో రైజర్స్ వంద పరుగులను కూడా పూర్తి చేసింది. కానీ ఈ జోరుకు బ్రేక్ వేస్తూ 15వ ఓవర్‌లో హెడ్‌ను అవేశ్ వైడ్ యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేయడంతో మూడో వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన నితీశ్ మాత్రం అశ్విన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో దూకుడును కొనసాగించాడు. అటు క్లాసెన్ కూడా జోరు పెంచి చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదడంతో 17 రన్స్ వచ్చాయి. అలాగే చివరి రెండు ఓవర్లలోనూ అతడి మూడు ఫోర్లు, ఓ సిక్స్ ధాటికి 25 రన్స్ రావడంతో పాటు జట్టు స్కోరు 200 మార్క్ దాటింది.



నితీశ్ (76 నాటౌట్)

1 ఉప్పల్ మైదానంలో మూడో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (134) నమోదు చేసిన జైస్వాల్-పరాగ్.

1 ఒక్క పరుగు తేడాతో సన్‌రైజర్స్ గెలవడం ఐపీఎల్‌లో ఇదే తొలిసారి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) అవేశ్ 58, అభిషేక్ (సి) జురెల్ (బి) అవేశ్ 12, అన్మోల్‌ప్రీత్ (సి) జైస్వాల్ (బి) సందీప్ 5, నితీశ్ (నాటౌట్) 76, క్లాసెన్ (నాటౌట్) 42, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 201/3 ; వికెట్లపతనం:** 1-25, 2-35, 3-131; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-33-0, అశ్విన్ 4-0-36-0, అవేశ్ ఖాన్ 4-0-39-2, సందీప్ శర్మ 4-0-31-1, చాహల్ 4-0-62-0.

రాజస్థాన్: జైస్వాల్ (బి) నటరాజన్ 67, బట్లర్ (సి) యాన్సెన్ (బి) భువనేశ్వర్ 0, శాంసన్ (బి) భువనేశ్వర్ 0, పరాగ్ (సి) యాన్సెన్ (బి) కమిన్స్ 77, హెట్‌మయెర్ (సి) యాన్సెన్ (బి) నటరాజన్ 13, పోవెల్ (ఎల్బీ) భువనేశ్వర్ 27, జురెల్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 1, అశ్విన్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు : 13: మొత్తం 20 ఓవర్లలో 200/7 ; వికెట్లపతనం:** 1-1, 2-1, 3-135, 4-159, 5-181, 6-182, 7-200; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-41-3, యాన్సెన్ 4-0-44-0, కమిన్స్ 4-0-34-2, నటరాజన్ 4-0-35-2, ఉనాద్కట్ 2-0-23-0, నితీశ్ 1-0-12-0, షాబాజ్ 1-0-11-0.

'అవుటాఫ్ దిస్ వరల్డ్'..



టీ 20 ప్రపంచ కప్ గీతం విడుదల

న్యూఢిల్లీ: మరో నెల రోజుల్లో పురుషుల టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ అధికారిక గీతాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం విడుదల జేసింది. గ్రామీ అవార్డు విజేత సీన్ పాల్, సోకా సూపర్ స్టార్ కెస్ సంయుక్తంగా 'అవుటాఫ్ దిస్ వరల్డ్' పేరిట ఈ గీతాన్ని రూపొందించారు. మైఖేల్ టానో మొంటానో నిర్మాణంలో గీతం రూపొందింది. జమైకా దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్, వెస్టిండీస్ క్రికెట్ స్టార్లు క్రిస్ గేల్, శివనారాయణ్ చందర్‌పాల్, స్టెఫానీ టేలర్, అమెరికా బౌలర్ అలీ ఖాన్ ఈ అధికారిక గీతానికి సంబంధించిన వీడియోలో తళుక్కున మెరిశారు.

క్వార్టర్స్‌లో భారత జట్లకు షాక్

థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ (చైనా): భారత పురుషుల, మహిళల జట్లు థామస్, ఉబెర్‌కప్‌ల్లో ఇంటిదారి పట్టాయి. ముఖ్యంగా పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు షాక్ తగిలింది. గురువారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో టీమిండియా చైనాతో పోరులో 1-3తో తడబడింది. భారీ అంచనాలున్న ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి, ధ్రువ్ కపిల-సాయి ప్రతీక్‌లు ఓడగా.. లక్ష్య సేన్ ఒక్కడే ఊరటనిచ్చాడు. కాగా, బుధవారం ఇండోనేసియాతో మ్యాచ్ ఆడడంతో భారత ఆటగాళ్లు కొంత అలసిపోగా.. ఓ రోజు విశ్రాంతి లభించడంతో చైనా ప్లేయర్లు కోర్టులో పాదరసంలా కదులుతూ పైచేయి సాధించారు.

అమ్మాయిలు పోరాడారు.. కానీ..: ఉబెర్ కప్‌లో పీవీ సింధులాంటి సీనియర్ ప్లేయర్ దూరమైనా.. అద్భుత పోరాటంతో నాకౌట్‌కు చేరినా భారత మహిళల జట్టు అదే జోరును కొనసాగించలేక పోయింది. క్వార్టర్స్‌లో భారత్ 0-3తో జపాన్ చేతిలో పోరాడి ఓడింది. తొలి సింగిల్స్‌లో అస్మిత చలీహా, రెండో మ్యాచ్‌లో ఇస్రాని బారువా ఓటమిపాలయ్యారు. ఇక డబుల్స్ మ్యాచ్‌లో కొంజెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా పరాజయం పాలవడంతో టీమిండియా ఓటమి పరిపూర్ణమైంది.

మనమ్మాయిలదే సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ బంగ్లా చిత్తు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళల జట్టు మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే గెలుచుకుంది. గురువారం జరిగిన మూడో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఏడు వికెట్లతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. తొలుత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 117/8 స్కోరు చేసింది. దిలారా అక్తర్ (39), నిగర్ సుల్తానా (28) మాత్రమే రాణించారు. రాధా యాదవ్ రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 18.3 ఓవర్లలో 121/3 స్కోరు చేసి నెగ్గింది. షఫాలీ వర్మ (51) హాఫ్ సెంచరీతో మెరవగా, మంధాన (47) సత్తా చాటింది.

మెస్సీ, రొనాల్డోలను వెనక్కు నెట్టిన కోహ్లీ

టాప్-100లో టాప్



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ పాపులారిటీ రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా 'ది ర్యాంకర్' అనే వెబ్‌సైట్ నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో 2024 టాప్-100 అథ్లెట్లలో కోహ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో సాకర్ స్టార్లు మెస్సీ, రొనాల్డోను కూడా కోహ్లీ వెనక్కునెట్టాడు. రొనాల్డో రెండో స్థానంలో, మెస్సీ మూడో స్థానంలో నిలిచారు.

కోఫోర్జ్ గూటికి సిగ్నిటీ

54 శాతం వాటా కొనుగోలు.. ఒక్కో షేరుకు రూ.1,415 చెల్లింపు

జూలై-సెప్టెంబరు త్రైమాసికం నాటికి డీల్ పూర్తి

Cigniti



రెండేళ్లలో 200 కోట్ల డాలర్ల కంపెనీ..

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు వాటాను కొనుగోలు చేయనున్నట్లు నోయిడాకు చెందిన ఐటీ సంస్థ కోఫోర్జ్ గురువారం ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో చేపట్టనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా సిగ్నిటీకి చెందిన ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ నెల 2న బీఎస్ఈలో సిగ్నిటీ షేరు ముగింపు ధర రూ.1,372.65తో పోలిస్తే 3 శాతం అధికమిది. సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు ఈక్విటీ వాటా కొనుగోలుకు కంపెనీ ప్రమోటర్లు, ఎంపిక చేసిన వాటాదారులతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకునేందుకు అంగీకారం లభించిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కోఫోర్జ్ వెల్లడించింది. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)లో ఈ డీల్ పూర్తి కావచ్చని అంచనా. ఈ ఒప్పందం పూర్తయిన అనంతరం సెబీ నిబంధనల ప్రకారంగా సిగ్నిటీ టెక్నాలజీస్.. వాటాదారుల నుంచి షేర్ల కొనుగోలు కోసం కోఫోర్జ్ ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి ఉంటుంది. తద్వారా సిగ్నిటీలో కోఫోర్జ్ వాటా 80 శాతం వరకు పెరగనుంది.

సిగ్నిటీ టెక్నాలజీస్ కొనుగోలుతో తమ కంపెనీ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 200 కోట్ల డాలర్ల విలువైన కంపెనీగా ఎదిగేందుకు దోహదపడుతుందని కోఫోర్జ్ భావిస్తోంది. అంతేకాదు, సంస్థ నిర్వహణ లాభాల మార్జిన్ సైతం 1.5-2 శాతం మేర మెరుగుపడవచ్చని అంచనా వేస్తోంది. అలాగే, రిటైల్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ విభాగాల్లోకి విస్తరించడంతోపాటు ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్యం, పశ్చిమ యూఎస్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఈ డీల్ దోహదపడనుంది.

రూ.2,100 కోట్ల సమీకరణ

కాగా కోఫోర్జ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కోఫోర్జ్ పీటీఈ లిమిటెడ్.. 25 కోట్ల డాలర్ల రుణాల (సుమారు రూ.2,100 కోట్లు)ను సమీకరించేందుకు గాను హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, గిఫ్ట్ సిటీ బ్రాంచీతో ఒప్పందం కుదుర్చుకుంది. సిగ్నిటీ కొనుగోలు కోసం కంపెనీ ఈ మొత్తాలను వినియోగించనుంది.

డీల్‌కు సిగ్నిటీ బోర్డు ఓకే

కోఫోర్జ్‌కు 54 శాతం వాటాలను విక్రయించేందుకు గాను గురువారం నాడు సిగ్నిటీ టెక్నాలజీ బోర్డు ఆమోదం తెలిపింది. కంపెనీ ప్రమోటర్లు చక్కిలం వెంకట సుబ్రమణ్యం, రాజేశ్వరి చక్కిలం, చక్కిలం శ్రీకాంత్, పెన్నం సుధాకర్, సప్న పెన్నం ఈ మేరకు ఆమోదం తెలిపినట్లు బోర్డు పేర్కొంది. డీల్‌లో భాగంగా కంపెనీ ప్రమోటర్లు 32.47 శాతం వరకు ఈక్విటీని కోఫోర్జ్‌కు విక్రయించనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 32.77 శాతం వరకు ఉంది. కాగా 1998 సెప్టెంబరులో కార్యకలాపాలు ప్రారంభించిన సిగ్నిటీ టెక్నాలజీస్.. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఆస్ట్రేలియా, కెనడా, చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికా,సింగపూర్ మార్కెట్లకు డిజిటల్ అస్యూరెన్స్, ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, క్వాలిటీ ఇంజనీరింగ్ సేవలందిస్తోంది.

కోఫోర్జ్ లాభంలో 95% వృద్ధి

ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) కోఫోర్జ్ కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 95 శాతం వృద్ధితో రూ.223.7 కోట్లకు చేరుకుంది. ఆదాయం 8.68 శాతం పెరిగి రూ.2,358.5 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ లాభం 16.46 శాతం వృద్ధితో రూ.808 కోట్లకు, ఆదాయం 14.52 శాతం పెరుగుదలతో రూ.9,179 కోట్లకు చేరుకుంది. ఈ మార్చి 31 నాటికి కోఫోర్జ్ ఉద్యోగుల సంఖ్య 24,726కు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను కోఫోర్జ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.19 డివిడెండ్‌ను ప్రకటించింది.

సిగ్నిటీ లాభంలో క్షీణత

క్యూ4లో సిగ్నిటీ టెక్నాలజీస్ లాభం దాదాపు 45 శాతం క్షీణించి రూ.27.14 కోట్లకు పరిమితం కాగా.. విక్రయాలు మాత్రం 7.22 శాతం పెరిగి రూ.455.64 కోట్లకు చేరుకున్నా యి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం 1.62 శాతం తగ్గి రూ. 165.59 కోట్లకు చేరుకోగా, అమ్మకాలు 10.16 శాతం పెరుగుదలతో రూ. 1,815.01 కోట్లుగా నమోదయ్యాయి.

● ఇసుజు మోటార్స్.. మార్కెట్లోకి లైఫ్‌స్టైల్ పికప్ మోడల్స్‌ను విడుదల చేసింది. వీ-క్రాస్ జెడ్ ప్రెస్టీజ్ పేరుతో మరింత పికప్, సరికొత్త లుక్‌తో వీటిని తీసుకువచ్చింది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ డిసెంట్ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి కొత్త ఫీచర్లను ఈ మోడల్స్‌లో చేర్చింది. ఈ వాహన ప్రారంభ ధరలు రూ.21,19,900 (హై-లాండర్), రూ.25,51,700 (వీ-క్రాస్ జెడ్), రూ.26,91,700 (వీ-క్రాస్ జెడ్ ప్రెస్టీజ్)గా ఉన్నాయి.

● కియా ఇండియా.. హై-టెక్, స్మార్ట్ నావిగేషన్ కోసం మ్యాప్ మై ఇండియాతో జట్టు కట్టింది. దీంతో కియా కస్టమర్లు ఎప్పటికప్పుడు మ్యాప్ అప్‌డేట్స్ సహా లొకేషన్ సర్వీసులకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని అందుకుంటారని తెలిపింది.

కోల్ ఇండియా లాభం రూ.8,682 కోట్లు

ప్రభుత్వ రంగంలోని మహారత్న కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.8,682 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.6,875.07 కోట్లతో పోల్చితే ఇది 26.2 శాతం అధికం. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.40,371.51 కోట్ల నుంచి రూ.39,654.50 కోట్లకు దిగజారింది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా వాటా 80 శాతం ఉంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.37,369 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

డివిడెండ్: కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5 తుది డివిడెండ్‌కు సిఫారసు చేసింది. ఇప్పటికే చెల్లించిన మధ్యంతర డివిడెండ్ రూ.20.50కి ఇది అదనం. అంటే ఒక్కో షేరు ముఖవిలువపై 255 శాతం (రూ.25.50) డివిడెండ్ చెల్లించినట్లవుతుంది. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కోల్ ఇండియా కేంద్ర ఖజానాకు, తాను కార్యకలాపాలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలకు రూ.60,140 కోట్లు చెల్లించింది.

బిజినెస్

ఇక విశ్లేషకులపై స్టాక్ ఎక్స్ఛేంజీల పర్యవేక్షణ

న్యూఢిల్లీ: రీసెర్చ్ అనలిస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లపై నియంత్రణ, పర్యవేక్షణకు సంబంధించిన నిబంధనావళిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రకటించింది. దీని కింద అనలిస్టులు, అడ్వైజర్ల పర్యవేక్షణకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారం ఇస్తారు. స్టాక్ ఎక్స్ఛేంజీలకు రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఆర్ఏఏఎస్‌బీ), ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఐఏఏఎస్‌బీ) పేరిట గుర్తింపు ఇస్తారు. ఈ గుర్తింపు సాధించాలంటే సంబంధిత ఎక్స్ఛేంజీ 15 సంవత్సరాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నదై ఉండాలి. అలాగే కనీస నికర విలువ రూ.200 కోట్లు కలిగి ఉండి, దేశవ్యాప్తంగా 20 నగరాల్లో టెర్మినల్స్ ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తూ ఉండాలి. అలాగే భౌతికంగా ఫిర్యాదుల పరిష్కార విభాగం, ఆన్‌లైన్‌లో వివాదాల పరిష్కార విభాగం నిర్వహిస్తూ ఉండాలి.

మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్

128 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఏప్రిల్ నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడంతో పాటు తయారీ రంగం పనితీరు ఆశాజనకంగా ఉండటం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నింపింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. దీంతో గురువారం సెన్సెక్స్ ఒకదశలో 330 పాయింట్ల వరకు పెరిగి 74,812 స్థాయికి ఎగబాకింది. చివరికి 128.33 పాయింట్ల లాభంతో 74,611.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43.35 పాయింట్ల వృద్ధితో 22,648.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 లాభపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 83.46 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ రేటు 0.91 శాతం పెరిగి 84.20 డాలర్ల వద్ద ట్రేడైంది.

మిశ్రమంగాముగిసిన గోద్రెజ్ షేర్లు: దేశంలోని ప్రముఖ వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన గోద్రెజ్ గ్రూప్ ఆస్తుల విభజన నేపథ్యంలో ఈ గ్రూప్ కంపెనీల షేర్లు మిశ్రమంగా ముగిశాయి. గోద్రెజ్ ఇండస్ట్రీస్ 7 శాతానికి పైగా క్షీణించగా.. గోద్రెజ్ ప్రాపర్టీస్ 4.37 శాతం, ఆస్టెక్ లైఫ్‌సైన్సెస్ 2.92 శాతం నష్టపోయాయి. కాగా, గోద్రెజ్ ఆగ్రోవెట్ షేరు దాదాపు 4 శాతం, గోద్రెజ్ కన్స్యూమర్ 1.11 శాతం పుంజుకున్నాయి.

సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌కు వాటా

సైయెంట్ లిమిటెడ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 1.02 శాతానికి సమానమైన 11.33 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ షేర్లను రూ.204.10 కోట్లతో కొనుగోలు చేసినట్లు బల్క్‌డీల్ గణాంకాలు వెల్లడించాయి. సగటున ఒక్కో షేరును రూ.1,800కు ఈ మ్యూచువల్ ఫండ్ సంస్థ కొనుగోలు చేసింది. తాజా వాటా కొనుగోలుతో సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటా 1.08 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. గురువారం బీఎస్ఈలో సైయెంట్ షేరు 0.67 శాతం నష్టంతో రూ.1,794.30 వద్ద క్లోజైంది.

ఆధార్ హౌసింగ్ ఇష్యూ ధర రూ.300-315

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.300-315గా నిర్ణయించింది. తద్వారా రూ.3,000 కోట్ల వరకు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా ఈ సంస్థ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ లిమిటెడ్ ఐపీఓ సైతం ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.1,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సంస్థ రూ.400 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.600 కోట్ల విలువైన 1.25 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● వాహన, వ్యాపార రుణాలందించే ఎస్‌కే ఫైనాన్స్ ఐపీఓకు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2,200 కోట్లు సేకరించాలని సంస్థ భావిస్తోంది.

తగ్గిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం

ఎయిర్‌పోర్టుల నుంచి డేటా సెంటర్ల వరకు విభిన్న రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 37 శాతం క్షీణించి రూ.450.58 కోట్లకు పరిమితమైంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై రూ.627 కోట్ల బకాయిని ఏకకాలంలో చెల్లించడంతో పాటు కమర్షియల్ మైనింగ్‌లో ఏర్పడిన నష్టాలు లాభాన్ని ప్రభావితం చేసినట్టు కంపెనీ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.722.48 కోట్లు కాగా మూడో త్రైమాసిక లాభం రూ.188.45 కోట్లుంది. న్యూ ఎనర్జీ, విమానాశ్రయ వ్యాపారాల్లో మంచి వృద్ధి నమోదైనా కమర్షియల్ మైనింగ్ విభాగం రూ.201.83 కోట్లు నష్టం నమోదు చేసింది. ఇదిలా ఉండగా 2030 నాటికి దేశంలో 1 గిగా వాట్ సామర్థ్యం గల 9 డేటా సెంటర్లు కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఎడ్జ్ కనెక్స్ జాయింట్ వెంచర్‌లో చెన్నై డేటా సెంటర్ ప్రస్తుతం పని చేస్తుండగా నోయిడా, హైదరాబాద్ డేటా సెంటర్ల నిర్మాణం 81-88 శాతం పూర్తయినట్టు కంపెనీ ప్రకటించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	87,000 ▼
ముంబై	71,327	65,336	79,719

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	440
చిత్తూరు	494	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	137
వరంగల్	129	విజయవాడ	137
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	127
విశాఖపట్నం	129		



77 ఏళ్ల వయస్సులో నడవలేకున్న కృష్ణలంకకు చెందిన జయమ్మను బ్యాంకుకు తీసుకొస్తూ..

పింఛన్ పాట్లు..!

మరోసారి పెన్షన్ కోసం పండుటాకుల అవస్థలు

- బ్యాంకుల వద్ద బారులు.. గంటలకొద్దీ పడిగాపులు
- ఆధార్, పాన్‌కార్డులు అడగటంతో మళ్లీ ఇళ్లకు..
- విత్‌డ్రా ఫాంలు రాసేవారు లేక అవస్థలు
- దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారికీ ఖాతాల్లోనే జమ
- వీల్‌చైర్లు, హ్యాండ్ స్టిక్కర్లతో కష్టంగా వచ్చిన వృద్ధులు



స్టిక్కర్‌పై కష్టంగా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/తిరువూరు/ విస్సన్నపేట/ చందర్లపాడు/ భవానీపురం) : పెన్షన్ల పంపిణీ పేరుతో ప్రభుత్వం మరోమారు పెన్షన్‌దారులను ఇబ్బందులకు గురిచేసింది. పెన్షన్ డబ్బును బ్యాంకుల్లో జమ చేయటంతో వాటిని తీసుకోవటానికి గురువారం వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా గురువారం పెన్షన్‌దారులు చవిచూసిన నరకం అంతా ఇంతా కాదు. 43 నుంచి 45 డిగ్రీల ఎండలో నానా ఇబ్బందులు పడి ప్రయాణాలు చేస్తూ బ్యాంకులకు వచ్చారు. గ్రామాల్లో ఊరికి దూరంగా 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రాల్లోని బ్యాంకులకు చేరుకుని బారులు తీరారు. కొంతమంది దివ్యాంగులు కూడా బ్యాంకుల వద్ద కనిపించారు. చేతులు లేనివారు, చూపులేనివారు, వీల్‌చైర్లలో వచ్చినవారు కూడా ఉన్నారు. మరికొందరు నడవలేని వృద్ధులను వారి కుటుంబ సభ్యులు ద్విచక్రవాహనాలపై తీసుకొచ్చారు. నడవలేని వారికి ఇంటి వద్దే పెన్షన్లు ఇస్తామని చెప్పినా ఆ పని దాదాపు ఎక్కడా చేయలేదు. బ్యాంకులకు వచ్చినవారు విత్‌డ్రా ఫాంలు రాయలేక నానా ఇబ్బందులు పడ్డారు. చాలాకాలంగా ఇంటి వద్దే పెన్షన్ తీసుకోవటం వల్ల కొందరికి బ్యాంకు పుస్తకాలకు సంబంధించిన లావాదేవీలు, ఈకేవైసీలో ఇబ్బందులు తలెత్తాయి. ఆధార్‌కార్డు, పాన్‌కార్డులను తీసుకురావాలని బ్యాంకు అధికారులు చెప్పటంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పటమట యూనియన్ బ్యాంకుకు పెద్దసంఖ్యలో దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు స్ట్రెక్చర్ సాయంతో వచ్చారు. పటమట, కృష్ణలంక, గుణదల, మొగల్రాజపురం, రాణిగారితోట, సింగ్‌నగర్, పాయకాపురం, వన్‌టౌన్, విద్యాధరపురం ప్రాంతాల్లోని బ్యాంకులు వృద్ధులతో కిటకిటలాడాయి. చందర్లపాడులోని ఇండియన్ బ్యాంక్ ఉదయం 10 గంటలకు ముందే వృద్ధులతో రద్దీగా కనిపించింది. తిరువూరులోని స్టేట్‌బ్యాంకులో కూడా ఇదే పరిస్థితి. వీరవల్లిలో సహకార బ్యాంక్ వద్ద ఆరు బయటే ఎండలో ఎదురుచూడాల్సి వచ్చింది. హనుమాన్ జంక్షన్ ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద రోడ్డుపైనే పెన్షన్ కోసం వేచిచూశారు. టెంట్ ఉన్నా ఎండవేడికి తట్టుకోలేకపోయారు.



కృష్ణలంక యూనియన్ బ్యాంక్ వద్ద బారులు తీరిన వృద్ధులు (ఇన్‌సెట్‌లో) ఉయ్యూరు యూనియన్ బ్యాంకులో ఎండకు కూలబడిపోయిన ఓ వృద్ధురాలు



తిరువూరు స్టేట్‌బ్యాంక్ వద్ద కిక్కిరిసి..



పటమటలోని బ్యాంకుకు వస్తున్న దివ్యాంగుడు



వీరవల్లి సహకార బ్యాంకు వద్ద ఎండలో పడిగాపులు

కిట్టూ.. ఎగబడి కొట్టు..



ఎస్పీ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

బందరులో పెచ్చుమీరుతున్న పేర్ని కుటుంబం ఆగడాలు

మూడు నెలల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలపై వరుస దాడులు

- వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు, ఆయన అనుచరుల బీభత్సం
- చిన్న వివాదమైనా కార్లలో వచ్చి దాడులు
- పేర్ని కుటుంబ సేవలో తరిస్తున్న పోలీసులు
- తాజాగా జనసేన కార్యకర్త, కుటుంబంపై దాడి

మచిలీపట్నంలో అరాచక పాలన సాగుతోంది. ఎమ్మెల్యే పేర్ని నాని కుమారుడు కిట్టు.. తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మూడు నెలలుగా టీడీపీ, జనసేన కార్యకర్తలను టార్గెట్ చేసుకుని దాడులకు తెగబడుతున్నా పోలీసులు పట్టించుకోరు. తాజాగా గురువారం బందరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ వార్డు విశ్వబ్రాహ్మణ కాలనీలో జనసేన కార్యకర్త కర్రి మహేశ్ కుటుంబంపై పేర్ని కిట్టు, ఆయన అనుచరులు దాడి చేయడంతో పరిస్థితి మరింత భయానకంగా మారింది.

గంజాయి బ్యాచ్..

పేర్ని కిట్టు వెంట తిరిగే వారిలో రాజకీయ పార్టీలో తిరిగే అనుచరగణం కంటే గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గురువారం నాటి దాడి వారి పనేనన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ కార్యకర్తలైతే ఆ స్థాయిలో దాడికి తెగబడి బీభత్సం సృష్టించరని సొంత పార్టీవారే చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) :

- ఈ ఏడాది మార్చిలో పోతేపల్లి పంచాయతీ ఉల్లిపాలెంలో పేర్ని కిట్టు పుట్టినరోజు పేరుతో నాలుగైదు చోట్ల బ్యానర్లు కట్టారు. అదే సమయంలో గ్రామంలో కొల్లు రవీంద్రకు స్వాగతం పలుకుతూ టీడీపీ కార్యకర్తలు మరికొన్ని బ్యానర్లు కట్టారు. పేర్ని కిట్టుకు చెందిన బ్యానర్ చించేశాడనే కారణంతో గ్రామానికి చెందిన ఈడే యశ్వంత్‌పై కిట్టు అనుచరుడు పవన్, మరో 20 మంది రెండు కార్లలో, నాలుగైదు ద్విచక్రవాహనాలపై వచ్చి దాడి చేశారు. అంతటితో ఆగకుండా కారులో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టారు. చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తామని చెప్పి తీసుకెళ్లారు. యశ్వంత్‌పై దాడి చేసేందుకు రెండు కార్లలో రాగా, అందులో ఒకటి కిట్టు కారేనని స్థానికులు చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు. కొల్లు రవీంద్రతో పాటు జనసేన నాయకుడు బండి రామకృష్ణ తదితరులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపమని కోరే వరకు పోలీసులు స్పందించలేదు.
- గత నెలలో జెడ్పీ కన్వెన్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకలో పేర్ని నానీని దూషించాడనే కారణంతో చిలకలపూడికి చెందిన తోట యశ్వంత్ అనే వ్యక్తిపై పేర్ని అనుచరులు దాడి చేశారు. అంతటితో ఆగకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. న్యాయం చేయాల్సిన పోలీసులు బాధితుడికి తమదైన శైలిలో వార్నింగ్ ఇచ్చారు. ఈ గొడవలన్నీ ఎందుకని, తనదే తప్పు అని బాధితుడు చెప్పే వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు.
- పోతేపల్లి పంచాయతీ శివారు ఉల్లిపాలెంలో గత నెలలో నూకాలమ్మ జాతర జరిగింది. గ్రామంలో టీడీపీకి అనుకూలంగా ఉన్న కేసన మహేశ్, ధర్మతేజ అనే యువకులను కిట్టు అనుచరులు కొట్టారు. దీంతో టీడీపీ కార్యకర్తలు తిరగబడి వారిని నిలువరించారు. ఉల్లిపాలెంలో ప్రతిసారీ గొడవలకు కారణమవుతున్న వైసీపీ కార్యకర్తలను తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ చాణక్య మందలించారు. దీంతో పేర్ని కిట్టు, నాని వందలాది మంది వైసీపీ కార్యకర్తలను వెంటబెట్టుకుని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వీరంగం చేశారు. పేర్ని నాని పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే, వైసీపీ కార్యకర్తలు సీసీ కెమెరాను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.
- తాజాగా కిట్టు ఎన్నికల ప్రచారం చేస్తుండగానే, వైసీపీ కార్యకర్తలు మచిలీపట్నం 8వ డివిజన్ విశ్వబ్రాహ్మణ కాలనీకి చెందిన జనసేన కార్యకర్త కర్రి మహేశ్ ఇంటిపై గురువారం దాడికి తెగబడ్డారు. మహేశ్ భార్య హేమలత, అతని సోదరుడి కుమారుడు నాగబాబుపై దాడి చేశారు. ఇంటి ఆవరణలోకి వెళ్లి దొరికిన వస్తువులను పగలగొట్టి, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి భయానక వాతావరణం సృష్టించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెళ్తే, అక్కడ కూడా వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం గమనార్హం. పోలీస్‌స్టేషన్ వద్ద ఇంతా జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారు.



బాధితుడిని ఎస్పీ కార్యాలయం వద్దకు తీసుకొస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర

పోలీసులా.. వైసీపీ కార్యకర్తలా!

- ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వస్తే.. మళ్లీ దాడి
- పోలీసుల నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం
- అన్ని ఆధారాలతో ఎన్నికల సంఘం, గవర్నర్, డీజీపీకి ఫిర్యాదు చేస్తాం : బాలశౌరి, రవీంద్ర

లోపలి పేజీలో..

ఫుల్లుగా..

మద్యాన్ని భారీగా డంప్ చేస్తున్న అధికార పార్టీ అభ్యర్థులు

- ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సరుకు సరఫరా
- కీలకంగా వ్యవహరిస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు

ఎన్నికల్లో డబ్బు ఎంత ముఖ్యమో, మద్యం అంతకంటే ఎక్కువ ముఖ్యం. ఇక గెలుపు కోసం అన్ని అడ్డదారులూ తొక్కుతున్న అధికార పార్టీ అభ్యర్థులకు మద్యం కేసులు ఇప్పుడు అత్యవసరం. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లను మంచి చేసుకుని ఎన్నికలకు ముందే రహస్య ప్రదేశాల్లో మందును భారీగా డంప్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అధికార పార్టీ అభ్యర్థులు ముందు జాగ్రత్తగా మందును భారీగా డంప్ చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రచారంలో నిర్వహించే ఊరేగింపులు, ర్యాలీల్లో పాల్గొన్న వారికి నగదుతో పాటు మద్యం కూడా ఇవ్వాల్సి వస్తోంది. దీంతో పంపిణీకి అవసరమైన సరుకును ముందే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి రప్పించుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఈ సరుకును చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం.

నిబంధనలను తోసిపుచ్చి..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒక వ్యక్తికి మూడు మద్యం సీసాలకు మించి విక్రయించకూడదు. దుకాణాల్లో ఎవరు మద్యం కొన్నా ఆధార్‌కార్డు చూపించాలి. ఒక వ్యక్తి వద్ద మూడు మద్యం సీసాలు మించి ఉండటానికి వీల్లేదు. అటువంటిది అధికార పార్టీ అభ్యర్థులకు సంబంధించిన ప్రదేశాల్లో కేసులకొద్దీ మద్యం నిల్వ ఉంటోంది. ఈ సరుకు మొత్తం ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సరఫరా అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అభ్యర్థుల అనుచరులు చాలా చాకచక్యంగా కేసులను రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం బారుల్లో డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను మాత్రమే సరఫరా చేయాలి. కొంతమంది బార్ నిర్వాహకులు తెలంగాణ నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను రప్పించుకుని సరఫరా చేస్తున్నారు.

రూ.32.80 లక్షల మద్యం సీజ్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు వరుస సోదాలు నిర్వహించారు. ఐదుగురు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనలను ఉల్లంఘించి సరుకును బయట పంపడమే దీనికి కారణమని తెలుస్తోంది. అధికారులు నాలుగు బృందాలుగా ప్రభుత్వ దుకాణాలు, బారుల్లో రెండు నెలలుగా తనిఖీలు నిర్వహించారు. ఒక్క బారులో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. జిల్లాలో ఏడు బెల్టు షాపులను గుర్తించారు. మొత్తం 3,296 లీటర్ల మద్యాన్ని, 2,035 బీరు సీసాలను సీజ్ చేశారు. ఈ సరుకు విలువ రూ.32లక్షల80వేల200 ఉంటుంది.



గతనెలలో మైలవరం వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు నామినేషన్‌లో నడిరోడ్డుపై మందు సీసాలతో కనిపించిన కార్యకర్తలు (ఫైల్)

7, 9 తేదీల్లో హోమ్ ఓటింగ్

- కృష్ణాజిల్లాలో మొదలైన హోమ్ ఓటింగ్
- తొలి ఓటు వినియోగించుకున్న గుడ్లవల్లేరు వృద్ధురాలు

జిల్లావ్యాప్తంగా 1,047 మంది దరఖాస్తు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మంచానికే పరిమితమై ఇంట్లో నుంచి బయటకు రావటానికి వీల్లేని వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం కల్పించిన హోమ్ ఓటింగ్ ఈనెల 7, 9 తేదీల్లో జరగనుంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,047 మంది దరఖాస్తు చేసుకున్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈ అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకే పోలింగ్ సిబ్బంది వచ్చి బ్యాలెట్ ఓటు వేయిస్తారు. పోలింగ్ కేంద్రంలో ఏ విధమైన ప్రక్రియ జరుగుతుందో అదేవిధంగా ఇంటి వద్ద కూడా జరుగుతుంది. ఆ తర్వాత అధికారులు బ్యాలెట్ బాక్సును వెంట తీసుకెళ్తారు. పోలీసు బందోబస్తు నడుమ ఈ హోమ్ ఓటింగ్ జరుగుతుంది. కాగా, హోమ్ ఓటింగ్ అవకాశాన్ని కృష్ణాజిల్లాలో మొదటిసారిగా 85 ఏళ్ల వృద్ధురాలు వినియోగించుకుంది. గుడివాడ నియోజకవర్గం గుడ్లవల్లేరు గ్రామంలో ఉంటున్న పొట్లూరి స్వరాజ్య లక్ష్మీబాయ్ (85) గురువారం ఇంట్లోనే తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.



గుడ్లవల్లేరులో ఓటు వేస్తున్న స్వరాజ్య లక్ష్మీబాయ్



నది ఒడ్డున నిలిపి ఉన్న ఎక్స్‌కవేటర్లు

ఇసుక దోపిడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ నేతలకు ఈసీ నిర్ణయం గొంతులో వెలక్కాయపడినట్టుగా చేసింది. నందిగామ నియోజకవర్గంలో అధికార పార్టీ పెద్దలు ఇష్టారాజ్యంగా సాగిస్తున్న ఇసుక దోపిడీకి ఎన్నికల కమిషన్ జోక్యంతో బ్రేక్ పడింది.

ఇసుక దోపిడీకి బ్రేక్

నందిగామ నియోజకవర్గంలో అధికార పార్టీ అక్రమ తవ్వకాలు

- ఆధారాలతో సహా ఈసీకి టీడీపీ నాయకుడి ఫిర్యాదు
- స్పందించిన అధికారులు.. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు చెక్
- పరిశీలనకు వెళ్లిన అధికారులు.. చర్యలు మాత్రం శూన్యం

కంచికచర్ల : నందిగామ నియోజ కవర్గంలోని కొంతమంది అధికారుల అండతో వైసీపీ పెద్దలు ఒకవైపు కృష్ణానదిని, మరోవైపు మునేరును భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలై కొద్దిరోజుల్లో పోలింగ్ జరగనున్నప్పటికీ ఈసీ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇసుకను అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్నారు. అక్రమార్జనకు పూనుకుంటున్నారు. అనధికారికంగా సాగుతున్న ఈ దోపిడీపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటంతో కంచికచర్ల మండలం కొత్తపేటకు చెందిన అబ్బూరు నాగమల్లేశ్వరరావు మూడు రోజుల క్రితం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈసీ రంగంలోకి దిగటంతో తప్పనిపరిస్థితుల్లో కేసు నమోదు చేసి, మంగళవారం సాయంత్రం రీచ్‌ల్లోకి వాహనాలు వెళ్లకుండా రోడ్లకు గండ్లు కొట్టించారు. కాగా, రీచ్‌ల్లో ఉన్న వాహనాలను సీజ్ చేయకుండా అధికారులు సురక్షితంగా బయటకు పంపించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రంగా అధికారుల పరిశీలన

కంచికచర్ల మండలం గని ఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు గ్రామాల పరిధిలోని కృష్ణానదిలో, ఎస్.అమరవరం, వేములపల్లి గ్రామాల పరిధిలోని మునేటిలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ సంస్థ పేరుతో అధికార పార్టీకి చెందిన పెద్దల కనుసన్నల్లో ఈ దోపిడీ జరుగుతోంది. వాస్తవానికి రీచ్‌లకు అనుమతుల్లేవని అంటున్నారు. అయినప్పటికీ పదుల సంఖ్యలో భారీ యంత్రాలతో కృష్ణానదిని, మునేటిని కొల్లగొడుతున్నారు. ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడీ జరుగుతున్నప్పటికీ అధికారులు మౌనం దాల్చారు. అక్రమ తవ్వకాల గురించి పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ చూస్తూ ఊరుకున్నారు. పైగా కొంతమంది అధికారుల అండతో వైసీపీ పెద్దలు నిర్భయంగా రేయింబవళ్లూ దోపిడీ సాగించారు. లోడింగ్‌ను బట్టి ఒక్కో లారీ నుంచి రూ.15 వేల నుంచి రూ.25 వేలు వసూలు చేసేవారు. హైదరాబాద్ వెళ్లే లారీలకు మన రాష్ట్ర పరిధిలో ఎలాంటి ఆటంకం లేకుండా కోదాడ వరకు పంపించేవారు. ఇందుకు ఎక్కడికెక్కడ ముడుపులు ఇవ్వాలంటూ మరో రూ.5 వేలు అదనంగా తీసుకునేవారు. అన్ని రీచ్‌లకు కలిపి రోజూ వందకు పైగా లారీలు వచ్చేవని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇసుక దోపిడీ గురించి పోలీస్, సెబ్, మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించటం లేదని, ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని పేర్కొంటూ నాగమల్లేశ్వరరావు గతనెల 27న ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈసీ ఆదేశాలతో కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో 30వ తేదీన 142/2024 నెంబరుతో యూ/ఎస్ 379, 171-హెచ్, ఐపీసీ 27, 35 వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం సాయంత్రం రీచ్‌ల వద్దకు వెళ్లారు. ముఖ్యంగా మున్నలూరు, ఎస్.అమరవరం, వేములపల్లి రీచ్‌ల్లోకి వాహనాలు వెళ్లకుండా రోడ్లకు గండ్లు కొట్టారు. కాగా, అధికారులు వెళ్లినప్పుడు రీచ్‌లలో పదుల సంఖ్యలో యంత్రాలు, లారీలు ఉన్నాయి. వాటిని సీజ్ చేయలేదు. కనీసం కేసు కూడా నమోదు చేయలేదు. పైగా ఆ వాహనాలన్నింటినీ బయటకు పంపించటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎస్పీ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు, బాధితుల ఆందోళన.. వారి నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న పోలీసులు

పోలీసులా.. వైసీపీ కార్యకర్తలా!

- ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వస్తే.. మళ్లీ దాడి
- పోలీసుల నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం
- అన్ని ఆధారాలతో ఎన్నికల సంఘం, గవర్నర్, డీజీపీకి ఫిర్యాదు చేస్తాం : బాలశౌరి, రవీంద్ర
- ఎస్పీ కార్యాలయం ఎదుట నేతల ఆందోళన
- తక్షణం కేసులు నమోదు చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే పేర్ని నాని ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జనసేన కార్యకర్త కర్రి మహేష్ కుటుంబసభ్యులపై వైసీపీ నాయకులు దాడిచేసిన ఘటనలో పోలీసుల తీరుపై మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మూకదాడిపై ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వస్తే పోలీసుల ఎదుటే వైసీపీ కార్యకర్తలు వారిపై దాడిచేయడంతో విషయం తెలుసుకున్న వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ, పార్టీశ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నిందితులపై కేసునమోదు చేయాలంటూ ఆందోళనకు దిగారు. దాడిలో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలపైనా, ఎమ్మెల్యే పేర్నినాని, పేర్నికిట్టుపై కేసులు నమోదుచేయాలని ఎస్పీతో ఫోన్‌లో బాలశౌరి, కొల్లురవీంద్ర మాట్లాడారు. వైసీపీ నాయకులు నా బీసీలు, నా ఎస్సీలు అని ఒక వైపు చెబుతూనే బీసీలపై దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుల కులవృత్తి, ఆచారాలను కించపరుస్తూ మాట్లాడారని ఆరోపించారు. మహేశ్ కుటుంబసభ్యులపై పేర్నికిట్టు సమక్షంలోనే దాడి జరిగిందని మహిళల మెడలోని తాళిబొట్టు సైతం లాగేందుకు ప్రయత్నించడంతో పాటు, విచక్షణా రహితంగా దాడిచేశారని అన్నారు. ఆధారాలు, పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలనచేసి నిందితులపై కేసు నమోదు చేయాలన్నారు. ఘటనకు సంబంధించిన అన్ని సాక్ష్యాలతో ఎన్నికల సంఘానికి, గవర్నర్‌కు, డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. దీనికి బాధ్యులు, నిందితులపై కేసులు నమోదుచేయకుంటే, శుక్రవారం పేర్నినాని ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓడిపోతున్నామనే భయం వైసీపీ నాయకుల్లో వచ్చిందని, దీంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, గందరగోళ పరిస్థితులను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై బాధితుల నుంచి మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుబానీ, సీఐ శ్రీనివాసయాదవ్ ఫిర్యాదు తీసుకుని నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో జనసేన, టీడీపీ నాయకులు ఎస్పీ కార్యాలయం నుంచి వెనుదిరిగారు. అనంతరం ఎంపీ బాలశౌరి, కొల్లురవీంద్ర మహేశ్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తమపై విచక్షణా రహితంగా దాడిచేశారని మహిళలు నేతల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేద్దాం

- జిల్లాలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం
- బందరులో కూటమి అభ్యర్థులు కొల్లు రవీంద్ర, బాలశౌరిల విస్తృత పర్యటన
- అడుగడుగునా హారతులిచ్చిన మహిళలు

మచిలీపట్నం టౌన్, మే 2 : అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీని బంగాళాఖాతంలో కలిపేద్దామని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం జనసేన నియో



జక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకులు మాదివాడ రాము, కొరియర్ శ్రీనులతో కలిసి మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గంలో కొల్లు రవీంద్ర విస్తృతంగా పర్యటించారు. చిలకలపూడిలో వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అనంతరం ట్రాక్టర్ తోలి బందరు మండలం హుస్సైన్‌పాలెం, చిట్టిపాలెం గ్రామాల్లో రవీంద్ర, రామకృష్ణలు పర్యటించారు. హుస్సైన్‌పాలెంలో ఉమ్మడి ప్రచార కరపత్రాలను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళలు రవీంద్రకు హారతులిచ్చారు. ప్రచార రథానికి గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ విధానాలు నచ్చక పలువురు జనసేన, టీడీపీలో చేరుతున్నారన్నారు. ఓటమి భయంతో పార్టీల్లోకి చేరిన కార్యకర్తలపై వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను కొల్లు



రవీంద్ర వివరించారు. మరో వారం రోజుల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎన్నికల బరిలో.. బాలశౌరి సిక్స్‌లే : బండి రామకృష్ణ

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి బాలశౌరికి బ్యాలెట్ పేపరులో ఆరో నెంబరు వచ్చిందని, ఈ ఎన్నికల బరిలో బాలశౌరి సిక్స్‌లు కొట్టబోతున్నారన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి గ్లాసు గుర్తును ఎన్నికల కమిషన్ తొలగించడం ముదావహమన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో జనసేన నాయకులపై వైసీపీ కార్యకర్తలు రెచ్చకొట్టే విధంగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, రామధాని వేణు, ఎండీ ఇలియాస్‌బాషా, పిప్పళ్ల కాంతారావు, అమ్మిరెడ్డి శివయ్య, చండిక ఉపేంద్ర, శ్రీకాకుళపు సముద్రాలు, రామధాని వేణు తదితరులు పాల్గొన్నారు.



నందమూరి రామకృష్ణకు తాటికల్లు పోస్తున్న గీత కార్మికులు, కొల్లు రవీంద్ర

గీత కార్మికులను ఆదుకుంటాం

- నందమూరి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్ : వైసీపీ ప్రభుత్వంలో గీత కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. బందరు మండలం సుల్తానగరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో నందమూరి రామకృష్ణ, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్రలు పాల్గొన్నారు. టీడీపీ సుల్తానగరం గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టిబొమ్మ వనరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రాష్ట్ర ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు బీసీలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు.



డోకిపర్రులో ప్రచారం మధ్యలో తాటి ముంజలు జుర్రుతున్న వెనిగండ్ల, రావి

అభివృద్ధి చేసి చూపిస్తా..

- గుడ్లవల్లేరు మండలంలో వెనిగండ్ల ప్రచారం

గుడ్లవల్లేరు, మే 2 : గుడివాడ ప్రజలకు అభివృద్ధిని రాబోయే ఐదేళ్లలో చేసి చూపిస్తా.. అని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. గురువారం గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు, లంకాదొడ్డి, మామిడికోళ్ల, కౌతవరం ఫస్ట్ వార్డు, గుడ్లవల్లేరు గ్రామాల్లో వెనిగండ్ల రాము రోడ్ షో నిర్వహించారు. ఎక్కడికక్కడ గ్రామాల్లో సమస్యలను ప్రజలు రాము దృష్టికి తీసుకొచ్చారు. డోకిపర్రు- లంకాదొడ్డి రహదారి, మామిడికోళ్ల-గుడ్లవల్లేరు రహదారి గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. చంద్రబాబు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వెనిగండ్ల ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రావి వెంకటేశ్వరరావు, కొనరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వెంకటరావు, శాయిన పుష్పావతి, కొడాలి రామరాజు, వీరమాచనేని శివప్రసాద్, జయరామ్, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, తోట మల్లి, రాధిక, ఎ.రామ్మోహన్, రంగబాబు, పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, మోహన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నాగులూరు ఎన్నికల ప్రచారంలో వసంతకు హారతులు పడుతున్న మహిళలు

జగన్‌కు ఓటేస్తే అంతా నాశనమే

- వసంత కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం, మే 2 : ఏపీలో మరల జగన్ అధికారంలోకి వస్తే అంతా నాశనం తప్ప ఏం ఉండదని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలం సాయన్నపాలెం, నాగులూరు, రంగాపురం, మద్దులపర్వ శ్రీరాంపురం, తాడిగూడెం, రెడ్డికుంట గ్రామాల్లో గురువారం వసంత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, జగన్ అమరావతి రాజధానిని విశాఖకు మార్చుతాడని, మన భూములపైనే హక్కులు కోల్పోయే చట్టం తెచ్చాడని, అలాంటి వాడిని ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేవలం ఓట్ల కోసం బటన్ నొక్కుడే తప్ప అభివృద్ధి చేద్దాం అని జగన్‌కు ఏ కోశాన లేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజా రాజధాని అమరావతితో పాటు పేదలకు ఉచిత ఇసుక, అన్న క్యాంటిన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. నాశిరకం మద్యం బ్రాండ్స్‌ను రద్దు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి, తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కె.విజయబాబు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, నాదెళ్ల చెన్నకేశవరావు (కేసుబాబు), కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి, చేబ్రోలు రాజు, కామిశెట్టి వెంకట నరసయ్య, పాలంకి మోహన్ మురళీ రెడ్డి, ఇజ్రాయిల్, వెలవెల రాఘవులు తదితరులు పాల్గొన్నారు. కొత్తనాగులూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బూక్యా చంటిబాబు తదితరులు గురువారం వసంత సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై బాబు రెండో సంతకం : దేవినేని ఉమా



గొల్లపూడి, మే 2: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ రెండో సంతకం చేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమా స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ప్రభుత్వం వంచనతో తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రైతులు, సామాన్యులు తమ భూములు కోల్పోయే ప్రమాదం ఉందని దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ, భూములకు సంబంధించి ఇప్పటి వరకు కోర్టులకు ఉన్న అన్ని అధికారాలను తీసుకెళ్లి టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (టీఆర్‌వో) చేతుల్లో పెట్టారని ఆందోళన చెందారు.



సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్‌తో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

అనుమానిత, అసాధారణ బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్

కృష్ణలంక, మే 2 : అనుమానిత, అసాధారణ బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ, జిల్లా వ్యయ పరిశీలకుడు వి.జస్టిన్, సౌరభ్‌శర్మ, మదన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ తదితరులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. "అభ్యర్థుల వ్యయ పరిశీలన ఇతర అంశాలపై దృష్టి సారించండి. ప్రలోభాలకు లొంగకుండా సమన్వయంతో పనిచేయండి. అనుమానిత, అసాధారణ లావాదేవీల సమాచారాన్ని విశ్లేషించండి. పోస్టల్ ఆర్డర్లు, యూపీఐ పేమెంట్లపైనా దృష్టి కేంద్రీకరించండి. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో డిపాజిట్లు, నగదు ఉపసంహరణలపై దృష్టి పెట్టండి. డబ్బు, మద్యం అనధికార రవాణాను అడ్డుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులంతా సమష్టిగా పనిచేయండి." అని నీనా నిగమ్ సూచించారు. అనంతరం సాధారణ ఎన్నికలు-2024పై పోలింగ్ అధికారుల కోసం సూచనల బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. జిల్లా సమాచారాన్ని కలెక్టర్ ఢిల్లీరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా రాజకీయ ప్రకటనలకు ప్రీసర్టిఫికేషన్ ఇస్తున్నామని తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పటిష్ఠంగా అమలు చేస్తున్నామని, 2024 మార్చి 16 నుంచి మే 1 వరకు రూ.3.38 కోట్ల నగదు, రూ.48 లక్షల విలువైన మద్యంతో పాటు మొత్తం రూ.6.92 కోట్ల విలువైన సీజర్లు జరిగాయని ఢిల్లీరావు వివరించారు. ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌జీఎస్పీ, కాల్‌సెంటర్, సీ-విజిల్‌కు 2,216 ఫిర్యాదులు రాగా 2,196 పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఇప్పటివరకు 60 కేసులు నమోదు చేశామని తెలిపారు. 11 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, 8 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు సజావుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. నిఘా బృందాల పనితీరు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, భద్రతా ప్రణాళిక, ఈవీఎం గార్డింగ్, స్ట్రాంగ్ రూమ్స్ భద్రతపై సీపీ వివరించారు. సమావేశం అనంతరం అధికారులతో కలిసి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం, ఎంసీఎంసీ, సోషల్ మీడియా, సీజర్స్ రిడ్రెసల్ విభాగాల కార్యకలాపాలను నీనా నిగమ్ పరిశీలించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎంసీఎంసీ మెంబర్ వెలగా జోషి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: ఢిల్లీరావు

శాంతియుత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. బుధవారం జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యలపై తన క్యాంపు కార్యాలయం నుంచి పోలీస్ ఉన్నతాధికారులు, రిటర్నింగ్ అధికారులు, డీసీపీలు, ఏసీపీలతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. జిల్లాలో 1,874 పోలింగ్ స్టేషన్లు, 720 పోలింగ్ స్టేషన్ లొకేషన్లు ఉన్నాయన్నారు. , 878 కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు.

బైక్‌ను ఢీకొన్న గేదెలు..పోస్టుమెన్ దుర్మరణం

ఎ.కొండూరు, మే 2: బైక్‌పై వెళుతుండగా గేదెలు ఢీకొని పోస్టుమెన్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన నూజివీడు- గంపలగూడెం రోడ్డులో చీమలపాడు గ్రామ సమీపంలో గురువారం ఉదయం జరిగింది. గంపలగూడెం మండలం గొల్లపూడి గ్రామంలో పోస్టుమెన్‌గా పనిచేస్తున్న తాళ్లూరి కృష్ణదాసు(50) బైక్‌పై కొండపల్లి నుంచి గంపలగూడెం వెళుతుండగా చీమలపాడు సమీపంలో గేదెలు బైక్‌ను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృష్ణదాసు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణ తెలిపారు.

పోలింగ్‌కు ఈవీఎంలు సిద్ధం

- ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 'ఈవీఎం కమిషనింగ్' ప్రారంభం
- ఈవీఎంలలో బ్యాలెట్ సెట్, వీవీ ప్యాట్లలో సింబల్ లోడింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎం కమిషనింగ్ పనులను గురువారం ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రారంభించింది. ఈవీఎంలు, వీవీప్యాట్లను ఎన్నికలకు సిద్ధం చేస్తోంది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో గురువారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు, జిల్లాకు ప్రత్యేకంగా నియమించిన ఎన్నికల పరిశీలకుల సమక్షంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కమ్ రిసెప్షన్ సెంటర్లలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఈవీఎంల రెండోదశ ర్యాండమైజేషన్ పూర్తవడంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజవర్గాలకు ఓట్లు వేయటానికి అవసరమైన మేరకు, రిజర్వుగా ఉంచిన ఈవీఎంలలో బ్యాలెట్ నింపే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఖరారు చేసిన తుది అభ్యర్థులు, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తుల ప్రాతిపదికన బ్యాలెట్లను ఈవీఎంలలో ఏర్పాటు చేస్తున్నారు.



ఈవీఎంలు, వీవీప్యాట్ల కేటాయింపు ఇలా

జిల్లా వ్యాప్తంగా 1781 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2147 బ్యాలెట్ యూనిట్లను(బీయూ), 2147 కంట్రోల్ యూనిట్లను(సీయూ), 2324 వీవీప్యాట్లను కేటాయించారు. రిజర్వులో మరో 611 బీయూ, 45 సీయూ, 308 వీవీప్యాట్లను ఉంచుతున్నారు. వీటన్నింటిలోనూ బ్యాలెట్ పేపర్లు నింపడం, సింబల్ లోడింగ్ ప్రక్రియను చేపట్టారు. తిరువూరుకు 280 బీయూ, 280 సీయూ, 304 వీవీ ప్యాట్లను కేటాయించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి 303 బీయూ, 303 సీయూ, 328 వీవీ ప్యాట్లు, సెంట్రల్‌కు 321 బీయూ, 321 సీయూ, 346 వీవీ ప్యాట్లు, తూర్పుకు 357 బీయూ, 357 సీయూ, 387 వీవీ ప్యాట్లు, మైలవరానికి 354 బీయూ, 354 సీయూ, 383 వీవీ ప్యాట్లు, నందిగామకు 266 బీయూ, 266 సీయూ, 288 వీవీప్యాట్లు, జగ్గయ్యపేటకు 266 బీయూ, 266 సీయూ, 288 వీవీప్యాట్లను కేటాయించారు. ఈ 7 నియోజకవర్గాలకు కలిపి 644 బీయూ, 45 సీయూ, 349 వీవీప్యాట్లను రిజర్వులో ఉంచుతున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 4,294 బీయూ, 4,294 సీయూ, 4,648 వీవీ ప్యాట్లను, అదనంగా 1255 బీయూ, 91 సీయూ, 657 వీవీప్యాట్లను కేటాయించారు. కమిషనింగ్ ప్రక్రియ రెండు రోజుల్లో నూరుశాతం పూర్తవుతుంది.

కమిషనింగ్‌ను పరిశీలించిన నీనా నిగమ్

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు ప్రక్రియను ఆమెకు వివరించారు. ఎన్నిలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించటంలో ఈవీఎం కమిషనింగ్ ముఖ్యమని ఆమె అన్నారు. కమిషనింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఈవీఎం కమిషనింగ్‌లో భాగంగా..

ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్‌తో అనుసంధానించే బ్యాలెట్ యూనిట్‌ను ఓపెన్ చేసి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన బ్యాలెట్ పేపర్లను వేర్వేరు బ్యాలెట్ యూనిట్లలో ఏర్పాటు చేశారు. బ్యాలెట్‌ను లోడ్ చేశాక, థంబ్ వీల్ సెట్టింగ్, మాస్కింగ్, అడ్రెస్ ట్యాగింగ్ చేశారు. ఈ రెండూ అనుసంధానమయ్యే కంట్రోల్ యూనిట్‌లో బ్యాలెట్ పేపర్ ప్రకారం క్యాండిడేట్ సెట్టింగ్, సీలింగ్ ఆఫ్ క్యాండిడేట్ సెట్ చేపట్టారు. ఈ ప్రక్రియతో పాటు సమాంతరంగా ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన వీవీ ప్యాట్ల కమిషనింగ్ చేపట్టారు. వీవీ ప్యాట్ల కమిషనింగ్‌లో భాగంగా వాటిలో సింబల్ లోడింగ్ చేశారు. బ్యాలెట్ పేపర్ ప్రకారం అభ్యర్థుల సింబల్ లోడింగ్ చేపట్టారు. స్లిప్పుల కోసం పేపర్ రోల్స్ సెట్ చేశారు. పవర్ ప్యాక్, సీలింగ్ ఆఫ్ పేపర్ రోల్ వంటివి నిర్వహించారు.

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో.. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచన

కృష్ణలంక, మే 2: పోలింగ్ విధులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోండి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. సాధారణ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పరిధిలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెంట్రలైజ్డ్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఫాం-12 సమర్పించిన వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశముంటుదన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆర్వో నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను పొంది అక్కడే ఓటేయాలని ఆయన సూచించారు. ఈనెల 4, 6 తేదీల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు వారికి కేటాయించిన నియోజకవర్గంలో ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పొందే వారిలో ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు జిల్లాలకు చెందిన పీవోలు, ఏపీవోలు వారి శిక్షణ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయాలని సూచించారు. సరిహద్దు జిల్లాలు కానివారు, ఇతర జిల్లాలకు చెందిన పీవోలు, ఏపీవోలు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెంట్రలైజ్డ్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటేయాలని ఆయన సూచించారు. ఇతర నియోజకవర్గంలో ఓటు ఉన్నవారికి ఆర్వో నుంచి ముందుగానే పోస్టల్ బ్యాలెట్‌ను సమీకరించి, అందిస్తామన్నారు. ఓపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బంది(పోలీస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, వెబ్ క్యాస్టింగ్, మైక్రోఅబ్జర్వర్లు) వారికి ఓటు ఉన్న నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈనెల 4, 5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయాలని ఆయన సూచించారు.

ఫెసిలిటేషన్ కేంద్రాలు ఇవే..

- తిరువూరు నియోజకవర్గం(69)లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తిరువూరు
- విజయవాడ పశ్చిమ (79)లో కేబీఎన్ కళాశాల, వన్‌టౌన్, విజయవాడ
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం (80)లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, మొగల్రాజపురం, విజయవాడ
- విజయవాడ తూర్పు నియోజకవర్గం (81)లో ఆంధ్రా లయోలా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కాలనీ, విజయవాడ
- మైలవరం నియోజకవర్గం(82)లో డాక్టర్ లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, మైలవరం
- నందిగామ నియోజకవర్గం(83)లో కేవీఆర్ డిగ్రీ కళాశాల, నందిగామ.
- జగ్గయ్యపేట నియోజకవర్గం(84)లో జేవీజే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జగ్గయ్యపేట

బీజేపీ నుంచి కొర్రప్రోలు సహా నలుగురి బహిష్కరణ

విజయవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి)/గన్నవరం: బీజేపీ నియామవళికి వ్యతిరేకంగా పనిచేస్తున్న పలువురిని సస్పెండ్ చేసినట్టు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కురుమద్దాలి ఫణికుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. పార్టీ నియామవళిని వ్యతిరేకించి అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి, సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో రాష్ట్ర అధ్యక్షురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేసి, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు కొర్రప్రోలు శ్రీనివాసరావును పార్టీ నుంచి బహిష్కరించినట్టు తెలిపారు. ఆయనతో పాటు జె.రవికుమార్, ఎం.సతీష్‌కుమార్, ఎస్.విజయదుర్గలను పార్టీ నుంచి బహిష్కరించినట్టు చెప్పారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో భాగంగా గన్నవరం నియోజకవర్గంలో యార్లగడ్డ వెంకట్రావు గెలుపు కోసం బీజేపీ విశేష కృషి చేస్తుందన్నారు. కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యమని బీజేపీ సీనియర్ నేత నాదిండ్ల మోహన్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ విద్యుత్ సెల్ కన్వీనర్ లక్ష్మంరాజు మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

రూ.1.16లక్షల మద్యం స్వాధీనం

వీరులపాడు, మే 2: తెలంగాణ నుంచి ఆటోలో అనధికారికంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం తెల్లవారుజామున పల్లంపల్లి గ్రామశివారులో స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ రవికిరణ్ తెలిపారు. మధిర మండలం చిలుకూరులో ఓ బెల్ట్ షాపులో 908 సీసాల మద్యం కొనుగోలు చేసి ఆటోలో షేక్ అహ్మద్ తరలిస్తుండగా తనిఖీ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నామని, షేక్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.16 లక్షలు ఉంటుందన్నారు. సీఐ చంద్ర శేఖరరావు, ఎస్సై మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు

ఎ.కొండూరు, మే 2: కారును అతివేగంగా వచ్చిన లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ సమీపంలోని మలుపు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన నలుగురు కారులో భద్రాచలం బయలుదేరారు. దీప్లానగర్ సమీపంలోని మలుపు వద్దకు రాగానే కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఆవుల రామకృష్ణారెడ్డి(38) అక్కడక్కడే మృతి చెందగా, బాలకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్ కృష్ణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.40

టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతల ప్రచారం



భవానీపురం, మే 2 : విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరిలను అఖండ మెజార్టీతో గెలిపించడంలో మైనార్టీలు కీలక పాత్ర పోషించాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఖాజా, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ బాజీ షరీఫ్‌లు పిలుపునిచ్చారు. హజ్రత్ గాలిబ్ షహీద్ దర్గా, అవుట్ ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. షేక్ ఇమ్రాన్, షేక్ షోయబ్, అహ్మద్, షేక్ అఖారుద్దీన్, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌కు ఉద్యోగులు ఓడిస్తారనే భయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ప్రచారం నిర్వహిస్తున్న గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, మే 2: ఉద్యోగస్తులంతా జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు కల్పించకుండా ఏ విధంగా వారిని తప్పించాలా అని జగన్ అనేక రాకాలుగా పిల్లిమొగ్గలు వేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. గురువారం సాయంత్రం 15వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఓడిస్తారనే భయంతో జగన్ వణికి పోతున్నారని, తమ ప్రచారంలో మహిళలు వచ్చి జగన్‌ను ఓడించి త్వరగా పంపించి వేయాలని, లేని పక్షంలో తాము బతకలేమంటూ చెబుతున్నారన్నారు. 8న విజయవాడలో ప్రధాని మోదీ రోడ్ షో చేయనున్నారని, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, బొప్పన భవకుమార్ పాల్గొన్నారు.

మహిళల సాధికారత టీడీపీ లక్ష్యం

పటమట : మహిళల సాధికారిత, రక్షణపై చంద్రబాబునాయుడు దృష్టి పెట్టారని, బీజేపీ, జనసేన, టీడీపీ కూటమికి ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. గురువారం 9వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలు ప్రతి కుటుంబానికి ఎంతో మేలు చేసేవిగా ఉన్నాయని, మహిళలను మరింత శక్తి వంతులను చేసే విధంగా సంక్షేమ పథకాలు ఉన్నాయని తెలిపారు. నల్లూరి భవానీశంకర్ రోడ్డు, వెంకటరత్నం మాస్టారు వీధి, ఎయిర్‌టెల్ ఆఫీస్‌రోడ్డు, రాఘవనగర్‌ల్లో గద్దె హేమాన్షితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్,ఎంపీగా కేశినేని శివనాథ్‌లను అఖండ మెజార్టీలతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ గాంధీ, డివిజన్ అధ్యక్షులు దేవేంద్ర, అన్నాబత్తుల శ్రీదేవి, బాలి, చిలకలపూడి నరసింహా, మండవ బుజ్జి, మొటపర్తి వరలక్ష్మి, భవానీలు పాల్గొన్నారు.

7వ డివిజన్‌లో ప్రచారం

మొగల్రాజపురం: 7వ డివిజన్ మధుగార్డెన్ ఏరియాలో బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌కు, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు ఓటు వేయాలని కోరుతూ గద్దె క్రాంతి, రాజేష్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రానికి జరిగిన అన్యాయం గుర్తించామని సమర్థుడైన నాయకుడు చంద్రబాబు మళ్లీ రావాలని జనం ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్‌చంద్ర, దోమకొండ అశోక్, దోమకొండ జ్యోతి రత్నాకర్, దయాల శిరీషా గాంధీ, పెనుగొండ శ్రీను, పెరవలి శివ కుమార్, అన్నే వసంత రాయలు, రేపాకుల శ్రీనివాస్, మాడల మల్లికార్జున, శివలక్ష్మి, జాస్తి సుష్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి



సుజనా చౌదరిని సత్కరించిన ముస్లిం సంఘాల నాయకులు

విద్యాధరపురం, మే 2: మైనార్టీలలో తాను ఒకడిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కూటమి బలపరిచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. గురువారం కానూరులోని ఆయన నివాసంలో ముస్లిం సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ముస్లిం సంఘాల నేతలు సత్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మాట్లాడారు. మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూడబోనని చెబుతూ పశ్చిమలో తాను గెలిస్తే చేపట్టబోయే పనుల గురించి వివరించారు. నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించుకుని నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తాను మాటలు చెప్పే వాడిని కాదని, చేతల మనిషినని, తనను గెలిపిస్తే పనిచేసి చూపిస్తానని భరోసా ఇచ్చారు. ముస్లిం సమాజం ఆర్థికంగా ఎదిగి అందరికి ఆదర్శంగా ఉండేలా అండగా ఉంటామన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, బీజేపీ, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్మాది జగన్‌ను తరిమికొడదాం: కేశినేని శ్రీదేవి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేశినేని శ్రీదేవి

విద్యాధరపురం, మే 2: పదిమంది సహకారంతో ఉన్మాది జగన్‌ను తరిమికొడదామని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సోదరి కేశినేని శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం 42వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీపురం ప్రాంతంలోని వెలంపల్లి కాలనీలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులు పలువురు మంచినీటిలో మురుగునీరు కలవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు భారీ మెజారిటీతో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. షేక్ ఆశా, చెన్నుపాటి ఉషారాణి, శివాజీ ముదిరాజ్, పెద్ది సతీష్, పగడాల కృష్ణ, తిరుపతి అనూష, స్రవంతి, హనుమంతరావు తదితరులతో పాటు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం

● తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విద్యాధరపురం కొండప్రాంతవాసులు ● పట్టించుకోని అధికారులు

విద్యాధరపురం, మే 2: రాష్ట్రంలో ఒకపక్క వేసవి కారణంగా అధిక ఉష్ణోగ్రత ఉంటే విద్యాధరపురం కొండప్రాంతంలో పగలు, రాత్రి అని తేడా లేకుండా తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోగా కరెంట్ పోతే మమ్మల్ని ఏమి చేయమంటారంటూ విసుక్కుంటున్నారని పలువురు కొండప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధి నుంచి గుప్తా సెంటర్ వరకు కొండప్రాంతంలో రెండు రోజుల నుంచి తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. బుధవారం రాత్రి 10నుంచి అర్ధరాత్రి 1.30 వరకు ఆరు దఫాలుగా విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. దీనిపై పలువురు స్థానికులు రామరాజ్యనగర్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా డ్యూటీలో ఉన్న సిబ్బంది పట్టించుకోకపోగా విసుక్కున్నారని కొట్టేటి కోటయ్య వీధిలోని పలువురు వృద్ధులు ఆరోపించారు. గురువారం మధ్యాహ్నం 2.20 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొండప్రాంతంలో అధికంగా రేకుల షెడ్డులు ఉండడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళ కొండప్రాంత ప్రజల ఇబ్బందులు చెప్పాల్సిన పనేలేదు. వన్‌టౌన్, గట్టువెనుక తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండగా కొట్టేటి కోటయ్య వీధి నుంచి గుప్తా సెంటర్ వరకు కొండప్రాంతంలో ఎందుకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వాటర్ ప్లాంట్‌కు

ఎక్కువ ఓల్టేజ్ వినియోగించడం వలనేనా..?

కొండ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కొట్టేటి కోటయ్య వీధిలోని ఓ వాటర్ ప్లాంటే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటర్ ప్లాంట్‌తో పాటు పాలబూత్ కూడా ఉండడం వల్ల వాటి నిర్వాహకుడు అధికంగా విద్యుత్ వాడడంతో కొండప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై గతంలో కూడా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని చెబుతున్నారు. దీనిపై వివరణ అడగడానికి సంబంధిత విద్యుత్ స్టేషన్ ఏఈని ఫోన్‌లో సంప్రతించగా స్పందించలేదు.

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి

విద్యాధరపురం, మే 2: రానున్న ఎన్నికల్లో కూటమి బలపరచిన ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరిలను భారీ మెజారిటీతో గెలిపించాలని 40వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు పేర్కొన్నారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్న వెంకట సుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పల్లంటి గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో గాంధీబొమ్మ రోడ్డులోని సుమారు 150 కుటుంబాలని కలిసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

రాధానగర్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం

పాయకాపురం, మే 2 : 63వ డివిజన్‌లోని రాధానగర్‌లో టీడీపీ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొండా ఉమా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. లబ్బా వైకుంఠం, కొండ, పైడి తులసి, పాల్గొన్నారు.

ఎస్‌ఓఎస్ కోర్సులతో ఫార్మశీ విద్యార్థులకు ఉపాధి

మొగల్రాజపురం, మే 2: మందుల తయారీ కంపెనీలతో పాటు సాఫ్ట్‌వేర్ తరహా ఉద్యోగాలకు ఫార్మశీ విద్యార్థులకు అవకాశం ఉందని అమెరికాకు చెందిన బేయర్ ఫార్మాకంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఇంకుర్తి వెంకట్ చెప్పారు. కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో ఫార్మశీ రంగంలో నూతన ఉపాధి అవకాశాలు అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫార్మశీ విద్యార్థులు ఎస్‌వోఎస్ వంటి అనుబంధ కోర్సులు చేయాలని, దీని వల్ల దేశ విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

గవర్నర్‌పేట, మే 2: వైసీపీకి బాగా పట్టున్న 24వ డివిజన్ న్యూ గిరిపురం ప్రాంతానికి చెందిన వైసీపీ నేతలు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీకి చెందిన మొండితోక స్వామి, నీలం సునీల్‌కుమార్, బుద్ధ నరేష్‌కుమార్, నీలం సందీప్‌ల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. **పాయకాపురం :** పాయకాపురం 60వ డివిజన్‌కు చెందిన సీపీఐ నేతలు గురువారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా, సీపీఐ నేత కె. రామరాజు, యూ. ప్రసాద్, నాగేశ్వరరావు సహా పలువురికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు కంచి ధన, మైనంపాటి సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పండి : బొండా ఉమా



రోడ్ షోలో బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, మే 2: గత తెలుగుదేశం హయాంలో తాను అధికారంలో ఉండగా సెంట్రల్‌లో జరిగిన అభివృద్ధే తప్ప వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అయోధ్యనగర్ ఆర్చ్ వద్ద నుంచి రామలింగేశ్వరనగర్ వరకూ ఎన్నికల ప్రచార రోడ్ షోను గురువారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో చేసి పేదల్ని ధనికులుగా చేయగల సత్తా ఒక్క నారా చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. స్థానిక టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

● 33వ డివిజన్ సత్యనారాయణపురం తిరుమల శెట్టి వారి వీధి, అబ్బురి వారి వీధిలో బొండా సిద్దార్థ గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని చెప్పారు. 33వ డివిజన్ ఇన్‌చార్జ్ గార్లపాటి విజయ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చామర్తి రవిబాబు, కోశాధికారి చిలువేరు శ్రీను, పొట్లూరి కృష్ణ ప్రసాద్, ధనలక్ష్మి, తంగిరాా లక్ష్మి, నిర్మల చౌదరి, యాబాజి మహేష్, కల్యాణి, సుబ్బారావు, నాగయ్య, టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



భవానీపురంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వన్‌టౌన్, మే 2: భవానీపురం పోలీసు స్టేషన్, సూర్యారావుపేట పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కే శ్రీనివాసరావు, హరికృష్ణల ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు మేమున్నామని గుర్తు చేస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పశ్చిమ డివిజన్ ఏసీపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కుమ్మరిపాలెం సెంటర్ నుంచి సితార జంక్షన్ వరకు, సౌత్ డివిజన్ ఏసీపీ రత్నరాజు ఆధ్వర్యంలో దుర్గాపురం. సంజయ్‌కాలనీ, మ్యూజియం రోడ్డులలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

అజిత్‌సింగ్‌నగర్ : అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బుడమేరు మధ్య కట్ట ప్రాంతంలో పోలీసులు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నార్త్‌జోన్ ఏసీపీ దుర్గాప్రసాద్ మధ్య కట్ట ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వాక్ చేశారు.

టీడీపీ మేనిఫెస్టో ప్రకటనతో ఓటర్లలో ఉత్సాహం

రాణిగారితోట, మే 2: టీడీపీ మేనిఫెస్టో ప్రకటించిన తరువాత ప్రజల్లో మరింత ఉత్సాహం పెరిగి టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వెసేందుకు ఎన్నికల రోజు కోసం ఎదురుచూస్తున్నారని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు.

డివిజన్‌లో గురువారం స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశినేని శివనాథ్ అలియాస్ కేశినేని చిన్ని.. రెండేళ్లుగా ఎన్టీఆర్ జిల్లాలో ఈ పేరు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు విజయవాడ సిటింగ్ ఎంపీ కేశినేని నాని సోదరుడిగా ప్రజలకు పరిచయం అయిన చిన్ని నేడు పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్ల నిర్వాహకుడిగా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే వ్యక్తిగా, అనారోగ్యం బారిన పడిన మారుమూల పల్లెల్లోని వారి కోసం వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్న నాయకుడిగా సుపరిచితం. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న సొంత సోదరుడు కేశినేని నానిని ఎదుర్కొనేందుకు సై అంటున్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ప్రచారం జరుగుతున్న తీరు, విజయవాడ పార్లమెంటు పరిధిలో కూటమి బలాబలాలు తదితర అంశాలపై ఆయన మాట్లాడిన వివరాలివి..

విజయవాడ - ఆంధ్రజ్యోతి

- ప్రజలకు బిక్షం వేసి పబ్బం గడుపుకొనే వ్యక్తి జగన్
- ప్రజాధనాన్ని.. సహజవనరులను లూఠీ చేసేశాడు
- నానిలో నాయకుడికి ఉండాల్సిన లక్షణాలే లేవు
- విజయవాడ ఎంపీతోపాటు 7 అసెంబ్లీలు గెలిపిస్తా
- చంద్రబాబుకు కానుకగా ఇస్తా
- 'ఆంధ్రజ్యోతి'తో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్



సంక్షేమంతోపాటు అభివృద్ధీ అవసరమే..!

ప్రచారం ఎలా సాగుతోంది..?

విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా నేను పోటీ చేస్తున్నాను. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నాను. ఐదేళ్ల వైసీపీ పాలన పట్ల అన్నివర్గాల్లో తీవ్రమైన వ్యతిరేకత గూడు కట్టుకుని ఉంది. పథకాల పేరుతో డబ్బులు అలా ఇచ్చి అంతకు రెట్టింపు కష్టాన్ని తమ నుంచి వైసీపీ ప్రభుత్వం దోచుకుందనే భావన ప్రతి ఒక్కరిలోనూ ఉంది. జగన్ ప్రభుత్వం ఏ ఒక్క వర్గాన్ని సంతృప్తి పర్చలేకపోయింది. కేవలం ప్రజాధనాన్ని.. రాష్ట్రంలోని సహజవనరులను దోచుకోవడంపైనే ఆయన దృష్టి పెట్టారు. ప్రజలకు బిక్షం వేసి పబ్బం గడుపుకొందామనే ఆలోచన ఉన్న ఏ నాయకుడూ చరిత్రలో నిలిచిన దాఖలాలు లేవు. సంక్షేమం, అభివృద్ధి ఈ రెండు ఉంటేనే ఏ రాష్ట్రమైనా ప్రగతిపథంలో నడుస్తుంది. ఈ విషయాన్ని ప్రచారంలో మేం ఓటర్లకు వివరించబోతుంటే వారే మాకు చెబుతున్నారు. ప్రజలను తక్కువ అంచనా వేయడం మూర్ఖత్వమే అవుతుంది.

విజయవాడ పార్లమెంటు అభివృద్ధిపై మీ ఆలోచనలు ఏమిటి?

విజయవాడ పార్లమెంటు పరిధిలో అభివృద్ధి చెందిన విజయవాడ నగరం ఉంది. అదే సమయంలో అత్యంత వెనుకబడిన తిరువూరు, ఎ.కొండూరు నియోజకవర్గాల్లో తండాలున్నాయి. విజయవాడ నగరానికి వస్తే.. నగరంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటాం. నగరం రెండు ప్రధాన పరిశ్రమలపై అధారపడి ఉంది. ఒకటి వాణిజ్యం, రెండు ఆటోమొబైల్. ఈ రెండు రంగాలపై ఆధారపడిన ప్రతి ఒక్కరి సమస్యలపై దృష్టిపెడతా. రాజధాని ప్రాంతం కావడంతో భవన నిర్మాణ రంగం కూడా బాగా అభివృద్ధి చెందుతోంది. కానీ జగన్ పాలన వచ్చిన తరవాత ఈ కార్మికులు రోడ్డునపడ్డారు. ఈ రంగాన్ని గాడిన పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆటోమొబైల్ రంగంతో మా కుటుంబానికి దగ్గర సంబంధం ఉంది. నగరంలో ఆటోమొబైల్ రంగంలో 4 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. వీరి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చేస్తాం. మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో తాగు, సాగునీటి సమస్యలు ఎక్కువగా మా దృష్టికి వచ్చాయి. వాటి పరిష్కారానికి కృషి చేస్తా. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తాం. ఎ.కొండూరు మండలంలో కిడ్నీవ్యాధి నివారణకు ముందుగా తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెడతా.

ప్రచారానికి వెళ్తుంటే ప్రజలు ఇవే కోరుతున్నారు..

మీ పార్లమెంటు పరిధిలో నేతల సమన్వయం ఎలా ఉంది?

విజయవాడ రాజకీయ రాజధాని. అలాంటి చోట నాయకులు ఎక్కువగా ఉంటారు. అయితే టీడీపీలో అందరు నాయకులను సమన్వయం చేసుకుంటూ టీం టీడీపీగా కలిసి ముందుకెళుతున్నాం. ముఖ్యంగా పశ్చిమలో నలుగురు పెద్ద నేతలు సీటు ఆశించారు. కానీ సమీకరణాల వల్ల వారికి పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వలేకపోయింది. వారందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నాం. పశ్చిమలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. ఆయన సహకారంతో ఎక్కడా సమన్వయలోపం లేకుండా అడుగులు వేస్తున్నాం. విజయవాడ పార్లమెంటు పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలందరినీ కలుపుకొని గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. అందరి సహకారంతో విజయవాడ పార్లమెంటు స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

ప్రత్యర్థిగా మీ సోదరుడు ఉండటం ఇబ్బంది లేదా?

రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరం ప్రత్యర్థులుగా బరిలో నిలవాల్సి వచ్చింది. మొదటి నుంచి మా కుటుంబం టీడీపీ కుటుంబం. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి కేశినేని నాని ఎంపీగా గెలుపొందారు. 2024లో టీడీపీ నుంచి నేను పోటీలో ఉన్నా. నానితో నాకు ఎలాంటి విభేదాలు లేవు. ప్రతి కుటుంబంలో ఉండే విధంగా ఏవో కొన్ని ఆస్తులకు సంబంధించి అభిప్రాయభేదాలు తప్ప వేరే ఎలాంటి విభేదాలు లేవు. వాటిని పార్టీతో ముడిపెట్టడం దారుణం. నాని కేవలం తన దుందుడుకు వైఖరి తోనే రాజకీయంగాను.. వ్యక్తిగతంగాను నష్టపోయారు. సొంత తమ్ముడి భార్యపై కేసు పెట్టారు. తల్లిలాంటి పార్టీపైన, పార్టీ అధినేతపై నోటికొచ్చింది మాట్లాడారు. ఓ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలివి కావు. త్వరలోనే ఆయన ప్రజాజీవితం నుంచి కనుమరుగైపోవడం ఖాయం.

కూటమి మేనిఫెస్టో
ఒక అద్భుతం

కంచికచర్ల, మే 2: టీడీపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో (ఎన్నికల ప్రణాళిక) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు తరతమ బేధం లేకుండా సమాజంలోని అందరికీ ప్రయోజనం కల్గించేలా ఉంది. రైతులకు, గృహిణులకు, మహిళలకు, నిరుద్యోగులకు, యువతకు, వృద్ధులు, వికలాంగులకు, ఇతరత్రా అన్ని వర్గాల వారికి టీడీపీ కూటమి మేనిఫెస్టో ఎంతో మేలు చేస్తుందని చెపుతున్నారు. మేనిఫెస్టో పేర్కొన్న వివిధ అంశాల గురించి ముఖ్యంగా పల్లెల్లో రచ్చబండ వద్ద విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 వంట గ్యాస్ సిలెండర్లు, నెలకు రూ. 1500 ఆర్థికసాయం అంశాల పట్ల మహిళల్లో సానుకూలధోరణి వ్యక్తమవుతోంది. ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపుతుందని కార్మికుల సంఘం నేత సుబ్బారావు మేస్త్రీ పేర్కొన్నారు. వర్గాల వారీగా, అంశాల వారీగా ఎవరెవరికీ ఎంత మేలు సమకూరుతుందన్న విషయమె వైసీపీ మేనిఫెస్టోతో బేరీజు వేసుకుని లెక్కలు వేస్తున్నారు. కూటమి మేనిఫెస్టోతో పోల్చితే వైసీపీ మేనిఫెస్టో తేలిపోయిందంటున్నారు. కూటమి మేనిఫెస్టో ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా ఉందని ఓటర్ల నుంచే ఎక్కువగా వినబడుతోందని టీడీపీ సీనియర్ నేత కోట వీరబాబు చెప్పారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి మేనిఫెస్టో ఒక వరంలాంటిదని, రాక్షస పాలన సాగిస్తున్న జగన్‌ను ఇంటికి పంపించటం ఖాయమని మరో సీనియర్ నేత ఆర్ఎస్‌పీ బాబు పేర్కొన్నారు.

సాగుకు వెన్నుదన్ను



నెమలపురి అమ్మారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, నక్కలంపేట

ప్రతి రైతుకూ ఏటా రూ.20వేలు సాయం అందిస్తామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రైతుల రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కింది. రైతుల భూములకు రక్షణ లేకుండా చేసిన ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామనటం అభినందనీయం.

మహిళలకు ఎంతో మేలు



మాచవరపు తనూజ, టీచర్, పరిటాల

టీడీపీ కూటమి మేనిఫెస్టో మహిళలకు ఎంతో మేలు చేయనుంది. ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500 సాయం వల్ల మహిళల ఇబ్బందులు తొలగి, ఆర్థికంగా భరోసా లభిస్తుంది.

డ్వాక్రా సంఘాలకు చేయూత



మూరకొండ పాప, డ్వాక్రా మహిళ, గని ఆత్కూరు.

టీడీపీ ప్రభుత్వంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డ్వాక్రా ఉద్యమం వైసీపీ పాలనలో నీరుగారిపోయింది. రూ.3లక్షల రుణాలకు వడ్డీ లేనదన్నారు. ఎక్కువ మందికి వడ్డీ రాయితీ అందలేదు. టీడీపీ కూటమి రూ.10లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు ఇస్తామనటం చాలా సంతోషం.

అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం



ఎస్కే బాజీ, డ్రైవర్, కంచికచర్ల

నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల భృతి, ఉచిత ఇసుక విధానం, చంద్రన్న బీమా సొమ్ము రూ. 5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపు, డ్రైవరకు ఏటా రూ.15వేల సాయం, ఉచిత ఇసుక విధానం, అన్న క్యాంటీన్లతో పాటుగా మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలతో అన్ని వర్గాలకు ఎంతో మేలు.

దోపిడీ @ గడ్డం గ్యాంగ్

ఇసుక, మట్టి మింగేశారు.. క్యాసినో పేరుతో కోట్లు కుమ్మేశారు..

జగనన్న కాలనీ మెరక పేరుతో కోట్లు కుమ్మేశారు..

గుడివాడ మండలం మల్లాయిపాలెంలో జగనన్న కాలనీని మెరక పేరుతో గడ్డం గ్యాంగ్ కోట్లు కొట్టేశారు. 178.3 ఎకరాల మెరకకు ఉపాధి హామి నిధులు రూ.28కోట్లు మంజూరయ్యాయి. ఈ కాంట్రాక్టును గడ్డం గ్యాంగ్ చేపట్టింది. ముఖ్యంగా ఎమ్మెల్యే నానికి చెందిన ముఖ్యమైన ముగ్గురు వ్యక్తులు మట్టి తోలకాల్లో కీలకపాత్ర పోషించారు. నిబంధనల మేరకు నాలుగడుగుల మెరక చేయాల్సి ఉండగా అడుగు ఎత్తు కూడా మెరక చేయలేదు. టీడీపీ నేతల ఫిర్యాదుతో మైనింగ్ అధికారులు పోసిన మట్టి ఎండలకు ఎండి, వానకు తడిసి మట్టి కొట్టుకుపోవడంతో మెరక ఎత్తు తగ్గిందని గమ్మత్తైన సమాధానమిచ్చారు.

మెరక లేక మునిగిన జగనన్న కాలనీ

గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తుఫాను ధాటికి పక్కనున్న పంటచేలతో పాటు జగనన్న కాలనీ పూర్తిగా మునకేసింది. దాదాపుగా 15 రోజుల పాటు కాలనీ నీళ్లలో నానింది. రెండు నెలల పాటు కాలనీలో రహదారులు, ఖాళీ స్థలాలు వర్షపు నీటిలో మునిగే ఉన్నాయంటే మెరక తోలకంలో ఎంత కక్కుర్తి పడ్డారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



తుఫానులో నీట మునిగిన జగనన్న కాలనీ (ఫైల్)

ప్రజల సొమ్ములను దోపిడీ చేయాలంటే ప్రత్యేకమైన స్కిల్స్ ఉండాలి. అది అందరికీ రాదు, నప్పదు. ప్రపంచంలో ఎన్నిరకాల దోపిడీలు చేయవచ్చో గడ్డం గ్యాంగ్ అన్నీ చేసి చూపించింది. సహజ వనరుల దగ్గర నుంచి ప్రజల జేబుల్లోని సొమ్మును కొట్టేయడం ఈ గ్యాంగ్‌కు వెన్నతో పెట్టిన విద్య. నియోజకవర్గంలో మట్టి దోపిడీ, జిల్లాలో ఇసుక రీచ్‌ల దగ్గర నుంచి పేకాట శిబిరాలు, క్రికెట్ బెట్టింగ్ మాఫియా, గంజాయి అమ్మకాలు అన్నీ గడ్డం గ్యాంగ్ కనుసన్నల్లో జరుగుతాయి. - గుడివాడ



జగనన్న కాలనీ మెరక పేరుతో తవ్విన బొమ్ములూరు శివారు పంచాయితీ చెరువు

చెరువులు, కాలువలనూ వదల్లేదు..

గడ్డం గ్యాంగ్ రంగంలోకి దిగి మండల పరిధిలోని పంచాయతీ చెరువుల నుంచి ప్రైవేటు చెరువుల వరకు మట్టిని జగనన్న కాలనీకి తరలించారు. దీంతో చెరువుల వెంబడి ఉన్న పొలాలు కోతకు గురవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖకు చెందిన కాలువలను సైతం వదలలేదు. జగనన్న కాలనీకి అనుకుని ఉన్న అచాలమ్మకోడును తాటిచెట్టు లోతు తవ్వి మట్టిని తరలించారు. కనీసం పశువులను దింపాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. ఎండాకాలంలోనూ కాలువ ఎండటం లేదంటే ఎంత లోతు తవ్వారే ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

క్యాసినో పేరుతో..

2021 సంక్రాంతికి నిర్వహించిన జాతీయ స్థాయి ఎడ్ల పందేల పోటీల్లో గోవా సంస్కృతిని కొడాలి నాని గుడివాడకు పరిచయం చేశారు. క్యాసినో నిర్వహించి అభాసుపాలయ్యారు. కేవలం ఎంట్రీ ఫీజే రూ.10వేలు పెట్టి దోచుకున్నారు. క్యాసినో ముసుగులో ప్రజల నుంచి సుమారు రూ.200కోట్లు కొట్టేశారు.

పక్క రాష్ట్రాలకు తరలిన ఇసుక

పమిడిముక్కల మండలం లంకపల్లి ఇసుక క్వారీని గుప్పెట్లో పెట్టుకుని ఇసుక దోపిడితో కోట్లు కూడపెట్టారు. గడ్డం గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారు. ఇద్దరు గాంగ్ మెంబర్స్ నిర్మించిన గృహాలను చూస్తే ఏ మేరకు దోపిడీ జరిగిందో తెలుస్తుంది.

పేకాట శిబిరాలకు ఫేమస్

ప్రతి ఏడాది సంక్రాంతి సంబరాల ముసుగులో భారీగా పేకాట నిర్వహిస్తున్నారు. పోలీసులకు తెలిసినా ఎవరి సూట్‌కేసు వారికి చేరడంతో గమ్మునున్నారు. ఇటీవల నందివాడ మండలం తమిరిశ- దొండపాడు మధ్యలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్పెషల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కొడాలి నాని తమ్ముడు చిన్ని దొరికాడని, పోలీసులు కాళ్లు పట్టుకుని విడిపించుకున్నాడని టీడీపీ నేతలు ఆరోపించారు. నియోకవర్గవ్యాప్తంగా భారీగా పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారు. నాని ముఖ్య అనుచరుల్లోని నలుగురు వ్యక్తులు ఈ వ్యవహారాన్ని నడుపుతారని నియోజకవర్గమంతా కోడై కూస్తోంది.

బెట్టింగ్ మాఫియాకు అండదండలు

క్రికెట్ బెట్టింగ్ మాఫియాకు నాని అండదండలు మెండుగా ఉన్నాయని వైసీపీ నేతలే బాహాటంగా పేర్కొంటున్నారు. ప్రచారం ఖర్చును ఈ మాఫియానే భరిస్తోందని టాక్.

గంజాయికి కేంద్రబిందువు

గంజాయి అమ్మకాలకు గుడివాడ కేంద్ర బిందువుగా మారింది. ఎక్కడపడితే అక్కడ గంజాయి దొరికే పరిస్థితి ఉందంటే అమ్మకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ గంజాయి అమ్మకాలను గడ్డం గ్యాంగ్ నిర్వహిస్తోందని పట్టణంలో వినికిడి.

మళ్లీ జగన్‌రెడ్డే వస్తే భూములపై
హక్కులుండవా..?

తరతరాల నుంచి వారసత్వంగా అనుభవిస్తున్న భూములపై హక్కులను కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తోందా అంటే ప్రభుత్వ చర్యలను చూస్తే అవుననే సమాధానం వస్తోంది. వైసీపీ సర్కార్ తీసుకొస్తున్న చట్టాలు, చేపడుతున్న చర్యలు ఇపుడు రైతులు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. టీడీపీ సానుభూతి రైతులే కాదు వైసీపీ రైతులు సైతం లోలోన జగన్ చట్టాలతో భయపడుతున్నారు. రూపాయి.. రూపాయి కూడబెట్టుకుని కొన్న భూములు రేపు చిక్కుల్లో పడితే తమ భవిష్యత్ ఏంటని మదనపడుతున్నారు.

- తోట్లవల్లూరు



కుమ్మమూరు పొలంలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పేరుతో సర్వేరాళ్లు



తోట్లవల్లూరులో రైతు పట్టాదారు పాసు పుస్తకంపై సీఎం జగన్ ఫొటో

- రైతు పట్టాదారు పాసు పుస్తకంపై జగన్ ఫొటో
- పొలాల్లో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష సర్వేరాళ్లు
- మరోవైపు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ చట్టం
- ఈ కొత్త చట్టాలతో భూములన్నీ సర్కార్ చేతిలోకే..!
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పంట పొలాల్లో భూరక్ష సర్వేరాళ్లు

తోట్లవల్లూరు మండలంలో కుమ్మమూరు, పెనమకూరు, గుర్విందపల్లి, గరికపర్రు గ్రామాల్లో రీ సర్వే పేరుతో 4వేల ఎకరాల్లో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష సర్వేరాళ్లను రైతులకు తెలియజేయకుండానే రెవెన్యూ సర్వే అధికారులు పంట పొలాల్లో ఏర్పాటు చేశారు. ఏ రైతుకీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా సర్వేరాళ్లను వేశారు. ప్రభుత్వం తమ సొంత భూములన్నట్టుగా సీఎం పేరుతో ఈ సర్వేరాళ్లను వేయటంతో రైతులు ఎవ్వరినీ ప్రశ్నించలేని పరిస్థితి దాపురించింది.

పాసు పుస్తకాలు జగన్‌వేనా.. మావి కావా..?

భూ యజమానికి పట్టాదారు పాసుపుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో అందించేవారు. ఇపుడు సీఎం జగన్ ఆ విధానానికి తూట్లు పొడిచేశారని రైతులు చెపుతున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలకు దరఖాస్తు చేసుకుంటే వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పేరుతో సీఎం జగన్ ఫొటో, నవరత్నాల లోగోతోను పుస్తకాలిచ్చారని రైతులు తెలిపారు. పుస్తకంపై జగనన్న భూహక్కు పత్రం అని పెద్దగా ముద్రించి పట్టాదారు పాసుపుస్తకం అని కనీకనిపించకుండా చిన్న అక్షరాలను ముద్రించారు. అంటే భూముల్లో జగనన్న సర్వేరాళ్లు వేయటం ఒక ఎత్తు కాగా పట్టాదారు పా సుపస్తకాలు సైతం జగన్ పే రుతోనే ఇవ్వటం మరొక ఎత్తని రైతులు భయపడుతున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రైతుల గుండెల్లో రైళ్లు

ఈ పరిస్థితుల మధ్య ల్యాండ్ టైట్లింగ్ చట్టం తేవటం రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తోంది. ఈ చట్టంతో భూమి హక్కులుంటాయా పోతాయో తెలియకుండా ఉందని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వివాదాలు కావాలని సృష్టించి భూమిని హస్తగతం చేసుకుంటే తామెవరిని ఆశ్రయించాలని, కోర్టులకు వెళ్లే వీలులేదన్న వార్తలొస్తున్నాయని రైతులు భయపడుతున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని చెపుతున్న వైసీపీ పెద్దలు చట్టం మాకొద్దని ఎందుకు వ్యతిరేకించటం లేదని ప్రశ్నిస్తున్నారు.

జగనొస్తే భూమిపై హక్కులుండవు

నెక్కలపూడి మురళీ, మండల తెలుగురైతు అధ్యక్షుడు

ఈ ఎన్నికల్లో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఇక రైతులకు తమ భూములపై హక్కులుండవు. భూముల్లో జగన్ పేరుతో సర్వేరాళ్లు, పాసుపుస్తకాలు జగన్ పేరుతో, ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రాష్ట్రంలోని భూములన్నీ సర్కార్ కిందకు వచ్చేటట్టు చాపకింద నీరులా చేస్తున్నారు. సొంతంగా పండించుకునే అర్హత ఉండదు. రాజధానికి భూములిచ్చిన రైతులనే నాశనం చేశాడు. ఇపుడు భూములన్నీ తాకట్టు పెట్టేసుకున్నా అడిగే హక్కు లేకుండా జగన్ చేస్తున్నాడు.

23 లక్షల కార్డులు కట్!

(మొదటి పేజీ తరువాయి)

ముడిపడిన పథకాలూ దూరమైనట్లే!

అసలేం జరిగింది?... ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య పెంచాలని చూస్తుంది. జనాభా, కుటుంబాల సంఖ్య పెరుగుతుంది కాబట్టి... లబ్ధిదారుల సంఖ్య కూడా పెరగాలి. కానీ, జగన్ ప్రభుత్వం మాత్రం రివర్స్‌లో వీలైనంత మందికి కోత పెట్టాలని ఆలోచిస్తోంది. ఇప్పటికే 'ఆరు షరతుల' చట్రంలో అనేకమందికి పథకాలు దూరం చేశారు. బటన్ నొక్కే ప్రతిసారీ ఆయా పథకాలకు వీరు అర్హులు కాదంటూ అర్థంలేని కారణాలు చూపించి పక్కన పెట్టేశారు. ఎవరెవరికి ఎందుకు రద్దు చేస్తున్నారో గ్రామ సచివాలయాల నోటీసు బోర్డుల్లో రాసేవారు. ఇలా పదుల్లో, వందల్లో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడం వల్ల పెద్ద ఉపయోగం లేదని జగన్ భావించినట్లుంది! అందుకే... 'స్కీముల్లో లీకేజ్ అరికట్టడం' అనే బాధ్యతను సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సీపీఆర్) అనే సంస్థకు అప్పగించారు. అదికూడా... ఏడాదిన్నర కిందటే! ఈ సంస్థ జనవరిలోనే నివేదిక అందించింది. అధికారంలోకి వచ్చిన మొదట్లోనే ఈ పని చేసి ఉంటే దీనికి ప్రాధాన్యం ఉండేది కాదేమో! కానీ... ఎన్నికల ముందు 'లీకేజీ'పై దృష్టి పెట్టడం గమనార్హం. అంటే... రెండోసారి అధికారంలోకి వస్తే, ఆ వెంటనే పథకాలకు కోతలు పెట్టాలన్నదే జగన్ ఉద్దేశమని ఇట్టే అర్థమవుతుంది.

మన్మోహన్ పని చేసిన సంస్థ...

రాష్ట్రంలోని కుటుంబాలకు - రేషన్ కార్డులకు మధ్య తేడా ఉందని తేల్చిన సీపీఆర్ ఆషామాషీ సంస్థ కాదు. ప్రభుత్వ విధానాలపై పరిశోధన, విశ్లేషణ, సూచనలు చేయడంలో సీపీఆర్‌కు జాతీయ స్థాయిలో పేరుంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నిపుణులు ఇందులో భాగస్వాములు! మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా సీపీఆర్‌లో సేవలు అందించారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు అధ్యయన బాధ్యతలు అప్పగించారంటే... తేలిగ్గా తీసిపడేయలేం. సంస్థ సిఫారసులను 'సీరియస్'గా తీసుకుని అమలు చేసేందుకు సిద్ధమైనట్లే!

'రేషన్'కు కోత... సీపీఆర్ సంస్థ రాష్ట్రంలోని రేషన్‌కార్డులపై ముందుగా దృష్టి సారించింది. ఏకంగా 23లక్షల బియ్యం కార్డులు అదనంగా/అనవసరంగా/అనర్హుల వద్ద ఉన్నాయని తేల్చింది. అంటే... ఆ మేరకు కార్డులకు కోత పెట్టాలని సిఫారసు చేయడమే! చేయూత, అమ్మఒడి పథకాలను కూడా అధ్యయనం చేసి వీటిలోనూ లీకేజీలు ఉన్నాయని వెల్లడించింది. గ్రామవార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటాబేస్ ఆధారంగా ఈ అధ్యయనం చేసినట్టు ఆ సంస్థ పేర్కొంది. అంటే, జగన్ అధికారంలోకి వచ్చాక కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చిన ఉద్యోగులు సేకరించి, రూపొందించిన డేటాబేస్ ఇది. "మొత్తం తెల్ల రేషన్ కార్డుల డేటాను రాష్ట్రంలోని 1.65 కోట్ల కుటుంబాలతో పోల్చి చూశాం. ఇందులో 15లక్షల కుటుంబాలకు బియ్యం కార్డులు లేవు. మిగిలిన కార్డులు-కుటుంబాల డేటాలో 77శాతం మ్యాచ్ అయ్యాయి. ఒక కుటుంబానికి ఒకటికి మించి కార్డులు జారీచేయడం, ఒక కుటుంబం మరో కార్డు ఐడీతో ఉండటం, లేదా ఈ రెండూ మిస్‌మ్యాచ్‌లూ చోటుచేసుకోవడం జరిగింది" అని సీపీఆర్ నిర్ధారించింది. సీపీఆర్ అధ్యయనం ప్రకారం... రాష్ట్రంలో బియ్యం కార్డులు లేని కుటుంబాల సంఖ్యను మినహాయిస్తే, 23 లక్షల కార్డులు- కుటుంబాలు మిస్ మ్యాచ్ అయ్యాయి. వెరసి... 23 లక్షల కుటుంబాలకు ఇప్పుడున్న కార్డులను తీసేయాలని సూటిగా సిఫారసు చేయడమే. ఒకవేళ తిరిగి అధికారంలోకి వస్తే జగన్ చేసే మొదటి పని ఈ రేషన్ కార్డులను తొలగించడమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇప్పటికే కష్టంగా పథకాల అమలు

ఈ ఐదేళ్లలో జగన్ చెప్పుకోడానికి ఏమైనా ఉందంటే... 'బటన్ నొక్కుడు' ఒక్కటే! పాత పథకాల పేర్లు, అమలు తీరు మార్చడమే ఆయన చేసింది. ఆ పథకాలూ కష్టంగానే అమలవుతున్నాయి. బటన్ నొక్కి రోజులు, వారాలు గడుస్తున్నా ఖాతాల్లో డబ్బు పడని సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇక... ఉద్యోగుల జీతాలు, పింఛన్ల సంగతి సరేసరి! అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో... ఈసారే 1న జీతాలు పడ్డాయి. ఆదాయం ఆశించినంతగా పెరగ లేదు. పన్నులు, చార్జీలు, సెస్సులతో బాదుతున్నా పరిస్థితి మారడంలేదు. ఏటా రూ.లక్ష కోట్లకు పైగా అప్పులు తెస్తూ నెట్టుకొస్తున్నారు. కొంతకాలం నుంచి అవీ పుట్టడం లేదు. ఈ నేపథ్యంలోనే పథకాలకు 'కోత'పెట్టి, ఖర్చు తగ్గించుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే... సీపీఆర్ సంస్థను ఆశ్రయించారు. ఈ సంస్థ ఏడాదిన్నర నుంచి అధ్యయనం చేసి మూడు నెలల క్రితమే ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. అనేక పథకాలకు మౌలిక అర్హతగా భావించే తెల్ల రేషన్ కార్డులు 23 లక్షలు 'మిస్‌మ్యాచ్' అయినట్లు సీపీఆర్ సంస్థ తేల్చింది. వీటిని రద్దు చేస్తే సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు లక్షల్లో తగ్గిపోతారు. జగన్ ప్రభుత్వానికి కావాల్సింది కూడా ఇదే. కానీ, ఇంతలో ఎన్నికలొచ్చాయి. దీంతో ఆ నివేదికను తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఎన్నికల్లో జగన్ మళ్లీ గెలవడమంటూ జరిగితే 23 లక్షల రేషన్ కార్డులు రద్దుకావడం ఖాయం. లబ్ధిదారులు లబోదిబోమనడం ఖాయం.

'భూమి' బద్దలైంది!

టైటిల్ చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

అడుగడుగునా నిలదీస్తున్న రైతాంగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు అడ్డగోలుగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూమి యాజమాన్య హక్కుల చట్టం-2022(ల్యాండ్ టైటిల్)పై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా తమకు జీవనాధారమైన, ప్రాణంగా భావించే భూమి 'హక్కు' భద్రతకు ముప్పు ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నేతలను ప్రజలు, రైతులు అడుగడుగునా నిలదీస్తున్నారు. 'మా పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలెందుకు? ఆయన ఏమైనా మా భూములకు సహ హక్కుదారా?' అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ అయ్యాక ఒరిజినల్ ఆస్తి పత్రాలు కాకుండా జిరాక్స్‌లు ఎందుకిస్తారు? అసలు పత్రాలు ఎక్కడైనా తాకట్టు పెట్టుకుంటారా? ఇవేం విధానాలు? అంటూ ప్రజలు ఊరువాడా యంత్రాంగాన్ని, అధికార పార్టీ అభ్యర్థులను నిలదీస్తున్నారు. దీంతో తాము ఏ చట్టం తీసుకొచ్చినా ప్రజలు శిరసావహించాల్సిందే అన్న ధోరణిలో ఉన్న జగన్ సర్కారు వెన్నులో వణుకు మొదలైంది. నిజాలను అబద్ధాలుగా చూపి, మీడియా, ప్రతిపక్షాలు, సోషల్ మీడియాను నియంత్రించాలంటూ సీఎం తన బృంద అధికారులను ఆదేశించారు. అంతే, సీఎంవో రంగంలోకి దిగింది. సీఐడీని కూడా రంగంలోకి దింపి కేసులు పెట్టించి బెదరగొట్టాలని ప్రయత్నిస్తోంది. అయితే ఎన్నికల సమయం కావడంతో, ఇప్పుడు ఏం చేసినా బూమ్‌రాంగ్ అవుతుందేమోనని అధికార వర్గాలు ఆలోచిస్తున్నాయి. తక్షణమే చర్యలు తీసుకోవాలని జగన్ ఒత్తిడి చేస్తుండటంతో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రామకృష్ణతో సీఐడీకి ఫిర్యాదు చేయించారు.

సర్వత్రా సందేహాలు.. ప్రశ్నలు

ల్యాండ్ టైటిల్‌లోని అతిదుర్మార్గమైన అంశాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిరోధించే ఈ చట్టం గురించి 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. ఇది టైటిల్ చట్టం కాదని, జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అని ప్రతిపక్షాలు కూడా తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఈ అంశం రైతులు, సామాన్యులను కూడా ఆలోచింపజేస్తోంది. టైటిల్ చట్టం అమల్లో భాగంగా రైతులకు ఇస్తున్న పాస్‌పుస్తకాల నిండా జగన్ బొమ్మలు ఉండటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో భూముల రిజిస్ట్రేషన్ తర్వాత అసలు పత్రాలు ఇవ్వకుండా, కేవలం జిరాక్స్ డాక్యుమెంట్లే ఇస్తారన్న అంశం వెలుగులోకి వచ్చింది. దీనిపై రైతులు, సామాన్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ ఆస్తి పత్రాలను ప్రభుత్వం తనవద్ద ఉంచుకొని ఆర్థిక అవసరాల కోసం తాకట్టు పెట్టుకుంటుందా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో ఈ రెండు అంశాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయి. చివరకు సీఎం సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా ఈఅంశం నిప్పు రాజేస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి సతీమణి భారతీరెడ్డినే అది కూడా సొంత పార్టీ నేతలే ప్రశ్నించారు. పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మలేమిటని నిలదీశారు. ఈ పరిణామాలపై జగన్ విశాఖ సభల్లో వివరణ ఇస్తూ... చట్టం మంచిదే అంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆస్తుల రిజిస్ట్రేషన్ తర్వాత ఒరిజినల్ పత్రాలు ఇచ్చే అంశంపై ఆయన పెదవి విప్పలేదు. దీంతో రైతుల్లో మరిన్ని అనుమానాలు అలుముకుంటున్నాయి.

రంగంలోకి సీఎంవో


టైటిల్ చట్టం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం క్షేత్రస్థాయికి వెళ్లిందని గుర్తించిన సీఎం జగన్.. నయానో, భయానో అడ్డుకోవాలని ప్లాన్ వేశారు. తన అమ్ములపొదిలోని సీఐడీని రంగంలోకి దించి ఇటు మీడియా, అటు ప్రతిపక్షాలపై కేసులు పెట్టించి బెదరగొట్టాలని వ్యూహం పన్నారు. దీనికోసం సీఎంవో రంగంలోకి దిగింది. టైటిల్ చట్టం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై మీడియాలో వస్తున్న వార్తలకు వివరణివ్వాలని రెవెన్యూ, సర్వే శాఖలను సీఎంవోలోని ముఖ్యకార్యదర్శి ముత్యాలరాజు ఆదేశించినట్లు తెలిసింది. 'ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం విస్తృతంగా ఉంది. దాన్ని అడ్డుకోవాలంటే మీరు వివరణ ఇవ్వాలి' అని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో తాము ఏమని వివరణ ఇవ్వాలని, అది అయ్యే పనికాదని అధికారులు తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ సమయంలో ప్రెస్‌మీట్‌లు నిర్వహించి మాట్లాడలేమని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి కూడా రంగంలోకి దిగి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరినట్లు తెలిసింది. అధికారుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రామకృష్ణను రంగంలోకి దింపారు.

సీఐడీకి ఫిర్యాదు

రిజిస్ట్రేషన్ శాఖ అధికారి రామకృష్ణ జగన్‌కు వీరభక్త విధేయుడు. సీఎంవో ముఖ్యకార్యదర్శి ముత్యాలరాజు ఆయనతో మాట్లాడినట్లు తెలిసింది. ఆయన ఏం ఆదేశాలు ఇచ్చారో కానీ రామకృష్ణ సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఓ ఫిర్యాదు చేశారు. ల్యాండ్ టైటిల్ చట్టం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఫేక్‌న్యూస్ వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, టైటిల్ చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇందుకు కారణమైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. అయితే, ఈ ఫిర్యాదును చూసి సీఐడీ అధికారులే అవాక్కయినట్లు తెలిసింది. ఫేక్ ప్రచారంపై ఎవరిమీద చర్యలు తీసుకోవాలి? ఎవరిపై విచారణ చేయాలో ఫిర్యాదులో స్పష్టత లేదు. దీంతో మరోసారి రామకృష్ణను సీఐడీ కార్యాలయానికి పిలిపించి... 'మీ ఫిర్యాదు ఆధారంగా ఎవరిపై విచారణ చేయాలి? ఎవరి మీద చర్యలు తీసుకోవాలి? బయటజరుగుతున్న ప్రచారం వల్ల మీ శాఖకు వస్తున్న నష్టం ఏమిటి? స్పష్టత ఇవ్వండి' అని కోరినట్లు తెలిసింది. దీంతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌లో తాజాగా తీసుకొచ్చిన సంస్కరణలపై రామకృష్ణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు సమాచారం. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐడీని కోరినట్లు తెలిసింది.

సీఐడీ ఏం చేయనుంది?

ఎన్నికల షెడ్యూల్ రాకముందు సీఐడీ దూకుడే వేరు. ఫిర్యాదు వచ్చినా, రాకున్నా సుమోటో పేరిట వ్యక్తులు, సంస్థలపై కేసులు పెట్టి జైల్లో వేసింది. జగన్, ఆయన మనుషులు, వైసీపీ పెద్దలపై సోషల్ మీడియాలో ఎవరైనా చిన్న పోస్టు పెట్టినా, విమర్శలు చేసినా సీఐడీ వెంటనే రంగంలోకి దిగి వారిని అరెస్టు చేసే దాకా వదల్లేదు. అయితే, ఇప్పుడు ఎన్నికల సమయం కావడం.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ సమయంలోనూ సీఐడీ అదే దూకుడు ప్రదర్శిస్తుందా? లేక నిబంధనల ప్రకారం వ్యవహరిస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. టైటిల్ చట్టం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం అంశంలో కేసులు పెట్టాలని సీఐడీపై ఒత్తిళ్లు ఉన్నట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ అధికారి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సత్వరమే చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, తన ఫిర్యాదుపై వివరణ ఇచ్చే సమయంలో రిజిస్ట్రేషన్ అధికారి రామకృష్ణ పలువురు జిల్లాల అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకోవాలని, ప్రజలకు రిజిస్ట్రేషన్ సంస్కరణలు, టైటిల్ చట్టంలోని సానుకూల అంశాలను వివరించాలని కోరినట్లు తెలిసింది.



18వ సారి ఓటు హక్కు వినియోగం

▸ సీనియర్ సిటిజన్ రొంగల రాముడి ప్రత్యేకత

▸ 104 ఏళ్ల వయసులో ఇంటి వద్ద ఓటు

ఆ పెద్దాయన వయస్సు 104 సంవత్సరాలు... 18వసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇలా 18వ సారి ఓటు హక్కును వినియోగించుకొన్న సీనియర్ సిటిజన్ బహుశా ఆయనేనేమో! తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రొంగల రాముడు ప్రత్యేకత ఇది. గురువారం నిడదవోలులోని నివాసంలో వయోవృద్ధులకు కల్పించిన హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పటివరకు 18సార్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

-నిడదవోలు

ముద్రగడా.. నువ్వు రెడ్డి కాపువి!

▸ నీకు బారసాల చేస్తాం.. వెండి మొలతాడు పెడతాం

▸ సినీ నటుడు పృథ్వీరాజ్ ఎద్దేవా

భీమవరం రూరల్, మే 2: 'ముద్రగడా.. నీకు రెడ్డి కాపు అని పేరు పెట్టా. టీడీపీ కూటమి నెగ్గితే పేరు మార్చుకుంటానన్నావుగా.. అందుకు సిద్ధంగా ఉండు. బారసాల చేస్తాం. వెండి మొలతాడు పెడతాం' అని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభంను సినీనటుడు పృథ్వీరాజ్ ఎద్దేవా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గురువారం జనసేన తరఫున ప్రచారం చేశారు.

ఐదేళ్లలో ఏం చేశావని వచ్చావ్?

▸ ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని నిలదీసిన జనం

ఆదోని, మే 2: కర్నూలు జిల్లా ఆదోనిలో సిట్టింగ్ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డిపై ఓటర్లు తిరగబడ్డారు. ఎన్నికల ప్రచారానికి బుధవారం రాత్రి ఎమ్మెల్యే సంతెకూడ్లూరు గ్రామానికి వచ్చి, ఎస్సీ కాలనీలోకి వెళ్లారు. కాలనీవాసులు ప్రచార రథానికి అడ్డంగా నిలబడి 'మా కాలనీకి ఎందుకొచ్చారు' అంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామంలో ఒక రోడ్డయినా వేశారా? తాగునీటి సమస్య పరిష్కరించారా? ఏ పని చేయనప్పుడు ఓటు అడిగేందుకు ఎందుకు వచ్చారు? అంటూ నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే ఖంగుతిన్నారు. 'మీరు ఇలానే మాట్లాడితే వెనుతిరిగిపోతాను' అన్నారు. అభివృద్ధి చేయని వ్యక్తికి ఓటు వేసే ప్రసక్తే లేదని ప్రజలు తేల్చి చెప్పారు.

వైసీపీ అభ్యర్థి 420.. ఓటు వేయకండి!

▸ మాజీ సర్పంచ్ కృష్ణవేణి ఆడియో హల్‌చల్

పాలకొల్లు రూరల్, మే 2: 'పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వైసీపీ అభ్యర్థి గుడాల గోపి 420. అతడికి ఓటు వేయవద్దు' అంటూ మాజీ సర్పంచ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి చెబుతున్న ఆడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) తనకు రూ.32లక్షలు ఇవ్వాలని, తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని శేషమ్మచెరువు మాజీ సర్పంచ్ కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు బాగా ఆలోచించి, మోసగాడికి ఓటు వేయవద్దంటూ కృష్ణవేణి విడుదల చేసిన ఆడియోలో కోరారు.

కార్పొరేట్ పార్టీలతో పోటీ...: మాణిక్కం ఠాగూర్

విజయవాడ, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు కార్పొరేట్ పార్టీలతో పోటీ పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ అన్నారు. ఈ రెండు పక్షాలు డబ్బులు వెదజల్లి ఎన్నికల్లో గెలవాలని అనుకుంటున్నాయని విమర్శించారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ త్వరలో రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, త్వరలోనే షెడ్యూల్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

అబ్బో.. ఎంత డబ్బో!

▸ కంటైనర్లలో రూ.2 వేల కోట్లు.. ఆర్బీఐకి తరలింపు

పామిడి, మే 2: అనంతపురం జిల్లా పామిడి మండలం గజరాంపల్లి గ్రామ సమీపంలో పోలీసులు నాలుగు కంటైనర్లను తనిఖీ చేశారు. వాటిలో ఏకంగా రూ.2వేల కోట్ల నగదు ఉన్నట్లు గుర్తించి.. ఐటీ, పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కేరళ నుంచి హైదరాబాద్‌లోని ఆర్బీఐకి ఈ నగదు తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని వదిలిపెట్టారు. ఎన్నికల నేపథ్యంలో పామిడి సీఐ రాజశేఖర్ రెడ్డి తన సిబ్బందితో 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసు స్టిక్కర్ వేసుకొని వస్తున్న కంటైనర్లను ఆపి వివరాలు ఆరా తీశారు. కేరళలోని కొచ్చి నుంచి నాలుగు కంటైనర్లలో రూ.2వేల కోట్ల నగదు హైదరాబాద్‌కు తీసుకువెళుతున్నట్లు తెలుసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఆదాయ పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ నళిని, గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి అక్కడికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఫెడరల్ బ్యాంక్ నుంచి రూ.వెయ్యి కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.500 కోట్లు, ఐడీబీఐ నుంచి రూ.500 కోట్లు హైదరాబాద్‌లోని ఆర్బీఐకి వెళ్తున్నట్లు నిర్ధారించుకొని, ఆ కంటైనర్లను విడిచిపెట్టారు.

రూ.2.40 కోట్ల నగదు పట్టివేత

గోపాలపురం, మే 2: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం జగన్నాథపురం శివారులోని అంతర్‌జిల్లాల చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.2.40 కోట్ల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ సొమ్ముకు సరైన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లా అంతటా 21 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, 24 స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు, 15ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల నిరంతర నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సరైన పత్రాలు లేకుండా నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు కానీ, లేదా 112 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలు కీలకమని, అందులోను ముఖ్యంగా ఏపీలో కోస్టల్ కారిడార్ ఉన్నందున పోర్టులను అభివృద్ధి చేసి సంపదను సృష్టించి, ఉద్యోగాలు కల్పించాలి. సుమారు రూ.మూడు లక్షల కోట్ల రూపాయలతో రాష్ట్రంలో ఎక్స్‌ప్రెస్ హైవేలను పూర్తి చేస్తాం. రాజమండ్రి-రాయిపూర్ రోడ్డు నిర్మాణంలో ఇబ్బందులు ఉన్నా పూర్తి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నాం. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలి' అని గడ్కరీ పిలుపు ఇచ్చారు. పార్వతీపురం పరిధి చిన్నబొండపల్లి ప్రాంతంలో ఆయన మట్లాడుతూ, 'అరకు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఆ ప్రాంత వాసులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం. తాగునీటి ఇక్కట్లు లేకుండా చేస్తాం. కమలం గుర్తుపై ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతను గెలిపించాలి. అదే విధంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్రను గెలిపించాలి' అన్నారు. ఈ బహిరంగ సభలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసీపీలో అరాచకం: అంబటి రాయుడు

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో అంతా అరాచకం, బానిసత్వమేనని, ఆ కూపం నుంచి సరైన సమయంలో పవన్ కల్యాణ్ తప్పించారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధినేత పవన్‌తో పాటు గురువారం పూర్ణామార్కెట్ ప్రాంతంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవ కోసం వైసీపీలో చేరానని, తనను తప్పుడు దారినుంచి సరైన సమయంలో పవన్ తప్పించి సన్మార్గంలోకి తీసుకువచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 50శాతం యువతే ఉన్నారని, అంతా సమష్టిగా పనిచేస్తే వైసీపీ అరాచకాలను పరిసమాప్తం చేయవచ్చని పిలుపునిచ్చారు. కూటమి అధికారంలోకి వస్తే పెద్ద పరిశ్రమలు, ప్రాజెక్టులు వస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాయుడు అన్నారు.

జన చైతన్యం


ప్రజా అజెండా





కౌంట్ డౌన్ 10 రోజులు

ఆంధ్రజ్యోతి
శుక్రవారం ◇ 3-5-2024



హామీ గాలికి కాపు కార్పొరేషన్‌కు ఏటా 2 వేల కోట్లు ఇస్తామని గత ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీని గాలికొదిలేశారు. ఐదేళ్లలో ఖర్చు చేసింది 2 వేల కోట్లు మాత్రమే.

టోకరా జగన్ సర్కారులో కాపులకు ప్రత్యేకించి 'కాపు నేస్తం' తప్ప ఇతర పథకాలేవీ లేవు. అందులోనూ ఈ పథకం కింద ఒక్కో మహిళకు ఏటా 15 వేలు ఇస్తామని చెప్పి.. నాలుగు విడతలు ఇచ్చి, ఐదో విడత ఎగ్గొట్టేసింది.

ఉత్తుత్తి గొప్పలు జగన్ ఐదేళ్ల పాలనలో కాపులకు ప్రత్యేకించి ఖర్చు చేసింది 2 వేల కోట్లే. అయితే 39 వేల కోట్లు ఖర్చు చేసినట్టు గొప్పలు చెబుతోంది. అన్ని వర్గాలకూ ఇచ్చే రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలను ఈ ఖాతాలో కలిపేసింది.

విదేశీ విద్య దూరం చంద్రబాబు హయాంలో 1,892 మంది కాపు విద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సాయం చేయగా.. జగన్ పాలనలో కనీసం 40 మందికి కూడా సాయం చేయలేదు.

గతం ఎంతో ఘనం చంద్రబాబు ప్రభుత్వం కాపులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.1000 కోట్ల నిధులు కేటాయించింది. 2,11,099 మందికి రూ.1,441 కోట్లు రాయితీగా అందజేసి స్వయం ఉపాధి కల్పించింది. ఇతర వర్గాలతో పాటు కాపులకు పలు పథకాలు అమలు చేసింది. జగన్ సర్కారు వచ్చాక వీటిన్నింటినీ రద్దు చేసింది.

- ఏటా 2 వేల కోట్ల హామీ గాలికి
- కాపు నేస్తానికి ఏటా 500 కోట్లు
- ఐదేళ్లలో ఖర్చు చేసింది 2 వేల కోట్లే
- చివరి విడత సాయం ఎగవేత
- గతంలో ఉన్న పలు పథకాలు రద్దు
- బాబు హయాంలో కార్పొరేషన్ కళకళ
- అనేక పథకాలతో లక్షల మందికి లబ్ధి
- 2.11 లక్షల మందికి స్వయం ఉపాధి
- 1892 మంది విద్యార్థులకు విదేశీ విద్య
- జగన్ ప్రభుత్వంలో మొత్తం మోసమే
- 39 వేల కోట్లు ఖర్చు చేసినట్టు గొప్పలు
- అందరికీ ఇచ్చే పథకాలూ ఈ ఖాతాలోకి

కాపులకు పచ్చి మోసం

సంక్షేమాన్ని విస్మరించిన జగన్ సర్కారు

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయకుంటే..? అది.. వంచనే. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకున్నా ఇంకా ఎంతో చేశామని గొప్పలు చెబితే..? అది.. పచ్చిగా మోసం చేయడమే. కాపులకు జగన్ సర్కారు చేస్తున్నది ఇదే. ఎన్నికలకు ముందు కాపులను ఉద్ధరిస్తానన్నట్టుగా హామీలు ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చాక వాటిని గాల్లో కలిపేశారు. గతంలో ఉన్న స్వయం ఉపాధి పథకం ఎత్తేశారు. రాయితీపై కార్లు, కుట్టు మిషన్ల శిక్షణ లాంటి పథకాల ఊసే లేదు. విద్యోన్నతికి మంగళం పాడారు. విదేశీ విద్యను చివర్లో ప్రారంభించి కఠిన నిబంధనలతో విద్యార్థులకు దూరం చేశారు. కాపు కార్పొరేషన్‌ను నామమాత్రం చేశారు. ఈ ప్రభుత్వంలో కాపులకు ప్రత్యేకించి అమలు చేస్తున్న పథకం కాపునేస్తం ఒక్కటే. దాన్ని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. అయినా.. 'మేం ఏడాదికి రూ.2 వేల కోట్లు చొప్పున ఖర్చు చేస్తామని అన్నాం. కానీ నాలుగేళ్లలోనే రూ.39,247 వేల కోట్లు ఖర్చు చేశాం' అని జగన్ సర్కారు గొప్పలకు పోయింది. కాపు కార్పొరేషన్‌కు ఏటా 2 వేల కోట్లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేని జగన్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీకి మించి నాలుగు రెట్లు ఖర్చు చేశామనడం కాపులను దగా చేయడమే! కాపు నేస్తం తప్ప కాపులకు ప్రత్యేకించి మరో పథకం లేదు. గతంలో ఉన్న పథకాలను రద్దు చేసింది. అయినా ఇన్ని వేల కోట్లు ఖర్చు చేశామని కాపులను మభ్యపెడుతోంది. అన్ని సామాజికవర్గాలకు, అన్ని కుటుంబాలకూ వచ్చే పథకాలను తీసుకొచ్చి కాపు సంక్షేమంలో కలిపేసి అంకెల గారడీ చేస్తోంది. పెన్షన్, రైతు భరోసా, లా నేస్తం, నేతన్న నేస్తం, బీమా, ఆరోగ్యశ్రీ పథకాల్లో లబ్ధిపొందిన వారిలో కాపుల్ని వెతికి తీసి, అదిగో కాపు సంక్షేమం అంటూ ప్రత్యేకించి కోట్లు ఖర్చు చేస్తున్నట్టు గొప్పలు చెబుతోంది.

టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్

తెలుగుదేశం ప్రభుత్వం కాపు సంక్షేమానికి ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చింది. చెప్పినట్టుగానే 2015 నవంబరు 4న కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచీ ఏడాదికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ వచ్చింది. అలా దాదాపు నాలుగేళ్లలో రూ.3,100 కోట్లు ఖర్చు చేసింది. కేవలం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వదిలేయకుండా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా స్వయం ఉపాధి పథకం ద్వారా కాపులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చింది. కార్పొరేషన్ కొంత రాయితీ ఇచ్చి, అంతే మొత్తంలో బ్యాంకుల నుంచి రుణం ఇప్పించింది. సొంత కార్లు కొనుగోలు చేసి, తద్వారా ఉపాధి పొందేవారికి రూ.లక్ష చొప్పున రాయితీ ఇచ్చింది. కుట్టుమిషన్లలో శిక్షణ, ఇతర ఉపాధి పథకాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం రూ.28 కోట్లు ఖర్చు చేసింది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

స్వయం ఉపాధి

టీడీపీ హయాంలో

స్వయం ఉపాధి పథకం కింద టీడీపీ ప్రభుత్వం ఒక్కో కాపు లబ్ధిదారుడికి రూ.30 వేల నుంచి రూ.లక్ష రాయితీ ఇచ్చింది. మొత్తం 2,11,099 మందికి రూ.1,441 కోట్లు రాయితీగా అందజేసింది. ఈ పథకం కింద అత్యధిక స్థాయిలో లబ్ధి చేకూర్చింది. రాయితీ రుణంతో లబ్ధిదారులు కిరాణా కొట్లు, ఆటోలు, గేదెల కొనుగోలుతో పాడి ద్వారా జీవనోపాధికి పలు యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు.

వైసీపీ హయాంలో

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం ఉపాధి పథకాన్ని రద్దు చేసింది. అసలు ఆ పథకమే దండగ అన్నట్టుగా స్వయం ఉపాధికి మంగళం పాడేసింది. దీంతో ఈ ఐదేళ్లుగా కాపులకు ఒక్కరికి కూడా స్వయం ఉపాధి రాయితీలు, రుణాలు దక్కలేదు. రాయితీలు వస్తాయని ఆశ పెట్టుకున్నవారిపై జగన్ ప్రభుత్వం నీళ్లు చల్లింది.

విదేశీ విద్య

టీడీపీ హయాంలో

పేదలు విదేశాల్లో చదువుకోవాలనే కలను నెరవేర్చాలనే లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీఆర్ విదేశీ విద్య పథకాన్ని ప్రారంభించింది. ఆ పథకం కింద ఏ దేశం వెళ్లి చదువుకున్నా ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షలు రాయితీగా ఇచ్చింది. పైగా విమాన ప్రయాణ ఖర్చులు కూడా భరించింది. ఈ పథకం అమలులో ఎక్కడా ఆంక్షలు విధించలేదు. ఉదారంగా రాయితీలు ఇచ్చింది. ఐదేళ్లలో 1892 మంది కాపు విద్యార్థులు విదేశాల్లో చదువుకుని లబ్ధి పొందారు. వారికి రూ.207 కోట్లు ఖర్చు చేసింది.

వైసీపీ హయాంలో

అన్ని పథకాల తరహాలోనే జగన్ ప్రభుత్వం విదేశీ విద్య పథకాన్ని కూడా రద్దు చేసింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో కౌన్సెలింగ్ నిర్వహించి మరీ ఈ పథకాన్ని ఎత్తేసింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా మూడేళ్లు పట్టించుకోని ప్రభుత్వం ఆ తర్వాత విదేశీ విద్యా దీవెన పేరుతో ఆ పథకాన్ని తిరిగి ప్రారంభించింది. కఠిన నిబంధనలతో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. టాప్-200 యూనివర్సిటీల్లో తప్ప ఇంకెక్కడ చదివినా రాయితీ ఇవ్వబోమని స్పష్టం చేసింది. దీంతో 40 మంది కాపు విద్యార్థులు కూడా ఈ పథకంలో లబ్ధి పొందలేదు. జగన్ ప్రభుత్వం కారణంగా విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల ఆశలు అడియాసలయ్యాయి.

విద్యోన్నతి

టీడీపీ హయాంలో

అఖిల భారత సర్వీసులు, గ్రూప్ పరీక్షలు, బ్యాంకింగ్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం విద్యోన్నతి అనే పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసింది. ఆయా పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ఫీజులను ప్రభుత్వమే చెల్లించింది. 5,708 మంది కాపు విద్యార్థులు ఈ పథకంలో శిక్షణ పొందారు. అందు కోసం ప్రభుత్వం రూ.28.63 కోట్లు ఖర్చు చేసింది. కోచింగ్ తీసుకున్నవారిలో అనేక మంది ఉద్యోగాలు పొందారు.

వైసీపీ హయాంలో

పోటీ పరీక్షలు రాసేవారు సొంతంగానే ఫీజులు కట్టుకోవాలంటూ ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఎక్కడో ఎవరో శిక్షణ తీసుకుంటే ప్రభుత్వం ఎందుకు ఫీజులు కట్టాలనే ధోరణి ప్రదర్శించింది. పైగా ఈ ప్రభుత్వం అసలు ఉద్యోగాల నోటిఫికేషన్లే ఇవ్వనప్పుడు ఇక శిక్షణ ఎందుకు అనుకుందో ఏమో కానీ ఈ పథకం ఆనవాళ్లు కూడా లేకుండా చేసింది.

అంకెల గారడీ

కాపులకు ఇచ్చిన హామీని అమలు చేయకపోగా జగన్ ప్రభుత్వం అంకెల గారడీతో మోసం చేస్తోంది. ఇచ్చిన హామీ ప్రకారం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయాలి. కానీ ఈ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అయితే కాపుల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతోంది. ఇతర వర్గాలతో పాటు కాపులకు ఇచ్చే పథకాలను కూడా ఈ ఖాతాలో కలిపేసింది. ఆసరా కింద రూ.2,083 కోట్లు, అమ్మఒడి రూ.2,248 కోట్లు, చేదోడు రూ.52 కోట్లు, ఉచిత పంటల బీమా రూ.655 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.191 కోట్లు, జగనన్న తోడు రూ.7 కోట్లు, వసతి దీవెన రూ.387 కోట్లు, విద్యా దీవెన రూ.1192 కోట్లు, మత్స్యకార భరోసా రూ.2 కోట్లు, నేతన్న నేస్తం రూ.35 కోట్లు, పెన్షన్ కానుక రూ.7,734 కోట్లు, రైతు భరోసా రూ.4,383 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాలు రూ.105 కోట్లు, స్వయం సహాయక బృందాలకు సున్నా వడ్డీ రూ.437 కోట్లు, వాహన మిత్ర రూ.84 కోట్లు, ఆరోగ్య ఆసరా రూ.45 కోట్లు, ఆరోగ్యశ్రీ రూ.465 కోట్లు, బీమా రూ.143 కోట్లు, విదేశీ విద్య రూ.14 కోట్లు, అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చింది రూ.21 కోట్లు, కొవిడ్ సాయం రూ.21 కోట్లు ఇచ్చినట్టు లెక్కలు వేసింది. ఇవి కాకుండా నాన్ డీబీటీ కింద మరో రూ.16,914 కోట్లు ఇచ్చినట్లు చూపించింది.

నేస్తంలో ఒక విడత ఎగవేత

జగన్ ప్రభుత్వం కాపులకు ప్రత్యేకించి అమలు చేస్తున్న ఒకే ఒక్క పథకం కాపునేస్తం. అయితే అందులోనూ ప్రభుత్వం ఒక విడత నగదు విడుదల చేయకుండా మోసం చేసింది. ఇచ్చిన హామీ ప్రకారం ఏటా రూ.15వేల చొప్పున ఐదేళ్లలో ఐదుసార్లు ఇవ్వాలి. చివరిసారి 2023 సెప్టెంబరులో నాలుగో విడత నగదు విడుదల చేసింది. తర్వాతి ఐదో విడత నగదు వచ్చే సెప్టెంబరులో ఇస్తామని చెబుతోంది. అంటే జగన్ పాలనలో ఈ ఐదేళ్లలో ఇచ్చింది నాలుగు సార్లే. దానివల్ల కాపు మహిళలు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.500 కోట్లు నష్టపోయారు. ఉన్న ఒక్క పథకంలో కూడా ఈ కోతలు ఏంటంటూ మహిళలు నిలదీస్తున్నారు. ఐదేళ్లలో ఈ పథకం కింద ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చుచేసింది. ఇది తప్ప మరో కాపు సంక్షేమ పథకమే లేదు.

అనారోగ్యం పాలైనా సంక్షేమమా?

సంక్షేమ పథకాలు అనేవి కుటుంబాలు అభివృద్ధి చెందడానికి ఉపయోగపడాలి. వారి కనీస అవసరాలు తీర్చే పథకాలు సంక్షేమం కిందకు రావు. దుర్భర పరిస్థితుల్లో అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలై ఆరోగ్యశ్రీ కార్డును వినియోగించుకుంటే.. దానిని సంక్షేమం కింద జగన్ ప్రభుత్వం చూపిస్తోంది. సంక్షేమ లెక్కల్లో 'అనారోగ్య సాయం' వేసుకోవడం ఏంటని కాపు సామాజికవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అగ్రిగోల్డ్ స్కామ్‌లో బాధితులకు వారి డబ్బు వారికి తిరిగి ఇవ్వడం కూడా సంక్షేమమేనని ప్రభుత్వం చెబుతోంది. ఏదైనా ప్రమాదంలో ఎవరైనా చనిపోయినపుడు ఇచ్చే పరిహారం కూడా సంక్షేమమేనట. గత ప్రభుత్వం కూడా ఇలాంటి లెక్కలు వేసి ఉంటే అప్పట్లో కూడా వేల కోట్ల సంక్షేమం కనిపించేది. కానీ గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి పథకాలను ప్రత్యేక సంక్షేమం కింద చూపించలేదు.

నేస్తం కంటే ఉపాధి మిన్న

ఈ ప్రభుత్వం కాపులకు సంబంధించి పదే పదే చెప్పుకొనే పథకం కాపునేస్తం. 45 నుంచి 60 ఏళ్ల మధ్య మహిళలకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తున్నారు. ఐదేళ్లలో ఒక విడత ఎగ్గొట్టి నాలుగు సార్లే ఇచ్చారు. లబ్ధిదారులైన ఒక్కో మహిళకు రూ.60 వేలు అందాయి. గత ప్రభుత్వంలో స్వయం ఉపాధి కింద 2,11,099 మంది లబ్ధిదారులకు రూ.1441 కోట్లు ఇచ్చారు. కానీ టీడీపీ ప్రభుత్వం లెక్కలు తీసి ఇలా ప్రచారం చేసుకోలేదు. కానీ జగన్ ప్రభుత్వం ఇవ్వని వాటిని కూడా ఇచ్చినట్లుగా, అందరికీ ఇచ్చినవే కాపులకు ఇచ్చి ప్రత్యేకంగా ఇచ్చినట్లుగా అంకెల గారడీ చేసింది.

హీరోలు.. విలన్!



'నేను రియల్ హీరోను' అన్నట్టు జగన్ కొత్తగా బిల్డప్ ఇస్తున్నారు. రియల్ హీరో అంటే... ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించాలి. రాష్ట్రానికి మేలు చేసే వాళ్లకు మర్యాదలు చేయాలి. కానీ... జగన్ తీరే వేరు. టాలీవుడ్ అగ్రనటులను కేవలం 'అవమానించేందుకే' తన ఇంటికి పిలిపించారు. సినిమా టికెట్ల ధర విషయంలో లేని వివాదాన్ని సృష్టించి.. కావాలనే సినీ పరిశ్రమను ఇబ్బంది పెట్టారు. 'నేను తలచుకుంటే మిమ్మల్ని రప్పించగలను' అన్నట్లుగా హీరోలను తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకు రప్పించారు. ఉద్దేశపూర్వకంగానే వారి వాహనాలను గేటు వద్ద ఆపించి.. నడిపించారు. వారు కేవలం హీరోలు, దర్శకులు, నిర్మాతలు మాత్రమే కాదు. మొత్తం సినీ పరిశ్రమకు ప్రతినిధులు! రాష్ట్రంలో పరిశ్రమ అభివృద్ధికి వారి సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. కానీ... జగన్ కేవలం తన ఇగో చల్లార్చుకోడానికే వారిని పిలిపించి అవమానించారనే విమర్శలు వచ్చాయి.

అట్లుంటది అన్నతోని..



ట్రెండింగ్.. ట్రెండింగ్..!

మైనారిటీలు ఆలోచించాలి..!



■ **వైసీపీ ప్రభుత్వంలో...**

చదువుల తల్లినీ చంపేశారు. చిత్తూరు జిల్లాలో తన కుమార్తె టాపర్ కావాలంటూ ఒక వైసీపీ నేత పెట్టిన వేధింపులు తాళలేక మిస్బా అనే విద్యార్థిని సూసైడ్ చేసుకుంది.

■ **చంద్రబాబు ప్రభుత్వంలో...**

టీడీపీ ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యా పథకం లబ్ధితో అమెరికాలో చదువుకుని అక్కడే ఉద్యోగం సంపాదించిన గుంటూరుకు చెందిన మహ్మద్ పర్వీన్ ఇప్పుడు ఇండియా వచ్చారు. తన ఉన్నతికి సహకరించిన చంద్రబాబును గెలిపించుకోవాలని ఆమె స్వదేశానికి తిరిగి వచ్చారు.

సోషల్ మీడియాలో ఇప్పుడీ రెండు ఉదంతాలతో కూడిన క్లిప్పింగ్ వైరల్‌గా మారింది. జగన్ హయాంలో వైసీపీ నేత వేధింపులతో మైనార్టీ విద్యార్థిని బలైపోతే... చంద్రబాబు ప్రభుత్వంలో పేదరికం నుంచి విదేశాల్లో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి ఉదంతాన్ని పోలుస్తూ, మైనార్టీలూ.. ఆలోచించండంటూ ఈ అంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

సమ్ థింగ్ స్పెషల్

ఉమన్ X ఉమన్!

■ నాలుగు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు అతివలే

అరకు పార్లమెంటు స్థానంలో కూడా

రాష్ట్రంలో కూటమి పార్టీలైన బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులు, అధికార వైసీపీ అభ్యర్థులు హోరా హోరీ తలపడుతున్న విషయం తెలిసిందే. అయితే.. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 171 చోట్ల ఆయా పార్టీల నుంచి పురుష అభ్యర్థులు.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పురుష అభ్యర్థులపై మహిళా అభ్యర్థులు దీటుగా బరిలో నిలిచారు. కానీ, ఆసక్తికర విషయం ఏంటంటే.. నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం కూటమి, వైసీపీల నుంచి అతివలే ప్రధాన అభ్యర్థులుగా తలపడుతున్నారు. ఒక పార్లమెంటు స్థానం నుంచి కూడా ఇద్దరూ మహిళా అభ్యర్థులే బరిలో నిలవడం విశేషం.

1) పెనుకొండ: ఉమ్మడి అనంతలోని పెనుకొండ అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరఫున మంత్రి ఉష శ్రీచరణ్ నిలవగా, టీడీపీ నాయకురాలు సంజీవరెడ్డిగారి సవితమ్మ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2004 తర్వాత ప్రధాన పార్టీలు మహిళా అభ్యర్థులకు ఇక్కడ అవకాశం ఇవ్వడం ఇదే తొలిసారి.

2) రంపచోడవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గం నుంచి కూటమి పార్టీల అభ్యర్థిగా టీడీపీ నాయకురాలు మిరియాల శిరీషాదేవి పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి నాగులాపల్లి ధనలక్ష్మి బరిలో ఉన్నారు. ఇద్దరూ బలమైన నాయకురాళ్లే కావడం విశేషం.

3) గుంటూరు పశ్చిమ: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా టీడీపీ నాయకురాలు పిడుగురాళ్ల మాధవి పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి విడదల రజని ఇక్కడ తలపడుతున్నారు. జనరల్ నియోజకవర్గమైన గుంటూరు వెస్ట్‌లో 1999 ఎన్నికల తర్వాత మళ్లీ ఇప్పుడే ప్రధాన పార్టీలు మహిళలకు అవకాశం కల్పించడం విశేషం. అప్పటి ఎన్నికల్లో టీడీపీ తరఫున శనక్కాయల అరుణ పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి భారతి బరిలో నిలిచారు. 6 వేల ఓట్ల మెజారిటీతో అరుణ విజయం దక్కించుకున్నారు.

4) కురుపాం: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం కురుపాం. ఇక్కడి నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ డిప్యూటీ సీఎం, సిట్టింగ్ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ ఇక్కడ పురుష అభ్యర్థికి అవకాశం ఇవ్వగా.. తాజా ఎన్నికల్లో మాత్రం మహిళా అభ్యర్థిని నిలబెట్టింది. టీడీపీ నుంచి తోయక జగదీశ్వరి పోటీ చేస్తున్నారు.

అరకు(పార్లమెంటు): ఎస్టీ పార్లమెంటు నియోజకవర్గం అరకులో ఈ దఫా ప్రధాన పార్టీల నుంచి ఇద్దరూ మహిళా అభ్యర్థులే తలపడుతున్నారు. కూటమి అభ్యర్థిగా బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత పోటీ చేస్తున్నారు. వైసీపీ తరఫున చెట్టి తనూజా రాణి పోటీలో ఉన్నారు. తనూజ రాణి తొలిసారి అరంగేట్రం చేశారు. ఈమె వైసీపీ ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ కోడలు కావడంతో పాటు వృత్తిపరంగా వైద్యురాలు.

సంఘం చెప్పిన మాట

కూటమితోనే బ్రాహ్మణుల సంక్షేమం



"2014లో చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బ్రాహ్మణులు తీవ్ర నిరాదరణకు గురయ్యారు. బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ కూటమితోనే సాధ్యం" అని బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు చెప్పారు. సంఘం నాయకులు గురువారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మేనిఫెస్టోలో బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని చెబుతూ.. మేనిఫెస్టోలోని అంశాలతో పోస్టర్ విడుదల చేశారు.

- అరసవల్లి

పుంగనూరు.. త్రిముఖ పోరు!



వైసీపీ X టీడీపీ X బీసీవై

పెద్దిరెడ్డి అరాచకాలే ప్రత్యర్థుల అస్త్రాలు

గట్టి పోటీనిస్తున్న టీడీపీ అభ్యర్థి చల్లా

అమీతుమీ అంటున్న రామచంద్రయాదవ్

తొలిసారి రామచంద్రారెడ్డికి అగ్నిపరీక్ష

(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అత్యంత కీలక నియోజకవర్గం పుంగనూరు. 2009 నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుస విజయాలు దక్కించుకున్నారు. అయితే, గత ఎన్నికలకు భిన్నంగా ప్రస్తుతం పెద్దిరెడ్డికి కీలకమైన రెండు పార్టీల నుంచి భారీ సెగ తగులుతోంది. ఒకరకంగా ఇది అగ్నిపరీక్షేనని చెప్పొచ్చు. దీనికితోడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి సాగించిన అక్రమాలు, ప్రతిపక్షాలను లేకుండా చేయాలన్న కక్ష వంటివి ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెంచాయి. ఈ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.

అన్నీ ఇన్నీ కాని అరాచకాలు!


గడిచిన ఐదేళ్లలో పుంగనూరు నియోజకవర్గం పెద్దిరెడ్డి అరాచకాలకు అడ్డాగా మారింది. ప్రతిపక్షాలు లేకుండా చేయాలన్న ఆయన కుట్రలను అడ్డుకునేవారు లేకుండా పోయారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థుల్ని నామినేషన్లు వేయకుండా అడ్డుకుని, దాడులు చేసి వంద శాతం ఏకగ్రీవాలు చేసుకున్నారు. విపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టించి వేధించారు. టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసులు, రౌడీషీట్లు లెక్కకు మిక్కిలి ఉన్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మీద 17 కేసులు, భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) అధినేత బోడే రామచంద్రయాదవ్‌పై 27 కేసులు పెట్టారు. ఈ అరాచకాలే పెద్దిరెడ్డికి ఇప్పుడు ఉచ్చుగా మారాయి. పెద్దిరెడ్డిని ఓడించి తీరాలన్న కసిని పెంచాయి.

- గతేడాది ఆగస్టులో టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పట్టణంలోకి రాకూడదంటూ వైసీపీ శ్రేణులు నల్ల దుస్తులు ధరించి నిరసనలు తెలిపారు. పోలీసులు-టీడీపీ-వైసీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో చంద్రబాబు, చల్లా సహా 498 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టారు.
- పుంగనూరులో ఉన్న టీడీపీ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. సదుం మండలానికి చెందిన రాజారెడ్డి టీడీపీలో క్రియాశీలంగా ఉన్నాడని కిడ్నాప్ చేసి కొట్టారు. కాళ్లు విరిచేసి కల్లూరు అటవీ ప్రాంతంలో పడేశారు.



మండలాలు: పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల
ఓటర్లు: 2,37,719, **పురుషులు:** 1,16,504, **మహిళలు:** 1,21,210, **ట్రాన్స్‌జెండర్లు:** 5

సామాజిక వర్గాలవారీగా..
రెడ్డి: 29,563, **ముస్లిం:** 29,143, **బలిజ:** 22,039, **ఎస్సీ మాల:** 21,774, **యాదవ:** 13,724, **వడ్డెర:** 11,923, **కమ్మ:** 8,989, **ఎస్సీ మాదిగ:** 8,273





పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	చల్లా రామచంద్రారెడ్డి	బోడే రామచంద్రయాదవ్
బలాలు	**బలాలు**	**బలాలు**
● సిట్టింగ్ ఎమ్మెల్యే. గ్రామాల్లో పర్యటనలు.	● పెద్దిరెడ్డి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం.	● పెద్దిరెడ్డి అరాచకాలపై నిరంతర పోరు.
● అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు.	● కూటమి శ్రేణుల మద్దతు	● కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు.
	● సమస్యలపై ఉద్యమాలు	
	● వైసీపీ శ్రేణుల చేరిక	
బలహీనతలు	**బలహీనతలు**	**బలహీనతలు**
● ప్రతిపక్షాలను అక్రమ కేసులతో వేధించడం.	● నియోజకవర్గానికి దూరంగా నివాసం	● పార్టీని స్థాపించి తక్కువ సమయం కావడం.
● అధికార దుర్వినియోగం	● ఆలస్యంగా ప్రచారాన్ని ప్రారంభించడం.	● క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరించకపోవడం.
● విపక్షాలు లేకుండా చేసే కుట్ర.		

బోడే రామచంద్రయాదవ్‌పై ఉక్కుపాదం

బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్.. మంత్రి పెద్దిరెడ్డి అక్రమాలపై నిరంతరం పోరాటం చేస్తున్నారు. పెద్దిరెడ్డికి చెందిన మిల్క్ డెయిరీ రైతులను దోచుకుంటోందని ఆయన సదుంలో రైతు భేరీకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నారు. అయినా ఆయన ఇంటి నుంచి బయటికు రాకుండా వందల మంది పోలీసులు మోహరించారు. అదే రోజు రాత్రి 300 మంది... మూడు గంటల సేపు ఆయన ఇంటి మీద రాళ్లు, కర్రలు, రాడ్లతో దాడి చేశారు. రామచంద్రయాదవ్ పలు మార్లు ఏర్పాటుచేసిన జాబ్‌మేళాలను పోలీసులు అడ్డుకున్నారు. ఏప్రిల్ 29న పెద్దిరెడ్డి స్వగ్రామం సదుంలో ప్రచారానికి వెళ్లిన రామచంద్రయాదవ్ మీద వైసీపీ శ్రేణులు దాడులు చేసి వాహనాలను ధ్వంసం చేశారు. సదుం స్టేషన్ ఎదుటే బీసీవై ప్రచార వాహనాలకు నిప్పు పెట్టారు. గతేడాది పుంగనూరులో ఓ సీఐ బీసీవై కార్యకర్తను చెప్పుతో కొట్టారు.

ఇదీ మన ఎన్నికల సైన్యం!



పోలింగ్ సిబ్బంది	సెక్టార్ అధికారులు/పోలీసులు
3,30,000	10,134
మైక్రో అబ్జర్వర్లు	**బీఎల్ఓలు**
18,961	46,165
పోలీసులు	**నోడల్ అధికారులు**
1,14,000	6,750

రాష్ట్రంలో ఎన్నికల కోసం శ్రమిస్తున్న వారి సంఖ్య: 5,26,010

ఎలగెలగా!


నారా భువనేశ్వరి


వైయస్ భారతి రెడ్డి

వారైతే అలా.. వీరైతే ఇలా!

నీలి, కూలి మీడియా కోతలు


ప్రతిపక్షాలకు చెందిన మహిళా నేతలు, కుటుంబ సభ్యులపై విరుచుకుపడటం! వైసీపీ వాళ్ల జోలికొస్తే మాత్రం సీఐడీతో అరెస్టులు చేయించడం.. ఐదేళ్లుగా ఇదే వరస! చివరికి ఎన్నికల సమయంలోనూ అదే నీచం. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటనలు, లోకేశ్ భార్య నారా బ్రాహ్మణి ఎన్నికల ప్రచారంపై రోత మీడియా, కూలి మీడియా రకరకాలుగా నోరుపారేసుకుంటోంది. కుప్పంలో చంద్రబాబుకు కష్టంగా ఉన్నందునే ఆయన సతీమణి రంగంలోకి దిగారంటూ వక్రభాష్యం చెబుతోంది. చివరికి... నారా బ్రాహ్మణి వస్త్రధారణపైనా అవాకులూ, చెవాకులే! కొందరు వైసీపీ నేతలదీ అదే తీరు. ఇప్పుడేమో... జగన్ సతీమణి భారతీ రెడ్డి పులివెందులలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కడప ఎంపీ అభ్యర్థి అవినాశ్ రెడ్డి తరఫున ఆయన భార్య సమత కూడా జనంలో తిరుగుతున్నారు. అంటే... జగన్, అవినాశ్ పనైపోయినందుకే వీళ్లు రంగంలోకి దిగారనుకోవాలా!? అదేం కాదని, వారు ప్రజల కోసం కష్టపడుతున్నారని ఇదే కూలి, నీలి మీడియా కోతలు కోస్తోంది. భారతిని వీర వనితగా అభివర్ణించడం గమనార్హం!

- అమరావతి, ఆంధ్రజ్యోతి

కీలకం

ఉద్యమాల పురిటిగడ్డ తెనాలిలో గెలుపెవరిదో!

మనోహర్ X శివకుమార్



టీడీపీ-బీజేపీ మద్దతుతో జనసేన అభ్యర్థిగా నాదెండ్ల

వైసీపీ తరఫున రెండోసారీ అన్నాబత్తుని

'ఆంధ్రా ప్యారిస్'లో గెలిచిన పార్టీదే రాష్ట్రంలో అధికారం

1983 నుంచీ ఇదే ఆనవాయితీ

ఉద్యమాల పురిటిగడ్డ.. రాజకీయ చైతన్యానికి తెనాలి పెట్టింది పేరు. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ పట్టణం.. ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు, సినీ, నాటక రంగ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులను జాతికి అందించింది. పైరుగాలులతో పచ్చచీర కట్టుకున్నట్లు కనిపించే ఈ పట్టణం మధ్య నుంచి వెళ్లే మూడు కాల్వలు దానికి 'ఆంధ్రా ప్యారిస్' పేరునూ తెచ్చిపెట్టాయి. 1952లో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడ్డాక 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మే 13న 16వ ఎన్నిక జరగనుంది. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం 1983 ఎన్నికల నాటి నుంచీ ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ గెలిచిన కొణిజేటి రోశయ్య, నాదెండ్ల భాస్కరరావు, అన్నాబత్తుని సత్యనారాయణ, నాదెండ్ల మనోహర్ వంటివారు మంత్రివర్గాల్లోనూ చోటు దక్కించుకున్నారు. తొలి ఎమ్మెల్యేగా గెలిచిన ఆలపాటి వెంకటరామయ్య కుంటుంబంలోనివారే ఇక్కడ ఆరు సార్లు గెలుపొందడం విశేషం. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి తెనాలి రాజకీయ చిత్రం మారుతూ వచ్చింది.



నువ్వా నేనా?

టీడీపీ-బీజేపీ బలపరిచిన అభ్యర్థిగా జనసేన తరఫున ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తుంటే.. అధికార వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తలపడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటుకాకపోవడటంతో ప్రధాన పోటీ వీరిద్దరి మధ్యే నెలకొంది. మనోహర్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కుమారుడే అయినా.. తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు స్పీకర్‌గా కూడా వ్యవహరించారు. తర్వాత జనసేనలో చేరి ఆ పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన శివకుమార్ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అన్నాబత్తుని సత్యనారాయణ కుమారుడు. టీడీపీని వీడి ఆయన వైసీపీలో చేరారు. ఒకసారి ఓడిపోయినా, గత ఎన్నికల్లో గెలుపొందారు. అభ్యర్థులిద్దరూ ఒకే సామాజిక వర్గం కావడం విశేషం. నియోజకవర్గంలో ఎస్సీ, కాపు, కమ్మ సామాజిక వర్గాలది కీలక పాత్ర. తటస్థంగా ఉండే ఆర్యవైశ్యుల ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి.

నియోజకవర్గ స్వరూపం

- నియోజకవర్గం పరిధిలో తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలం ఉన్నాయి.

మొత్తం ఓటర్లు: 2,65,863
పురుషులు: 1,28,188.. **మహిళలు:** 1,37,642, **ట్రాన్స్‌జెండర్లు:** 33

సామాజిక వర్గాల వారీగా ..
ఎస్సీలు: 56 వేలు, **కాపులు:** 40 వేలు, **కమ్మ:** 31 వేలు, **వైశ్యులు:** 26 వేలు, **ముస్లిం:** 24 వేలు, **యాదవ:** 20 వేలు, **రెడ్లు:** 12 వేలు.

- తెనాలి, ఆంధ్రజ్యోతి.

నాదెండ్ల మనోహర్ బలాలు...

సౌమ్యుడు, వివాదరహితుడు. నియోజకవర్గ ప్రజలందరికీ సుపరిచితుడు. జనసేనలో కీలక నేత. టీడీపీ-బీజేపీ నుంచి సంపూర్ణ మద్దతు. స్పీకర్‌గా ఉన్న సమయంలో రూ.100 కోట్లతో తాగునీటి పథకం, నాలుగు లైన్ల రహదారి సహా పలు భారీ అభివృద్ధి పనులు. కాపు, కమ్మ సామాజికవర్గాల ఓట్లు ఎక్కువగా ఉండడం. ప్రభుత్వంపై వ్యతిరేకత.

బలహీనతలు..

జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా రాష్ట్రమంతటా తిరుగుతుండడం వల్ల నియోజకవర్గంలో అందుబాటులో ఉండరనే ప్రచారం. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ వర్గీయుల్లో కొంత అసంతృప్తి.

శివకుమార్ బలాలు..

శివన్నగా స్థానిక జనంలో గుర్తింపు. అందరికీ అందుబాటులో ఉంటూ ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా హాజరవడం, వైసీపీ తరఫున గెలిచినా టీడీపీ వారికీ పనులు చేసిపెట్టడం.

బలహీనతలు..

ఇసుక విచ్చలవిడి తవ్వకాలు.. మేనల్లుడి ఇసుక దందా. గంజాయి విక్రయాలు పెరిగిపోవడం, అల్లరి మూకలను కట్టడి చేయలేకపోవటం, రౌడీషీటర్ల ఆగడాలు, ఆర్యవైశ్యులపై దాడులు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు, 25వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చినా, అన్నీ పట్టణానికి దూరంగా ఉండడం.. ఈ స్థలాల కోసం పొలాలను అధిక రేట్లకు కొనుగోలు చేసి, భారీగా వెనకేశారనే ఆరోపణలు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారుల పేరుపై డ్వాక్రా రుణాలు తీసుకుని.. ఏళ్లు గడచినా పనులు మొదలుపెట్టకపోవడం.

కలయిక మేలుచేస్తుందన్న ధీమా!



గత ఎన్నికల్లో త్రిముఖ పోటీ కారణంగా ఓట్లు చీలి వైసీపీ నెగ్గింది. వైసీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌కు 94,495 ఓట్లు, టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 76,846 ఓట్లు, జనసేన అభ్యర్థి మనోహర్‌కు 29,905 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ-జనసేన కలిస్తే 1,06,751 ఓట్లు. 12,256 ఓట్ల మెజారిటీతో ఉమ్మడి అభ్యర్థి గెలిచేవారు. ఈసారి మనోహర్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవడంతో విజయం ఖాయమని కూటమి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

గుర్తంటే.. నలుగురికీ గుర్తుండిపోయేలా ఉండాలి.

చూసిన వెంటనే కంట్లో పడాలి. అప్పుడే పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన ఓటర్లు.. ఆ గుర్తుపై ఓట్లు గుద్దేస్తారు. ఆ ప్రయత్నమే చేస్తున్నారు విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలు. పెద్ద పెద్ద గాజు గ్లాసులను భుజాన మోస్తూ.. ప్రజలను ఆకర్షిస్తున్నారు.

గుర్తంటే.. గుర్తుండిపోవాలి..



తగ్గేదేలే...!



విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పటమటలో కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. ఓ దివ్యాంగుడు ఇలా తన ట్రై సైకిల్‌కు టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు కట్టుకుని 'జనానికి అండాదండా కూటమి జెండా'లంటూ ప్రచారంలో పాల్గొన్నారు.

బ్యాండేజ్ బబ్లూని నమ్మొద్దు!



'కోడికత్తి డ్రామా ప్రజలకు తెలియడంతో జగన్‌రెడ్డి బ్యాండేజ్ బబ్లూ అవతారమెత్తాడు. చిన్నరాయి తగిలిందని వారం రోజులపాటు బ్యాండేజ్ వేసుకుని ప్రజల సానుభూతి కోసం జగన్ ఆడుతున్న డ్రామాలను నమ్మొద్దు' అంటూ గురువారం ఒంగోలులో టీడీపీ కార్యకర్తలు నుదుటికి, కంటికి బ్యాండేజ్ వేసుకుని చేసిన ప్రచారం ప్రజలను ఆకట్టుకుంది.

- ఒంగోలు కార్పొరేషన్



నవ్వాలా... ఏడ్వాలా?

▸ కామెడీ సరుకుగా మారిన ఏపీ

▸ స్టాండప్ కమెడియన్ల పరాచికాలు

ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే... అన్నపూర్ణ, అమరావతి, గోవిందుడి తిరుపతి, సాగర నగరి విశాఖపట్నం, ఇంకా ఎన్నెన్నో! ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే స్టాండప్ కమెడియన్లకు కావాల్సిన సరుకుగా మారిపోయింది. 'మొన్నే విశాఖ కువెళ్లా' అంటూ ఇటీవల ఒక స్టాండప్ కమెడియన్ చెప్పిన మాటలు... షో విన్న వారికి బాగా నవ్వు తెప్పించాయి. కానీ... రాష్ట్రాన్ని అభిమానించే వాళ్లకు మాత్రం ఆవేదనే మిగిల్చేవే! ఆ 'కామెడీ' ఇలా సాగింది..

"మొన్న విశాఖపట్నం వెళ్లాను! మనం ఒకే చోటికి రెండోసారి వెళితే... చాలా నిర్మాణాలు చిన్నగా కనిపిస్తాయి! (ఇంకా విషయంలోకి రాకముందే ప్రేక్షకుల్లోంచి ఒకరు జై జగన్ అని అరిచారు... నవ్వులు!) నాకు రుషికొండ హిల్ కూడా చిన్నగా కనిపించింది. అంతేకాదు... గీతం యూనివర్సిటీని 'ఓపెన్ యూనివర్సిటీ'లా మార్చేసిన విధానం సూపర్! కాంపౌండ్‌లు ఏవీ లేవు... ఎవరైనా లోపలికి వెళ్లిపోవచ్చు. (జగన్ సర్కారు గీతం వర్సిటీ ప్రహరీలను కూల్చేసిందని చెబుతూ!). ఇక ఫ్లోటింగ్ బ్రిడ్జి పేరుకు తగినట్లే సముద్రంలో 'ఫ్లోట్' అవుతూ వెళ్లిపోయిందట. హమ్మో... విశాఖలో, మొత్తంగా ఏపీలో జాగ్రత్తగా మాట్లాడాల్సిందే! మీకు కోపమొస్తే సీఎంపైనే రాళ్లేస్తారు. ఇక్కడ ఏం చేయకపోవచ్చుకానీ... షో తర్వాత నేను బయటికి వెళ్లాల్సి ఉంటుంది కదా! మా ఇల్లు ఇక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరం! నడిచే పోవాలి. నాకోసం హెలికాప్టర్ కూడా రాదు! (జగన్ దగ్గరి దూరాలకు కూడా హెలికాప్టర్ వాడటాన్ని గుర్తు చేస్తూ) - ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

టీడీపీలో చేరిన బలిజ నేత

▸ నంద్యాల జిల్లాలో వైసీపీకి షాక్



చంద్రబాబును కలిసిన రవికృష్ణ

నంద్యాల (నూనెపల్లె), మే 2: నంద్యాల జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన బలిజ సామాజిక వర్గాన్ని వైసీపీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పట్టించుకోకపోవడంతో కాపు నేతలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత ఎన్నికల్లో బలిజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో బలిజ సంఘం నాయకుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఐఎంఏ యాక్షన్ కమిటీ ఛైర్మన్ జి.రవికృష్ణ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిశారు. డాక్టర్ రవికృష్ణను చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

జగన్.. మాట తప్పావ్!



రాయచోటి ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన కిరణ్ కుమార్ రెడ్డి

ఓటు అడిగే హక్కు నీకెక్కడిది

రాయచోటి, కడప సభల్లో చంద్రబాబు ఫైర్

- మద్యపానం నిషేధిస్తానని చెప్పావా లేదా.? తర్వాతే ఓటడుగుతానని అన్నావా లేదా..?
- వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తాను.. పీఆర్‌సీ ఇస్తానన్నావు.. మధ్యంతర భృతి ఇస్తానన్నావ్.. పీఆర్‌సీ రద్దు చేశావా?
- జాబ్ కేలెండర్ ఇస్తానన్నావు.. డీఎస్సీ వేస్తా అన్నావు.. ఇచ్చావా? ఉద్యోగాలు వచ్చాయా?
- ఉద్యోగులు, జర్నలిస్టులకు ఇళ్లు కట్టిస్తా అన్నావు.. కట్టించావా?
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ పనుల్లో 50 శాతం ఇస్తానన్నావు.. కల్పించావా? ఇవేమీ చేయకుండా.. మాట తప్పిన నీవు ఏ విధంగా ఓటు అడుగుతావ్?

టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం జగన్‌పై ఈ ఐదు ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ఆయనకు ఓటడిగే హక్కు ఎక్కడిదని నిలదీశారు. ప్రజాగళంలో భాగంగా గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో, కడప జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ మేనిఫెస్టోలో చెప్పిన వాటిలో 99శాతం అమలు చేయలేదన్నారు. ఆయన పాలనకు జనం సున్నా మార్కులే వేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో రూ.60 ఉన్న మద్యం ఇప్పుడు రూ.200 అయిందని.. పెరిగిన రూ.140 తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్తోందన్నారు. తాము దమ్మున్న ప్రజా మేనిఫెస్టో తెచ్చామని.. దాని ముందు జగన్ మేనిఫెస్టో వెలవెలబోయిందని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఎవరు చంపారో తెలియదంట..

జగన్ బాబాయిని ఎవరు చంపారో ప్రపంచం మొత్తానికీ తెలుసు.. కానీ, సీఎంకు మాత్రం తెలియదంట..! నిందితుడు అవినాశ్‌రెడ్డిని పక్కనే పెట్టుకుని.. అమాయకుడు, చిన్నపిల్లోడని అంటున్నారు. ఇప్పటికైనా హూ కిల్డ్ బాబాయ్ అని అర్థమైందా మీకు. అర్థమైంటే చేతులు పైకెత్తండి (అనగానే ప్రజలు చేతులు పైకెత్తారు). మళ్లీ కడపలో మీరు ఓటేస్తే మీ ఇంటికి వచ్చేది గొడ్డలే. కిరణ్‌కుమార్‌రెడ్డి, నేను ముఖ్యమంత్రులుగా పనిచేశాం. మీ పట్టాదార్ పాస్‌పుస్తకాలపైన మా ఫొటోలు వేసుకున్నామా..? మీ భూములకు జగన్ ఎటువంటి వారసుడూ కాదు.. మీకా భూమి ఆయన తాత, నాన్న ఇవ్వలేదు. అలాంటప్పుడు జగన్ ఫొటో ఎందుకు? మీ భూముల పై కన్ను వేసిన జగన్ కొత్త చట్టం తెస్తున్నాడు.. మేం రాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తాం. మొదటి నెల నుంచే రూ.4వేలు పెన్షన్ ఇస్తాం. దివ్యాంగులకు రూ.6 వేలు, రెండు చేతులు, రెండు కాళ్లు లేని వారికి రూ.10 వేలు అందిస్తాం. బీసీలకు 50 ఏళ్లకే సంవత్సరాలకే పెన్షన్లు ఇస్తాం. చంద్రన్నబీమా మళ్లీ తెస్తాం.

కిమ్‌లాంటి దుర్మార్గుడు..

మళ్లీ జగన్ వస్తే హైదరాబాద్ సౌత్ కొరియా అవుతుంది. ఆంధ్రప్రదేశ్ నార్త్‌కొరియా అయిపోతుంది ఇలాంటి వాళ్లు ఉంటే. అక్కడ కిమ్ అని ఒకాయన ఉన్నాడు.. అక్కడ ఎవరూ ఆనందంగా ఉండడానికి వీల్లేదు. ఏడవడానికీ వీల్లేదు.. అలాంటి దుర్మార్గుడు జగన్. నా జీవితంలో ఇంత అరాచకం చేసేవాడిని చూడలేదు. నేను ఉన్నప్పుడు ఉచిత ఇసుక వచ్చిందా లేదా? ట్రాక్టర్ ఆ రోజు రూ.1,000. ఇవాళ రూ.5,000. జూన్ 4వ తేదీ నుంచి మళ్లీ ఉచిత ఇసుక విధానం తీసుకొస్తున్నా. దేవుని కడపలో నిలబడి ఈ సీఎంకు సవాల్ విసురుతున్నా. రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీకి రెండుసార్లు ఫౌండేషన్ వేశావు ఇంకెప్పుడు తెస్తావు. గులకరాయి డ్రామా అందరికీ గుర్తుంది. గులక రాయి కనపడదు, దెబ్బమాత్రం కనపడుతుంది. కోడికత్తితో ఎయిర్‌పోర్టుకు వెళ్లానంట, ఇపుడు గులకరాయితో హత్యాప్రయత్నం చేశానంట. మరోపక్క గొడ్డలితో నరికి నారాసుర రక్తచరిత్ర అనిరాసిన మీకు.. నీతి నిజాయితీ పద్ధతి ఉందా? మేం అధికారంలోకి వస్తే.. ముస్లిం మైనారిటీల రక్షణ బాధ్యత నేను తీసుకుంటాను. నవరత్నాలు అంటున్నాడు.. ఆ నవరత్నాలు ఏంటో తెలుసా? ఇసుక మాఫియా, మద్యం మాఫియా, భూమాఫియా, మైనింగ్ మాఫియా, హత్యా రాజకీయాలు, ప్రజల ఆస్తుల కబ్జా.. అదే రేపు వస్తోంది.. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్.. మీ భూమి ఏమీద కన్నేశాడు.. మళ్లీ గెలిస్తే మీ భూమి మీది కాదు.. ఆశ వదులుకోండి. ఏడో రత్నం ప్రభుత్వ టెర్రరిజం సెటిల్‌మెంట్స్, ఎనిమిదో రత్నం దాడులు, కేసులు. తొమ్మిదో రత్నం శవరాజకీయాలు, డ్రామాలు, గులకరాయి నాటకాలు. ఇలాంటి వ్యక్తి మీకు కావాలా?

- గత ఐదేళ్లలో ప్రజల జీవితంలో ఎటువంటి మార్పులు రాలేదు. ఆదాయంలో పెరుగుదల లేదు. జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. ఈ కోతల ప్రభుత్వం ఇంకా ఎందుకు అవసరమో ప్రజలు గుర్తించాలి.
- తమిళనాడు, తెలంగాణల్లో దొరికే మద్యం బ్రాండ్లు మన రాష్ట్రంలో ఎందుకు దొరకడం లేదు? జే బ్రాండు నాసిరకం మద్యం మాత్రమే దొరుకుతోంది. మేమొచ్చాక విషపూరిత బ్రాండ్లను రద్దు చేస్తాం.

- చంద్రబాబు

కరెంటు తీసేసినా..

చంద్రబాబు గురువారం సాయంత్రం కడప విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గాన కడప నగరానికి వస్తుండగా అలంఖాన్ పల్లె వరకు 3 కిలోమీటర్ల మేర విద్యుద్దీపాలు ఆర్పివేశారు. కాగా.. నగరంలో చంద్రబాబు భారీ రోడ్‌షో నిర్వహించారు. రాత్రి 9.30 గంటలకు సభ ముగించుకుని హైదరాబాద్ బయల్దేరారు. -కడప/రాయచోటి, ఆంధ్రజ్యోతి.

సీఈసీ పర్యవేక్షణలో

పుంగనూరు ఎన్నికలు జరపాలి

▸ పెద్దిరెడ్డి అరాచకాలతో భయపడుతున్న ఓటర్లు

▸ ఈసీకి మాజీ సీఎం కిరణ్ ఫిర్యాదు



పుంగనూరు, కలికిరి, మే 2: 'పుంగనూరులో హింసాత్మక ఘటనలు లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలి. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం స్వీయ పర్యవేక్షణలో పుంగనూరు ఎన్నికలు నిర్వహించాలి' అని మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఈమేరకు ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత నెల 14, 15తేదీల్లో సైతం తాను ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. 'పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి వ్యవహారాలు ఎన్నికల కమిషన్‌ను సవాలు చేసే విధంగా ఉన్నాయి. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, వారి కుటుంబీకులు తీవ్ర స్థాయిలో హింసను ప్రేరేపిస్తున్నారు. దీంతో ఓటర్లు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అధికార పార్టీలో ఉండటం వల్ల పెద్దిరెడ్డి తమకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ, పోలీస్ అధికారులను ఎన్నికల కంటే ముందుగా నియమించుకున్నారు. వారు వైసీపీకి మద్దతుగా ప్రతిపక్షాలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు పెడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. మంత్రి పెద్దిరెడ్డికి మద్దతుగా ఏకపక్షంగా పనిచేస్తున్న అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గం ఓటర్లలో విశ్వాసం పెరగడానికి, స్వేచ్ఛగా ఓటు వేయడానికి, ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి, పుంగనూరు నియోజకవర్గాన్ని పూర్తిగా ఎన్నికల కమిషన్ తన ఆధీనంలోకి తీసుకోవాలి. ఎన్నికల కేంద్ర పరిశీలకులను ప్రత్యేకంగా నియమించాలి. అన్ని సమస్యాత్మక, కీలకమైన పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు అమర్చాలి. కేంద్ర పారా మిలిటరీ బలగాలను వెంటనే మోహరించాలి. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు కొనసాగించాలి. పుంగనూరుకు ప్రత్యేకంగా ఎన్నికల పరిశీలకుడిని నియమించాలి. పెద్దిరెడ్డికి మద్దతుగా ఏకపక్షంగా ప్రతిపక్షాలను ఇబ్బందులు పెడుతూ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలి. వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించి బదిలీ చేసి తటస్థ ప్రవర్తన గల అధికారులను వెంటనే నియమించాలి' అని కిరణ్ కుమార్ రెడ్డి ఈసీకి విజ్ఞప్తి చేశారు. తన లేఖకు ఇటీవల కాలంలో జరిగిన విధ్వంసాలు, దాడులు, హత్యాయత్నాలకు సంబంధించిన వివరాలను జతపరిచారు.

జగన్‌కు హత్యా రాజకీయాలే ఎక్కువ

▸ బాబాయిని చంపిన హంతకుడిని కాపాడుతున్నారు

▸ కడప స్టీల్‌ప్లాంటుకు రెండుసార్లు శంకుస్థాపనలు

▸ అయినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు

▸ ఎంపీగా గెలిపిస్తే నేను మీ గొంతునవుతా

▸ పార్లమెంటులో ప్రత్యేక హోదా కోసం పోరాడతా

▸ జమ్మలమడుగు ఎన్నికల ప్రచారంలో షర్మిల



జమ్మలమడుగు మండలం సుద్దపల్లిలో ప్రసంగిస్తున్న షర్మిలారెడ్డి

కడప/అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): జగన్‌కు రాష్ట్రాభివృద్ధి కన్నా హత్యా రాజకీయాలే ఎక్కువ. బాబాయిని చంపిన హంతకుడిని జగన్ కాపాడుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వివేకా రామలక్ష్మణుల్లా ఉండేవారు. వివేకాను గొడ్డలితో ఏడుసార్లు నరికి చంపారు. సీబీఐ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. అవినాశ్ అరెస్టు కర్నూలు తలపించింది" అంటూ పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దముడియం, జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... 'కడపలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నదే వైఎస్ ఆశయం. ఆయన బతికున్నప్పుడే బ్రహ్మణీ స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు పనులు కొంతమేర జరిగాయి. ఆయన మరణానంతరం ఆగిపోయాయి. అయితే కడప స్టీల్‌ప్లాంటుకు చంద్రబాబు ఒకసారి, జగన్ రెండుసార్లు శంకుస్థాపన చేసి దాన్ని శంకుస్థాపనల ప్రాజెక్టుగా మార్చారు. స్టీల్‌ప్లాంటు పూర్తయి ఉంటే ఎంతోమందికి ఉద్యోగాలు వచ్చేవి. ఇదేనా జగన్‌కు సొంత జిల్లాపై ఉన్న ప్రేమ?' అని నిలదీశారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు థర్మల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న 2వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పారని, ఇదే తొలి సంతకం అవుతుందని ఎర్రగుంట్లలో నిర్వహించిన బహిరంగ సభలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారం చేపట్టాక ఆ హామీని మర్చిపోయారని మండిపడ్డారు. తన మీటింగ్‌కు రానివ్వకుండా కార్మికులను అడ్డుకున్నారని ఆరోపించారు. కార్మికులు 7, 8వేల రూపాయల జీతంతో బతుకుతున్నారని, ఇది న్యాయమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీపీపీని కూడా ప్రైవేటుపరం చేసేందుకు చూస్తున్నారని అదానీ, అంబానీలకు కట్టబెట్టే యత్నం చేస్తున్నారని, జాతీయ సంపదను కొల్లగొట్టాలని చూస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. బాబు, జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్నా కనీసం రాజధాని కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రాలకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఉన్నాయని, మన రాష్ట్రానికి ఏముందని ప్రశ్నించారు. మూడు రాజధానులన్న జగన్ చివరకు ఒక్కటి కూడా లేకుండా చేశారని విమర్శించారు. 'వివేకా ఆత్మ ఈ గడ్డ మీద ఘోషిస్తోంది. న్యాయం కోసం సునీత తొక్కని గడప లేదు. మా పక్క న్యాయం, ధర్మం ఉంటే... అటువైపు అన్యాయం, అధర్మం, డబ్బు ఉన్నాయి. కడప ప్రజలు న్యాయం వైపే నిలబడాలని కోరుతున్నా. ఎంపీగా గెలిపిస్తే నేను మీ గొంతునవుతా.. పార్లమెంటులో ప్రత్యేక హోదా కోసం పోరాడతా. స్టీలు ఫ్యాక్టరీ నిర్మిస్తాం. నేను మీ బిడ్డను... దేనికీ భయపడను. కొంగుచాపి న్యాయం అడుగుతున్నాం. హస్తం గుర్తుకు ఓటు వేసి వైఎస్ఆర్, వివేకాకు న్యాయం చేయండి' అని షర్మిల కోరారు.

7న కడపలో రాహుల్ సభ

కాంగ్రెస్ పార్టీ ఈ నెల 7న కడపలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొంటారు. ఈ మేరకు రాహుల్ కార్యాలయం నుంచి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు గురువారం సమాచారం అందింది. జగన్ సర్కారు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాహుల్ ప్రసంగించనున్నారు.

జాబు రావాలంటే జగన్ పాలన పోవాలి!

▸ నవ సందేహాల పేరిట జగన్‌కు షర్మిల లేఖ

అమరావతి/కడప, మే 2(ఆంధ్రజ్యోతి): 'జాబు రావాలంటే బాబు పోవాలని ఎన్నికల ముందు ప్రజలను నమ్మించారు.. మరి మీ ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు ఎందుకు పోతున్నారు?.. ఇప్పుడు జాబు రావాలంటే మీ పాలన పోవాలని అంగీకరిస్తారా' అంటూ ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి జగన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు నిరుద్యోగులకు జగన్ ఇచ్చిన ఉద్యోగాల హామీ విషయంలో తాము అడుగుతున్న నవ సందేహాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం జగన్‌కు ఆమె లేఖ రాశారు.

- 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఆ హామీ ఏమైంది? ఏయే శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు?
- ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అన్నారు ఎందుకివ్వలేదు?
- 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్నారు. 22 ఎంపీలను ఇస్తే ఏం చేశారు?
- గ్రూప్-2 నోటిఫికేషన్ రెండుసార్లు ఇచ్చి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదెందుకు?
- విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదు?
- 23 వేలతో మెగా డీఎస్సీ అని చెప్పి 6 వేలతో దగా డీఎస్సీ ఎందుకు వేశారు? అది కూడా ఎన్నికల కోడ్‌కు అడ్డంకిగా మారే పరిస్థితులలో ప్రకటించడం మోసం కాదా?
- రాష్ట్రంలో నిరుద్యోగులు 7.7 శాతం పెరిగారంటే అది మీ వైఫల్యం కాదా? మళ్లీ వలసలు మొదలైన మాట వాస్తవం కాదా?
- స్కిల్ ట్రైనింగ్ సెంటర్లను ఎందుకు నిలిపివేశారు?
- ఐదేళ్ల క్రితం జాబు రావాలంటే బాబు పోవాలని ప్రచారం చేశారు.. ఇప్పుడు జాబు రావాలంటే మీ పాలన పోవాలని అంగీకరిస్తారా?



20 లక్షల ఉద్యోగాల కల్పన

బాధ్యత నాది

▸ యూనిఫైడ్ పోర్టల్‌ను ఏర్పాటు చేస్తాం

▸ యువతకు నారా లోకేశ్ భరోసా



చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): 'ఏటా సింగిల్ జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. నిరుద్యోగులు పేపర్లు తీసుకుని వెతుక్కోవాల్సిన అవసరం లేదు. నోటిఫికేషన్‌లో ప్యూన్ నుంచి గ్రూప్1, 2 వరకు పోస్టులు వరకూ అన్నీ ప్రకటిస్తాం. యూనిఫైడ్ పోర్టల్ తీసుకొస్తాం. వెబ్‌సైట్‌లో మీ వివరాలు నమోదు చేస్తే ఏ పరీక్షకైనా హాజరయ్యేలా వెసులుబాటు కల్పిస్తాం' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువతకు భరోసా ఇచ్చారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పరిధిలోని ఐతేపల్లి వద్ద గురువారం ఆయన 'హలో లోకేశ్' కార్యక్రమం ద్వారా స్థానిక యువతతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 'సూపర్ సిక్స్'లో మొదటి హామీగా ఉన్న 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వం ఏర్పాటైన ఐదేళ్లలో కల్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో వివిధ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు లోకేశ్ తెలిపారు. తిరుపతికి టీసీఎల్, డిక్సన్, సెల్‌కాన్ తదితర పరిశ్రమలు టీడీపీ హయాంలోనే వచ్చాయని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో రెండు డీఎస్సీల ద్వారా 32 వేల పోస్టులు భర్తీ చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 2.35 లక్షల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన జగన్ ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదన్నారు. జగన్ తన ఇద్దరు బిడ్డల నూ విదేశాల్లోనే చదివిస్తున్నారని, కానీ మన బిడ్డలు మాత్రం విదేశాల్లో చదువుకోకూడదా అని ప్రశ్నించారు.

"జగన్మోహన్‌రెడ్డి పదేపదే చంద్రబాబును ముసలోడని అంటున్నారు. ఈ రోజుతో అది తేలిపోవాలి. కొబ్బరికాయ ఇస్తే కనీసం వంగి కొట్టలేని, బస్సు నుంచి స్టూలు లేనిదే కిందకు దిగలేని.. ముసలోడు ఈ సైకో జగన్. ఆయనకు ఓ సవాల్ విసురుతున్నా. మై డియర్ జగన్.. టైం, డేట్ నువ్వు ఫిక్స్ చేయ్. నేను చంద్రబాబును తీసుకొస్తా. ఇక్కడే తిరుమల ఉంది. నువ్వు ముందు మెట్లు ఎక్కుతావో, చంద్రబాబు ముందు ఎక్కుతారో చూద్దాం. అప్పుడు ముసలోడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు" అని అన్నారు. 'గతంలో కోడికత్తిలా తాజాగా గులకరాయి డ్రామా ఆడారు. అదో ఇంపోర్టెడ్ రాయి. కోడికత్తి డ్రామా జరిగిన 15 రోజుల తర్వాత బాబాయ్ శవమయ్యారు. ఇప్పుడు మళ్లీ తాడేపల్లి నుంచి ఏ శవం బయటికి వస్తుందోనని కుటుంబసభ్యులు భయంగా ఉన్నారు. సొంత తల్లి, చెల్లే జగన్‌ను చూసి భయపడుతున్నారు. రాష్ట్రంలో ఇక మహిళల పరిస్థితి ఏంటి' అని లోకేశ్ ప్రశ్నించారు.

మళ్లీ జగన్ వద్దు!



పాలకొండలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న జనసేనాని పవన్ కల్యాణ్

వైసీపీకి ఓట్లు వేస్తే ఆస్తులు పోతాయ్: పవన్

విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి/పాలకొండ, మే 2: 'విశాఖలో భూములు లాక్కుంటున్నారు. ధనవంతులు భయపడి అమెరికాకు వెళ్లిపోతున్నారు. ఎన్నాళ్లిలా? ఎంతమంది సొంత ఇళ్లను వదిలి వెళ్లిపోగలరు? మేం అండగా ఉంటాం. మీరు ధైర్యంగా నిలబడండి. వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయండి' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన మన్యం జిల్లా పాలకొండలో, విశాఖలో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. ఉత్తరాంధ్ర, విశాఖపట్నం అంటే తనకు ప్రత్యేక అభిమానమని, ఇక్కడే నటనలో ఓనమాలు నేర్చుకున్నానన్నారు. తన సినిమాలో ఉత్తరాంధ్ర యాసలో ఓ పాట బాగా గుర్తుకు వస్తోందంటూ...'మళ్లీ నీకెందుకురా పెళ్లి?' అనే పాట పాడి వినిపించారు. ఇది ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌కు వర్తిస్తుందన్నారు. అధికారం ఇస్తే సీపీఎస్ రద్దు చేస్తానని, మెగా డీఎస్సీ నిర్వహిస్తానని, ఏటా జాబ్ కేలెండర్ విడుదల చేస్తానని ఇలా చాలా చెప్పారని, కానీ ఏదీ చేయలేదని..అటువంటి వ్యక్తికి మళ్లీ ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. అందుకే 'మళ్లీ.. నీకెందుకురా పెళ్లి' అంటున్నానని చమత్కరించారు. జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీపైనే తొలి సంతకమని పవన్ ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం రంగులు వేయడానికి, తీయడానికి రూ.2,300 కోట్లు తగలేసిందని ధ్వజమెత్తారు. ఇందులో పదో వంతు రూ.214 కోట్లు ఇచ్చి ఉంటే తోటపల్లి ఎడమ కాలువ, జంపరకోట పనులు పూర్తయ్యేవని చెప్పారు. తాను మాటిస్తున్నానని, కూటమి ప్రభుత్వం రాగానే గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడడంతో పాటు సబ్సిడీపై ట్రైకార్ రుణాలు అందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తాం' అని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుకు సంబంధించి ఏడాదిలోగా బలమైన పరిష్కారం చూపిస్తామన్నారు.ఇంకా ఏమన్నారంటే..

రాజకీయ నాయకులకు ఓటమి తెలియాలి

రాజకీయ నాయకులకు ఓటమి తెలియాలి. అప్పుడే బాధ్యతగా ఉంటారు. పదవులు ఈ రోజు వస్తాయి, రేపు పోతాయి. కానీ ప్రజలను కష్టాల్లో ఆదుకుంటే వారి గుండెల్లో నాయకుల స్థానం చెక్కు చెదరకుండా ఉంటుంది. దాని కోసమే ప్రయత్నిస్తున్నా. చంద్రబాబును జైల్లో పెడితే.. రాజమండ్రి వెళ్లి ఆయనకు అండగా నిలబడినప్పుడు సొంత పార్టీ వారే నన్ను ప్రశ్నించారు. ప్రతిపక్షాల మధ్య ఉన్న అనైక్యతే శత్రువైన జగన్‌కు బలంగా మారుతోందని.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి ఉంటేనే వైసీపీని ఓడించగలుగుతామని.. ప్రజలకు మంచి చేయగలుగుతామని, అందుకే అలా చేశానని చెప్పా ను. గాజువాక నుంచో, భీమవరం నుంచో గెలిపించి ఉంటే.. అసెంబ్లీలో 151 మంది ఎమ్మెల్యేలను చొక్కా పట్టుకుని సమస్యలపై ప్రశ్నించేవాడిని. కూటమిని గెలిపిస్తే మేమే కాకుండా అందరితో పనిచేయిస్తాం. జగన్ వంటి దుష్టుడి నుంచి ప్రజలను కాపాడాలంటే.. పోరాటమే శరణ్యం. యువత సముద్రంలా ఆవేశంగా ఉప్పొంగగలదు. మహిళలకు ఆదిపరాశక్తికి ఉన్నంత శక్తి ఉంది. అంతా కలిసి పోరాటం చేస్తే అనుకున్నది సాధించగలుగుతాం. ఉత్తరాంధ్రలో చక్కటి క్రీడాకారులు ఉన్నారు. కరణం మల్లీశ్వరి వంటి వారు ఈ ప్రాంతం వారే. అలాంటి వారిని మరింత మందిని తయారు చేయడానికి విశాఖను ఆర్థిక రాజధానిగానే కాకుండా క్రీడా రాజధానిగా కూడా అభివృద్ధి చేస్తాం. ల్యాండ్ టైటిల్ చట్టంతో ప్రతి ఒక్కరూ ఆస్తులు కోల్పోవలసి వస్తుంది. ఆలోచించుకుని మరీ ఓట్లు వేయాలి.

- జగన్ తన సొంత చెల్లెళ్లకే న్యాయం చేయలేదు. వారికి తగిన గౌరవం ఇవ్వలేదు. దాంతో వారు న్యాయం కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తున్నారు. అటువంటి వ్యక్తి మహిళల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తారని కోరుకోవడం కూడా అవివేకమే.
- 'భవన కార్మికుల సంక్షేమ నిధి రూ.450 కోట్లను జగన్ ప్రభుత్వం దోచుకుంది. మేం రాగానే తిరిగి ఆ నిధిని అందుబాటులోకి తెస్తాం. ఆ నిధికి నేను కోటి రూపాయలు విరాళంగా అందిస్తా.
- చిన్న రాయి తగిలితే దానికి బ్యాండేజీ వేసి, మేకప్ వేసుకొని ఏదో జరిగిపోయినట్లు బిల్డప్ ఇచ్చిన జగన్‌కు.. 30 వేల మంది ఆడపిల్లలు కనిపించకుండా పోతే.. వారి తల్లిదండ్రుల ఆవేదన ఎలా ఉంటుందో తెలియకుండా పోయింది. కనీసం వారిని కలిసి ఓదార్చాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు.

- పవన్ కల్యాణ్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



ఆ వెలుగు జిలుగులేవి?

ఇంద్రధనస్సు వంపులతో.. నిండైన రంగు డిజైన్లతో.. కాంతులు జిమ్మే విద్యుత్ దీపాలతో నగరంలోని చిట్టినగర్ సొరంగం గత టీడీపీ ప్రభుత్వంలో ధగధగలాడింది. వైసీపీ అధికారంలోకొచ్చాక నిర్వహణను గాలికి వదిలేసింది. సొరంగం రంగులు వెలిసిపోయాయి. విద్యుత్ వెలుగుల ఊసే లేదు. అందం, ఆకర్షణ అసలే లేదు.





మానికొండలో యార్లగడ్డ, బాలశౌరి సమక్షంలో టీడీపీలో చేరిన ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యలమర్తి రాజు

వంశీకి సొంత ఊళ్లో షాక్

● టీడీపీలో చేరిన సర్పంచి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు

ఉంగుటూరు, మే 2 : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు తన సొంతగ్రామమైన ఉంగుటూరులో బిగ్‌షాక్ తగిలింది. గ్రామసర్పంచ్ కాటూరి వరప్రసాద్‌తోపాటు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యలమర్తి రాజు వైసీపీని వీడి టీడీపీ గూటికి చేరారు. గురువారం మానికొండ ఎన్నికల ప్రచారంలో ఉన్న గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, బందరు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని కలిసి వారి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిద్దరికీ యార్లగడ్డ పసుపుకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. యార్లగడ్డ లాంటి ఉన్నతమైన వ్యక్తిత్వం, విలువలుగల రాజకీయనాయకుడు ఈ నియోజక వర్గానికి తప్పకుండా అవసరమని, రానున్న ఎన్నికల్లో యార్లగడ్డ వెంకట్రావు అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు మా వంతు శక్తివంచనలేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్, మాజీ జడ్పీటీసీ తెలిపారు. ఇరువురు ప్రజాప్రతినిధుల చేరికతో ఉంగుటూరు టీడీపీలో జోష్ పెంచింది.

మహిళా నెట్‌బాల్‌కు జట్టు ఎంపిక



జట్టుకు ఎంపిక అయిన క్రీడాకారులతో టి.విజయలక్ష్మి, ఎస్.కల్పన

లబ్బీపేట, మే 2 : ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు త్రిశూర్ కొరట్టిలోని కాలికట్ యూనివర్శిటీ పరిధిలో ఉన్న నైపుణ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ నెట్‌బాల్ (మహిళా) పోటీల్లో పాల్గొనే కృష్ణా యూనివర్శిటీ జట్టును ఎంపిక చేసినట్టు ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ కల్పన తెలిపారు. జట్టులో సభ్యులుగా క్రీడాకారులు సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన మహేశ్వరి, యమునా భాయ్, వర్షిణి, రమిత, ధనశ్రీ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన సుష్మ, రేచెల్ 2, సాయిదుర్గ, వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన నాగేశ్వరి, అంజలి, మైలవరం డాయల్ హెచ్ఆర్ జీడీసీకి చెందిన విజయ భార్గవి, పావని ఎంపికయ్యారు. జట్టు కోచ్‌గా డి.నవీన్ కుమార్, మేనేజర్‌గా పి.శివ భాస్కరరావు నియమితులైనట్టు తెలిపారు. ఎంపిక అయిన క్రీడాకారులను సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీ అభినందించారు.

ఇసుక తవ్వకాలపై మంత్రి జోగికి నిలదీత

పెనమలూరు, మే 2 : ఇసుక తవ్వకాలపై మంత్రి జోగి రమేష్‌ను పెదపులిపాక గ్రామస్థులు నిలదీశారు. గురువారం గ్రామంలో ప్రచారానికి వచ్చిన జోగి రమేష్‌ను గ్రామస్థుడు కొణతం శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ప్రశ్నించి సమాధానం చెబితేనే తమ వీధిలో ప్రచారానికి రావాలని తేల్చి చెప్పారు. దీంతో అతడిని జోగి రమేష్ పక్కకు తీసుకెళ్లి సముదాయించారు. శివరాత్రి తర్వాత పెదపులిపాక తదితర రీచ్‌లలో వైసీపీ వర్గీయులు ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా తమను మాత్రం ఎందుకు నిలువరించారో తెలపాలని ప్రశ్నించారు. టీడీపీ వారికి ఒక న్యాయం, వైసీపీ వారికి మరో న్యాయమా అని ప్రశ్నించారు.

టీడీపీ జెండా కట్టుకొన్న వ్యక్తిపై దాడి

పెదపులిపాకలో గురువారం జోగి రమేష్ ప్రచారానికి రాగా ఎస్సీ కాలనీకి చెందిన జోజి అనే వ్యక్తి పొరపాటున టీడీపీ జెండాతో వారి వెంట వచ్చాడు. అతడిని, అతని వాహనాన్ని వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేసి అతడిపై దాడికి పూనుకొన్నారు. వారి దాడిలో అతని ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. అతని భార్య, జోజి ఎదురుతిరగడంతో వైసీపీ వర్గీయులు వెనుతిరిగారు. గ్రామంలో వైసీపీ దాడితో ఉద్రిక్తత చోటుచేసుకొంది.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా

● కూటమి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా

పెనమలూరు, మే 2 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని టీడీపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరి వెల్లడించారు. గురువారం కానూరు పంట కాల్వ రోడ్డులోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో పశ్చిమ నియోజకవర్గం ముస్లిం సంఘాల సభ్యులతో కలిసి మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత భవిష్యత్తులో ముస్లిం సమాజం కోసం చేపట్టబోయే కార్యాచరణను వివరించారు. ప్రధాన సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. గతంలో రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ మైనారిటీలను తమ ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారని, కానీ మోదీ వచ్చాక వారికి ప్రాధాన్యత, భరోసా ఇచ్చి గౌరవించారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానం చేసి ముస్లిం, క్రిస్టియన్, ఎండోమెంటు ఆస్తులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తాను మాట తప్పి పని చేయకుంటే ఎవరైనా ప్రశ్నించవచ్చని తెలిపారు. ప్రతి డివిజన్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కిలోమీటరు పరిధిలోనే పోలింగ్ కేంద్రాలు

● ఊర్మిళానగర్ ఓటర్లకు ఊరట ● రెండుచోట్ల నాలుగు పోలింగ్ కేంద్రాలు

భవానీపురం, మే 2 : అన్నివర్గాల ప్రజలు నివసించే 43వ డివిజన్ ఊర్మిళానగర్ పరిధిలో ఓటర్లు కిలో మీటరులోపే నాలుగు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈనెల 13న జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్, ఇతర ఏర్పాట్లను ఎన్నికలకు రెండు రోజుల ముందు ఏర్పాటు చేస్తారు. ఊర్మిళా సుబ్బారావునగర్ (రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ సతీమణి) ఐఏఎస్ పేరిట ఏర్పడిన ఈ కాలనీలో సుమారు 5వేల మందికిపైగా ఓటర్లులున్నారు. డివిజన్ ఓటర్లు 11 వేలకుపైగా ఉండగా సగం ఓటర్లు ఇక్కడే ఉన్నారు. సిద్ధం కృష్ణారెడ్డి ఎలిమెంటరీ స్కూల్‌లో 1, 3, 5 పోలింగ్ కేంద్రాల్లో 3600 వరకు ఓటర్లులుండగా, ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద 1102 మంది ఓటర్లు 4వ నెంబర్ పోలింగ్ బూత్ వద్ద ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇక్కడ ప్రత్యేక ర్యాంపు ఏర్పాటు చేసి వృద్ధులు, వికలాంగులు సునాయాసంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేలా ఏర్పాటు చేశారు.

దుర్గగుడిలో దక్షిణామూర్తికి పూజలు

వన్‌టౌన్, మే 2 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మల్లేశ్వరాలయ కుడ్యాలపై నెలకొన్న దక్షిణామూర్తి విగ్రహానికి ప్రతి గురువారం ఆలయ అర్చకులు అర్చనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మే 2వ తేదీ గురువారం దక్షిణామూర్తికి వివిధ ఉపచారాలు చేసి పూజలు నిర్వహించారు. అంతకముందు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **బంగారు తాపడానికి విరాళం**

దుర్గమ్మ వారి గోపురంలో స్వర్ణతాపడం నిమిత్తం డోనర్‌సెల్‌లో గురువారం హైదరాబాద్‌కు చెందిన జాస్తి కిషోర్ కుటుంబసభ్యులు రూ.2 లక్షలను విరాళంగా సమర్పించారు. ఈవో కేఎస్ రామారావు ద్వారా చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

● **క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను సమీక్ష**

దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ఈవో కేఎస్ రామరావు గురువారం పరిశీలించారు. కాంట్రాక్టర్లతోపాటు ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులతో ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కాలపరిమితికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నదాన భవనం, ప్రసాదం పోటు, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

● **అన్నప్రసాద విభాగంలో ఈవో ఆకస్మిక పరిశీలన**

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణ విభాగాన్ని గురువారం ఈవో కేఎస్ రామారావు ఆకస్మికంగా పరిశీలించారు. అన్నప్రసాద నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విరాళాల కౌంటర్‌లో వివరాలను పరిశీలించి చూశారు. విరాళాలిచ్చే భక్తులతో సామరస్యంగా మెలిగి వారి మన్ననలను పొందాలని సిబ్బందికి సూచించారు. అన్నప్రసాద రుచి, నాణ్యతపై ఆయన పూర్తి శ్రద్ధ వహించి భక్తుల మన్ననలు పొందే విధంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.



దక్షిణామూర్తి పూజలో పాల్గొన్న ఈవో రామారావు

మేనిఫెస్టోతో రాష్ట్ర ఆర్థిక స్థితిని తిరగరాద్దాం

● ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, మే 2 : టీడీపీ కూటమి మేనిఫెస్టోతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తిరగరాద్దామని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. గురువారం కానూరులో జరిగిన ప్రచార యాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. టీడీపీ, వైసీపీ మేనిఫెస్టోలకు.. నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా ఉందని పేర్కొన్నారు. వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కేవలం ఇసుక, అక్రమ మైనింగ్‌లతో వేల కోట్లకు పడగలెత్తి ఎన్నికలను శాసించేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు.

● **ముస్లింలకు పెద్దపీట**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోనగర్ చెంతనే ఉన్న సనత్‌నగర్‌లోని తూర్పు కాపులు, ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు.



కానూరులో ప్రజలకు అభివాదం తెలుపుతున్న నందమూరి రామకృష్ణ, బోడె ప్రసాద్

నియోజకవర్గంలో 35 వేల ఓట్లున్న ఉయ్యూరు, గంగూరు, తాడిగడప, యనమలకుదురు, కానూరు ప్రాంతాల్లోని ముస్లింలకు పోరంకి, నిడమానూరు రోడ్డులో ఒకేచోట 15 ఎకరాల్లో మోడల్ మసీదు, మోడల్ ఈద్గా, షాదీఖానాల ఏర్పాటుకు చంద్రబాబు వద్ద రెండు రోజుల క్రితం హామీ తీసుకున్నట్టు తెలిపారు. వీటికి అనుసంధానంగా ఇళ్ల స్థలాలు లేని ముస్లిం సోదరులకు దగ్గర్లోనే ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీలకు డ్రైనేజీలు, రోడ్లు అభివృద్ధి చేస్తామని తెలిపారు. మొన్నటి బుధవారం ఉయ్యూరు సంఘటనతో జోగి రమేష్ కుటుంబం ఆరాచకం ప్రజలకు తెలిసి పోయిందన్నారు. ప్రజల మధ్య తొడగొట్టడం, రెచ్చగొట్టడం లాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో చెల్లవని తన పిల్లలకు జోగి రమేష్ నేర్పాలని హితవు పలికారు.

ఎన్డీఏ కూటమి గెలుపు తథ్యం : నందమూరి రామకృష్ణ

ఉంగుటూరు, మే 2 : వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో పూర్తిగా విసుగెత్తిపోయిన ప్రజానీకం ఓటు అనే ఆయుధంతో జగన్‌కు సరైన గుణపాఠం చెప్పి, ఎన్డీఏ కూటమిని గెలిపించడం తథ్యమని నందమూరి రామకృష్ణ జోస్యం చెప్పారు. గురువారం సాయంత్రం మండలంలోని మానికొండ, తరిగొప్పల, వేంపాడు గ్రామాల్లో గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారంలో బందరు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరితో పాటు ముఖ్యఅతిథులుగా నందమూరి రామకృష్ణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నేతలందరూ స్థానిక ప్రజలతో మమేకమవుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రజలకు అందించనున్న పథకాలను, నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డ ప్రత్యేకంగా రూపొందించిన సూపర్‌సిక్స్ ప్రణాళికలను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఈసందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని, సమాజంలో ప్రతి పౌరుడు బాధ్యతతో ఆలోచించి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.



మానికొండ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నందమూరి రామకృష్ణ, యార్లగడ్డ, ముద్దరబోయిన

● **గన్నవరం సీటు గెలిచి భువనమ్మకు కానుకగా ఇస్తాం : కొనకళ్ల**

యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిచి, భువనమ్మకు ఈ సీటు కానుకగా ఇవ్వడం ఖాయమని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మండలంలోని మానికొండ, తరిగొప్పల, వేంపాడు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించిన ఘనత టీడీపీదన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గన్నవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని మానికొండ, తరిగొప్పల, వేంపాడుగ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

డివిజన్ సమస్యలు పరిష్కారం కావాలంటే..

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

విద్యాధరపురం, మే 2 : డివిజన్‌లో సమస్యలు పరిష్కారం కావాలంటే పశ్చిమ నియోజకవర్గంలో కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరినీ, పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను గెలిపించుకోవల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని 40 డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన వెంకట సుబ్బయ్య అన్నారు. గురువారం నిర్వహించిన 40వ డివిజన్ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో కష్టనష్టాలను అధిగమించి ఐదేళ్లుగా టీడీపీకి అండగా ఉన్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. డివిజన్‌లో అత్యధిక మెజారిటీ తెప్పిస్తామని తెలిపారు. అందరినీ కలుపుకుని పని చేస్తామని, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి సుజనాచౌదరి, శివనాథ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ, మన కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన అవసరాన్ని వివరించారు. నాయకులు గూడూరు కొండయ్య, రాజేంద్ర, బొబ్బూరి నారాయణస్వామి, సుబ్బారెడ్డి ఇంకాసీనియర్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



డివిజన్ టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

దళితులను దగా చేసిన జగన్

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయలేదు

● మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు

ధర్నాచౌక్, మే 2: రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలపై వైసీపీ ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం దారుణమని మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల పట్ల జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దళితులను చంపిన వ్యక్తులనే సీఎం జగన్ వెనకేసుకు వస్తున్నారని విమర్శించారు. దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును, దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులును పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించకుండా వారికి సీఎం జగన్ వత్తాసు పలకడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల హత్యల సంఘటనల పట్ల సీఎం జగన్‌తో చర్చించేందుకు ఎస్సీ కమిషన్ సభ్యుడినైన తనకే అవకాశం కలగలేదని వాపోయారు. దళితులకు న్యాయం చేయలేక పోవడంతో తన పదవికి గతంలోనే రాజీనామ చేశానన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రాష్ట్రంలో రాబోయే కొత్త ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికే కేటాయించాలన్నారు.

ప్రపంచ రికార్డర్లకు సత్కారం



చిట్టినగర్, మే 2 : కరెన్సీ నోట్లపై ముద్రించిన ప్రపంచ వారసత్వ ప్రదేశాలను ఏడు రోజుల్లో ప్రయాణించి ప్రపంచ రికార్డు సాధించిన వారిని గురువారం ఘనంగా సత్కరించారు. విజయవాడకు చెందిన షేక్ నయీం పాషా, మోటపోతుల ఉదయ్ నాగభూషణం 6,305 కిలోమీటర్ల దూరాన్ని ఏడు రోజుల్లో చుట్టిముట్టి ప్రపంచ రికార్డును సాధించారు. వారిని చిట్టినగర్‌లోని గౌతమ్ విద్యాసంస్థల ప్రాంగణంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.సూర్యారావు మాట్లాడారు. పాషా, నాగభూషణంలను ప్రశంసించారు. బీజేపీ నేత శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ చారిత్రక ప్రదేశాలు అత్యంత వేగంగా సందర్శించిన మొదటి భారతీయులుగా విజయవాడ వాసులు గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాంధీ దేశం సోషల్‌వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు గాంధీ నాగరాజన్, వైసీపీ నేత పెదబాబు, బీజేపీ నేత బుల్లబ్బాయి పాల్గొన్నారు.



యూటీఎస్‌తో రైలు టికెట్లు బుక్ చేసుకోండి

● రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర

రైల్వేస్టేషన్, మే 2 : యూటీఎస్ యాప్ ద్వారా రైలు ప్రయాణ టికెట్లను బుక్ చేసుకోవాలని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర పాటిల్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఏదైనా రైల్వేస్టేషన్ ప్రాంగణం నుంచి ఐదు కిలోమీటర్లకు పైన ఉన్న ఏ ప్రదేశానికైన దూర పరిమితి లేకుండా యూటీఎస్ యాప్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. యూటీఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో దూర పరిమితిని సడలించి రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. సబ్‌అర్బన్, నాన్ సబ్‌అర్బన్ స్టేషన్‌లకు 20 కిలోమీటర్లు, 50 కిలోమీటర్ల దూరపరిమితిలో యాప్ ద్వారా బుక్ చేసుకునే నిబంధనను సడలించినట్టు తెలిపారు. ఇకపై దూరపరిమితితో సంబంధం లేకుండా టికెట్లు బుక్ చేసుకోవచ్చునన్నారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్, విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలో యూటీఎస్ యాప్ పనిచేస్తుందన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి

● కేసన శంకరరావు



సంఘీభావం తెలుపుతున్న బీసీ నేతలు

ధర్నాచౌక్, మే 2: రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికే తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటుగా అన్ని సామాజిక తరగతులకు సమ న్యాయం జరిగి, సమగ్రాభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ పక్షాలకే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో గత ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లేదని విమర్శించారు. ఒక విజన్ కలిగిన చంద్రబాబు నాయుడు సేవలు రాష్ట్రానికి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన చారిత్రక ఆవశ్యకత ఏర్పడిందన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తో అన్ని అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సంఘం నేతలు, కార్యకర్తలు, దళిత, గిరిజన, మైనార్టీ, బలహీన వర్గాల ప్రజలందరికి విజ్ఞప్తి చేశారు. సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ గత ఐదేళ్ల నియంతలాగ రాష్ట్రాన్ని పరిపాలించారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ఎందుకు సీఎం జగన్ ఎందుకు ప్రయత్నించలేదని విమర్శించారు. నా బీసీ, నా ఎస్సీ, నా మైనార్టీ అనే అర్హత జగన్‌కు లేదన్నారు. ఆయా వర్గాల ప్రజలపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలపై జగన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారన్నారు. అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

తిరువూరు, మే 2: పోలీసులు, ప్రత్యేక పోలీసుదళం సిబ్బంది గురువారం కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే ప్రత్యేక దళాలు పట్టణంలో మోహరించాయి. మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలతో పాటుగా అన్ని గ్రామాల్లో ఇప్పటికే పోలీసు సిబ్బంది ర్యాలీలు నిర్వహించి ప్రజలు ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రధాన రహదారిలో పోలీసులు కవాతు నిర్వహించారు.

పోలీసులూ... మారరా..!

▸▸ ఇంతలా దిగజారి వ్యవహరించాలా?: వర్ల

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులు దిగజారి వ్యవహరిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒకప్పుడు ఏపీ పోలీస్‌కు ఇతర దేశాల్లోనూ మంచి పేరు ఉండేది. జగన్‌రెడ్డి నిర్వాకం వల్ల అది పాతాళానికి పడిపోయింది. విశాఖలో పోలీస్ వాహనంలోనే వైసీపీ వారి డబ్బులు తరలించి, రాత్రిపూట కరెంట్ తీసి మరీ ఓటర్లకు పంచిపెట్టాల్సిన ఖర్మ పోలీసులకు పట్టింది. ఇటువంటి దిగజారుడు పని చేస్తున్న అధికారి ఎంతటి దుర్మార్గానికైనా పాల్పడగలడు. ప్రజారక్షణ, శాంతి భద్రతలను కాపాడటానికి ఉపయోగించాల్సిన పోలీస్ వాహనాన్ని జగన్‌రెడ్డి అవినీతి సొమ్మును రవాణా చేసి, రాత్రిపూట రహస్యంగా ఓటర్లకు పంచడానికి వాడితే.. పోలీసులంటే ఎవరికి గౌరవం ఉంటుంది? ఇంకేం విలువ ఉంటుంది? ప్రతి పోలీస్ ఆలోచించాలి. ఎందుకింత దిగజారి ప్రవరిస్తున్నారో డీజీపీ సమాధానం చెప్పాలి. దీనిపై మీడియాలో వస్తే.. తప్పు జరగలేదని అయినా వివరణ ఇవ్వాలి కదా? మా వాళ్లు తప్పు చేయలేదని పోలీస్ కమిషనర్ అయినా చెప్పాలి కదా? ఈ వ్యవహారంలో తప్పు చేసిన అధికారులను శిక్షించాలి' అని వర్ల డిమాండ్ చేశారు.

జగన్ ఏముఖం పెట్టుకుని ముస్లిం ఓట్లు అడుగుతాడు: సయ్యద్ రఫీ

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి పాలనలో ముస్లింలపై దాడులు పెరిగాయి. మైనార్టీలకు రక్షణ లేదు. వైసీపీ మేనిఫెస్టోలో ముస్లింలకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. జగన్ ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేశారు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ ధ్వజమెత్తారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మైనార్టీలు సొంత కాళ్లపై నిలబడేందుకు టీడీపీ ప్రభుత్వం పెట్టిన దుకాన్ ఔర్ మకాన్ పథకాన్ని జగన్ రద్దు చేశాడు. మైనార్టీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి ఇవ్వలేదు. వక్ఫ్ బోర్డు ఆస్తులను రీసర్వే చేసి, డిజిటలైజేషన్ చేయించి, పూర్తి స్థాయిలో పరిరక్షిస్తామన్న జగన్.. వైసీపీ నేతలే ముస్లింల ఆస్తులు కైంకర్యం చేస్తుంటే కాపాడే ప్రయత్నమే చేయలేదు. మైనార్టీ ఆడబిడ్డలకు పెళ్లి కానుక కింద రూ.లక్ష ఇస్తానని మోసం చేశాడు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సహాయం చేస్తానని ఒక్కరికి కూడా రూపాయి సాయం చేయలేదు. చంద్రబాబు ఇమామ్‌లకు చేసిన సాయం కూడా జగన్ చేయలేదు. ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.5 లక్షలు ఇస్తానని ఎవరికీ ఇవ్వలేదు. రంజాన్ తోఫా కూడా ఎత్తేశారు. ఇప్పుడు జగన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని ముస్లిం ఓట్లు అడుగుతారు?' అని రఫీ నిలదీశారు.

జగన్ గ్రాఫ్ దారుణంగా పడింది: రఘురామ

భీమవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల మేనిఫెస్టో తర్వాత వైఎస్ జగన్ గ్రాఫ్ దారుణంగా పడిపోయింది. గుంటూరు, నర్సాపురం వంటి ఎంపీ నియోజకవర్గాల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమి స్వీప్ చేస్తుంది. కూటమి తరఫున గెలుపొందే అభ్యర్థులు భారీ మెజారిటీలు సాధిస్తారు. ఫ్లాష్ సర్వేలో ఇదే విషయం తేలింది' అని నరసాపురం ఎంపీ, ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పెద అమిరంలో గురువారం నిర్వహించిన రచ్చబండలో ఆయన మాట్లాడారు. 'ఒక్క చాన్స్ అంటూ జగన్ ఐదేళ్లపాటు ప్రజలను మోసం చేశారు. ఈ సారి ఉద్యోగులు, యువత, రైతులు, వ్యాపార వర్గాల్లో జగన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. అందరినీ మోసం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిది. గత ఐదేళ్లు కుటుంబ నిర్వహణ భారంగా మారిపోయింది. దీంతో మహిళలు కూడా జగన్‌ను వ్యతిరేకిస్తున్న వర్గంలో ఉన్నారు. ఇక తన సొంత చెల్లెలు షర్మిల సంధించిన ప్రశ్నలకు సీఎం సమాధానం చెప్పాలి. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసిన ఘనత జగన్‌దే' అని రఘురామ విమర్శించారు.

ఇసుకలో జగన్ తిన్నదంతా కక్కిస్తాం: టీడీపీ

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఇసుకలో సీఎం జగన్ తిన్నదంతా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్కిస్తాం. అడ్డగోలుగా రేటు పెంచి జనం జేబులు ఖాళీ చేసి రూ.వేల కోట్లు బొక్కారు. దీనిని వదిలిపెట్టేది లేదు' అని తెలుగుదేశం పార్టీ హెచ్చరించింది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ గురువారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జాతీయ హరిత ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి వంటి వాటి అనుమతి తీసుకోకుండా అనధికారికంగా 110 గనులు జగన్ హయాంలో తెరిచారు. ఇవిగాక మరో 500 ఇసుక రేవులు లెక్కలోకి రాకుండా నడిపారు. వీటి ద్వారా రూ.వేల కోట్ల దోపిడీ జరిగింది. టెండర్ పొందిన జేపీ వెంచర్స్ సమయం అయిపోయినా యథేచ్ఛగా తవ్వుకొంది. ఇప్పుడు సుప్రీం కోర్టులో ఈ వ్యవహారం అంతా బయటపడింది. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్న రేవులను మూసివేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అనుమతులు ఉన్న రేవుల్లో సీసీ కెమెరాలు పెట్టాలని చెప్పింది. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయింది. జగన్ కనీసం రూ.50 వేల కోట్లు సంపాదించారు. అమాయకులు 40 మంది ప్రాణాలు కోల్పోయారు' అని కొనకళ్ల అన్నారు.

జగన్ నోటికి ఈసీ కళ్లెం వేయాలి: కనకమేడల

న్యూఢిల్లీ, మే 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో ఏపీ సీఎం జగన్ తన స్థాయి మరిచి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును దూర్భాషలాడుతున్నారని ఆ పార్టీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం, ఇక్కడ తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 'జగన్‌పై చర్యలకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. జగన్ నోటికి ఈసీ కళ్లెం వేయాలి. జగన్ తన ఎన్నికల అఫిడవిట్‌లో 29 కేసులు ఉన్నాయని చెప్పారు. ఇన్ని కేసులున్న జగన్ ఇతరులను మోసకారి అని అంటున్నారు. జగన్ నేరస్తులను వెనకేసుకొస్తున్నారని వైఎస్ సునీత, షర్మిల చెబుతున్నారు. అన్నింటికీ జగన్ నైతిక బాధ్యత వహించాలి. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల అఫిడవిట్‌లో రూ.రెండు కోట్ల ఆస్తి ఉన్నట్లు పేర్కొన్నారు. జగన్ మాత్రం తన అఫిడవిట్‌లో బెంగుళూరు ప్యాలెస్, ఇతర ఇళ్లు, సాక్షి ఆఫీస్ చూపెట్టలేదు. తండ్రి సీఎంగా ఉన్నప్పుడు రూ.43 వేల కోట్ల అవినీతి చేస్తే, సీఎంగా ఉన్న ఈ ఐదు ఏళ్లలో జగన్ ఇంకా ఎన్నో రెట్లు అక్రమ ఆస్తులు సంపాదించారు. జగన్ ఎన్నికల అఫిడవిట్‌లే ఆయన అక్రమ సంపాదనకు ఉదాహరణ' అని కనకమేడల ఆరోపించారు.

రోత పత్రిక కథనాలపై ఈసీకి కనకమేడల ఫిర్యాదు

వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కుటుంబానికి చెందిన జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్ అధీనంలోని రోత పత్రిక ఎన్‌డీఏ కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన పక్షాలకు, వారి విధానాలకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తోందని ఎన్నికల సంఘానికి కనకమేడల ఫిర్యాదు చేశారు. 'ప్రతిరోజూ జగన్ పత్రిక వైసీపీకి ప్రయోజనం చేకూర్చేలా ప్రతి పేజీలో అభ్యంతరకర, కించపరిచే పదజాలంతో కథనాలను, విశ్లేషణలను ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రచురిస్తోంది. కూటమికి వ్యతిరేకంగా ప్రచురించిన అనేక కథనాలను పెయిడ్‌న్యూస్‌గా పరిగణించి, ఆ వ్యాసాల ఖర్చును వైసీపీ అభ్యర్థులకు కేటాయించాలి. గత నెల 18 నుంచి రోత పత్రికను పరిశీలించి ఈసీ మార్గదర్శకాల ప్రకారం పెయిడ్ న్యూస్ కింద కథనాలను వర్గీకరించి తగిన చర్యలు తీసుకోవాలి. జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలు జగన్ పత్రిక కథనాలను పరిశీలించాలి. పార్టీని ప్రమోట్ చేయడం కోసమే వైసీపీకి నేతృత్వం వహిస్తున్న పబ్లికేషన్స్ యజమానుల ప్రోద్బలంతోనే కథనాలు ప్రచురితమవుతున్నాయి. కూటమి మేనిఫెస్టో విడుదల సమయంలో మేనిఫెస్టోను టచ్ చేయడానికి భాగస్వామ్య పక్షాలు సిద్ధంగా లేవంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది' అని కనకమేడల ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులంతా కూటమికి ఓటేయాలి: అశోక్‌బాబు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో ఉద్యోగులు పడ్డ కష్టాలు తీరాలంటే.. పోస్టల్ బ్యాలెట్‌తో టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటేసి చంద్రబాబును గెలిపించాలి' అని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు కోరారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లలో ఉద్యోగులను ఏడిపించిన జగన్ ఇప్పుడు ప్రలోభాలకు తెరలేపారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం గిఫ్ట్ కూపన్లు ఇచ్చి, ఉద్యోగుల ఓట్లను కొట్టేయాలని చూస్తున్నారు. ఓట్ల కోసం వైసీపీ నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా ఉద్యోగులు నమ్మరు. జగన్ పాలనలో మాదిరిగా ఏ ప్రభుత్వంలో ఉద్యోగులు ఇబ్బందులు పడలేదు' అని అన్నారు.

కూటమితోనే బ్రాహ్మణులకు మేలు: బుచ్చి

రాష్ట్రంలో బ్రాహ్మణులు, అర్చకులు ఈ ఎన్నికల్లో కూటమిని ఆదరించాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ కోరారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని చెప్పారు. బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి, భద్రత అనే మూడు ప్రామాణికాలతో కూటమి మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది!

▸▸ పారిశ్రామికీకరణ అసలే లేదు
▸▸ విద్యావంతుల్లో 30 శాతం నిరుద్యోగులే
▸▸ ఆర్థిక విచ్ఛిన్నానికి సీఎఫ్ఎంఎస్ వినియోగం
▸▸ ప్రభుత్వ అప్పులతో పెరిగిన తలసరి అప్పులు
▸▸ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పార్టీలు కృషి చేయాలి
▸▸ ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
▸▸ మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి
▸▸ ప్రజలకు మేధావుల పిలుపు



చర్చా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీవీ రమేశ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 2: రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం కంటే అప్పే ఎక్కువగా ఉందని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను అనుత్పాదక రంగాలకు కేటాయించడం వల్ల రాష్ట్రం అధోగతి పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్, ఇసుక, మట్టి తదితరాలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే వాటిని కబ్జా చేస్తున్నారని, ఉన్నత లక్ష్యాలతో ప్రారంభించిన సీఎఫ్ఎంఎస్‌ను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి ఉపయోగిస్తున్నారని ఆక్షేపించారు. ప్రభుత్వాధినేతలు ఆధునిక రాజులుగా మారి, ప్రజా సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. కులం, మతం, ప్రాంతాల పేరుతో ప్రజలను విడదీసి నీచ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివన్నింటినీ నిర్మూలించి ప్రజలు, రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అభివృద్ధే ధ్యేయంగా పనిచేసేవారిని ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్షణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీవీ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పీవీ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు, పౌరులు కృషి చేయాలని, పౌరులు నిరంతరం ప్రభుత్వ వ్యవహారాల్లో భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో సీఎఫ్ఎంఎస్‌ను 2016లో ప్రారంభించారని, అయితే, దానిని ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజల తలసరి అప్పు రూ.2.20 లక్షలకు చేరి, దేశంలోనే అగ్రభాగాన నిలిచామని ఆవేదన వ్యక్తం చేశారు. తలసరి ఆదాయం కన్నా అప్పే ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను ఉత్పాదక రంగాలకు వినియోగించకుండా అనుత్పాదక రంగాలకు కేటాయించడం దారుణమన్నారు. సంపదను సృష్టించడం ద్వారానే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకోగలమని చెప్పారు. సహజ వనరులైన మైనింగ్, ఇసుక, మట్టి, బీచ్ శాండ్, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులే వాటిని కబ్జా చేస్తుంటే ఏంచేయాలని ప్రశ్నించారు. ప్రజాసేవ కోసం నిస్వార్థంగా పనిచేస్తామంటున్న శాశనసభ అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచేందుకు రూ.40 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారని, లోక్‌సభ అభ్యర్థులు రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారని, ఇలాంటి వారు ప్రజలకు నిస్వార్థంగా ఎలా సేవలందించగలరని ప్రశ్నించారు. ప్రముఖ రాజనీతి ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి మాట్లాడుతూ.. అత్యధిక ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలుగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వ అధినేతలు ఆధునిక రాజులుగా మారి ప్రజల సొమ్ముతో సంక్షేమ పథకాలను అమలుచేస్తూ ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పారిశ్రామిక పురోగతికి సమగ్ర ప్రణాళికను రూపొందించడంలో నేటి పాలకులు ఘోరంగా వైఫల్యం చెందారని విశ్లేషించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో ఏపీ చివరి స్థానంలో ఉందన్నారు. విద్యావంతుల్లో 30 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు. నైపుణ్యం కలిగిన కార్మికులు దక్షిణ కొరియాలో 95 శాతం ఉంటే ఏపీలో 2.5 శాతం మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 శాతం భూమికి సాగునీరు అందడంలేదని, పారిశ్రామికీకరణ అసలే లేదన్నారు. విద్వేష రాజకీయాలతో పెట్టుబడులు హైదరాబాద్, బెంగళూరుకు తరలిపోతున్నాయన్నారు. దేశంలోనే ఎన్నికల వ్యయం అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా ఏపీ మారిందని చెప్పారు. ఇప్పటికైనా ఓటర్లు చైతన్యవంతులై డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతం భావాలకు లోనుకాకుండా విజ్ఞతతో ఓట్లేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది పి.రవితేజ మాట్లాడుతూ మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలను కులం, మతం, ప్రాంతాల పేరుతో విడదీసి నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి, ప్రముఖ ఆడిటర్ ఫల్గుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ దుర్గాప్రసాదరావు

క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

▸▸ న్యాయాధికారుల సదస్సులో జస్టిస్ దుర్గాప్రసాదరావు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయాధికారులకు గురువారం అవగాహన తరగతులు ఏర్పాటు చేశారు. మంగళగిరిలోని జ్యుడీషియల్ అకాడమీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షుడు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై అవగాహన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ... జూలై 1 నుంచి అమల్లోకి రానున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కొత్త చట్టాలలోని అంశాలను వివరించారు. మరోవైపు ఈ నెల 2,3వ తేదీలలో ఎంపిక చేయబడిన న్యాయాధికారులకు ప్రత్యక్షంగా, 4వ తేదీన రాష్ట్రంలోని న్యాయాధికారులు అందరికీ ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ విధానంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ ఎ.హరిహరనాథశర్మ తెలిపారు.

డిమాండ్ 250 ఎంయూకు తగ్గడం లేదు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరగడంతో విద్యుత్తు డిమాండ్ 250 మిలియన్ యూనిట్లకు తగ్గడం లేదు. బుధవారం రాష్ట్రంలో 250.616 మిలియన్ యూనిట్ల డిమాండ్ నమోదైంది. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి బహిరంగ మార్కెట్లో 36.552 ఎంయూను రూ.27.500 కోట్లతో విద్యుత్తు పంపిణీ సంస్థలు కొనుగోలు చేశాయి. జెన్కో థర్మల్ విద్యుదుత్పత్తి సంస్థల్లో బొగ్గు నిల్వలు రెండు రోజులకు సరిపడానే ఉన్నాయి. వీటీపీఎస్‌లో 1.17రోజులకు, ఆర్టీపీపీలో 2.82 రోజులకు, కృష్ణపట్నంలో 3.87 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలున్నట్లు అధికారులు తెలిపారు.

మద్యం డబ్బుతో ఎన్నికల్లో గెలిచే యత్నం: సీపీఐ

మంగళగిరి సిటీ, మే 2: సీఎం జగన్ లిక్కర్ మాఫియా ద్వారా కోట్లాది రూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని, ఆ సొమ్ముతో సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఇండియా బ్లాక్ వేదిక బలపరిచిన గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్‌లను గెలిపించాలని కోరుతూ గురువారం మంగళగిరిలో జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం త్యాగాలు చేసిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

మరోసారి 'గడప గడపకు...'

▸▸ జగన్ పథకాలపై ఇంటింటి ప్రచారం
▸▸ టైటిల్ యాక్టుపై గ్రామాల్లో తిరుగుబాటు
▸▸ బూత్ కమిటీలు తెరపైకి.. మొదలైన ప్రచారం

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు సార్వత్రిక ఎన్నికలు ముందుకువస్తున్నాయి. మరోవైపు జగన్ సర్కారుపై ప్రజాగ్రహం అంతకంతకూ వెల్లువెత్తుతోంది. దీంతో కొంతయినా ప్రజావ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నంలో వైసీపీ అధిష్ఠానం ఉంది. అందులోభాగంగా బూత్ కమిటీలను గడప గడపకు... తిప్పాలని నిర్ణయించారు. గడచిన 59 నెలలుగా జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందంటూ విస్తృతంగా సామాజిక మధ్యమాల్లో, మీడియా చానళ్లలో, ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్న యూట్యూబ్ చానళ్లలో వైసీపీ సోషల్ మీడియా విభాగం ప్రచారం చేస్తోంది. అయితే.. రాష్ట్రంలో అమలు జరుగుతున్న అరాచక పాలనతో పోల్చితే ఈ ప్రచారం పెద్దగా ప్రజల్లోకి వెళ్లడంలేదు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు .. పట్టణాలకు మాత్రమే ప్రజావ్యతిరేకత పరిమితమైందని ప్రభుత్వ పెద్దలు భావించారు. అయితే.. కోడ్ తర్వాత ఈ పరిస్థితి మరింత విస్తరించి, పల్లెలకూ తాకింది. పట్టాదార్ పాసుపుస్తకాలపై సీఎం జగన్ ఫొటోలు ముద్రించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ ఆస్తులకు జగన్ వారసుడా అంటూ మండిపోతున్నారు. సామాజిక పింఛన్లను పంపిణీ చేయడంలో వరుసగా రెండో నెల కూడా ప్రభుత్వం విఫలం చెందింది. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అవ్వాతాతలు ఆవేదన చెందుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన ప్రకటన వారిపై తీవ్ర ప్రభావం చూపింది. చాలా మంది వలంటీర్లు రాజీనామా చేయకుండా యథాతథంగా కొనసాగుతున్నారు. దీంతో ఎన్నికల యాజమాన్య వ్యవహారమంతా వలంటీర్ల ద్వారా నడిపిద్దామనుకున్న జగన్ వ్యూహం బెడిసికొట్టింది. ఈ నేపథ్యంలో మరోసారి 'గడప గడపకు..' కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చారు. 47,000 బూత్ కమిటీలతో గురువారం ఈ కార్యక్రమం ప్రారంభించారు. కమిటీలో పదిమంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీకి ఒక చైర్మన్ ఉంటారు. వైసీపీ నాయకులెవరూ కమిటీలో లేకుండా జాగ్రత్త పడ్డారు. సామాన్యులుగా, తటస్థులుగా ఉన్నట్టు కనిపిస్తూ, 'గడప గడపకూ' బూత్ కమిటీ సభ్యులు వెళతారు. సర్కారుపై పెరిగిన వ్యతిరేకతను కొంతైనా తగ్గించేలా... ఇంటింటికీ వెళ్లి జగన్ పథకాలపై కుటుంబాల్లోని మహిళల్లో పెద్దఎత్తున ప్రచారం సాగించాలని వైసీపీ పెద్దలు ఆదేశించారు.

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు

ఇది ఆఖరి పోరాటం





విజయనగరంలో బాలకృష్ణ సభకు హాజరైన జనం, ప్రచార రథంపై మాట్లాడుతున్న బాలకృష్ణ. పక్కన అశోక్‌గజపతిరాజు, అసెంబ్లీ అభ్యర్థి అదితి, పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

▸▸ విజయనగరంలో ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ

విజయనగరం, మే 2(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఇది ఆఖరి పోరాటం. దీనిలో న్యాయ నిర్ణేతలు ఓటర్లే' అని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. గురువారం విజయనగరం జిల్లా చీపురుపల్లి, విజయనగరంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. 'మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి అరాచక పాలన అందించిన ఘనత జగన్‌దే. ఒక్క అవకాశం పేరుతో అధికారాన్ని చేపట్టి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. సంక్షేమాన్ని తీసుకువచ్చిందే తెలుగుదేశం. అందుకు ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు' అంటూ ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను, సంస్కరణలను ప్రస్తావించారు. అదే ఒరవడిని టీడీపీ అధినేత చంద్రబాబు కొనసాగిస్తున్నారని వివరించారు. "జగన్ ఈ ఐదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్లు అప్పు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుని తీసుకువచ్చి మన భూములపై అప్పులు తీసుకువచ్చేందుకు సిద్ధపడుతున్నారు. 'చరిత్ర సృష్టించేది మనమే... తిరగరాసేదీ మనమే' అంటూ వచ్చే ఎన్నికల్లో ఘన విజయం వైపు నడుస్తున్నాం. జాబ్ కేలెండర్ పేరుతో జగన్ మోసం చేశారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారు. ఉత్తరాంధ్రకు చెందిన బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాద్‌రావు, తమ్మినేని సీతారాం, గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాసరావు వంటి వారు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు కానీ వారు ఉత్తరాంధ్రకు ఏమి చేశారు? అడుక్కుతినే వారికి, చిరు వ్యాపారులకు అప్పులు ఇచ్చి వారి ఆస్తులు లాగేసుకున్నారు. చెల్లిని, తల్లిని వెళ్లగొట్టి, బాబాయ్‌ని హత్య చేయించిన వారిని వెనకేసుకొచ్చే దానికి సమాధానం చెప్పేందుకు జగన్ సిద్ధమా?" అని ఆయన ప్రశ్నించారు. కూటమి శక్తిని ఎవరూ ఆపలేరని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు పాశుపతాస్త్రాలుగా అభివర్ణించారు. చంద్రబాబు అధికారం చేపట్టగానే తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై చంద్రబాబు రెండో సంతకం చేస్తారన్నారు. టీడీపీ పార్టీ మాత్రమే కాదని, వసుధైక కుటుంబమని అన్నారు. కార్యకర్తలకు సానపట్టి నాయకుడిగా తయారు చేసి టికెట్లు అందించే ఘనత టీడీపీదేనన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి అదితి గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని బాలకృష్ణ కోరారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పేరు

▸▸ హైదరాబాద్‌పై పట్టుసాధించేందుకు పావుగా 'టాస్క్‌ఫోర్స్'
▸▸ తన సామాజికవర్గం వారి కోసమే.. రాధాకిషన్‌కు పోస్టింగ్
▸▸ నగర పోలీసు కమిషనర్‌నే ఏమార్చిన టీం
▸▸ రాధాకిషన్ వాంగ్మూలంలో వెల్లడి.. ఆలస్యంగా వెలుగులోకి
▸▸ లోక్‌సభ ఎన్నికల తర్వాత.. ట్యాపింగ్ కేసు పార్ట్-2

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో తొలిసారి మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీసులు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావును విచారించిన తర్వాత.. ఆయన వాంగ్మూలాన్ని కోర్టుకు సమర్పించారు. గత నెల 3 నుంచి 10వ తేదీ వరకు దర్యాప్తు అధికారులు రాధాకిషన్‌ను కస్టడీలోకి తీసుకుని, విచారించిన విషయం తెలిసిందే.! ఆ క్రమంలో గత నెల 9వ తేదీన సేకరించిన వాంగ్మూలంలో.. రాధాకిషన్ పలుమార్లు అప్పటి సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించారు. విపక్షాల ఎత్తులను ముందుగానే గుర్తించి, వాటిని చిత్తు చేయడానికి ఒక పద్ధతి ప్రకారం కేసీఆర్ తన సామాజికవర్గానికి చెందిన అధికారులను స్పెషల్ వింగ్‌లలో నియమించుకున్నట్లు రాధాకిషన్ వాంగ్మూలం స్పష్టం చేస్తోంది. ఆ క్రమంలో నేరుగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కే జవాబుదారీగా పనిచేసే టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఎంచుకున్నారని, ఓ దశలో సీపీని కూడా ఏమార్చి, కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ కీలక నేతల రహస్య టాస్క్‌లను కూడా పూర్తిచేసేవారిమని రాధాకిషన్ వెల్లడించినట్లు తెలుస్తోంది. "హైదరాబాద్‌పై పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ చీఫ్ టాస్క్‌ఫోర్స్‌ను ఎంచుకున్నారు. అక్కడ నమ్మకస్తుడైన అధికారిని నియమించాలనుకున్నారు. 2017లో నాకు ఎస్పీగా పదోన్నతి వచ్చింది. ఆ తర్వాత నన్ను టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. నా నియామకం వెనక అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు కీలకంగా వ్యవహరించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్‌లోని కొందరు కీలక నేతల పనులను టాస్క్‌ఫోర్స్ ద్వారా చక్కబెట్టేవాడిని. వివాదాల పరిష్కారాలు, బీఆర్ఎస్‌కు ముప్పుగా ఉన్న వ్యక్తులను గుర్తించి, వారికి ఇబ్బందులు కల్పించడం, లొంగదీసుకోవడం, మా దారికి తీసుకురావడం వంటి పనులు చేసేవాడిని. కొన్ని సందర్భాల్లో సివిల్ వివాదాలను సైతం సెటిల్ చేసేవాడిని" అని రాధాకిషన్ తన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. తాను టాస్క్‌ఫోర్స్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించాక ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌రావు(2023లో డీఎస్పీగా యాక్సిలరీ పదోన్నతి పొందారు) నేతృత్వంలో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు రాధాకిషన్ వివరించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్ట్-2 ఉంటుందని స్పష్టమవుతోంది. గత నెల భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌ల కస్టడీ, విచారణ పూర్తయ్యేసరికి లోక్‌సభ ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అయితే.. వీరి వాంగ్మూలంలో పలువురు బీఆర్ఎస్ నేతల పేర్లు వెలుగులోకి వచ్చాయి.

సమస్యలపై అడిగితే దాడి చేశారు

▸▸ మేదరమెట్లలో వైవీ తమ్ముడి ప్రచారంలో ఘటన
▸▸ బాధిత మహిళల ఆవేదన

మేదరమెట్ల, మే 2 : ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాయకులను సమస్యలపై అడిగితే.. మహిళలు అని కూడా చూడకుండా తమపై దాడి చేశారని బాధితులు వాపోతున్నారు. బాపట్ల జిల్లా మేదరమెట్ల పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో గురువారం రాత్రి వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి సోదరుడు వైవీ భద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ కుమారులు, ఇతర వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారానికి వెళ్లారు. తమకు తాగునీరు రావడం లేదని, ఆరు నెలల నుంచి మురుగు కాలువల్లో పూడిక తీయలేదంటూ మహిళలు ప్రశ్నించారు. దీంతో మమ్మల్నే అడుగుతారా? అంటూ రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు వారిపై దాడి చేశారు. దాడిలో కుమ్మరి మహేశ్వరికి గాయాలు కాగా ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సర్పంచ్ చిన్న కుమారుడు మధుకు కూడా గాయమైనట్లు చెబుతున్నారు. విషయం తెలియడంతో ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి వచ్చినా ఇరువర్గాలను పంపించేశారు.కాగా, ప్రచారానికి రావడానికి ముందే పక్కా ప్రణాళికతో పోలీస్ స్టేషన్‌లో తమ పలుకుబడి ఉపయోగించి ఆ కాలనీకి చెందిన కొంతమందిని బైండోవర్ చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నించారు.

నేను ఎమ్మెల్యే రాజా కజిన్.. నా బైకునే ఆపుతారా?

▸▸ ఫ్లయింగ్ స్క్వాడ్‌తో వైసీపీ చోటా నాయకుడి వాగ్వాదం

కోరుకొండ, మే 2 : 'మా వాహనాన్నే ఆపుతారా.. నేను ఎమ్మెల్యే జక్కం పూడి రాజా కజిన్‌ను' అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఓ వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేసినట్టు గురువారం కోరుకొండ ఎస్ఐ డి. ఆనంద్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం రాత్రి 11 గంటలకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. వైసీపీ కోరుకొండ మండల యువజన విభాగం నాయకుడు వుల్లి గణ మరో ఇద్దరితో కలిసి మోటార్ సైకిల్‌పై కోరుకొండ వస్తున్నాడు. వారి వాహనం ఆపి తనిఖీ చేస్తుండగా.. మా వాహనాన్నే ఆపుతారా అంటూ గణ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. మహిళా కానిస్టేబుల్ వారించగా ఆమెపై కూడా దుర్భాషలాడి అంతుచూస్తానని బెదిరించాడని ఎస్ఐ తెలిపారు. మహిళా కానిస్టేబుల్ రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజయరాయిలో రెచ్చిపోయిన వైసీపీ గూండాలు

▸▸ ప్రచారానికి అడ్డువచ్చి టీడీపీ వర్గీయులపై దాడి
▸▸ పర్వతనేని ప్రభాకర్ తలకు తీవ్ర గాయం.. మరికొందరికీ గాయాలు



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పర్వతనేని ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న చింతమనేని ప్రభాకర్

పెదవేగి, మే 2 : ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయిలో టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా గురువారం రాత్రి పది గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన యువకులు 20 మంది ప్రచారానికి అడ్డుగా వచ్చి టీడీపీ శ్రేణులపై దాడికి పాల్పడ్డారు. టీడీపీకి చెందిన పర్వతనేని ప్రభాకర్ తలకు తీవ్రగాయమైంది. మరి కొంతమందికి గాయాలయ్యాయి. మా వీధిలోకి ప్రచారానికి రావడానికి వీలు లేదంటూ అడ్డుకోవడమే గొడవకు కారణంగా తెలుస్తోంది. వైసీపీ నాయకుడు మట్టా రమాశంకర్ తదితరులు రాడ్లు, కర్రలతో దాడి చేశారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయాలని చింతమనేని ధర్నా నిర్వహించారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ప్రభుత్వాసుపత్రిలో బాధితులను చింతమనేని పరామర్శించారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త కత్తితో దాడి..

మండవల్లి మే 2 : ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెరికేగూడెంలో టీడీపీ కార్యకర్తపై గురువారం రాత్రి వైసీపీ కార్యకర్తలు కమ్మ కత్తితో దాడి చేశారు. పెరికేగూడెంలో రేషన్ డీలర్ భర్త పెరుమాళ్ల రమేష్ బీజేపీలో చురుగ్గా తిరుగుతున్నాడు. వైసీపీకి చెందిన కుంచె నాగయ్య అతని కుమారుడు చక్రి గురువారం రాత్రి రమేష్ ఇంటికి వెళ్లి బీజేపీలో తిరగడానికి వెళ్లవద్దంటూ కత్తితో దాడి చేశారు. రమేష్ అర చేతికి తీవ్రగాయమైంది. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 3 మే 2024

పీజీ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని యూనిట్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ప్రొడక్ట్స్(సీఎస్ఐఆర్-యూఆర్‌డీఐపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో 12 మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ సెషన్స్, డెయిలీ అసైన్‌మెంట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

మాడ్యూల్స్

- ఇంట్రడక్షన్ టు ఐపీఆర్ అండ్ పేటెంట్స్ అండ్ పేటెంట్ లెజిస్లేషన్
- ఇంటర్నేషనల్ ఫ్రేంవర్క్స్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ అండ్ బేసిక్స్ ఆఫ్ పేటెంట్ సెర్చింగ్
- సెర్చింగ్ ఆన్ పేటెంట్ డేటా బేసెస్
- అండర్‌స్టాండింగ్ డేటాబేస్ ఫీచర్స్
- అడ్వాన్స్‌డ్ పేటెంట్ సెర్చింగ్
- ఇన్ఫర్మేషన్ సెర్చింగ్ ఇన్ వేరియస్ డొమైన్స్
- పేటెంట్ అనలిటిక్స్ అండ్ మాపింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్
- పేటెంట్ ఇన్ఫర్మేషన్ ఫర్ టెక్నాలజీ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ వాల్యుయేషన్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ ఆర్ అండ్ డీ ప్లానింగ్, స్ట్రాటజిక్ పేటెంటింగ్ అండ్ పర్ఫార్మెన్స్ బెంచ్ మార్కింగ్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ స్ట్రాటజీ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/టెక్నాలజీ)/ఎంఫార్మసీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీతోపాటు ఎల్ఎల్‌బీ/మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్/ఎంబీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** 62,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **ఇంటర్వ్యూ కేంద్రం:** పుణె
- **ఇంటర్వ్యూలు:** జూన్ 27, 28
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 10
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 19
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** pgdp.urdip.res.in

సరోజినీ దామోదర్ ఫౌండేషన్- 'విద్యాధన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఇంటర్, పదకొండు-పన్నెండు తరగతులు చదివే అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు సంస్థ తరపున మెంటారింగ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉంటాయి. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తిగల అభ్యర్థులు రాష్ట్రానికి నిర్దేశించిన ఈ-మెయిల్‌కు దరఖాస్తులు పంపాలి.



తెలుగు రాష్ట్రాల్లో విద్యాధన్ స్కాలర్‌షిప్

అర్హత: ఏపీ/తెలంగాణలో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి కనీసం 90 శాతం మార్కులతో/9 సీజీపీఏ స్కోర్‌తో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు 75 శాతం మార్కులు/7.5 సీజీపీఏ స్కోర్ చాలు. కుటుంబ వార్షికాదాయం రెండు లక్షలు మించకూడదు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి మాత్రమే ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. పరీక్ష కేంద్రాల సమాచారాన్ని అభ్యర్థులకు ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. అత్యధిక స్కోర్‌తో కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉన్నత చదువుల కోసం ఏడాదికి రూ.10,000 నుంచి రూ.75,000 వరకు స్కాలర్‌షిప్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 7; తెలంగాణలో జూన్ 16
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి లేదా తత్సమాన కోర్సు మార్కుల పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అభ్యర్థి ఫొటో, ఇంటర్/పన్నెండోతరగతి అడ్మిషన్ పొందిన కళాశాల వివరాలు.
- **అభ్యర్థుల స్క్రీనింగ్:** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 23న; తెలంగాణలో జూలై 7
- **ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** ఆంధ్రప్రదేశ్‌లో జూలై 7 నుంచి 20 వరకు; తెలంగాణలో ఆగస్టు 1 నుంచి 10 వరకు
- **ఆంధ్రప్రదేశ్ ఈ-మెయిల్:** vidyadhan.andhra@sdfoundationindia.com
- **తెలంగాణ ఈ-మెయిల్:** vidyadhan.telangana@sdfoundationindia.com
- **వెబ్‌సైట్:** www.vidyadhan.org/apply

Vidyadhan
Transforming lives through education

కల్యాణి ఐఐఐటీ

కల్యాణి(పశ్చిమ బెంగాల్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెమిస్టర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. గుర్తింపు పొందిన ఫండింగ్ ఏజెన్సీల నుంచి ఫెలోషిప్స్ పొందినవారు రీసెర్చ్ కేటగిరీలో; ప్రముఖ పరిశోధన/బోధన సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు ఫుల్ టైం స్పాన్సర్డ్ కేటగిరీలో; పరిశోధన సంస్థలు/పారిశ్రామిక సంస్థలు/విద్యా సంస్థల్లో పనిచేస్తున్నవారు ఎక్స్‌టర్నల్ కేటగిరీలో; ఐఐఐటీ కల్యాణి సహా ప్రముఖ సంస్థల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు పార్ట్ టైం కేటగిరీలో; సంస్థ స్పాన్సర్ చేసిన ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నవారు ప్రాజెక్ట్ స్టాఫ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎటువంటి ఫెలోషిప్ లేనివారు ఇన్‌స్టిట్యూట్ టీచింగ్ అసిస్టెంట్‌షిప్ లేదా విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలి. ఇన్‌స్టిట్యూట్ టీచింగ్ అసిస్టెంట్‌షిప్ కేటగిరీలో చేరినవారికి నెలకు రూ.25,000 చొప్పున అయిదేళ్లపాటు ఫెలోషిప్ ఇస్తారు. వీరు థియరీ, ల్యాబొరేటరీ తరగతుల్లో వారానికి ఆరు గంటలపాటు టీచింగ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కేటగిరీ కింద ముగ్గురికి అవకాశం కల్పిస్తారు. వీరికి మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750 చొప్పున ఫెలోషిప్ అందిస్తారు. వీరికి హెచ్‌ఆర్‌ఏతోపాటు నిబంధనల ప్రకారం రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కూడా ఇస్తారు.



విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి గేట్/నెట్ అర్హత పొందినవారు కూడా అర్హులే. సైన్స్ విభాగాలకు సంబంధిత స్పెషలైజేషన్‌తో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **టెస్ట్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 10
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 21 వరకు
- **వెబ్‌సైట్:** www.iiitkalyani.ac.in

నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ ఆర్‌కేఎల్)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. రిటెన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్స్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, మేనేజ్‌మెంట్.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి ఇంజనీరింగ్, సైన్స్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్పెషలైజేషన్లతో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఇంజనీరింగ్/ఎంఫార్మసీ/ఎంఆర్క్/ఎంప్లాన్/ఎండిజైన్/ఎమ్మెస్సీ/ఎంబీఏ/ఎంకాం/ఎంఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత డిగ్రీ లేదా 60 శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీవీఎస్సీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి గేట్/నెట్/జీప్యాట్ స్కోర్ ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. విభాగానికి నిర్దేశించిన ఇతర అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్/డీఎస్‌టీ- ఇన్‌స్పైయిర్/ఆర్‌జీఎన్‌ఎఫ్/ఐసీఎస్ఎస్ఆర్/ఉమెన్ సైంటిస్ట్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు 2024 జూన్ 9 నాటికి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. 32 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులకు ఫెలోషిప్ ఇవ్వరు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 9
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- **ఫలితాలు విడుదల:** జూలై 3
- **అడ్మిషన్స్:** జూలై 17 నుంచి 19 వరకు
- **సెమిస్టర్ రిజిస్ట్రేషన్:** జూలై 22
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitrkl.ac.in

జాబ్ కార్నర్

సెయిల్‌లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 108

ఝార్ఖండ్ రాష్ట్రంలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బొకారో స్టీల్ ప్లాంట్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

1. సీనియర్ కన్సల్టెంట్
2. కన్సల్టెంట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్
3. మెడికల్ ఆఫీసర్
4. అసిస్టెంట్ మేనేజర్

నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

5. ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(బాయిలర్)
6. అటెండెంట్ కమ్ టెక్నీషియన్(బాయిలర్)
7. మైనింగ్ ఫోర్‌మన్
8. సర్వేయర్
9. ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(మైనింగ్/ఎలక్ట్రికల్)
10. అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7

వెబ్‌సైట్: https://sail.co.in/

सेल SAIL

టీఎంసీలో వివిధ ఖాళీలు

ఖాళీలు 87

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్...ముంబయి, గువహటి, విశాఖపట్నంలోని టీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్, నాన్-మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్ 'ఇ': 8 పోస్టులు
2. మెడికల్ ఫిజిసిస్ట్: 2 పోస్టులు
3. ఆఫీసర్ ఇన్‌ఛార్జ్: 1 పోస్టు
4. సైంటిఫిక్ అసిస్టెంట్: 2 పోస్టులు
5. అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్: 1 పోస్టు
6. ఫిమేల్ నర్స్: 58 పోస్టులు
7. కిచెన్ సూపర్‌వైజర్: 1 పోస్టు
8. టెక్నీషియన్ 'సి': 1 పోస్టు
9. టెక్నీషియన్ 'ఎ': 4 పోస్టులు
10. స్టెనోగ్రాఫర్: 6 పోస్టులు
11. లోయర్ డివిజన్ క్లర్క్: 3 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7

వెబ్‌సైట్: tmc.gov.in/



నైపర్, మొహాలీలో టీచింగ్ స్టాఫ్

ఖాళీలు 32

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రొఫెసర్: 13
2. అసోసియేట్ ప్రొఫెసర్: 12
3. అసిస్టెంట్ ప్రొఫెసర్: 7

విభాగాలు: ఫార్మాకోఇన్ఫర్మేటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ - ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.

అర్హత: పీహెచ్‌డీతో పాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

జీతం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100 - రూ.2,20,000; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600 - రూ.2,11,300; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 - రూ.1,67,400.

వయోపరిమితి: 50 ఏళ్లు మించరాదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: ద రిజిస్ట్రార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెక్టార్-67, ఎస్.ఎ.ఎస్.నగర్(మొహాలీ), పంజాబ్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 6

వెబ్‌సైట్: https://niper.gov.in/


లిటిల్స్



బీర్బల్ కిచిడీ


అక్బర్, బీర్బల్ ఒక రోజు ఓ కొలను దగ్గరికి వచ్చారు. ఆ సమయంలో బాగా చలికాలం. మంచులా చల్లగా ఉన్నాయి ఆ కొలనులోని నీళ్లు. అక్బర్ ఆ కొలను దగ్గరకు వచ్చి చేయి పెట్టాడు నీళ్లలో. ఇంత చల్లగా ఉండే కొలనులో డబ్బుకోసం దిగి రాత్రంతా ఉండేవాళ్లు ఉంటారా? అని అడిగారు అక్బర్. 'అవును ఉంటారు. ఎంతో మంది ఉంటారు' అన్నారు బీర్బల్. 'రాత్రంతా చల్లని నీళ్లలో ఉంటారా? వారికి ఒక్క బంగారు నాణెం ఇస్తాం' అని దండోరా వేశారు.

ఓ పేదవాడు వచ్చాడు. ఆ బంగారు నాణెం చాలు అంటూ వచ్చాడు. కొలనులో ఉన్నాడు. రాత్రంతా కొలనులో ఉంటే నాలుగైదు బంగారు నాణేలు ఆ పేదవాడికి ఇవ్వండి అన్నాడు మరోసారి అక్బర్. దీంతో పేదవాడు ఆ విషయం తెలిసి పొంగిపోయాడు. ఉదయాన్నే పేదవాడిని చూడటానికి రాజు వచ్చాడు. విచిత్రం పేదవాడికి ఏమీ కాలేదు. 'ఈ పేదవాడు నిజంగా నీళ్లలో ఉన్నాడా?' అని సైనికులను, అక్కడ తిరిగేవాళ్లను వాకబు చేశాడు. పేదవాడు నిజాయితీగా రాత్రంతా ఆ నీళ్లలో ఉన్నాడు కాబట్టి భయపడలేదు. 'ఇంత ఆశ్చర్యమేమిటి? ఎలా ఉన్నావు?' అనడిగాడు రాజుగారు. ఆ పేదవాడు ఇలా అన్నాడు.. 'అయ్యా.. దూరంగా ఓ కాంతి కనపడింది. దాన్ని చూస్తూ వెచ్చదనంగా అనుకున్నా. అందుకే చల్లని నీళ్ల గురించి మర్చిపోయాను' అన్నాడు. 'అదేంటీ ఆ వెలుతురును తీసుకున్నావు. ఇది మోసం. దీనికి నాణేలు రావు. కారాగార శిక్ష తప్పదు' అన్నాడు అక్బర్.




అక్బర్ చెప్పిన మాటలు బీర్బల్‌కు నచ్చలేదు. ఏమాత్రం భయపడకుండా 'ఇలా ఉండటం అతని గొప్పతనం కాక ఏమవుతుంది? అతని మెదడును నియంత్రించాడు' అన్నాడు. అయినా అక్బర్ వొప్పుకోలేదు. ఒకరోజు బీర్బల్ తన ఇంటికి భోజనానికి రమ్మన్నాడు. 'కిచిడీ బావుంటుంది' అన్నాడు. అలానే బీర్బల్ ఇంటికి అక్బర్ వెళ్లారు. పావు గంట గడిచింది. ఇంకా కిచిడీ తయారు కాలేదు అన్నాడు బీర్బల్. ఆ తర్వాత లోపలకు రాజుగారిని తీసుకెళ్లాడు. కట్టెలున్నాయి. దానికి ఓ పాత్ర కట్టి ఉంది. కింద మంట ఉంది. 'ఈ కిచిడీ అయ్యేంతవరకూ ఉండటం కష్టం. ఇది కాదేమో' అన్నాడు. 'ఎలా?' అని అడిగాడు. 'మంట తగిలితే అదే అవుతుంది కొన్ని గంటలకైనా మహాప్రభూ' అన్నాడు. అక్బర్ కోప్పడ్డాడు. ఈ పరాచకాలేంటీ? అన్నాడు. 'ఈ మంటనే కిచిడీకి అందకుంటే.. దూరంగా ఉండే వెలుగు ఆ కొలనులో చలికి వణికే ఆ పేదవాడికి ఎలా తెలుస్తుంది.' అనడిగాడు బీర్బల్. వెంటనే అక్బర్‌కు విషయం అర్థమైంది. ఆ పేదవాడిని ఖైదీ నుంచి విముక్తి కల్పించమన్నాడు. చెప్పిన బంగారు నాణేలతో మరిన్ని బంగారు నాణేలను ఇచ్చాడు. రాజు కాళ్లమీద పడ్డాడు. ఆ పేదవాడు తన పేదరికం పోయినట్లే అని మనసులో అనుకున్నాడు. ఆ పేదవాడు విషయం తెలుసుకుని బీర్బల్‌కు కృతజ్ఞత చెప్పాడు పేదవాడు.

దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 297

1					7		5	
4	3		1					6
		6	9			3		
				6			4	2
		2				1		
3	4			1				
		5			6	9		
6					1		7	4
	9		3					5

సుడోకు - 296 సమాధానం

4	7	8	3	1	9	2	6	5
3	6	1	5	2	7	4	8	9
9	5	2	4	8	6	3	1	7
5	4	6	7	9	3	8	2	1
7	8	3	1	6	2	9	5	4
2	1	9	8	4	5	7	3	6
6	9	4	2	3	1	5	7	8
1	2	5	9	7	8	6	4	3
8	3	7	6	5	4	1	9	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.